

‘రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు కళకళలాడాలి.
పాడిపంటలతో పులకించిపోవాలి’

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 18+20 వెల: ₹ 5.00

సంపుటి: 10
సంచిక: 359

బుధవారం 21-3-2018

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



‘హెచ్1 బీ’పై పోస్టర్ల నిరసన
శాన్‌ఫ్రాన్సిస్కో, కాలిఫోర్నియా రైల్వే స్టేషన్లలో పోస్టర్లు
-12లో



నిర్భయ తల్లి ఆత్మ ఘోష
- ఫ్యామిలీలో

కాపీరాయుడి ‘స్టేట్ ఫస్ట్’ ఆశలు

హోదా పోరాటంలో క్రెడిట్ కోసం బాబు ఆరాటం

అనుకూల మీడియాలో ఆకాశమెత్తున ప్రచారం



స్లిప్‌లు పెట్టి.. పక్కవాడి పేపర్ కాపీకొట్టి.. ఇన్విజిలేటర్‌కు పలుమార్లు దొరికిపోయిన దొంగపిల్లాడు ఏమనుకుంటాడు? పాసయితే చాలు అనుకుంటాడా లేక స్టేట్ ఫస్ట్ రావాలని ఆశిస్తాడా..? ప్రత్యేక హోదాపై పలుమార్లు నాలుక మడతేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పుడు ప్రత్యేక హోదా కోసం తానే పోరాడుతున్నట్లు ఎల్లోమీడియాలో చేయించుకుంటున్న ప్రచారం కూడా అచ్చు అలానే ఉంది. క్లైమాక్స్‌కు చేరిన హోదా పోరులో రాత్రికి రాత్రి యూటర్న్‌లు తీసుకుంటూ.. అబద్ధాలాడుతూ.. ఎదుటివారిని ఎద్దేవా చేస్తూ.. తాను పోరాడుతున్నట్లు.. చంద్రబాబు చేస్తున్న సర్కస్ చూసి ప్రజలు విస్తుపోతున్నారు.

2 లో

ఎదురుదాడే బాబు తంత్రం

వైఎస్సార్‌సీపీపై బురదజల్లుతూనే ఉండాలని నాయకులకు దిశానిర్దేశం

18 లో

- బీజేపీ, జగన్, పవన్ కుమ్మక్కయినట్లు దుష్ప్రచారం చేయాలని సూచనలు
- రాష్ట్రానికి బీజేపీ అన్యాయం చేసిందని కరపత్రాలు.. బీజేపీ ఆరోపణలు తెలుగుజాతిపై పోరాటంగా చిత్రీకరణ
- హోదా ఉద్యమంతో జగన్‌కు పెరిగిన ఆదరణను జీర్ణించుకోలేక కుయుక్తులు

లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్‌ను మంగళవారం ఆమె కార్యాలయంలో కలసి అవిశ్వాస తీర్మానం చర్చకు వచ్చేలా చూడాలని అభ్యర్థిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎంపీలు



‘అవిశ్వాసం’పై అదే తీరు

కేంద్రంపై అవిశ్వాస తీర్మానం నోటీసులను అనుమతించని స్పీకర్

- సభ ఆర్డర్‌లో లేకుంటే చర్చ చేపట్టలేమని స్పష్టీకరణ
- లోక్‌సభలో కొనసాగిన టీఆర్‌ఎస్, ఏఐఏడీఎంకే ఆందోళన
- మరోసారి నోటీసులు ఇచ్చిన వైవీ సుబ్బారెడ్డి, తోట నరసింహం
- సభలో తమకు సహకరించాలని పలు పార్టీలకు విజ్ఞప్తి
- ప్రత్యేక హోదా కోసం రాజ్యసభలో విజయసాయిరెడ్డి ఆందోళన

సాక్షి, న్యూఢిల్లీ

కేంద్ర ప్రభుత్వంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, టీడీపీ ఇచ్చిన అవిశ్వాస తీర్మానాలు మూడోసారి కూడా లోక్‌సభలో చర్చకు నోచుకోలేదు. సభ ఆర్డర్‌లో లేదన్న కారణంతో స్పీకర్ సుమిత్రా మహాజన్ చర్చకు అనుమతించలేదు. మంగళవారం నాటి సభా కార్యక్రమాల జాబితాలో చేర్చాలంటూ వైఎస్సార్‌సీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, టీడీపీ ఎంపీ తోట నరసింహం సోమవారం లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు అవిశ్వాస తీర్మానం నోటీసులు ఇచ్చిన సంగతి తెలిసిందే. మంగళవారం ఉదయం 11 గంటలకు ప్రశ్నోత్తరాలతో సభ ప్రారంభమైన నిమిషానికే సభను స్పీకర్ 12 గంటల వరకు వాయిదా వేశారు. ఏఐఏడీఎంకే, టీఆర్‌ఎస్ సభ్యులు వెల్‌లో ఆందోళన చేయడంతో స్పీకర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. తిరిగి 12 గంటలకు

మిగతా 2వ పేజీలో ▶

ఆశా వర్కర్లకు వేతనాలివ్వం

- పనిచేసిన మేరకే పారితోషికం
- వేతనాలిచ్చే ప్రతిపాదనేదీ లేదు : యనమల
- అవయవదానంపై దృష్టి సారించండి : స్పీకర్

- వివరాలు 3లో

టెట్ ఫలితాల్లో గందరగోళం

- తారుమారైన అభ్యర్థుల మార్కులు
- మూల్యాంకనంలో తప్పులు జరిగినట్లు ఆరోపణలు
- ఫైనల్ ‘కీ’కి, ఫలితాలకు పొంతనలేని వైనం.. ఆందోళనలో అభ్యర్థులు

- వివరాలు 18లో



గుంటూరు జిల్లా రాజుపాలెం క్రాస్ వద్ద హోదా ప్లకార్డు పట్టుకుని చిన్నారులతో కలిసి నడుస్తున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్

ఎర్రటి ఎండలో వెల్లువెత్తిన జనాభిమానం

- జననేత అడుగులో అడుగేసిన యువకులు, అక్కచెల్లెమ్మలు
- ఊరూరా ఘన స్వాగతం.. కష్టాలు చెప్పుకున్న వలస కూలీలు
- పొగాకు పంటకు గిట్టుబాటు ధర లేదని వాపోయిన రైతులు
- కన్నీటి పర్యంతమైన అతిసార బాధితులు.. అందరికీ ధైర్యం చెప్పిన వైఎస్ జగన్
- అందరినీ ఆదుకుంటామని ప్రతిపక్ష నేత భరోసా

ప్రజా సంకల్ప యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి


నడి నెత్తిన సూర్యుడు సుర్రుమనిపిస్తున్నా ఏమాత్రం లెక్క చేయకుండా అశేష ప్రజానీకం జననేత జగన్ అడుగులో అడుగులేసింది. పసి పిల్లలను చంకనెత్తుకుని వచ్చిన మహిళలు.. ‘అన్నొస్తున్నాడు..’ అంటూ పొలాల్లోంచి పరుగెత్తుకొచ్చారు. కాళ్లు కాలుతున్నా లెక్కచేయక చిన్నారి విద్యార్థులు పాదయాత్ర ఆద్యంతం హుషారుగా నడిచారు. రాజన్న బిడ్డను చూద్దామని అవ్వాతాతలు రోడ్డుపక్కన గంటల తరబడి వేచి చూశారు. తమ బాధలు వినే నాయకుడు వచ్చారంటూ ప్రజలు ఊరూరా స్వాగతం పలికారు.. పూలబాటలేశారు. తెలుగుదేశం ప్రభుత్వ పాలనలో మోసపోయిన బాధితులు.. కష్టాలు అనుభవించే బడుగు, బలహీనులు అనేక మంది జగన్ ముందు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప యాత్ర 116వ రోజు మంగళవారం గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలో కొనసాగింది. పెదనందిపాడు శివారు మొదలు


మిగతా 6వ పేజీలో ▶

అసెంబ్లీలో అబద్ధాల పుట్ట!

పోలవరం ప్రాజెక్టు పనులపై సీఎం చంద్రబాబు అసత్యాలు

- శాసనసభ వేదికగా అక్రమాలను కప్పిపుచ్చే యత్నం
- ప్రజల కళ్లకు గంతలు కట్టేందుకు పన్నాగం
- కేంద్ర మంత్రి సూచనలపై పనులు ‘నవయుగ’కు అప్పగించారట!
- అదే సంస్థకు కట్టబెట్టాలని ఎక్కడా చెప్పని కేంద్ర మంత్రి
- ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలను దక్కించుకోవడంపైనా పాత పల్లవే
- రాష్ట్ర సర్కారు అభ్యర్థన మేరకే అప్పగించామని కేంద్రం ప్రకటన




agreed to the State's request

రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థన మేరకే పోలవరం నిర్మాణ బాధ్యతలు అప్పగించామని కేంద్ర ఆర్థిక శాఖ సెప్టెంబర్ 8, 2016న జారీ చేసిన ప్రకటన

సాక్షి, అమరావతి:

పోలవరం ప్రాజెక్టు పనుల్లో అవినీతి, అక్రమాలను తెరమరుగు చేయడానికి మంగళవారం సాక్షాత్తూ శాసనసభ వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు మరోసారి అసత్యాలను వల్లె వేశారు. ప్రజల కళ్లకు గంతలు కట్టే ప్రయత్నం చేశారు. కేంద్ర మంత్రి సూచనల మేరకే ఈ ప్రాజెక్టు పనులను నవయుగ సంస్థకు అప్పగించామని ప్రకటించారు. ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలను రాష్ట్రానికి అప్పగించాలని

మిగతా 3వ పేజీలో ▶

పోలవరానికి రూ.1,400 కోట్లు

ఏపీ ప్రభుత్వానికి విడుదల చేయాలని నాబార్డుకు కేంద్రం ఆదేశం

- వివరాలు 3లో





మాకు మద్దతివ్వండి

- రాజ్యసభ ఎన్నికల్లో టీడీపీ మద్దతు కోరిన తెలంగాణ కాంగ్రెస్
- నిర్ణయంపై నేడు టీడీపీ అధికారిక ప్రకటన

సాక్షి, హైదరాబాద్: రాజ్యసభ ఎన్నికల్లో మద్దతివ్వాలని కాంగ్రెస్ పార్టీ టీడీపీని కోరింది. మంగళవారం తెలంగాణ సీఎల్పీ నేత జానారెడ్డి నివాసంలో పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. తమ పార్టీ అభ్యర్థి బలరాం నాయక్‌కు మద్దతివ్వాలని తెలంగాణ టీడీపీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్యను కోరినట్లు వెల్లడించారు. కాగా, రాజ్యసభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు ఎమ్మెల్యేలు వెంకట వీరయ్య, ఆర్.కృష్ణయ్య, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రమణ టీడీఎల్పీలో సమావేశమయ్యారు. కాంగ్రెస్ అభ్యర్థికి ఓటేసినా గెలిచే పరిస్థితి లేదనే అభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం. అయితే అధికారిక నిర్ణయాన్ని బుధవారం ప్రకటించనున్నారు.

ఆ 39 మందిని చంపేశారు

ఐఎస్ అపహరించిన భారతీయుల మృతి



- మోసుల్ దగ్గర్లోని ఒక గ్రామంలో మృతదేహాల గుర్తింపు
- వారి మృతిని నిర్ధారిస్తూ రాజ్యసభలో సుష్మా ప్రకటన
- 2014లో 40 మంది కార్మికులను అపహరించిన ఉగ్రవాదులు
- బంగ్లాదేశ్‌కు చెందిన ముస్లింనని చెప్పి తప్పించుకున్న హర్జీత్
- బాధిత కుటుంబాలతో కేంద్రం అమానవీయంగా వ్యవహరించింది: ప్రతిపక్షాలు

12 లో

భారతీయ కాల్ సెంటర్లకు ముప్పు



■ భారతీయ కాల్ సెంటర్లపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపే బిల్లును అమెరికా కాంగ్రెస్‌లో ప్రవేశపెట్టారు. అమెరికన్ కాల్ సెంటర్లను పరిరక్షించాలని డెమొక్రటిక్ సెనేటర్ షెర్రాడ్ బ్రౌన్ ఈ బిల్లులో ప్రతిపాదించారు. ఈ బిల్లు చట్టమైతే భారత్‌లోని కాల్ సెంటర్ ఉద్యోగాలు ప్రమాదంలో పడనున్నాయి.

- వివరాలు 12లో

ఇదండీ సంగతి



ప్రత్యేక హోదా కోసం.. రేపు జాతీయ రహదారుల దిగ్బంధం

- విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు వైఎస్ జగన్ పిలుపు
- ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి ఆందోళనకు మద్దతు



సాక్షి, అమరావతి: రాష్ట్రానికి ప్రత్యేక హోదా డిమాండ్ చేస్తూ ఈనెల 22వ తేదీన రాష్ట్రంలోని జాతీయ రహదారులు అన్నింటినీ దిగ్బంధించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. ప్రత్యేక హోదా కోసం గత నాలుగేళ్లుగా వైఎస్సార్‌సీపీ అలుపెరగని పోరాటం చేస్తున్న విషయం తెలిసిందే. హోదా సాధన కోసం చేసే ఏ పోరాటానికైనా, ఆందోళనకైనా మద్దతిస్తామని వైఎస్సార్‌సీపీ ఇప్పటికే ప్రకటించింది. ఈ నేపథ్యంలో ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి చేయనున్న ఆందోళనకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. గురువారం ఉదయం 10.00 గంటలకు ప్రారంభమయ్యే జాతీయ రహదారుల దిగ్బంధం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులను సమాయత్తం చేయాలని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో కోరింది. ఇతర పార్టీలను, విద్యార్థి, యువజన, ప్రజా సంఘాలను సమన్వయం చేసుకుంటూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని పేర్కొంది. ముఖ్య నాయకులతో బుధవారం జిల్లాస్థాయి సమావేశాలు ఏర్పాటు చేసి ఇందుకు తగిన కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించింది. ఈ ఆందోళన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పార్టీ జెండాలు, కండువాలతో పాల్గొని పెద్దఎత్తున ప్లకార్డులను ప్రదర్శించాలని పేర్కొంది.

@ysjagan

అవిశ్వాస తీర్మానంపై చర్చకు సహకరించండి

వివిధ రాజకీయ పార్టీలను కోరిన వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వంపై తాము ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి సహకరించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ప్రధాన ప్రతిపక్ష నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వివిధ రాజకీయ పక్షాలకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ట్విట్టర్‌లో ఓ సందేశాన్ని ఉంచారు. 'ప్రత్యేక తరగతి హోదా (ఎస్‌సీఎస్) ఆంధ్రప్రదేశ్ జీవనాడి. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వనందుకు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై కీలకమైన చర్చ జరిగేందుకు సహకరించాల్సిందిగా సభలోని అన్ని రాజకీయ పక్షాలను సవినయంగా కోరుకుంటున్నాం. సభలోని ఇతర పార్టీలు లేవనెత్తిన అంశాలను మేము గుర్తిస్తూనే ప్రత్యేక తరగతి హోదాపై నిరంతరాయ చర్చకు సహకరించాలని అభ్యర్థిస్తున్నాం. మా రాష్ట్రాన్ని విభజించే సమయంలో ముందస్తు షరతుగా ఏపీకి ప్రత్యేక తరగతి హోదా ఇస్తామని పార్లమెంటు సాక్షిగా హామీ ఇచ్చారు. ఏపీకి ప్రత్యేక తరగతి హోదా సాధించే వరకు వైఎస్సార్‌సీపీ పోరాటాన్ని కొనసాగిస్తుంది' అని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

కాపీరాయుడి 'స్టేట్ ఫస్ట్' ఆశలు

- అవిశ్వాసాన్ని, ఎంపీల రాజీనామాలను తొలుత ఎద్దేవా చేసిన బాబు..
- వైఎస్సార్‌సీపీ తీర్మానానికి మద్దతిస్తానని అసెంబ్లీ సాక్షిగా ప్రకటన
- తెల్లారే సరికల్లా యూటర్న్.. సొంత తీర్మానంతో ప్రత్యక్షం..
- మద్దతు కూడగట్టడానికి చేసిందేమీ లేదు.. అయినా.. అన్ని పార్టీల మద్దతు తమకే ఉందని ప్రచారం..
- ప్యాకేజీని స్వాగతించి.. నాలుగేళ్లు కాలయాపన చేసిన బాబు
- ప్రజల్లో హోదా భావోద్వేగాలు చూసి నాటకాలు..
- ఎన్నికల ముంగిట్లో ఎల్లో మీడియా దన్నుతో సర్కస్ ఫీట్లు..

(సాక్షి ప్రత్యేక ప్రతినిధి)

తగినంత సంఖ్యాబలం ఉంటే వైఎస్సార్‌సీపీ అవిశ్వాసానికి మద్దతిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సాక్షాత్తూ అసెంబ్లీ సాక్షిగా ప్రకటించారు. ఆ మర్నాడే మాట మార్చారు. ఉదయం 9.30 గంటలకు ఎన్డీయే నుంచి వైదొలగారు. అవిశ్వాస తీర్మానాన్ని పెట్టి తనకే అన్ని పక్షాల మద్దతు ఉందని ఆయన ప్రకటించారు. వాస్తవానికి అవిశ్వాసం అన్న ఆలోచన ప్రతిపక్షనేత జగన్‌ది. అవిశ్వాసాన్ని అవహేళన చేసింది చంద్రబాబు.. అన్ని పార్టీల దగ్గరకు తన ఎంపీలను పంపించి మద్దతు కూడగట్టింది జగన్‌మోహన్‌రెడ్డి. అవిశ్వాసం తెలివితక్కువ పని అని అవహేళన చేసిన చంద్రబాబు అన్ని పక్షాలూ జగన్‌కు మద్దతు పలకడంతో ఆ క్రెడిట్ తనకే రావాలని హడావిడిగా ఎన్డీయే నుంచి వైదొలగి అవిశ్వాసాన్ని విడిగా ప్రతిపాదించారు. ప్రత్యేక హోదా కోసం పోరాడాలన్న చిత్తశుద్ధి లేకపోగా ఢిల్లీ పరిణామాలలో క్రెడిట్ అంతా తనకే దక్కాలన్న ఆరాటంలో చంద్రబాబు తన అనుకూల మీడియాలో వెనకాముందు చూసుకోకుండా సొంత డబ్బా ప్రచారాలను ముమ్మరం చేశారని విశ్లేషకులంటున్నారు. ప్రజలలో ప్రత్యేక హోదా భావోద్వేగాలు పెరగడం చూసి ఒక్కసారిగా ఆయన యూటర్న్ తీసుకున్నారు. అవిశ్వాస తీర్మానం, ఎంపీల రాజీనామా ప్రతిపాదనలను చంద్రబాబు తొలుత ఎద్దేవా చేశారు. అవిశ్వాస తీర్మానం ఆలోచన అనుభవం లేనివారిదని, జగన్ పార్లమెంటు ప్రొసీడింగ్స్ తెలియకుండా మాట్లాడుతున్నారని అన్నారు. ఎంపీల రాజీనామాల ప్రతిపాదన కూడా తెలివిమాలిన ఆలోచన అని విమర్శలు చేశారు. ఇపుడు అవన్నీ తన ఆలోచనలేనన్నట్లు.. ప్రత్యేక హోదా కోసం తానే కష్టపడుతున్నట్లు అనుకూల మీడియాలో ప్రచారం చేయించుకుంటున్నారు.

మీకు అన్ని పక్షాల మద్దతు ఉందా..

ఫైనాన్స్ బిల్లు ముందుగానే ఆమోదం పొందడంతో పార్లమెంటును వాయిదా వేసే ప్రమాదముందని గ్రహించిన వైఎస్సార్సీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి అవిశ్వాస తీర్మానం ప్రతిపాదనను కూడా ముందుకు జరిపారు. పార్లమెంటు సాక్షిగా తమ రాష్ట్రానికి లభించిన ప్రత్యేక హోదా హామీని నెరవేర్చడం కోసం అలుపెరగకుండా పోరాడుతున్నామని, అందులో భాగంగా కేంద్రంపై అవిశ్వాస తీర్మానం పెడుతున్నందున తమకు సహకరించాలని అన్ని రాజకీయ పార్టీలకు లేఖలు రాశారు. ఆ లేఖలను పార్టీ ఎంపీలు అన్ని పార్టీల నేతలకు అందించి మద్దతును కూడగట్టారు. ఈ పరిణామాలను గమనించిన చంద్రబాబు కంగారు పడ్డారు. ప్రత్యేక హోదా పోరాటం క్రెడిట్ అంతా జగన్‌కు పోతున్నట్లు భయపడి యూటర్న్‌ల మీద యూటర్న్‌లు తీసుకున్నారు. వేగంగా మాటలు మార్చారు. విడిగా అవిశ్వాస తీర్మానం పెట్టాలని నిర్ణయించడమే కాక తమకే అన్ని పార్టీల మద్దతు ఉందని అనుకూల మీడియాలో ప్రచారం చేయించుకుంటున్నారు. మార్చి 16న ఉదయం 9.30 గంటలకు ఎన్డీయే నుంచి వైదొలగాలని నిర్ణయించే వరకు వైఎస్సార్సీపీ అవిశ్వాస తీర్మానానికి టీడీపీ మద్దతిస్తోందనే అంతా అనుకున్నారు. కానీ చంద్రబాబు మాటమార్చారు. తాము వెనకబడిపోకుండా తామే అవిశ్వాసం పెడుతున్నామని, తమకే అన్ని పార్టీలూ మద్దతిస్తున్నాయని ప్రచారం మొదలుపెట్టారు.

అవిశ్వాసం ఆలోచనే లేదు.. ఇక పార్టీల మద్దతు కూడగట్టింది ఎప్పుడు?

అన్ని రంగాలనూ అవినీతిమయం చేశారని ఆధారాలతో సహా రుజువవుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీకి వ్యతిరేకంగా అన్ని పార్టీలూ పోరాడుతున్నాయి. అవినీతిని విశృంఖలం చేసిన ఆ పార్టీని నమ్మడానికి కాంగ్రెస్ తప్ప ఎవరూ సిద్ధంగా లేరు. కిరణ్‌కుమార్ రెడ్డి హయాంలో చేతులు కలిపి జగన్‌పై తప్పుడు కేసులు పెట్టిన కాంగ్రెస్ మాత్రమే టీడీపీతో కలసి పనిచేసే అవకాశాలున్నాయి తప్ప మిగిలిన పార్టీలన్నిటికీ చంద్రబాబు సంగతి తెలుసు. అసలు ఏం చూసి చంద్రబాబుకు అన్ని రాజకీయ పార్టీలు మద్దతిస్తాయి? దేశంలోకెల్లా చంద్రబాబుది అవినీతి ప్రభుత్వమని, ఆయన హయాంలో ఆంధ్రప్రదేశ్ నెంబర్ 1 స్థానానికి చేరుకుందని ఎన్‌సీఏఈఆర్ వంటి ప్రతిష్టాత్మక సంస్థలు గుర్తించినందుకు పార్టీలు మద్దతిస్తాయా? దేశంలోకెల్లా ధనికుడైన ముఖ్యమంత్రి చంద్రబాబు అని, రెండెకరాల నుంచి రెండు లక్షల కోట్లకు ఆస్తులు చేరుకున్నాయని గుర్తించినందుకు జాతీయ పార్టీలు మద్దతిస్తాయా? అయినా కేంద్రంపై తాము అవిశ్వాసం పెడుతున్నామని, తమకు మద్దతివ్వాలని కనీసం ఆయా పార్టీలను తెలుగుదేశం ఎంపీలు గానీ, ముఖ్యనేతలు గానీ కలిసి అభ్యర్థించిన దాఖలాలు కూడా లేవు. వైఎస్సార్సీపీ అధ్యక్షుడి మద్దతు అభ్యర్థన లేఖలు, ఎంపీల ప్రయత్నాల వల్లే జాతీయ స్థాయిలో కదలిక వచ్చింది. కాంగ్రెస్, వామపక్షాలు, ఇతర బీజేపీ యేతర పక్షాలు ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా విషయంలో మద్దతు పలకాలన్న నిర్ణయానికి వచ్చాయి. అందుకోసం ఎలాంటి ప్రయత్నాలూ చేయకుండానే తన అనుకూల మీడియాలో మాత్రం చంద్రబాబు ప్రతిరోజూ అదంతా తన ప్రతిభ అన్నట్లు.. ఏదో క్రెడిట్ తనకే వచ్చేయాలన్నట్లు ప్రచారం చేయించుకోవడం హాస్యాస్పదంగా ఉందని ఢిల్లీ పరిణామాలను గమనిస్తున్న రాజకీయ విశ్లేషకులంటున్నారు.

పోరాడుతున్నదెవరు?

ఐదు కోట్ల మంది ఆంధ్రులకు అపర సంజీవని వంటి ప్రత్యేక హోదా కోసం ఆది నుంచి పోరాడుతున్న దెవరు? 'హోదా కోసం ఎందాకైనా' అనే నినాదం ఎవరిది? 'ప్యాకేజీలతో మోసం చేయొద్దు.. ప్రత్యేక హోదా మన హక్కు.. దాని కోసం చివరి వరకుపోరాడదామని పిలుపునిచ్చిందెవరు? నాలుగేళ్లలో హోదా కోసం అన్ని రకాల ఉద్యమాలూ చేసిందెవరు?

ఎవరు అనేది రాష్ట్ర ప్రజలు గ్రహించారు.

పూటకోమాట ఎవరిది?

ప్రత్యేక హోదా సంజీవని కాదన్న ఊసరవెల్లి ఎవరు? హోదాతో ఏం వస్తుంది.. కేంద్రం హోదా కన్నా మెరుగైన ప్యాకేజీ ఇచ్చింది. మనమే ఎక్కువ సాధించాం. ఏ రాష్ట్రానికైనా ఇంతకన్నా ఎక్కువ వచ్చాయా అన్నదెవరు? ప్యాకేజీ ఇచ్చినందుకు మోదీకి ప్రత్యేక ధన్యవాదాలు చెప్పిందెవరు? హోదాపై మళ్లీ యూటర్న్ తీసుకున్నదెవరు? అవిశ్వాసం, రాజీనామాలపైనా పూటకోరకంగా మాట్లాడుతున్నదెవరు?

ఎవరు అనేది రాష్ట్ర ప్రజలకు అర్థమయ్యింది.

అవిశ్వాసం, రాజీనామాలను ఎద్దేవా చేసిన బాబు..

ప్రత్యేక హోదా పోరాటంలో భాగంగా ఫిబ్రవరి 15నే స్పష్టమైన కార్యాచరణను ప్రకటించిన ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందులో అవిశ్వాస తీర్మానం ప్రతిపాదనను కూడా చేర్చారు. మార్చి 1న కలెక్టరేట్ల ముట్టడి, 5న ఢిల్లీలో పార్టీ ముఖ్యనేతలు, ప్రజాప్రతినిధులు, శ్రేణుల ధర్నా, మార్చి 5 నుంచి ఏప్రిల్ 5 వరకు పార్లమెంటులో ఎంపీల పోరాటం, అప్పటికీ కేంద్రం హోదా ఇవ్వకపోతే ఏప్రిల్ 6న రాజీనామాలు చేసి తిరిగి రావడం.. ఇదీ జగన్ హోదా పోరు కార్యాచరణ. అయితే మార్చి 21న కేంద్రంపై అవిశ్వాసం పెట్టాలన్న ప్రతిపాదనను అందులో చేర్చారు. తాము పెట్టే అవిశ్వాస తీర్మానానికి మద్దతివ్వాలని, లేదంటే మీరే అవిశ్వాస తీర్మానం పెడితే మేం మద్దతిస్తామని టీడీపీకి ఫిబ్రవరి 18న జగన్ ప్రతిపాదించారు. కానీ ఫిబ్రవరి 19న చంద్రబాబు ఏమన్నారో తెలుసా? 'అవిశ్వాసం పెట్టాలన్న ఆలోచన అవివేకంతో కూడుకున్నది. ఒకసారి అవిశ్వాసం పెడితే మళ్లీ ఆరునెలల వరకు మాట్లాడలేం.' అన్నారు. అలాగే ఫిబ్రవరి 20న 'హామీలను పోరాడి సాధించుకోవాలి తప్ప రాజీనామాలు చేస్తే ఎలా' అని ప్రశ్నించారు. ఆ మర్నాడే పూర్తి మెజారిటీ ఉన్న బీజేపీని అవిశ్వాసంతో ఏమీ చేయలేమన్నారు. మార్చి 15 వరకు చంద్రబాబుది అదే వైఖరి.

స్వాగతించకుండా పోరాడి ఉంటే..

ప్రత్యేక హోదా ఇవ్వలేమని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ 2016 సెప్టెంబర్ 9 అర్ధరాత్రి ప్రకటించినపుడు చంద్రబాబునాయుడు ఎలాంటి సంకోచమూ లేకుండా వెంటనే స్వాగతించేశారు. కేంద్ర మంత్రులకు సన్మానాలు చేశారు. ఢిల్లీకి వెళ్లి మరీ దండలు వేసి వచ్చారు. ఆనాడు ప్రత్యేక హోదా ఆకాంక్ష కనిపించలేదా? హోదా ఇవ్వలేమని చెబుతున్నా ఎలా స్వాగతించారు? ఎందుకు సన్మానాలు చేశారు? ఇపుడు ప్రత్యేక హోదాపై సమరశీల పోరాటాలు చేస్తున్నట్లు ప్రచారం చేయించుకుంటున్న చంద్రబాబు ఆ నాడే కేంద్రంపై ఒత్తిడి చేసి ఉంటే ప్రత్యేకహోదా వచ్చి ఉండేది. కలసి పోటీచేసి అధికార పగ్గాలు చేపట్టి కేంద్రంలో అధికారాన్ని పంచుకుని నాలుగేళ్లపాటు కాలయాపన చేసేసిన చంద్రబాబు ఇపుడు ప్రజలలో ప్రత్యేకహోదా భావోద్వేగాలు మిన్నుముట్టడంతో యూటర్న్ తీసుకున్నారు. నాలుగేళ్లపాటు కేంద్రంతో కలసి రాష్ట్రప్రయోజనాలు పట్టించుకోకుండా ప్రజలను మోసగించి ఇపుడు పుణ్యకాలం గడచిపోయిన తర్వాత ప్రజల కోసం నిలబడినట్లు ప్రచారం చేయించుకుంటున్నారు. స్వీయ రాజకీయ ప్రయోజనాల కోసమే ఇన్నాళ్లూ మిన్నకున్నారని, ఇపుడు ఎన్నికలు దగ్గరపడుతుండడంతోనే చంద్రబాబు కేంద్రంపై పోరాడుతున్నట్లు రంగులు మార్చుతున్నారని విమర్శకులంటున్నారు. ఇన్నాళ్లూ కేంద్రంలో అధికారం పంచుకున్న చంద్రబాబు ప్రత్యేక హోదా హామీ నెరవేరకపోవడానికి, విభజన చట్టంలోని అంశాలు అమలు కాకపోవడానికి కారణాలేమిటనేదానిపై సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉన్నా ఆ విషయాన్ని వదిలేసి తానే ప్రశ్నిస్తున్నట్లు పోజిస్తుండడం చూసి రాష్ట్రప్రజలు ఆశ్చర్యపోతున్నారు.



అవిశ్వాసానికి మద్దతివ్వాలని సీపీఎం నేత సీతారాం ఏచూరి, కాంగ్రెస్ నేత ఖర్గే, టీడీపీ నేత తోట నరసింహంతో..



బీజేడీ నేత భర్తృహరి, ఎన్‌సీపీ నేత తారిఖ్ అన్వర్, టీఎంసీ నేత సౌగత్‌రాయ్, ఆప్ నేత భగవత్‌మన్‌లను కలిసి కోరుతున్న వైఎస్సార్‌సీపీ ఎంపీలు

అవిశ్వాసానికి మద్దతు కోరుతూ ఈనెల 15న వివిధ పార్టీల నేతలను కలిసిన వైఎస్సార్‌సీపీ ఎంపీలు

చంద్రబాబు.. పూటకోమాట

19.02.2018:	ఒకసారి అవిశ్వాసం పెడితే మళ్లీ ఆరు నెలల వరకు మాట్లాడలేం. ఏం తెలియకుండా అవిశ్వాసం పెడతాం.. నా వెనక రా అని జగన్ అవివేకంతో మాట్లాడుతున్నారు.
20.02.2018:	హామీలను పోరాడి సాధించుకోవాలి తప్ప రాజీనామాలు చేస్తే పార్లమెంట్‌లో ఎవరు పోరాడుతారు.
21.02.2018:	పూర్తి మెజారిటీ ఉన్న బీజేపీని అవిశ్వాసంతో ఏమీ చేయలేం.
27.02.2018:	ప్రత్యేక హోదాతో రాష్ట్రానికి ఏమొస్తాయి. హోదాతో రాయితీలు వస్తాయని ఏ జీఓలో ఉందో చూపించమంటే చూపలేకపోతున్నారు. హోదా వస్తే పరిశ్రమలకు రాయితీలు వచ్చేస్తాయని కొందరు మభ్య పెడుతున్నారు.
02.03.2018:	హోదా వద్దని టీడీపీ ఎక్కడా, ఎప్పుడూ అనలేదు.
06.03.2018:	పత్యేక హోదా ఇవ్వాలన్నదే మన డిమాండ్? ఎవరూ ప్రత్యేక ప్యాకేజీ అనే ప్రస్తావన కూడా తేవద్దు. ప్రత్యేక హోదా గురించే అందరూ మాట్లాడాలి.
15.03.2018:	రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎవరితోనైనా కలిసి పనిచేస్తాం. వైఎస్సార్‌సీపీ అవిశ్వాసానికి మద్దతిస్తామని అసెంబ్లీలో ప్రకటన
16.03.2018:	మేమే అవిశ్వాసం పెడతాం. ఎన్‌డీఏ నుంచి వైదొలిగి హడావుడిగా అవిశ్వాసం నోటీసు

'అవిశ్వాసం'పై అదే తీరు



కేంద్రంపై అవిశ్వాస తీర్మానానికి సహకరించాలని మంగళవారం పార్లమెంట్ ఆవరణలో టీఎంసీ, అన్నాడీఎంకే నేతలతో పాటు జేడీఎస్ అధ్యక్షుడు దేవెగౌడను కోరుతున్న వైఎస్సార్‌సీపీ ఎంపీలు

▶ మొదటి పేజీ తరువాయి

సభ ప్రారంభం కాగానే విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుష్మా స్వరాజ్ ఇరాక్‌లో భారతీయుల హత్యలపై ప్రకటన చేసేందుకు లేచి నిల్చున్నారు. ఆ ప్రకటన చేయనివ్వకుండా విపక్ష సభ్యులు తమ స్థానాల్లోనే ఉండి నినాదాలు ప్రారంభించారు. అప్పటివరకు వెల్‌లో ఉండి ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేసిన ఏఐఏడీఎంకే, టీఆర్ఎస్ సభ్యులు సుష్మాస్వరాజ్ ప్రకటన చేస్తుండగా మౌనంగా నిలుచున్నారు. దీంతో ఆ రెండు పార్టీల తీరును విపక్షాలు తప్పుపట్టాయి. అవిశ్వాస తీర్మానం నోటీసులు ప్రస్తావనకు వస్తే గొడవకు దిగుతూ, ఇప్పుడు మౌనంగా ఎందుకున్నారని ప్రశ్నించాయి. అయితే, ఈ గందరగోళం మధ్య ఇరాక్‌లో భారతీయుల హత్యలపై ప్రకటన చేయలేనని సుష్మా స్వరాజ్ తేల్చిచెప్పారు. దీంతో సభాపతి విపక్షాల తీరును తప్పుపట్టారు. ''మీలో మానవత్వం సన్నగిల్లిందా? ఇలా చేయడం సరైంది కాదు. ఇది మన ప్రతిష్టను దెబ్బతీస్తుంది'' అని పేర్కొన్నారు. అనంతరం పలువురు మంత్రులు వివిధ స్టాండింగ్ కమిటీల సిఫారసుల అమలు నివేదికలను ప్రవేశపెట్టారు.

మళ్లీ అదే తీరు

సరిగ్గా మధ్యాహ్నం 12.13 గంటలకు సభాపతి తన వద్దకు వచ్చిన అవిశ్వాస తీర్మానం నోటీసులను సభలో ప్రస్తావించారు. ''కేంద్ర మంత్రి మండలిపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు వైవీ సుబ్బారెడ్డి నుంచి, తోట నర్సింహం నుంచి నోటీసులు అందాయి. ఈ నోటీసులను సభ ముందుంచడం నా బాధ్యత. ఈ తీర్మానం ప్రవేశపెట్టేందుకు అవసరమైన 50 మంది సభ్యులు వారి స్థానాల్లో లేచి నిలుచుంటే వారిని లెక్కించేందుకు వీలుగా సభ సజావుగా నడవాలి. అప్పుడే నేను వారిని లెక్కించి ఈ తీర్మానం ప్రవేశపెట్టేందుకు అనుమతి ఇవ్వాలా లేదా అనేది నిర్ణయించగలను. అందువల్ల సభ్యులు తమ తమ స్థానాల్లోకి వెళ్లి కూర్చోవాలి'' అని సూచించారు. అవిశ్వాస తీర్మానం నోటీసులు ప్రస్తావన రాగానే విపక్షాల సభ్యులంతా దానికి మద్దతుగా లేచి నిలబడ్డారు. వైఎస్సార్‌సీపీ, టీడీపీ, కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, సమాజ్‌వాదీ పార్టీ, ఆర్జేడీ, ఎన్సీపీ, జేఎంఎం, ఎంఐఎం, ఆమ్ ఆద్మీ తదితర విపక్షాల సభ్యులంతా అవిశ్వాస తీర్మానం నోటీసులకు మద్దతుగా సభలో లేచి నిలుచున్నారు. అవిశ్వాస తీర్మానం నోటీసుకు మద్దతుగా సభలో లేచి నిల్చోవాలని వైఎస్సార్‌సీపీ తన పార్టీ ఎంపీలకు విప్ జారీ చేసింది. అయితే, ఆ పార్టీ నుంచి గెలిచిన ఎంపీ కొత్తపల్లి గీత స్పీకర్ అవిశ్వాస తీర్మానం ప్రస్తావన తెచ్చినప్పుడు సభలో కూర్చునే ఉన్నారు.

ఇదేం పద్ధతి?: స్పీకర్

అవిశ్వాస తీర్మానాల నోటీసులను ప్రస్తావిస్తూ వెల్‌లో ఉన్న సభ్యులను తమ స్థానాల్లోకి వెళ్లాలని కోరినప్పటికీ వారు వినకపోవడంతో స్పీకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ''ఇదేం పద్ధతి? రెండు అవిశ్వాస తీర్మానాలపై చర్చ జరగాల్సిన అవసరం ఉంది. మీరు సహకరించడం లేదు. సభ సజావుగా సాగకపోవడంతో అవిశ్వాస తీర్మానాలను నేను సభ ముందుకు తీసుకురాలేకపోతున్నాను'' అని పేర్కొంటూ అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెట్టేందుకు అనుమతిని తోసిపుచ్చారు. సభను బుధవారానికి వాయిదా వేశారు.

మరోసారి నోటీసులు

కేంద్రంపై అవిశ్వాసం ప్రకటించేందుకు వైఎస్సార్‌సీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, టీడీపీ ఎంపీ తోట నర్సింహం నాలుగోసారి నోటీసు ఇచ్చారు. మంగళవారం మధ్యాహ్నం ఈ నోటీసులను లోక్‌సభ సెక్రటరీ జనరల్ స్నేహలతా శ్రీవాస్తవకు అందజేశారు.

స్పీకర్‌కు వైఎస్సార్‌సీపీ అభ్యర్థన

ధర్నా అనంతరం వైఎస్సార్‌సీపీ ఎంపీలు లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్‌ను ఆమె కార్యాలయంలో కలిశారు. అవిశ్వాస తీర్మానం చర్చకు వచ్చేందుకు వీలుగా దానిని ప్రవేశపెట్టేందుకు అనుమతివ్వాలని కోరారు.

మాకు సహకరించండి

పార్లమెంట్ ఆవరణలో గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న ఏఐఏడీఎంకే సభ్యులను వైఎస్సార్‌సీపీ సభ్యులు కలిశారు. చేతులు జోడించి నమస్కారం చేశారు. కేంద్రంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు తమకు సహకరించాలని కోరారు. అలాగే మాజీ ప్రధానమంత్రి, జేడీఎస్ అధ్యక్షుడు దేవెగౌడను పార్లమెంట్‌లో కలిశారు. అవిశ్వాస తీర్మానానికి మద్దతు తెలపాలని అభ్యర్థించారు.

సహకరించాలని ఏఐఏడీఎంకే, టీఆర్ఎస్‌కు వినతి

అంతకుముందు ఉదయం 10.30 గంటలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు పార్లమెంట్ ప్రధాన ద్వారం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ''కేంద్రంపై మేము ఇచ్చిన అవిశ్వాస తీర్మానం నోటీసుకు సభలో అన్ని ప్రతిపక్షాలు మద్దతుగా నిలిచాయి. ఏఐఏడీఎంకే, టీఆర్ఎస్ పార్టీలకు విజ్ఞప్తి చేస్తున్నాం. మా రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని వినిపించేందుకు సహకరించాలని కోరుతున్నాం. ఇదివరకే వారిని కలిసి అడిగాం. మరోసారి విజ్ఞప్తి చేస్తున్నాం. సభలో మీరు మౌనంగా ఉంటే తీర్మానం ప్రవేశపెట్టేందుకు అవకాశం ఉంటుందని విన్నవిస్తున్నాం. అవిశ్వాస తీర్మానం చర్చకు రాకుండా అడ్డుకోవాలని టీడీపీ సర్వశక్తులూ ఒడ్డుతోంది. టీడీపీ ఇతర పార్టీలతో చేరి సభను జరగనివ్వకుండా చేస్తోంది'' అని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ ఎంపీలు పార్లమెంట్‌లో ఆవరణలో గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేశారు.

రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ ఆందోళన

ప్రత్యేక హోదాపై చర్చకు పట్టుబడుతూ వైఎస్సార్‌సీపీ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి రాజ్యసభలో ఆందోళనకు దిగారు. ప్రత్యేక హోదా ప్లకార్డును ప్రదర్శిస్తూ వెల్‌లో ఆందోళన చేశారు. ప్రతిపక్ష నేత గులాం నబీ ఆజాద్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా అంశం, కావేరీ నదీ బోర్డు తదితర అంశాలపై జరగాల్సి ఉందన్నారు.

చర్చ జరగాలనే కోరుకుంటున్నా: వెంకయ్య

ఏపీకి ప్రత్యేక హోదా, కావేరీ బోర్డు, బ్యాంకింగ్ తదితర అంశాలపై చర్చ జరగాలని తాను మొదటినుంచీ కోరుకుంటున్నానని రాజ్యసభ చైర్మన్ ఎం.వెంకయ్య నాయుడు చెప్పారు. అయితే అధికార, విపక్షాల మధ్య వాగ్వాదం, వివిధ పక్షాల ఆందోళన కారణంగా సభను బుధవారానికి వాయిదా వేశారు.

అసెంబ్లీలో అబద్ధాల పుట్ట!

▶ మొదటి పేజీ తరువాయి

తాను కోరలేదని, నీతిఅయోగ్ ప్రతిపాదనల మేరకు కేంద్రమే అప్పగించిందని పాత పల్లవిని అందుకున్నారు. ''డబ్బుల కోసమే పోలవరం ప్రాజెక్టు పనులను దక్కించుకున్నానని ఇద్దరు నాపై విమర్శలు చేస్తున్నారు. భూసేకరణ, ఆర్అండ్ఆర్ వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించేలా అంగీకరించానని ఆరోపిస్తున్నారు. సున్నితమైన సమస్యలపై ఇలా మాట్లాడొద్దు. చేతులు పెడితే కాలిపోతాయి'' అంటూ రుసరుసలాడారు. పోలవరం ప్రాజెక్టుపై అసెంబ్లీ వేదికగా చంద్రబాబు చేసిన వ్యాఖ్యల్లో వాస్తవం ఎంతన్నది పరిశీలిస్తే... పోలవరం జలాశయం పనులను నవయుగ సంస్థకు అప్పగించడంలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పాత్ర లేదన్నది ఇట్టే అర్థమవుతుంది.

- *పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ) అనుమతి లేకుండా అంచనా వ్యయాన్ని రూ.286.98 కోట్ల మేర పెంచేసి టెండర్ నోటిఫికేషన్ ఇవ్వడాన్ని కేంద్రం సీరియస్‌గా తీసుకుంటే... తన తప్పును కప్పిపుచ్చుకోవడానికి పాత ధరలకే పనులు చేయడానికి నవయుగ ముందుకొచ్చిందని నమ్మబలికి, నామినేషన్ విధానంలో ఆ సంస్థకు కట్టబెట్టాలని కేబినెట్‌లో సూత్రప్రాయంగా నిర్ణయించింది రాష్ట్ర ప్రభుత్వం కాదా?*
- *ఇందులో కేంద్ర ప్రభుత్వం పాత్ర, కేంద్ర మంత్రి గడ్కరీ పాత్ర ఎక్కడుంది?*
- *రాష్ట్ర సర్కారు కోరింది కాబట్టే పోలవరం ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతను అప్పగించామని కేంద్రం రెండుసార్లు విస్పష్టంగా ప్రకటించినా, చంద్రబాబు మాత్రం నాలుక మడతేశారు. నీతిఆయోగ్ సిఫార్సుల ప్రకారమే తమకు అప్పగించారంటూ పాతపాట పాడారు.*

నిబంధనలకు నీళ్లు: పోలవరం ప్రాజెక్టు జలాశయం(హెడ్ వర్క్స్) పనుల్లో 60సీ నిబంధన కింద పాత కాంట్రాక్టర్ నుంచి మినహాయించిన పనులకు రూ.1,395.30 కోట్లతో ఎల్ఎస్ ఓపెన్ పద్ధతిలో నవంబర్ 16న రాష్ట్ర ప్రభుత్వం టెండర్ నోటిఫికేషన్ జారీ చేసింది. సీఎం చంద్రబాబు ఒత్తిడి మేరకు.. ఆ పనులు నవయుగ సంస్థకే దక్కేలా నిబంధనలతో టెండర్ నోటిఫికేషన్ జారీ చేశారని అప్పట్లో విమర్శలొచ్చాయి. పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ) ఆమోదం లేకుండా, నిబంధనలను తుంగలో తొక్కుతూ జారీ చేసిన ఈ టెండర్ నోటిఫికేషన్‌ను నిలిపివేయాలంటూ నవంబర్ 27న కేంద్రం లేఖ రాయడంతో కలకలం రేగింది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తూ.. అంచనా వ్యయాన్ని రూ.1,483.22 కోట్లకు పెంచేసి మరీ నవంబర్ 30న 'ఈ–ప్రొక్యూర్‌మెంట్' వెబ్‌సైట్‌లో డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయడంపై కేంద్ర జలవనరుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ కన్నెర్ర చేశారు.


నవయుగకు పోలవరం
రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం
కాంక్రీట్ పనులు నామినేషన్ విధానంలో అప్పగింత
బీజేపీపై పోరాటమెందుకు?

పోలవరాన్ని నవయుగకు అప్పగిస్తూ పత్రికలో వచ్చిన కథనం

అదనపు భారం ఎవరు భరిస్తారు?

టెండర్ల వివాదంపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ డిసెంబర్ 13న నిర్వహించిన సమావేశంలో పాత కాంట్రాక్టర్‌కు నెల రోజుల సమయం ఇవ్వాలని.. ఆ లోగా నిర్దేశించిన మేరకు పనులు చేయకపోతే, అప్పుడు తాజా టెండర్ అంశాన్ని పరిశీలిస్తామని తేల్చిచెప్పారు. గడ్కరీ ఇచ్చిన గడువు ముగుస్తున్నా పనుల్లో ఏమాత్రం పురోగతి లేదని, టెండర్లకు అనుమతి ఇవ్వాలని కోరుతూ జనవరి 4న రాష్ట్ర జలవనరుల శాఖ కార్యదర్శి శశిభూషణ్ కుమార్ కేంద్ర జలవనరుల శాఖ కార్యదర్శి యూపీ సింగ్‌కు లేఖ రాశారు. పీపీఏ గెజిట్ నోటిఫికేషన్‌లోని నిబంధనలను గుర్తు చేస్తూ.. టెండర్ అంశంపై నిర్ణయాధికారం పీపీఏకే ఉందని, అక్కడే తేల్చుకోలని రాష్ట్ర ప్రభుత్వానికి జనవరి 5న యూపీ సింగ్ సూచించారు. దాంతో జనవరి 11న సీఈవో సౌమిత్రి హల్దార్ పీపీఏ సమావేశం నిర్వహించారు. 60సీ కింద విడదీసిన పనుల విలువ రూ.1196.24 కోట్లు కాగా, దాన్ని రూ.1,483.22 కోట్లకు పెంచేసి టెండర్లు పిలిచారని, అదనంగా పడే రూ.286.98 కోట్ల భారాన్ని ఎవరు భరిస్తారని రాష్ట్ర ప్రభుత్వాన్ని పీపీఏ నిలదీసింది. ఈ వ్యవహారంపై స్పష్టత ఇచ్చాకే టెండర్లపై నిర్ణయం తీసుకుంటామని పేర్కొంది.

పాత ధరలకే చేస్తుందట!: అంచనా వ్యయం పెంపు వెనుక గుట్టు రట్టు కావడంతో రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త ఎత్తుగడకు తెరతీసింది. పాత ధరలకే పనులు చేయడానికి నవయుగ సంస్థ ముందుకొచ్చిందంటూ జనవరి 17న మీడియాకు లీకులిచ్చింది. 60సీ కింద విడదీసిన పనులను నవయుగకు నామినేషన్ విధానంలో కట్టబెట్టాలని జనవరి 20న మంత్రివర్గ సమావేశంలో అప్పగించాలని సూత్రప్రాయంగా నిర్ణయించారు. అనంతరం జనవరి 30న ఢిల్లీలో నితిన్ గడ్కరీ నేతృత్వంలో జరిగిన సమావేశంలో, పాత ధరలకే చేయడానికి ముందుకొచ్చిన నవయుగకు నామినేషన్ విధానంలో పనులు అప్పగిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఎలాంటి అదనపు భారం పడబోదని చెప్పడంతో ఆ ప్రతిపాదనకు నితిన్ గడ్కరీ అంగీకరించారు. కానీ, అసెంబ్లీలో సీఎం చంద్రబాబు అందుకు విరుద్ధంగా.. కేంద్ర మంత్రి సూచనల మేరకే ప్రాజెక్టు పనులను నవయుగ సంస్థకు కట్టబెట్టామని పేర్కొన్నారు.

కేంద్రం చెప్పిందేమిటంటే..

పోలవరం ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించాలని తాము అడగలేదని.. నీతిఆయోగ్ సిఫార్సుల ప్రకారం కేంద్రమే అప్పగించిందని చంద్రబాబు అసత్యాలు పలికారు. రాష్ట్రానికి ప్రత్యేక సహాయం ప్రకటిస్తూ 2016 సెప్టెంబరు 7న కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ చేసిన ప్రకటనలో గానీ.. 2016 సెప్టెంబరు 8న కేంద్ర ఆర్థిక శాఖ జారీ చేసిన ప్రకటనలో గానీ రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థన మేరకే పోలవరం ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలను అప్పగించినట్లు స్పష్టంగా ఉంది. కానీ, సీఎం చంద్రబాబు శాసనసభ వేదికగా పచ్చి అబద్ధాలు చెప్పడం గమనార్హం.



మావల్లే మోదీ అధికారంలోకి

- ఇంకా బీజేపీతోనే ఉంటే మునుగుతామనే బయటి కొచ్చాం: చంద్రబాబు
- కేంద్రం నిర్వహించే ఆపరేషన్లు మమ్మల్ని ఏమీ చేయలేవు

సాక్షి, అమరావతి/తిరుమల: కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి తెలుగుదేశం పార్టీనే కారణమని సీఎం చంద్రబాబు చెప్పారు. గతంలో ఎన్టీఆర్ రూపొందించిన కాంగ్రెస్ వ్యతిరేక భావజాలం పునాదులపైనే ఎన్డీఏ ఏర్పాటైందన్నారు. మంగళవారం ఉండవల్లిలోని తన నివాసం వద్ద ప్రజాదర్బారు హాలులో జరిగిన పార్టీ సమన్వయ కమిటీ సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు.

ఎన్ని నిధులొస్తాయో కూడా పవన్‌కు తెలియదు

దేశంలో కాంగ్రెసేతర భావజాలాన్ని వ్యాప్తి చేసింది టీడీపీనే అని చంద్రబాబు చెప్పారు. ప్రత్యేక హోదా గురించి మాట్లాడుతున్న పవన్ కల్యాణ్‌కు అసలు నిధులు ఎన్ని వస్తాయో కూడా తెలియదని వ్యాఖ్యానించారు. మార్చి 29న పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని గ్రామగ్రామానా నిర్వహించాలని సూచించారు. కాగా, గుంటూరు జిల్లా, కృష్ణా కరకట్టన ఉన్న సీఎం చంద్రబాబు ఇంటికి మరమ్మతుల నిమిత్తం రూ. 8 లక్షలు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో ఇచ్చింది.


చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న ఈవో, జేఈవో


తిరుమలకు చేరుకున్న సీఎం కుటుంబం

కాగా, ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం రాత్రి 8 గంటలకు తిరుమలకు చేరుకున్నారు. సతీమణి భువనేశ్వరి, కుమారుడు లోకేశ్, కోడలు బ్రాహ్మణి, మనుమడు దేవాన్ష్, బాలకృష్ణ దంపతులు వచ్చారు. ఈ సందర్భంగా సీఎంకు టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, జేఈవో శ్రీనివాస రాజు స్వాగతం పలికారు. బుధవారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు. అనంతరం దేవాన్ష్ పుట్టిన రోజును పురస్కరించుకుని ఇక్కడి నిత్యాన్న భవన సముదాయంలో భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేయనున్నారు. అన్నప్రసాద భవనంలో అన్నప్రసాద వితరణ కోసం అయ్యే ఖర్చు రూ.26 లక్షలను సీఎం కుటుంబం టీటీడీకి అందజేసినట్టు తిరుమల జేఈవో వెల్లడించారు.

- **ప్రత్యేక హోదా సాధన ఉద్యమంలో ఉపాధ్యాయులు నిర్వహించాల్సిన భవిష్యత్ కార్యాచరణను నిర్ణయించడానికి 25న విజయవాడలో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కమలాకర్‌రావు, శ్రీధర్‌రెడ్డిలు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.**

లోకేశ్‌పై ఆరోపణలకు ఆధారాలున్నాయి

- సమయం వచ్చినప్పుడు బయటపెడతాను
- జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ వెల్లడి



సాక్షి, అమరావతి: మంత్రి లోకేశ్ అవినీతిపై తాను చేసిన వ్యాఖ్యలకు ఆధారాలున్నాయని జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ చెప్పారు. ఏ ఆధారాల్లేకుండా ఆయన గురించి ఎందుకు మాట్లాడతానని ప్రశ్నించారు. తాజాగా ఓ ఇంగ్లిష్ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. సరైన సమయం వచ్చినప్పుడు ఆధారాలు బయటపెడతానని చెప్పారు. ఏమీ ఆశించకుండా 2014 ఎన్నికల్లో ఎన్డీఏకు మద్దతునిచ్చానని తెలిపారు. కానీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను బీజేపీ, టీడీపీ నాయకులు నెరవేర్చలేదన్నారు.

పోలవరానికి రూ.1,400 కోట్లు

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టుకు రూ.1,400 కోట్లు విడుదల చేసేందుకు ఆమోదం తెలుపుతూ కేంద్ర జలవనరుల శాఖ కార్యదర్శి యూపీ సింగ్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఈ మేరకు నిధులు విడుదల చేయాలని నాబార్డును ఆదేశించారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం పంపింది. రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థన మేరకు పోలవరం ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలను 2016 సెప్టెంబరు 7న కేంద్రం అప్పగించింది. 2010–11 ధరల ప్రకారం 2014 ఏప్రిల్ 1 తర్వాత నీటిపారుదల విభాగానికి అయ్యే వ్యయాన్ని మాత్రమే భరిస్తామని కేంద్రం షరతు విధించింది. 2014 ఏప్రిల్ 1 నుంచి ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.7,918.04 కోట్లు ఖర్చు చేయగా, కేంద్రం రూ. 5,595 కోట్లు విడుదల చేసింది.

సీబీఐ విచారణ వేసుకోమనండి

మాకు భయం లేదు.. మీడియాతో లోకేశ్



సాక్షి, అమరావతి: తాము ఎలాంటి తప్పు చేయలేదని.. అవసరమైతే సీబీఐ విచారణ వేసుకోవచ్చని మంత్రి లోకేశ్ సూచించారు. తమకు ఎలాంటి భయంలేదని చెప్పారు. మంగళవారం అసెంబ్లీలో ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై స్పందించబోనన్నారు. పవన్ తనపై ఆరోపణలు చేయడం బాధ కలిగించిందని చెప్పారు. ఆరోపణలు చేయడం కాదు నిరూపించాలని సవాల్ విసిరారు. 'పవన్ దుమ్మెత్తి పోస్తే నేను దులుపుకోవాలా? శేఖర్‌రెడ్డితో నాకు సంబంధాలు లేకపోయినా ఉన్నట్టు ఆరోపించడం ఏమిటి? పవన్ దగ్గర నా ఫోన్ నంబర్ ఉంది కదా.. నాకే ఫోన్ చేయొచ్చు కదా..' అని లోకేశ్ ప్రశ్నించారు.

పవన్, మోదీలకు ప్రజలే బుద్ధి చెబుతారు

రాష్ట్రానికి అన్యాయం చేసిన ప్రధాని మోదీకి.. ఆయన చెప్పినట్టు లేనిపోని ఆరోపణలు చేస్తున్న జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌కు ఐదు కోట్ల ఆంధ్రులే బుద్ధి చెబుతారని టీడీపీ ఎమ్మెల్యేలు హెచ్చరించారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మంగళవారం పలువురు టీడీపీ ఎమ్మెల్యేలు మీడియాతో మాట్లాడుతూ పవన్, మోదీలపై విమర్శలు గుప్పించారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్ మాట్లాడుతూ.. పోలవరం ప్రాజెక్టును అడ్డుకునేందుకే.. విచారణ జరపాలంటూ డిమాండ్ చేస్తున్నారని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి అయితే మరో 50 ఏళ్లు చంద్రబాబే ముఖ్యమంత్రిగా ఉంటారనే భయంతో ఈ విధంగా ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఐతాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ.. అవిశ్వాస తీర్మానంతో మోదీ గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని చెప్పారు.

ఆశా వర్కర్లకు వేతనాలివ్వం

- పనిచేసిన మేరకే పారితోషికం ఉంటుంది
- వేతనాలిచ్చే ప్రతిపాదనేదీ లేదు : యనమల

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా వివిధ ఆరోగ్య పథకాల అమలులో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న 44,664 మంది ఆశా కార్యకర్తలకు వేతనాలు ఇవ్వలేమని రాష్ట్ర ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు స్పష్టంచేశారు. అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో మంగళవారం పలువురు సభ్యులు ఆశా వర్కర్ల పారితోషికంపై ప్రశ్నించారు. పల్లెల్లో ఆశా వర్కర్లు చేస్తున్న సేవలు అసామాన్యమైనవని వారికి పారితోషికం ఇస్తే బావుంటుందని సూచించారు. దీనికి మంత్రి స్పందిస్తూ.. ఆశా వర్కర్లు కేంద్ర పథకాలకు మాత్రమే పనిచేస్తున్నారని, వీరికి వేతనాలు పెంచే ప్రతిపాదనేదీ లేనందున జీతాలూ ఇవ్వలేమని తేల్చి చెప్పారు. చేసిన పనికి మాత్రమే ఇవ్వగలం మినహా మరొకటి లేదన్నారు. రాష్ట్రంలో జీవన్‌దాన్ సేవలు అందించడానికి ఇప్పటివరకూ 30 ఆస్పత్రులను గుర్తించామన్నారు. దీనిపై స్పీకర్ స్పందిస్తూ.. అవయవదానంపై సరైన ప్రచారం లేదని.. దీనివల్ల చాలామంది అవయవదానం చేయలేకపోతున్నారన్నారు. కార్పొరేట్ సోషియల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్సార్) కింద అయినా ప్రచారం చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం దీనిపై దృష్టి సారించాలని కోడెల అన్నారు. శ్రీకాకుళం జిల్లా రామకృష్ణాపురం భూముల అన్యాక్రాంతంపై విచారణ జరిపించి నివేదికను సభలో ఉంచుతామని మరో ప్రశ్నకు రెవెన్యూ మంత్రి కేఈ కృష్ణమూర్తి సమాధానమిచ్చారు.

నిధులపై రాజకీయ యుద్ధం : రాష్ట్రానికి నిధులు ఇవ్వడంలో కేంద్రం ఏకపక్ష ధోరణితో వ్యవహరిస్తోందని.. ప్రస్తుతం మనం నిధుల కోసం రాజకీయ యుద్ధం చేస్తున్నామని, అవసరమైతే కోర్టులను ఆశ్రయించేందుకైనా సిద్ధమని మంత్రి యనమల రామకృష్ణుడు తెలిపారు. అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో వెనుకబడిన జిల్లాలకు నిధుల కేటాయింపుపై పలువురు సభ్యులు ప్రశ్నించగా.. ఆయన పైవిధంగా సమాధానమిచ్చారు.

సాక్షి
బుధవారం, మార్చి 21

కొత్త మతం!

తమను ఎస్సీ, ఎస్టీ లేదా బీసీలుగా గుర్తించాలని దేశవ్యాప్తంగా వివిధ కులాల నుంచి బలంగా డిమాండు వినబడుతున్న తరుణంలో కర్ణాటక మంత్రివర్గం లింగాయత్ సామాజిక వర్గాన్ని ప్రత్యేక మతంగా గుర్తిస్తూ సోమవారం చేసిన తీర్మానం సహజంగానే ప్రకంపనలు సృష్టిస్తోంది. దానిపై అనుకూల, వ్యతిరేక వాదనలు మొదలయ్యాయి. బసవణ్ణ సిద్ధాంతాలను అనుసరించే వీరశైవుల్ని కూడా మైనారిటీ మతంగా గుర్తించాలని కేబినెట్ తీర్మానించింది. కర్ణాటక కేబినెట్ తీసే నిర్ణయమేమీ కాదు. ఆ ప్రతిపాదన కేంద్ర హోంశాఖకు చేరుతుంది. ఆ ప్రతిపాదన జనాభా గణన వ్యవహారాలను చూసే రిజిస్ట్రార్ జనరల్‌కు వెళ్తుంది. తాజా నిర్ణయాన్ని బీజేపీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది గనుక సహజంగానే ఆ తర్వాత ఆ మూలనపడుతుంది. ఇదంతా ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు తెలియక కాదు. కానీ బంతిని కేంద్ర ప్రభుత్వ పరిధిలోకి నెట్టి తాను చేయగలిగిందంతా చేసినట్టు చూపించాలి. బీజేపీకి పెట్టని కోటగా ఉంటున్న లింగాయత్‌లను కాంగ్రెస్ వైపు తిప్పుకోవాలి. త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ధిపొందాలి. ఇదీ ఆయన వ్యూహం. అయిదేళ్ల క్రితం బీజేపీని అలిగి సొంతంగా పార్టీ పెట్టుకున్న సమయంలో మాజీ ముఖ్యమంత్రి యడ్యూరప్ప కూడా వీరశైవ లింగాయత్‌లను ప్రత్యేక మతంగా గుర్తించాలంటూ అప్పటి యూపీఏ ప్రభుత్వానికి లేఖ రాశారు. అయితే అది అసాధ్యమని యూపీఏ ప్రభుత్వం ప్రత్యుత్తరమిచ్చింది. యడ్యూరప్ప తిరిగి బీజేపీలోకి ప్రవేశించాక దాని ఊసెత్తలేదు. తాజా నిర్ణయం ఆయన్ను రాజకీయంగా ఇరకాటంలోకి నెట్టింది. ప్రస్తుతం ఆ వర్గానికి ఆయన తిరుగులేని నేత. నిజానికి లింగాయత్‌లను ప్రత్యేక మతవర్గంగా గుర్తించడంపై కాంగ్రెస్‌లోనే విభేదాలున్నాయి. ఈ నెల 8న జరిగిన కేబినెట్ తొలిసారి దీన్ని చర్చించినప్పుడు లింగాయత్‌లకు ప్రాతినిధ్యంవహించే మంత్రులు, వీరశైవ వర్గానికి చెందిన మంత్రులు కత్తులు దూసుకున్నారు.

ఈ రాజకీయఎత్తుగడల సంగతలా ఉంచితే తమను ప్రత్యేక మతవర్గంగా గుర్తించాలన్న లింగాయత్ డిమాండు ఈనాటిది కాదు. స్వాతంత్ర్యం రావడానికి ముందే 1942లో ఈ డిమాండు మొదలైంది. 1871 మైసూర్ జనాభా లెక్కల్లో లింగాయత్‌లను ప్రత్యేక మతంగా గుర్తించినట్టు దాఖలాలున్నాయి. అయితే ఆ తర్వాత 1881లో జరిగిన జనగణనలో వారిని హిందూ మతంలో ఒక కులంగా వర్గీకరించారు. ఈ మార్పునకు కారణమేమిటో అందులో నమోదు చేయలేదు. వాస్తవానికి చాన్నాళ్లనుంచి ఆ డిమాండును భుజాన వేసుకుని సిద్ధాంతానికి కృషి చేసిన వ్యక్తులు ఇద్దరున్నారు. వారిలో ప్రముఖ సాహితీవేత్త, హంపీ విశ్వవిద్యాలయ మాజీ వైస్ చాన్సలర్ కల్బుర్గీ ఒకరు కాగా, మరొకరు మాజీ ఐఏఎస్ అధికారి ఎస్ఎం జాందార్. కల్బుర్గీని గుర్తు తెలియని దుండగులు మూడేళ్లక్రితం కాల్చిచంపారు. లింగాయత్‌లది ప్రత్యేక మతమని, వారిని అలా గుర్తించడమే సరైందని కల్బుర్గీ గట్టిగా వాదించేవారు. అదే సమయంలో లింగాయత్ సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన సంఘ సంస్కర్త బసవేశ్వరుడి బోధనలను లింగాయత్ మఠాలు సరిగా పట్టించుకోవటం లేదని విమర్శించేవారు. మాజీ ఐఏఎస్ అధికారి జాందార్ చేసిన కృషి కూడా తక్కువేమీ కాదు. లింగాయత్‌లు ప్రత్యేక మతవర్గమని రుజువు చేసేందుకు తగిన ఆధారాలను ఆయన ఎంతో శ్రమకోర్చి సేకరించారు. 2011లో జనగణన జరిగిన సందర్భంలో లింగాయత్‌లెవరూ హిందువులుగా నమోదు చేసుకోవద్దంటూ లింగాయత్ మఠాలనుంచి ప్రకటనలొచ్చాయి. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో నిరుడు ఈ డిమాండు ఊపందుకుంది. బీదర్, బెళగావి, లాతూర్, కలబురగి తదితర ప్రాంతాల్లో భారీ ర్యాలీలు నిర్వహించారు. వీటన్నిటికీ హైదరాబాద్ కర్ణాటక ప్రాంతం, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి లక్షలాదిమంది లింగాయత్‌లు హాజరయ్యారు. గత ఏడాది డిసెంబర్‌లో బెంగళూరులో జాతీయ సదస్సు జరిపారు. ఆ సదస్సు తర్వాతే లింగాయత్‌ల డిమాండు పరిశీలించడం కోసం రిటైర్డ్ జస్టిస్ నాగమోహన్ దాస్ కమిటీని ఏర్పాటు చేశారు.

లింగాయత్ సిద్ధాంతానికి మూల కారకుడైన బసవేశ్వరుడు సంఘ సంస్కర్త. 12వ శతాబ్దిలో తన బోధనలతో ప్రస్తుతం కర్ణాటకగా ఉన్న ప్రాంతాన్ని మాత్రమే కాదు... దక్షిణాదినంతటినీ తీవ్రంగా ప్రభావితం చేశాడు. పల్నాడు, గురజాల రాజ్యాల్లో కీలకపాత్ర పోషించిన బ్రహ్మనాయుడు 'చాపకూడు' సిద్ధాంతం వెనక బసవేశ్వరుడి ప్రభావమే ఉంది. సమాజంపై కులమతాల పట్టు బలంగా ఉన్నప్పుడు, ఆచారాలు సంప్రదాయాల పేరిట అసమానతలు రాజ్యమేలుతున్నప్పుడు బసవేశ్వరుడు వాటికి వ్యతిరేకంగా పోరాడాడు. సమూహాలను కూడగట్టాడు. కుల వ్యవస్థను, వైదిక ఆచారాలను వ్యతిరేకించాడు. విగ్రహారాధాన నిరసించాడు. ఆయన సిద్ధాంతాల ప్రచారం కోసం ఎన్నో మఠాలు వెలిశాయి. అయితే వైదిక ఆచారాలను పాటించే వీరశైవులు, లింగాయత్‌లు ఒకటేనన్నది యడ్యూరప్ప వంటివారి వాదన. వీరశైవులు, లింగాయత్‌లను ఒకటిగా పరిగణించి ఆ వర్గాన్ని మైనారిటీ మతంగా గుర్తించాలని వీరశైవ మహాసభ కోరుతోంది.

కర్ణాటకలో లింగాయత్‌లు, వీరశైవుల ప్రభావం చాలా బలమైనది. 224మంది సభ్యులున్న అసెంబ్లీలో ప్రతి నలుగురు ఎమ్మెల్యేల్లో ఒకరు లింగాయత్ లేదా వీరశైవ వర్గానికి చెందినవారు. రాష్ట్ర జనాభాలో 17 శాతంగా ఉండే లింగాయత్‌లు ఉత్తర కర్ణాటక ప్రాంతంలో అధికం. ఆ వర్గం దాదాపు వంద నియోజకవర్గాల్లో పార్టీల గెలుపోటముల్ని నిర్ణయించే స్థితిలో ఉంది. బసవణ్ణ మఠాల ఆధ్వర్యంలో కర్ణాటకలో పలుచోట విద్యాసంస్థలు పనిచేస్తున్నాయి. ఇప్పుడు వీరశైవ మహాసభ ఏం నిర్ణయిస్తే దానికి తాను కట్టుబడి ఉంటానని బీజేపీ నేత యడ్యూరప్ప చెబుతున్నారు. మొత్తానికి సిద్ధరామయ్య కదిపిన తేనెతుట్టె కర్ణాటక రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఇది బీజేపీని ఎంతవరకూ ఇరకాటంలోకి నెడుతుందో, కాంగ్రెస్‌కు ఏమేరకు లాభిస్తుందో చూడాల్సి ఉంది.



> నీ ఆకాంక్ష బలమైనదైతే, వాస్తవమైనదైతే గురుత్వాకర్షణ శక్తి కూడా దాన్ని అడ్డుకోలేదు.
>
> – హెచ్. జాక్సన్ బ్రౌన్
> అమెరికన్ రచయిత

గ్రహం అనుగ్రహం

శ్రీ విళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు
చైత్రమాసం, తిథి శు.చవితి సా.3.47 వరకు, తదుపరి పంచమి
నక్షత్రం భరణి రా.7.25 వరకు, తదుపరి కృత్తిక, వర్జ్యం... లేదు
దుర్ముహూర్తం ప.11.43 నుంచి 12.30 వరకు
అమృతఘడియలు ప.2.44 నుంచి 4.13 వరకు.

సూర్యోదయం : 6.09
సూర్యాస్తమయం : 6.07
రాహుకాలం : ప 12.00 నుంచి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుంచి 9.00 వరకు



నమాజ్ వేళలు

ఫజర్ : 5.08
జొహర్ : 12.23
అసర్ : 4.45
మగ్రీబ్ : 6.27
ఇషా : 7.39

మళ్లీ వేడెక్కిన దక్షిణపు గాలి



టీఎస్ సుధీర్

దక్షిణ భారతదేశ రాష్ట్రాలలో ఎక్కువగా ప్రాంతీయ పార్టీలే అధికారంలో ఉన్నాయి. కాబట్టి బీజేపీ జాతీయవాద రాజకీయ ఎత్తుగడను నిరోధించడానికి ఈ పార్టీల అధినేతలు తమ అస్తిత్వం కార్డును ప్రయోగించే అవకాశం ఉంది. కానీ ఇది పెద్దగా అనుకూలించకపోవచ్చు. కేంద్రం తనది పై చేయిగా ఉండడానికి రాష్ట్రాల మధ్య ఉండే విభేదాలను ఉపయోగించు కుంటుంది. తెలుగు ప్రాంతమే ఒకటిగా ఉండలేక పోవడంతో 2014లో కేంద్రం విభజించి, తెలంగాణను ఏర్పాటు చేసింది.

వింధ్య పర్వతాలకు దిగువన, అంటే దక్షిణ భారతంలో ఇప్పుడు ఓ బృందగానం వినిపిస్తోంది. అది ఢిల్లీ ఆధిపత్య ధోరణికి నిరసనగా వినిపిస్తోంది.

కేంద్రం రాష్ట్రాలను తోలుబొమ్మల మాదిరిగా ఆడించాలని చూస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు ఈ నెలలోనే విమర్శలు గుప్పించారు. సమాఖ్య వ్యవస్థ లక్షణాన్ని మరచి కేంద్రం రాష్ట్రాల మీద స్వారీ చేయాలని చూస్తోందని ఆయన తీవ్ర స్థాయిలోనే ధ్వజమెత్తారు కూడా. అంతకు ముందు ఒక నెల క్రితం ఆయన కుమారుడు, తెలంగాణ ఐటీ శాఖ మంత్రి కె.టి. రామారావు కూడా దక్షిణ భారత రాష్ట్రాల అభివృద్ధి కార్యక్రమం మీద కేంద్రానికి శ్రద్ధ లేదని ఆరోపించారు. ఢిల్లీ–ముంబై పారిశ్రామిక నడవా అభివృద్ధి పట్ల ఉన్న దృష్టి దక్షిణాది మీద లేదని ఆయన చెప్పారు. అదే సమయంలో కర్ణాటక నుంచి కూడా నిరసన గళం వినిపించింది.



తీసుకునేది ఎక్కువ ఇచ్చేది తక్కువ

భారతదేశం మొత్తం మీద వసూలవుతున్న పన్నులలో 9 శాతం కర్ణాటక నుంచి వెళుతున్నాయనీ, కానీ కేంద్రం నుంచి తమ రాష్ట్రానికి అందుతున్నది మాత్రం 4.65 శాతమేనని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆక్రోశం వెళ్లగక్కారు. ఇది ఆ మధ్య ఆయన తన ఫేస్‌బుక్‌లో చేసిన వ్యాఖ్య. కాబట్టి వసూల వుతున్న పన్నులు మొత్తాన్ని బట్టి చూస్తే దేశంలో కర్ణాటక మూడో స్థానంలో ఉందని కూడా ఆయన చెబుతున్నారు. కర్ణాటక శాసనసభకు ఈ వేసవిలోనే ఎన్నికలు జరుగబోతున్నాయి. ఈ నేపథ్యంలో దక్షిణాది రాష్ట్రమైన కర్ణాటక పట్ల చూపుతున్నట్టు చెబుతున్న ఈ వివక్ష ఆ ఎన్నికలలో ఒక కీలకాంశంగా మారుతుంది. ఆ ఎన్నికలలో కాంగ్రెస్ దాదాపుగా ఒక ప్రాంతీయ పార్టీ అవతారంలోనే, ఆ పార్టీ సామంతుడు సిద్ధరామయ్య నాయకత్వంలో పోరాడబోతున్న విషయం కూడా సుస్పష్టం. కాబట్టి ఇలాంటి అంశాలు ఓటర్లలో భావావేశాన్ని రేకెత్తిస్తాయని ఆ పార్టీ అంచనా. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం పన్ను రూపంలో ప్రతి ఒక్క రూపాయికి, తిరిగి 1.79 రూపాయలు పొందుతోందని కూడా కర్ణాటక కాంగ్రెస్ వాదిస్తోంది. ఆ రాష్ట్రంతో పోల్చి చూసినప్పుడు కర్ణాటక చెల్లించే ప్రతి రూపాయికీ తిరిగి పొందుతున్నది కేవలం 47 పైసలు. తమిళనాడు పరిస్థితి ఇంతకంటే కనాకష్టం. ఆ రాష్ట్రానికి దక్కుతున్నది కేవలం నలభయ్ పైసలు. ఇలాంటి ప్రశ్నలు సహజంగానే అభివృద్ధికి దక్కే ప్రతిఫలం ఇదా అన్న సందేహానికి తావిస్తాయి. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూడా కేంద్రం పట్ల అసంతృప్తిగానే ఉన్నారు. సినీనటుడు పవన్ కల్యాణ్ కూడా కేంద్రం వైఖరి మీద ఆమధ్య రుసురుసలాడినవారే.

పార్టీల పరంగా చూస్తే కర్ణాటకలో పోటీ కాంగ్రెస్, బీజేపీల మధ్య అనివార్యం. కానీ ఈ పోటీని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తనకూ, ప్రధాని నరేంద్ర మోదీకి మధ్య పోటీ స్థాయికి దించాలని చూస్తున్నారు. బీజేపీని లక్ష్యం చేసుకోవడానికి ఇదొక వ్యూహం కూడా. అదెలాగంటే, దక్షిణాది దృష్టిలో బీజేపీ హిందీ ప్రాంతానికి చెందిన పార్టీ. అలాగే ఈ వాదన వింధ్య పర్వతాలకు ఆవల ఉన్న ఆ ప్రాంతం దక్షిణ ప్రాంత వనరులను దోచుకుపోతున్నదని కూడా ధ్వనింపచేస్తుంది.

సినిమా రంగం నుంచి రాజకీయాలలోకి వచ్చిన కమల్ హాసన్ మొన్న ఫిబ్రవరిలో మధురైలో కొత్త రాజకీయ పార్టీ స్థాపించినప్పుడు ఒక జెండాను కూడా ఆవిష్కరించారు. దాని మీద ఆరు చేతులు గొలుసుకట్టుగా ఒకదానిని ఒకటి పట్టుకున్నట్టు చిత్రించారు. ఇదే చాలామందికి ప్రశ్నార్థకమైంది. ఆ ఆరు చేతులు దక్షిణాదికి చెందిన ఆరు రాష్ట్రాలను ప్రతిబింబిస్తాయనీ, ఒక దానికొకటి బాసటగా కలసి ఉన్నాయనీ కమల్ వివరణ ఇచ్చారు. దక్షిణాది రాష్ట్రాలు కలసి ఒక ప్రెషర్ గ్రూప్‌గా కలసి ఉండాలని చెప్పడానికి ఇది దృశ్యాత్మక అభివ్యక్తిగా భావించవచ్చు. విధాన నిర్ణయాలలో గానీ, కేంద్రం కల్పించే ఆర్థిక ప్రయోజనాల విషయంలో గానీ దక్షిణ భారతదేశాన్ని ఢిల్లీ గమనంలోకి తీసుకోవడం లేదు. ఈ అంశంలో పరిగణనలోనికి తీసుకోవలసిన విషయం ఇంకొకటి ఉంది. కమల్ పెరియార్ ద్రవిడ సిద్ధాంతాన్ని అనుసరిస్తున్నారు. ఆ సిద్ధాంతంలోని చాలా కోణాలలో ద్రవిడనాడు ఆలోచన కూడా ఒకటి. ద్రవిడనాడు వాంఛించదగినదా? అంటూ గడచిన వారం ఈరోడ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో డీఎంకే నాయకుడు ఎంకె స్టాలిన్‌ను ఒకరు ప్రశ్నించారు. 'అలాంటి ఒక డిమాండ్ వినిపిస్తే, అది స్వాగతించదగినదే. అలాంటి డిమాండ్ వస్తుందనే ఆ ఊహ కూడా'అని స్టాలిన్ చెప్పారు. అయితే ఆధునిక భారత దేశంలో ద్రవిడనాడు అనే భావనను దేశ వ్యతిరేకంగా విశ్లేషిస్తున్నారు. దీనితో స్టాలిన్ సమాధానం మీద కొంత రగడ చెలరేగింది. అయితే ఇప్పుడు దక్షిణాది రాష్ట్రాలు కేంద్రం నుంచి పొందవలసి ఉన్న ప్రయోజనాల విషయంలో గళమెత్తాయి. ఆ క్రమంలో, ఆ రగడలో స్టాలిన్ ప్రకటన వివాదాల వరకు వెళ్లలేదు. అలాగే ఆ మరునాడే స్టాలిన్ కూడా, ద్రవిడనాడును తానే కోరినట్టు పత్రికలు తప్పుగా రాశాయని వివరణ ఇచ్చారు. కానీ తమిళనాడులో హిందీ వ్యతిరేకతకు తోడు ఉత్తరాది రాష్ట్రాల ఆధిపత్యమన్న భావన మరింత బలంగా ఉంటుంది. ఈ మధ్యనే మైలురాళ్ల మీద హిందీ అక్షరాలు రాయడం గురించే అక్కడ పెద్ద ఎత్తున అలజడి రేగింది.

ఆ మధ్య ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కేరళలో పర్యటించినప్పుడు, వైద్య విధానం ఎలా ఉండాలో మా రాష్ట్రాన్ని చూసి నేర్చుకోవాలంటూ ఇచ్చిన ఉపన్యాసం ఆ రాష్ట్ర ప్రజల మనోభావాలను కదిలించింది. ఎందుకంటే గోరఖ్‌పూర్ ఆస్పత్రిలో ప్రాణవాయువు అందుబాటులో లేకపోవడం వల్ల చిన్నారులు మరణించారు. అలాగే ఝాన్సీ ప్రభుత్వ వైద్యశాలలో తొలగించిన కాలునే దిండుగా చేసుకుని పడుకున్న ఉదంతం కూడా చోటు చేసుకుంది. అలాంటి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి వచ్చి మాట్లాడిన ఇలాంటి మాటలు కేరళలో తీవ్ర విమర్శలకు కారణమయ్యాయి. నిజానికి కేరళలో సమస్యలు లేవని కాదు. కానీ ఏదైనా సమస్య వస్తే దానిని పరిష్కరించుకునే వెసులుబాటు అక్కడ ఉంది. కాబట్టి ఇలాంటి వ్యాఖ్యలని అనాలోచితమైనవిగా తీసుకోవాలా? లేకపోతే, ఇది దేశంలోని ఒక లోపంగా భావించాలా? అంతకు మించి, ఉత్తర భారతదేశంతో పోలిస్తే దక్షిణ భారతదేశానికి తక్కువ లోక్‌సభ స్థానాలు మిగులుతాయని, దీనర్థం రాజకీయాధికారంలో దక్షిణాదిని పలచన చేయడమేనని రాజకీయ నాయకులు చెప్పే అవకాశం లేకపోలేదు. ప్రస్తుతం ఈ ఉత్తర, దక్షిణ భారత విభజన సోషల్ మీడియాలోనే ఎక్కువగా వినిపిస్తోంది. ప్రజాభిప్రాయానికి ఇదొక కొలబద్ద. కానీ దీనికి గొప్ప కచ్చితత్వం మాత్రం లేదు. రాజకీయ నాయకులు ఆ మనోభావాలను ఉపయోగించుకుంటున్నారు.

అస్తిత్వం కార్డుతో రాష్ట్రాలు

ప్రస్తుతం దక్షిణ భారతదేశ రాష్ట్రాలలో ఎక్కువగా ప్రాంతీయ పార్టీలే అధికారంలో ఉన్నాయి. కాబట్టి బీజేపీ జాతీయవాద రాజకీయ ఎత్తుగడను నిరోధించడానికి ఈ పార్టీల అధినేతలు తమ అస్తిత్వం కార్డును ప్రయోగించే అవకాశం ఉంది. కానీ ఇది పెద్దగా అనుకూలించకపోవచ్చు.

కేంద్రం తనది పై చేయిగా ఉండడానికి ఉప ఖండంలో రాష్ట్రాల మధ్య ఉండే విభేదాలను ఉపయోగించుకుంటుంది. తెలుగు ప్రాంతమే ఒకటిగా ఉండలేక పోవడంతో 2014లో కేంద్రం విభజించి, తెలంగాణను ఏర్పాటు చేసింది. అలాగే కావేరీ జలాల గురించి తమిళనాడు, కర్ణాటక మధ్య విభేదాలు ఉన్నాయి. ముల్ల పెరియార్ డ్యామ్ విషయంలో తమిళనాడుకు కేరళతో కూడా వివాదం ఉంది. ఇప్పుడు అందరినీ ఆకట్టుకుంటున్న ప్రశ్న ఏమిటంటే, దేశంలో భాగంగా ఉన్నప్పుడు ప్రాంతీయ అసమానతలను తొలగించుకోవలసిన బాధ్యత దక్షిణాది రాష్ట్రాలకు కూడా ఉంది కదా! ఎందుకంటే, ఉత్తరాదికి కూడా సముద్రతీరం ఉంటే ఇక్కడి రాష్ట్రాలు కూడా దక్షిణాదితో సమంగా ఉండేవని వారు వాదించవచ్చు. మిగిలిన భారతదేశం మొత్తం నుంచి వలసలు జరగడం లేదా అంటూ అపహాస్యం చేసినా, బిహార్, ఉత్తరప్రదేశ్, ఈశాన్య రాష్ట్రాలను అలా వెనుకబడిన ప్రాంతాలుగా మిగిల్చితే, దక్షిణ భారతదేశంతో పాటు, ముంబై వంటి నగరాలు కూడా వలసలకు కేంద్రాలవుతాయన్నది నిజం. కాబట్టి దక్షిణ భారతదేశం తన వాటాను పంచడంలో కొన్ని ప్రయోజనాలు ఉన్నాయి. దానితో ఆయా ప్రాంతాల ఆర్థికాభివృద్ధి కూడా జరుగుతుంది. ఇక ఈ అంశం గురించి ఇంత కలత ఎందుకంటే, ఈ విషయాన్ని శాంతిపూర్వకంగా పరిష్కరించే నాయకత్వం ప్రస్తుతం కేంద్రంలో లేదు. దక్షిణాదిన బీజేపీ అధికారంలో లేదు. కనుక ఈ ప్రాంతం అంటే ఆ పార్టీకి ఆఖరి ప్రాధాన్యతాంశంగానే ఉంటుంది. ఇదే ఆ ప్రాంతంలోని రాష్ట్రాలకు ఆగ్రహాన్ని కలిగిస్తుంది. ఉపఖండం ముక్కలు కావాలని ఎవరూ సలహా ఇవ్వడం లేదు. కానీ మనసులు విడిపోతే భవిష్యత్తులో జరిగే నష్టం అంతకంటే ఎక్కువే.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్టు

గమనిక : 20వ తేదీ నాటి ఏబీకే ప్రసాద్ 'రెండోమాట'లోని మూడో కాలమ్‌లో కణాదుడుకి బదులు కపిలుడు అనీ, (అణువు రహస్యాన్ని ఛేదించినవాడు) అలాగే పీలవః పీలవః పీలవఃకు బదులు పేలవః పేలవః పేలవః అని పొరపాటున అచ్చయింది. గమనించగలరు.

సోషల్ మీడియా 'ఫోబియా'

ఇంతకాలం తమ రాతల ద్వారా ప్రజాభిప్రాయాన్ని కొన్ని పార్టీలకు, వ్యక్తులకు అనుకూలంగా మలచడంలో తలమునకలుగా ఉన్నవారు తాము కల్పిస్తున్న 'భ్రమలు' సోషల్ మీడియా కారణంగా తొలగిపోతాయని భయపడుతున్నారు.

అభిప్రాయం



సి. రామచంద్రయ్య

తెలుగునాట సోషల్ మీడియా ఓ మాఫియాగా మారిపోతోందని కొందరు తెగ బాధపడిపోతున్నారు. పనిగట్టుకొని సాగిస్తున్న సోషల్ మీడియా దుష్ప్రచారం కొందరు ప్రముఖులకు ప్రాణ సంకటంగా మారిందన్నది వారి ప్రధాన ఆరోపణ. ఇంతకాలం ప్రధాన స్రవంతి మీడియా ఏకచత్రాధిపత్యంగా రాజ్యమేలింది. ఇపుడు ఆ పరిస్థితి మారింది. ప్రధాన స్రవంతి మీడియా (మొత్తం కాదు) చేస్తున్న వక్రీకరణలు, వండివారుస్తున్న కథనాలు, నిజాలుగా చెలామణి చేస్తున్న అసత్య వార్తల వెనుకనున్న గుట్టుమట్లను సోషల్ మీడియా ఎత్తి చూపిస్తున్నది. నిజాలేమిటో గ్రహించడానికి ఈ రోజు ప్రజలకు ఓ ప్రత్యామ్నాయ వ్యవస్థ అందుబాటులోకి వచ్చింది. బహుశ ఆ దుగ్ధతోనే కాబోలు ప్రధాన స్రవంతి మీడియాకి చెందిన కొందరు 'సోషల్ మీడియా' మొత్తాన్ని ఓ భూతంగా, మాఫియాగా చిత్రీకరిస్తున్నారు.

ఏపీ విషయంలో 'సోషల్ మీడియా' నిర్వర్తిస్తున్న పాత్రను విశ్లేషించి చూసినపుడు అది మాఫియానా? లేక ప్రజలకు మేలు చేస్తున్న మీడియానా? అన్నది అర్థమవుతుంది. ఏపీ సీఎం చంద్రబాబు ఇటీవల అసెంబ్లీలో ప్రసంగిస్తూ ''దేశంలోని రాజకీయ వేత్తల్లో నా అంత సీనియర్ ఎవరూ లేరు'' అని ప్రకటించుకున్నారు. దేశంలోని సీనియర్ రాజకీయ వేత్తల్లో బాబు ఒకరేగానీ.. ఆయన సీనియర్ మోస్ట్ కాదు. ఈ వాస్తవాన్ని మాజీ పార్లమెంట్ సభ్యుడు ఉండవల్లి అరుణ్ కుమార్ సోషల్ మీడియా ద్వారా తాను ప్రజలకు తెలియపర్చకపోతే.. అసెంబ్లీ సాక్షిగా బాబు చెప్పిన అబద్ధమే నిజంగా చెలామణి అయిపోయేది.



ముందూవెనుకా ఆలోచించకుండా బాబు తనకి సంబంధించి ఇటువంటి అనేక అసత్యాలను గతంలో ప్రచారం చేశారు. తాజాగా ఏపీ ప్రత్యేకహోదాకు సంబంధించి బాబు పలు సందర్భాలలో మాట మార్చారు. ఆయన ఏయే సందర్భాలలో ఏ విధంగా మాట మార్చిందీ వీడియో క్లిప్పింగ్ సాక్ష్యాలతో సోషల్ మీడియా ద్వారా ప్రజలు తెలుసుకోగలిగారు. అదే విధంగా 2017 కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా.. మీడియా సాక్షిగా బాబు ''రాష్ట్రానికి అన్నీ వచ్చాయి.. ఇంతకంటే ఎక్కువ ఎవరిస్తారు?'' అంటూ చెప్పిన మాటల్ని హెడ్‌లైన్స్‌లో ప్రచురించిన వార్తా పత్రికల క్లిప్పింగులు సోషల్ మీడియా ద్వారా షేర్ కావడంతో.. అధికార పార్టీ నేతల గొంతుకల్లో పచ్చి వెలక్కాయ పడ్డట్టు అయింది. ప్రజలకిచ్చిన హామీల విషయంలోగానీ, ప్రత్యేకహోదా ప్యాకేజీల అంశాల్లోగానీ పూటకోమాట, రోజుకో విధానం అవలంబించే బాబు లాంటి రాజకీయనాయకుల ఊసరవెల్లి విన్యాసాల్ని సోషల్ మీడియా ద్వారా సామాన్య ప్రజలు చూస్తున్నారు, అర్థం చేసుకుంటున్నారు.

'సోషల్ మీడియా'ను భూతంగా చూపుతున్న ప్రధాన స్రవంతి మీడియాలోని ఓ వర్గం రాజకీయ నాయకుల ద్వంద్వ ప్రమాణాలను ప్రశ్నించడం ఎప్పుడో మానేసింది. అధికారంలో ఉన్న వారు ఏం చెప్పినా బుద్ధిగా వినడం, రాయడం.. దానిని ప్రజలకు చేరవేయడమే వాటి బాధ్యతగా మారింది. ఇటీవల బాబు.. తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎటువంటి మచ్చ లేదని; తాను పరమ పవిత్రంగా రాజకీయాలు చేస్తున్నందునే హాయిగా నిద్రపోగలుగుతున్నానని కొన్ని పత్రికలకు, కొన్ని చానెళ్లకు చెప్పారు. ఆయన మాటల్లోని అసంబద్ధతను రిపోర్టర్‌లు ప్రశ్నించలేదు. బాబు అడ్డంగా దొరికిపోయిన ఓటుకు నోటు కేసును ఆ ప్రతినిధులు ప్రస్తావించలేదు. ఎందుకు అడ్డదారుల్లో ప్రజా ప్రతినిధులను కొనుగోలు చేయాల్సి వచ్చిందో అడగలేదు. బాబు ఏం చెప్పినా అదే శిరోధార్యంగా.. అబద్ధాలను నిజాలుగా జనం మీదకు వదిలే 'మీడియా'ను ఏమనాలి?

అధికారంలోకి వచ్చాక రైతులకు బేషరతుగా చేస్తానన్న రుణమాఫీపై బాబు మాట మార్చారు. టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన అనేక హామీలకు మంగళం పాడారు. గతంలో ఇలాంటి విమర్శలు వస్తే వాటిని అవలీలగా తిప్పికొట్టగలిగేవారు. కానీ, నేడు సోషల్ మీడియా అందుబాటులోకి వచ్చాక ప్రజలకు వాస్తవాలు తెలుస్తున్నాయి కనుక ఇబ్బందిపడుతున్నారు. ఇక, అమరావతి నిర్మాణానికి సంబంధించి బాబు చేస్తున్న డొల్ల ప్రకటనలు.. సింగపూర్‌ను మించిన రాజధాని, టోక్యోను మించిన రాజధాని, న్యూయార్క్‌ను తలదన్నే రాజధాని అంటూ ఏ దేశం వెళితే ఆ దేశాన్ని మించిన రాజధాని కడతానంటూ చేసిన ప్రకటనలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

ఇంతకాలం తమ రాతల ద్వారా ప్రజాభిప్రాయాన్ని రాజకీయంగా కొన్ని పార్టీలకు, వ్యక్తులకు అనుకూలంగా మలచడంలో తెలుగునాట తలమునకలుగా ఉన్నవారు తాము కల్పిస్తున్న 'భ్రమలు' సోషల్ మీడియా కారణంగా తొలగిపోతాయని ఇప్పుడు భయపడుతున్నారు. అందుకే సోషల్ మీడియా ఫోబియాతో దానిని ఓ మాఫియాగా చిత్రీకరిస్తున్నారు. సోషల్ మీడియాను దుర్వినియోగపర్చేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందే. అయితే, మొత్తం సోషల్ మీడియానే లేకుండా చేయాలన్న ప్రయత్నాలు మంచిదికాదు. వాస్తవాల విశ్లేషణకు నేడు సోషల్ మీడియానే సామాన్యులకు దిక్కుగా మారిందనడం అతిశయోక్తికాదు.

వ్యాసకర్త మాజీ ఎంపీ । 81069 15555

అమరావతిపై సింగపూర్ కబంధహస్తం

చంద్రబాబు ఇవ్వాళ ప్రత్యేక హోదా ఎందుకివ్వరు అంటూ కేంద్రంపై యుద్ధం మొదలెట్టారు కానీ, ఏపీ రాజధాని అమరావతి నిర్మాణం కోసం సింగపూర్ కంపెనీతో షేర్ హోల్డింగ్ ఒప్పందంపై సంతకం పెట్టడం ద్వారా మరోసారి బ్రిటిష్ పాలకుల తరహా దోపిడీని మళ్లీ పునరావృతం చేసే ప్రమాదంలోకి ఆంధ్రప్రదేశ్‌ని నెడుతున్నారు. ఏపీలో రాజధాని అమరావతి నగరాన్ని నిర్మించుకోవలసిన నేపథ్యంలో, పరదేశ కంపెనీల భాగస్వామ్యంతో రాజధానిని నిర్మించుకోవాలన్న రాష్ట్ర పాలకుడి నిర్ణయాల కారణంగా దేశంలో వలస దోపిడీ చరిత్ర పునరావృతం అవుతుందని భావిస్తున్నారు.

విదేశీయుడు వచ్చి ఈ దేశ సంపదను కొల్లగొట్టి తన దేశానికి తరలించినా, ఈ దేశీయుడే ఈ దేశాన్ని కొల్లగొట్టి ఆ డబ్బును విదేశాల్లో దాచుకున్నా పెద్ద తేడా ఏమీ ఉండదు. మొఘల్స్ నుంచి బ్రిటీషర్ల దాకా చేసిందీ అదే. వీళ్లు మొదటి కోవకు చెందిన వారైతే, నేటి స్వతంత్ర భారతదేశంలో బాబుతో సహా చాలామంది పాలకులు రెండో కోవకు చెందిన వారు. క్రీ. శ. 1610 – 1640 మధ్య కాలాన్ని పరిశీలిస్తే నెల్లూరు నుంచి మద్రాసు దాకా అప్పటి పాలకులుగా ఉన్న తెలుగు రాజు దామెర అయ్యప్పనాయుడు తన తండ్రి చెన్నప్ప నాయుడు పేరుతో చెన్నపట్నం (మద్రాసు నగరం – ఓడరేవు) ను నిర్మించి, ఈస్ట్ ఇండియా కంపెనీకి దానం చేయడంతో వలసదేశాలకు ఆనాడు కాస్త నీడను ఇచ్చినట్లయింది. నేడు మన రాష్ట్రంలో ఈ సంఘటన యాదృచ్ఛికంగా అనిపించినా, అయ్యప్పనాయుడు, బాబు ఒకే గడ్డమీద జన్మించడం అనుమానాలకు బలాన్నిస్తోంది.

ఏపీ విభజన చట్టం ప్రకారం రాజధాన్ని నిర్మించుకొనే వరకు ప్రభుత్వం పదేళ్ల వరకూ హైదరాబాద్‌లో నుండే పాలించే వెసులుబాటు ఉంది. దాంతో రాజధాని అమరావతిని కేంద్రం ఇచ్చే నిధులతోనే నెమ్మదిగా నిర్మించుకోవచ్చు. కానీ బాబు కొత్త రాజధాని, కొత్త రాష్ట్రాన్ని ఒకేసారిగా బినామీ కంపెనీలతో నిర్మించేసి, కోట్ల రూపాయలు కొల్లగొట్టి విదేశాలకు తరలించాలన్న కోరికతో తెల్లదొరలకు తలదన్నేరు. అభివృద్ధిలో దేశం ఎంతో ఎదిగిన కారణంగా రాజధాని నిర్మాణంకు అవసరం అయ్యే డిజైన్లు, కాంట్రాక్టర్లు, పెట్టుబడుల కోసం విదేశాలకు పోవలసిన పనిలేదు. అవకాశం ఇస్తే దేశాన్ని కొనే శక్తి సామర్థ్యాలు, నైపుణ్యం కలిగిన కాంట్రాక్టర్లు దేశంలో, రాష్ట్రంలో కొరత లేదు.

అలాంటిది.. తొమ్మిది మంది ఉద్యోగులు ఉన్న సింగపూర్ చోటా సంస్థ రాజధాని అమరావతిని నిర్మిస్తుందని, డబ్బులు లేకుండా ప్రజలకు నాలుగేళ్ల సినిమా చూపించారు. అంటే సింగపూర్ కంపెనీతో రాయితీలు, అభివృద్ధి ఒప్పందం, షేర్ హోల్డింగ్ అగ్రిమెంట్‌పై రాష్ట్ర ప్రభుత్వం సంతకాలు చేసి, అమరావతిని మరో ఈస్ట్ ఇండియా కంపెనీ సింగపూర్‌కి ధారాదత్తం చేసేలా ఉంది చంద్రబాబు నాయుడు నిర్ణయం. ప్రస్తుతం ఏపీ సీఎం తీరు చూస్తుంటే సింగపూర్ పాలకులు భవిష్యత్తులో నయా వలసపాలకులుగా అవతరించే ప్రమాదం పొంచి ఉన్నట్లు స్పష్టమవుతోంది.

– యాతం వీరాస్వామి, రాజకీయ విశ్లేషకుడు
మొబైల్ : 95816 76918

ఆత్మ.. పరమాత్మ



'ఆత్మ' అయిన మనం 'పరమాత్ముని' అంశం అని మనలో చాలామంది భావిస్తారు. ఒక చిన్న భాగాన్ని మాత్రమే 'అంశం' అని అంటారు. ఒకవైపు పరమాత్మ అనాది అని, అవినాశి అని అంటూనే ఇటువంటి అవినాశీ పరమాత్ముని ఒక భాగంలోకి ఎలా తీసుకు వస్తారు? పరమాత్మ ఎలా ఖండితం అవ్వగలరు? 'ఆత్మ' మృత్యువు లేనిది అయినప్పుడు మరి ఆత్మకు జన్మనిచ్చే 'పరమాత్మ' కూడా అమరంగానే ఉంటారు కదా. అటువంటి పరమాత్మను ఒక భాగంలోకి తీసుకురావడం అతనిని కూడా వినాశీ అని అనడమే.

పరమాత్ముడు నిత్యమూ వెలిగే 'జ్యోతి స్వరూపుడు'. కానీ 'ఆత్మ' లందరిలో దీపం వెలుగుతుంది, ఆరిపోతుంది కూడా. 'పరమాత్మ' ప్రకాశానికి, 'ఆత్మ' లలో ఉన్న ప్రకాశానికి తప్పకుండా తేడా ఉంటుంది. బల్బుల్లో కూడా కొన్ని ఎక్కువ శక్తి కలవి, కొన్ని తక్కువ శక్తి కలవి ఉంటాయి. అలాగే మనుష్యాత్మల్లో కూడా తక్కువ శక్తి ఉన్నవి లేక ఎక్కువ శక్తి ఉన్నవి ఉంటాయి. కానీ పరమాత్ముని శక్తి ఎప్పుడూ ఎక్కువగానూ, తక్కువగానూ అవ్వజాలదు. కారణం అతడు సదా పవిత్రుడు, జన్మ మృత్యు చక్రంలోకి రానివాడు. సుఖదుఃఖాలకు అతీతుడు. మనుష్యులు తమ కర్మల కారణంగానే పుణ్యాత్ములుగా, ధర్మాత్ములుగా లేక పాపాత్ములుగా అవుతుంటారు. పాపకర్మలవల్లే 'ఆత్మ' ప్రకాశం క్షీణిస్తుంది. మళ్లీ ఆరిపోయిన 'ఆత్మ దీపాలకు' జ్ఞానమనే ప్రకాశాన్ని, శక్తిని ఇచ్చి వెలిగించేవాడు సర్వశక్తివంతుడైన 'పరమాత్మ' మాత్రమే.



'పరమాత్మ'లో అందరికంటే ఎక్కువ శక్తి ఉంటుంది. అతను సృష్టి అంతిమంలో వచ్చి పతనమైన 'ధర్మాన్ని' తిరిగి స్థాపిస్తాడు. 'పరమాత్మ' ప్రతి యుగంలో వస్తారు అని ఎవరైనా అంటే అతడు 'సృష్టి' మధ్యలోనే వచ్చినట్లు. మధ్యలోనే తన శక్తితో అందరికీ శక్తిని, సద్గతిని ఇచ్చినట్లైతే మరి వారి శక్తి నిలిచి ఉండాలి కదా! మనుష్యులు దుర్గతిని ఎందుకు పొందుతారు? కాబట్టి పరమాత్మ ప్రతియుగంలోనూ రారని అంటే మధ్య మధ్యలో రాజాలరని నిరూపణ అవుతుంది. అతడు కల్పవు అంతిమం అనగా ఈ కలియుగాంత సమయంలోనే తమ శక్తితో ఒకేసారి సర్వులకు సద్గతిని ఇచ్చేందుకు వస్తారు. పరమాత్మ ఇంతటి సేవను చేస్తారు కాబట్టే వారి స్మృతి చిహ్నంగా పెద్ద శివ లింగాలను తయారు చేస్తారు. ఎంతగానో పూజిస్తారు. కావున తప్పకుండా పరమాత్మ సత్యం మరియు చైతన్యం మరియు ఆనంద స్వరూపుడు.

– బ్రహ్మకుమారీ సుజనా ఉప్పటూరి

సవరణ: మంగళవారం నాటి సంపాదకీయంలో కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు మూడుగా పేర్కొనడం జరిగింది. పంజాబ్‌ను కూడా ఈ జాబితాలో చేర్చాలి.

మేకప్ లేకుండానే చంద్రబాబు వేషాలు

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి అంబటి రాంబాబు ధ్వజం
- వేషాలు వేయడంలో ఎంపీ శివప్రసాద్‌ను మించిపోయాడు

విజయవాడ సిటీ: రాష్ట్రంలో ఎవరో ఒకరి సాయం లేకుండా ఎన్నడూ నడవలేని ముఖ్యమంత్రి చంద్రబాబు తనని అధికారంలోకి తీసుకొచ్చిన బీజేపీ, జనసేన ఇప్పుడు దూరం కావడంతో కొత్త మిత్రుల కోసం వెంపర్లాడుతున్నాడని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి అంబటి రాంబాబు చెప్పారు. రాష్ట్రాన్ని అశాస్త్రీయంగా విభజించారంటూ కాంగ్రెస్‌పై దుమ్మెత్తిపోసిన చంద్రబాబు ప్రస్తుతం అదే పార్టీతో కలిసి వెళ్లాలనుకోవడం ఆయన రాజకీయ అవకాశావాదానికి నిదర్శనమని విమర్శించారు. ద్రోహులు ఓడిపోతారంటూ సీఎం చేసిన వ్యాఖ్యలు ఆయనకే వర్తిస్తాయన్నారు. అంబటి మంగళవారం విజయవాడలోని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పార్లమెంట్ వద్ద టీడీపీ ఎంపీ శివప్రసాద్ మేకప్ వేసుకొని వేషాలు వేస్తుండగా, రాష్ట్రంలో చంద్రబాబు ఎలాంటి మేకప్ లేకుండానే రోజుకో వేషం వేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాడని దుయ్యబట్టారు. వేషాలు వేయడంలో శివప్రసాద్‌ను మించిపోయాడని ఎద్దేవా చేశారు. ప్రత్యేక హోదా సాధన కోసం తమ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే ఉద్యమ కార్యాచరణ ప్రకటించారని గుర్తుచేశారు. ప్రజలకు ఆరు వందల వాగ్దానాలు ఇచ్చి ఒక్కటైనా నిలబెట్టుకోని చంద్రబాబు వంటి ద్రోహులకు రాబోయే ఎన్నికల్లో డిపాజిట్లు కూడా దక్కవని తేల్చిచెప్పారు.




రామ్‌మాధవ్‌కు ఇప్పుడే తెలిసిందా?

చంద్రబాబు వెన్నుపోటు నైజం గురించి ఇప్పుడే తెలిసిందన్నట్లుగా బీజేపీ జాతీయ కార్యదర్శి రాంమాధవ్ మాట్లాడడం ఆశ్చర్యంగా ఉందని అంబటి రాంబాబు పేర్కొన్నారు. ''చంద్రబాబు...ఎన్టీఆర్‌కే కాదు, పవన్ కల్యాణ్‌కు బీజేపీకి, చివరకు ఆంధ్రప్రదేశ్ ప్రజలకు కూడా వెన్నుపోటు పొడుస్తాడని మేము మొదటినుంచీ చెబుతూనే ఉన్నాం. కొందరు బీజేపీతో కలిసిపోయి, తనకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారంటూ చంద్రబాబు ఎదురుదాడి చేయడం విడ్డూరంగా ఉంది. బీజేపీతో వైఎస్సార్‌సీపీ కుమ్మక్కైందంటూ టీడీపీ నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తురు. వాస్తవానికి 2014లో ఫ్రంట్ ఏర్పాటు చేద్దామని రాష్ట్రంలో మొదటిగా వైఎస్సార్‌సీపీ వద్దకు బీజేపీ వచ్చింది. మేం నిరాకరించడం వల్లే టీడీపీతో కలిసింది. బీజేపీతో కుమ్మక్కు కావాల్సిన అవసరం వైఎస్సార్‌సీపీకి లేదు. ఏ పార్టీతోనూ చీకటి ఒప్పందాలు చేసుకోవాల్సిన అవసరం లేదు'' అని స్పష్టం చేశారు.

అన్యాయాలు.. పాపపు చేష్టలు

''ప్రత్యేక హోదాతోపాటు అవిశ్వాస తీర్మానంపై చంద్రబాబు రోజుకో మాట మాట్లాడారు. ఇన్ని రకాలుగా నాలుకను ఇష్టం వచ్చిన తిప్పి మాట్లాడిన వారు దేశ రాజకీయాల్లో ఎవరూ లేరు. ఎవరో తనను అణచివేస్తున్నారంటూ చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి ఆయన చేసిన అన్యాయాలు, అవినీతితో మూటగట్టుకున్న పాపపు చేష్టలే ప్రజలకు ఆయనను దూరం చేస్తున్నాయి. ఇలాంటి దుర్మార్గపు రాజకీయ నాయకులు దేశంలో ఎవరూ లేరు'' అని రాంబాబు ధ్వజమెత్తారు.

కేంద్రం సహకరించకున్నా ప్రగతి సాధించాం



శాసనసభలో సీఎం చంద్రబాబునాయుడు

సాక్షి, అమరావతి : కేంద్రం సహకరించకున్నా దేశం సగటు పారిశ్రామిక అభివృద్ధి కన్నా రాష్ట్రంలో అధికంగా సాధించామని సీఎం చంద్రబాబునాయుడు చెప్పారు. ప్రత్యేక హోదా ఇచ్చి ఉంటే పారిశ్రామిక రంగంలో రాష్ట్రం మరింత అభివృద్ధి సాధించేదన్నారు. శాసనసభలో మంగళవారం 'పెట్టుబడులు, పారిశ్రామికాభివృద్ధి, ఉద్యోగ కల్పన'పై జరిగిన స్వల్పకాలిక చర్చలో ఆయన మాట్లాడారు. విభజనవల్ల ఉత్పన్నమైన ఇబ్బందులను అధిగమించి రాష్ట్రంలో రెండంకెల వృద్ధి రేటును సాధించామన్నారు. కానీ, తలసరి ఆదాయంలో కర్ణాటక, తెలంగాణలతో పోల్చితే రూ.32 వేలకు పైగా రాష్ట్రం వెనుకబడిందని చెప్పారు. నీళ్లు, విద్యుత్, రహదారి సౌకర్యాలు కల్పించడంవల్లే అనంతపురం జిల్లాకు కియా పరిశ్రమ వచ్చిందన్నారు. ఇబ్బందుల్లో ఉన్న రాష్ట్రాన్ని మరింత ఇబ్బంది పెట్టవద్దని కేంద్రాన్ని కోరుతున్నామన్నారు. అంతకు ముందు బీజేపీ శాసనసభా పక్ష నేత విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ.. ప్రత్యేక హోదాకు పారిశ్రామిక రాయితీలకూ ఏ సంబంధం ఉండదన్నారు. రాష్ట్రానికి ఇప్పటికే 15 శాతం పెట్టుబడి రాయితీ, 15 శాతం యంత్రాల అరుగుదల కింద రాయితీలు ఇస్తున్నామని.. ఇతర రాయితీలు ఏమైనా కావాలంటే కేంద్రాన్ని అడగవచ్చునన్నారు. కేంద్రం సహకారం లేకుండానే రాష్ట్రం రెండంకెల వృద్ధి రేటు సాధించిందా అని ఆయన ప్రశ్నించారు.

జస్టిస్ ధర్మారావుకు హైకోర్టు ఘన నివాళి

సాక్షి, హైదరాబాద్: హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎలిపి ధర్మారావుకు ఉమ్మడి హైకోర్టు ఘనంగా నివాళులు అర్పించింది. జస్టిస్ ధర్మారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయనకు నివాళులు అర్పించేందుకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ రమేశ్ రంగనాథన్ నేతృత్వంలో న్యాయమూర్తులందరూ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. జస్టిస్ ధర్మారావు న్యాయవ్యవస్థకు చేసిన సేవలను ఏసీజే కొనియాడారు. అనంతరం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సి.ప్రతాప్‌రెడ్డి, పోసాని వెంకటేశ్వర్లు కూడా జస్టిస్ ధర్మారావు సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో న్యాయవాదులు పాల్గొన్నారు. ధర్మారావు మృతికి సంతాపంగా అందరూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.

ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ లక్ష్మీపతి రాజీనామా

రాష్ట్రానికి కేంద్రం చేసిన సాయాన్ని ప్రజలకు వివరిస్తానని వెల్లడి

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎంఎస్ఐడీసీ) చైర్మన్ పదవికి బీజేపీ నాయకుడు పి.లక్ష్మీపతి రాజీనామా చేశారు. ఈ మేరకు మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి తన రాజీనామా లేఖను అందించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఎన్‌డీఏ నుంచి టీడీపీ బయటకు వచ్చినందున బీజేపీకి చెందిన తాను రాష్ట్రంలోని పదవికి రాజీనామా చేసినట్టు చెప్పారు. రాష్ట్రానికి బీజేపీ ఏమీ చేయలేదని, అన్యాయం చేస్తోందంటూ టీడీపీ నేతలు చేస్తున్న ప్రచారంలో నిజం లేదన్నారు. విభజనతో నష్టపోయిన ఏపీని అన్ని విధాలుగా ఆదుకునేలా కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని వివరించారు.

థర్మల్ విద్యుత్ కేంద్రం కాలుష్యంపై స్పందించిన హైకోర్టు

పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని అధికారులకు ఆదేశం

సాక్షి, హైదరాబాద్ : కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నంలో ఏపీ జెన్‌కో ఆధ్వర్యంలో నడుస్తున్న నార్ల తాతారావు థర్మల్ విద్యుత్ కేంద్రం వల్ల గాలి, నీరు తీవ్ర స్థాయిలో కలుషితమవుతున్నాయంటూ దాఖలైన వ్యాజ్యంపై హైకోర్టు స్పందించింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలంటూ నార్ల తాతారావు థర్మల్ విద్యుత్ కేంద్రం చీఫ్ ఇంజనీర్, ఏపీ జెన్‌కో, విద్యుత్‌శాఖ ముఖ్య కార్యదర్శి తదితరులకు నోటీసులు జారీచేసింది. ఈ మేరకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ రమేశ్ రంగనాథన్, న్యాయమూర్తి జస్టిస్ కొంగర విజయలక్ష్మితో కూడిన ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది.

విజయవాడ నుంచి ఎయిర్‌కార్గో సర్వీసులకు అనుమతి

కేంద్ర ఎక్సైజ్, కస్టమ్స్ శాఖ నోటిఫికేషన్



సాక్షి, అమరావతిబ్యూరో: అమరావతి నుంచి ఎయిర్ కార్గో సర్వీసులకు మార్గం సుగమమైంది. విజయవాడలోని గన్నవరం విమానాశ్రయంలో ఎయిర్‌కార్గో సర్వీసులను ప్రవేశపెట్టడానికి కేంద్ర ఎక్సైజ్, కస్టమ్ శాఖ ఆమోదించింది. ఈ మేరకు నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో గన్నవరం విమానాశ్రయానికి అంతర్జాతీయ గుర్తింపు లభించినట్టైంది. ఇక్కడి నుంచి విమానాల ద్వారా విదేశాలకు సరుకు ఎగుమతులు, దిగుమతులకు ప్రధాన అడ్డంకి తొలగిపోయింది. త్వరలోనే గన్నవరం విమానాశ్రయంలో ఎయిర్ కార్గో సేవల మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్ర ఎక్సైజ్, కస్టమ్స్ శాఖ చర్యలు తీసుకోనుంది. ఎయిర్ కార్గో కాంప్లెక్స్ ఏర్పాటు చేసి ప్రత్యేక కస్టమ్స్ విభాగాన్ని ఏర్పాటు చేస్తారు. అనంతరం డిమాండ్‌ను బట్టి విదేశాలకు ఎగుమతులు, దిగుమతులకు వీలుగా ఎయిర్ కార్గో సర్వీసులను ప్రవేశపెడతారు. ఇప్పటికే దేశం మొత్తం మీద 19 రాష్ట్రాల్లో 32 విమానాశ్రయల్లో కార్గో సర్వీసులు నిర్వహిస్తున్నారు. 33వ విమానాశ్రయంగా గన్నవరం విమానాశ్రయం స్థానం పొందింది. తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటికే హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయం, విశాఖపట్నంలోని రాజీవ్‌గాంధీ విమానాశ్రయాలలో ఎయిర్ కార్గో సర్వీసులు నిర్వహిస్తున్నారు. గన్నవరం విమానాశ్రయం నుంచి త్వరలో విజయవాడ నుంచి దుబాయ్‌కి అంతర్జాతీయ విమాన సర్వీసు ప్రారంభించనున్నారు.

మూడేళ్లలో రాష్ట్ర ప్రభుత్వ కొత్త అప్పులు రూ.65,757 కోట్లు

శాసనమండలిలో ఆర్థిక మంత్రి యనమల

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రిగా చంద్రబాబు అధికారం చేపట్టాక 2015 ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు మూడేళ్ల కాలంలో రూ.65,757 కోట్లు ప్రభుత్వం కొత్త అప్పులు తీసుకున్నట్టు ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు చెప్పారు. శాసనమండలిలో బడ్జెట్‌పై జరిగిన చర్చకు మంగళవారం మంత్రి సమాధానమిచ్చారు. 2014–15 ఆర్థిక సంవత్సరంలో కొంత సమయం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా కొనసాగిన నేపథ్యంలో ఆ ఏడాది వివరాలను పొందుపరచలేదన్నారు. వచ్చే ఆర్థిక ఏడాది మరో 30 వేల కోట్ల దాకా కొత్త అప్పులు తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. అప్పుల వడ్డీలకే రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా దాదాపు రూ.10 వేల దాకా చెల్లించాల్సి వస్తోందన్నారు. విభజన తర్వాత రాష్ట్ర ప్రభుత్వ రెవెన్యూ తగ్గిపోయి, ఖర్చులు పెరగడంతో ప్రభుత్వం కొత్త అప్పులు చేయాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వం తీసుకునే కొత్త అప్పులను రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగిస్తున్నామని చెప్పారు.

ప్రజాసంకల్ప యాత్ర

116వ రోజు

ఇప్పటి వరకూ నడిచిన దూరం

1,552.5 కి.మీ

116వ రోజు నడిచిన దూరం **12.5** కిలోమీటర్లు

ప్రారంభం: ఉ.7.30 గంటలకు పెదనందిపాడు శివారు

ముగింపు: సా.5.30 గంటలకు ఉప్పలపాడు

ముఖ్యాంశాలు

- పెదనందిపాడు శివారు, రాజుపాలెం క్రాస్, పరిటాలవారిపాలెం క్రాస్, అన్నవరం క్రాస్, ఉప్పలపాడులో జనంతో మమేకం.
- పాలపర్రులో జెండా ఆవిష్కరణ

నేటి పాదయాత్ర షెడ్యూల్

ప్రారంభం: ఉ.7.30 గంటలకు ఉప్పలపాడు

ముఖ్యాంశాలు

- జరుగులవారిపాలెం, మిట్టపాలెం, దండమూడి, మానుకొండువారిపాలెం, పోలిరెడ్డిపాలెంలో జనంతో మమేకం.
- చిలకలూరిపేట కళామందిర్ సెంటర్‌లో బహిరంగ సభ


ఉప్పలపాడు వద్ద జగన్ వెంట నడుస్తున్న అశేష ప్రజానీకం


రాజుపాలెం క్రాస్ వద్ద జగన్‌తో కరచాలనం కోసం పోటీపడుతున్న రైతు కూలీలు


పరిటాలవారిపాలెం క్రాస్ వద్ద జగన్‌తో కలిసి నడుస్తున్న నంగారాభేరీ నేత, లంబాడీ అక్కచెల్లెమ్మలు

ఎర్రటి ఎండలో వెల్లువెత్తిన జనాభిమానం

▶ మొదటి పేజీ తరువాయి
అన్నారం క్రాస్‌రోడ్డు, పాలపర్రు, రాజుపాలెం క్రాస్ మీదుగా ఉప్పలపాడు వరకూ సాగింది.

ఊళ్లకు ఊళ్లే తరలొచ్చినట్టు..

పెదనందిపాడు శివారుకు దాదాపు 16 గ్రామాల ప్రజలు వచ్చారు. కిలోమీటర్ల పొడవునా జగన్‌ను చూసేందుకు, మాట్లాడేందుకు, ఆయన అడుగుల్లో అడుగులేసేందుకు, కష్టాలు చెప్పుకునేందుకు ప్రయత్నించారు. జనాభిమానం అడ్డుపడుతుంటే.. పాలపర్రుకు చేరుకునే సరికి దాదాపు 11 గంటలైంది. అప్పటికే ఆ ఊరికి పరిటాల వారి పాలెం, అన్నవరం గ్రామాల ప్రజలు వచ్చారు. ఎండవేడిమికి ఉక్కపోతతో ఓ వైపు చెమట కారుతున్నా.. మరోవైపు జగన్‌ను దగ్గరి నుంచి చూడటానికి ఉత్సాహం చూపారు. 'వాళ్ల నాన్నను చూశాను. ఆయన కొడుకునూ చూడాలని వచ్చాను' అని 70 ఏళ్ల వెంకట సుబ్బయ్య అన్నాడు. జగన్ కోసం నాలుగు గంటల పాటు నిరీక్షించానని తుండుతో చెమట తుడుచుకుంటూ చెప్పాడు. కొప్పుల నాగలక్ష్మి తన ఐదేళ్ల బాబుకు వచ్చిన కష్టాన్ని చెప్పుకునేందుకు వచ్చింది. 'నా కొడుకు కంటి నరాలు చెదిరాయని డాక్టర్లు చెప్పారు. ఈ ప్రభుత్వం మాకు సాయం చేస్తుందనే నమ్మకం లేదు. అందుకే అన్నను కలవాలని వచ్చా' అని చెప్పింది. స్థానికంగా ఉండే వాళ్లు కూడా వీధుల్లో గుమిగూడి జగన్ కోసం ఎండలో నిరీక్షించడం కనిపించింది.

కష్టమొచ్చిందన్నా..

కర్నూలు నుంచి వచ్చిన వలస కూలీలు.. కళ్లల్లో పుట్టెడు దుఃఖం దాచుకుంటూనే తమ గోడు చెప్పుకున్నారు. 'పనులు దొరకడం లేదు.. బతకలేకపోతున్నాం.. కూలి కూడా సరిగా వచ్చేట్టు లేదు.. మంచి రోజులు వస్తాయనే గంపెడాశతో బతుకీడుస్తున్నాం' అని మల్లేష్ అనే వ్యక్తి అన్నాడు. యాదమ్మ, ఈశ్వరి, ప్రభావతి... ఇలా దాదాపు 15 మంది కూలీలు పొలాల్లోంచి పరుగెత్తుకొచ్చారు. రెక్కలు ముక్కలు చేసుకున్నా పిల్లలను చదివించలేకపోతున్నాం.. చూడయ్యా మట్టి పనికి పంపుతున్నాం.. అంటూ బొబ్బలెక్కిన తమ చిన్నారుల చేతులు చూపించారు. గుక్కెడు నీటి కోసం బోలెడు కష్టాలు పడుతున్నామని పాలపర్రు గ్రామస్తులు జగన్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. అధికార పార్టీ నేతలు పట్టించుకున్న పాపాన పోలేదని 60 ఏళ్ల సౌభాగ్యమ్మ తెలిపింది. మరికొంత మంది మహిళలు జగన్‌తో ఆ ఊరి కష్టాలు చెప్పుకున్నారు. పెదనందిపాడులో 80 ఏళ్ల వృద్ధులు తనను చూసేందుకు వేచి ఉన్నారని తెలిసి జగన్ చలించిపోయారు. నేరుగా వారి వద్దకే వెళ్లి ఆప్యాయంగా వారి చేతులు నిమురుతూ మాట్లాడారు. దగ్గరకు తీసుకుని గుండెలకు హత్తుకున్నారు. 'ఆ బాబొస్తే మాకు ఇక కష్టాలు ఉండవ్' అని జగన్ ఆత్మీయ పలకరింపు తర్వాత 75 ఏళ్ల ఎల్లయ్య అన్నారు.

ఆడపిల్లల పట్ల కూడా ఈ సర్కారుకు వివక్షే!

పెదనందిపాడు మండలం రాజుపాళెం గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు చిన్నా, కీర్తి దంపతులకు ఇద్దరు అమ్మాయిలు. రెండవ కూమార్తె జన్మించాక.. మా ఇంటి మహాలక్ష్మి పథకం లబ్ధిదారుగా ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అభిమానులనే కారణంతో వీరి దరఖాస్తుకు టీడీపీ నేతలు అడ్డుపడ్డారు. చిన్నా తల్లికి వితంతు పింఛన్ ఇవ్వడానికి కూడా వారికి మనసొప్పలేదు. ఈ నేపథ్యంలో తమ గ్రామం నుంచి మూడు కిలోమీటర్ల దూరంలోని పాలపర్రుకు చేరుకుని పాదయాత్రలో ఉన్న తమ అభిమాన నాయకుడు జగన్‌ను కలిశారు. తమ రెండవ కుమార్తెకు ఆయనతో నామకరణం చేయించి మురిసిపోయారు. మీరు సీఎం అయితే తప్ప తమలాంటి వారి కష్టాలు తీరవని చెప్పారు.




పాదయాత్రలో అవ్వలతో ఆప్యాయంగా మాట్లాడుతున్న ప్రతిపక్ష నేత జగన్


వైఎస్ హయాంలో ఆరోగ్య శ్రీ కింద తాను ఉచితంగా గుండె ఆపరేషన్ చేయించుకున్నానని రాజుపాలెం వద్ద కృతజ్ఞతలు తెలియజేస్తున్న ఓ అమ్మ


ఉప్పలపాడు వద్ద వైఎస్ జగన్‌తో గోడు వెళ్లబోసుకుంటున్న అతిసార బాధితులు


పాపిష్టి సర్కారు పోవాలయ్యా..

ఆనంద్‌పేట, అల్లీనగర్ తదితర ప్రాంతాల్లో అతిసారతో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబీకులు జగన్‌ను కలిశారు. చనిపోయిన వాళ్లకు నిజాయితీగా పరిహారం కూడా ఇవ్వడం లేదని ఆవేదన వెలిబుచ్చారు. ప్రజల ప్రాణాలు పోతున్నా దిద్దుబాటు చర్యలు చేపట్టని మొద్దు నిద్రలో ఈ ప్రభుత్వం ఉందని, ఈ పాపిష్టి సర్కారు పోవాలని దుమ్మెత్తిపోశారు. మీరే కాపాడాలంటూ జగన్‌ను వేడుకున్నారు. బాధితులకు అండగా ఉండాలని పార్టీ నేతలను జగన్ ఆదేశించారు. గుంటూరు రూరల్ మండలం చౌడవరం గ్రామానికి చెందిన ప్రజలు ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగారు. 'అన్నా 20 ఏళ్లుగా ఉంటున్నాం.. పట్టాలు కూడా ఇవ్వకపోతే ఎలా?' అంటూ జగన్ వద్ద వాపోయారు. పచ్చచొక్కా వాళ్లకే ప్రభుత్వ పథకాలన్నీ దోచిపెడుతున్నారని పాలపర్రు గ్రామ మహిళ జ్యోతి ఆగ్రహం వ్యక్తం చేసింది. గిట్టుబాటు ధర దక్కని పొగాకు రైతులు.. సర్కారీ చర్యలతో దిక్కుతోచక అల్లాడిపోతున్న డైట్ విద్యార్థులు.. ప్రత్యేక హోదా కోసం ఎలుగెత్తి పోరాడతామని ప్రతినబూనిన యువత.. ప్రజా సంక్షేమ రాజ్యం కోసం సంకల్పానికి మద్దతు ఇస్తామని పలువురు లాయర్లు జగన్‌ను కలిశారు. అందరి సమస్యలనూ జగన్ శ్రద్ధగా విన్నారు. అందరికీ అన్నీ చేయాలన్నదే తన లక్ష్యమని పునరుద్ఘాటించారు. మనందరి ప్రభుత్వం రాగానే అన్ని వర్గాల వారినీ ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

116వ రోజు

20–03–2018, మంగళవారం

ఉప్పలపాడు, గుంటూరు జిల్లా



పేదల ప్రాణాలంటే ఏమాత్రం విలువలేదా?

పంట పొలాల్లోంచి పరిగెత్తుకొస్తున్న చిన్నారులు.. వారి వెనకాలే వడివడిగా వస్తున్న పెద్దలు.. కాసేపాగాను. 'అన్న ఆగాడు..' అంటూ పరుగు పెంచిమరీ నా దగ్గరికొచ్చారు. ఆప్యాయంగా చుట్టూ చేరారు. ఆ చిట్టి తల్లులకు పట్టుమని పదేళ్లు కూడా లేవనుకుంటా.. చేతిలో చెయ్యి వేశారు. చేతుల నిండా మట్టి.. నెత్తి నిండా దుమ్ము.. గుడ్డలన్నీ మాసిపోయి ఉన్నాయి. 'బడికెళ్లలేదా..' అని అడిగాను. ఆపేశామన్నా.. పనికెళుతున్నాం అన్నారు. ఒక్కసారిగా మనసు చివుక్కుమంది. ఆ వెనకే ఉన్న వారి పెద్దలు 'ఇంటిల్లిపాదీ కూలికెళుతున్నామయ్యా.. ఏ ఒక్కరు పనికెళ్లకపోయినా గడిచేట్టు లేదు. చదువులెట్టా చెప్పించాలి' అని చెబుతుంటే.. వారి దీనస్థితికి జాలేసింది. చదువుకోవాలని ఉన్నా బడికెళ్లలేని దైన్యం ఆ చిన్నారులది. బిడ్డల్ని చదివించాలని ఉన్నా అడ్డుపడుతున్న ఆర్థిక ఇబ్బంది ఆ తల్లులది. పలకాబలపం పట్టాల్సిన చిన్నారులు పలుగు, పార పట్టాల్సి రావడం ఏంటి? కలం పట్టాల్సిన ఆ చేతులు కలుపు తీయాల్సి రావడం ఎంత దయనీయం! ఏ చిన్నారికీ, ఏ తల్లిదండ్రులకూ ఇలాంటి పరిస్థితి రానీయకూడదనే.. అమ్మ ఒడి పథకంతో ఆదుకోవాలన్న నా సంకల్పం మరింత దృఢపడింది. వారంతా కర్నూలు, అనంతపురం జిల్లాల నుంచి వచ్చిన వలస కూలీలట. 'అన్నా.. ఇక్కడ రోజుకు రెండు వందల కూలి ఇస్తారు. ఏం చేస్తాం.. ఈ మాత్రం పని ఊరికాడ లేకపోయే' అంటుంటే.. చాలా బాధనిపించింది. ఉపాధి హామీ పథకం సక్రమంగా అమలవుతుంటే వీరికి ఈ కష్టం వచ్చేదా?

చిలకలూరిపేట డైట్ కాలేజీ విద్యార్థినులు కలిశారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో తాము ఎలా నష్టపోతున్నామో చెప్పారు. వారంతా 2016, ఆగస్టులో డీఎడ్ కోర్సులో చేరారట. ఇరవై నెలలైంది. ఇంత వరకూ మొదటి సంవత్సర పరీక్షలే నిర్వహించలేదట. ఇక రెండో ఏడాది పరీక్షలు ఎప్పుడుంటాయో తెలియని అయోమయంలో ఉన్నామన్నారు. 'అన్నా.. గతంలో మీరు మాట్లాడిన తర్వాతే.. మొద్దునిద్రలో ఉన్న ఈ ప్రభుత్వం కళ్లు తెరిచింది. టెట్ పరీక్ష రాసేందుకు మాకు అనుమతిచ్చింది' అని చెప్పారు. ఆ నమ్మకంతోనే మళ్లీ వచ్చామన్నారు. 'రెండేళ్ల కోర్సు కాలం అయిపోతున్నా పరీక్షలు పెట్టకపోతే డీఎస్సీకి ఎలా వెళ్లగలం? టెట్‌కు అనుమతించి.. డీఎస్సీకి అవకాశం లేకపోతే ఏం ప్రయోజనం? అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. వాళ్ల ఆవేదనలో అర్థం ఉంది. డైట్ సెట్‌ను ప్రభుత్వమే నిర్వహించి.. కౌన్సెలింగ్ ద్వారా కాలేజీలలో ప్రవేశాలు కల్పించి.. వారికి పరీక్షలే నిర్వహించకుండా, వారి ఉద్యోగావకాశాలను, భవిష్యత్తును దెబ్బతీస్తూ వారి జీవితాలతో ఆడుకునే అధికారం ఈ ప్రభుత్వానికి ఎవరిచ్చారు? రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 70 వేల మంది విద్యార్థులు ఈ స్థాయిలో అవస్థలు పడుతున్నా కనీసం చలించని ఈ చంద్రబాబు సర్కారును ఏమనాలి?

ఉప్పలపాడులో పాదయాత్ర సాగుతుండగా గుంటూరు నుంచి వచ్చిన డయేరియా బాధిత కుటుంబాలవారు, వారి బంధువులు కలిశారు. 'మేమేం పాపం చేశామయ్యా.. ఈ ప్రభుత్వం చేసిన తప్పులకు మా వాళ్ల ప్రాణాలు పోయాయ్..' అంటూ రోదించారు. చాలా ఘోరమనిపించింది. కలుషిత నీటిని తాగి డయేరియాతో ప్రాణాలు కోల్పోవడం ఎంత దారుణం? సామాన్య ప్రజలకు శుద్ధమైన తాగునీటిని కూడా అందించలేకపోవడం ప్రభుత్వ అసమర్థత కాక మరేంటి? ప్రజారోగ్యమంటే ఇంత నిర్లక్ష్యమా? పేదల ప్రాణాలంటే ఏమాత్రం విలువే లేదా?

ముఖ్యమంత్రిగారికి నాదో ప్రశ్న.. గుంటూరు డయేరియా మరణాలకు కేవలం ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం కాదా? సమస్య తీవ్రతను తక్కువగా చేసి చూపడం కోసం, పరిహారం ఎగ్గొట్టడం కోసం మరణాల సంఖ్యను తగ్గించి చూపడం అమానుషం కాదా? కేవలం ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల సంభవించిన ఈ మరణాలన్నీ సర్కారీ హత్యలేనని ప్రజలంటున్నారు.. వారికేం సమాధానం చెబుతారు?

వైఎస్. జగన్.

ప్రజా సంకల్ప యాత్ర — **మరిన్ని చిత్రాలు టాబ్లాయిడ్‌లో**

చర్చించే వరకూ వదలం

- వైఎస్సార్ సీపీ ఎంపీల ఉద్ఘాటన
- ఐదు కోట్ల మంది ప్రజల ఆవేదన దేశానికి తెలియజేస్తాం


మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ మేకపాటి. చిత్రంలో విజయసాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, వరప్రసాద్, మిథున్‌రెడ్డి, అవినాశ్‌రెడ్డి, బొత్స, బుగ్గన, కారుమూరి

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం అవిశ్వాస తీర్మానంపై చర్చ జరపకుండా రాష్ట్రానికి తీరని అన్యాయం చేస్తోందని వైఎస్సార్ సీపీ ఎంపీలు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం లోక్‌సభ వాయిదా పడిన అనంతరం పార్టీ ఎంపీలు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డి, వరప్రసాదరావు, మిథున్‌రెడ్డి, అవినాశ్‌రెడ్డి, పీఏసీ చైర్మన్ బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, పార్టీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ మీడియాతో మాట్లాడారు. అవిశ్వాసంపై చర్చకు అనుమతించాల్సిందిగా సభ ప్రారంభానికి ముందు స్పీకర్‌ను కోరామని మేకపాటి తెలిపారు. అయితే సభలో గందరగోళం పరిస్థితులు లేకుంటే తీర్మానాన్ని ప్రవేశపెడతామని ఆమె చెప్పారన్నారు. కొద్దిసేపు నిరసన విరమించాలని అన్నాడీఎంకె, టీఆర్ఎస్ ఎంపీలను కోరినా అదే పరిస్థితి కొనసాగడం బాధ కలిగించిందన్నారు.

ఐదు కోట్ల మంది గళం వినిపిస్తాం..

అవిశ్వాసంపై పార్లమెంట్‌లో చర్చ జరిపేంత వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని, ఈ విషయంలో ఎట్టిపరిస్థితుల్లో వెనక్కి తగ్గబోమని మేకపాటి స్పష్టం చేశారు. అవిశ్వాసంపై చర్చ జరిపి ఐదు కోట్ల మంది ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆవేదన యావత్తు దేశానికి తెలిసేలా వైఎస్సార్ సీపీ చేస్తుందన్నారు. హోదా సాధన కోసం అవిశ్రాంతంగా పోరాడుతున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ ఢిల్లీలో ధర్నా చేపట్టారని, ఆమరణ నిరాహార దీక్ష చేశారని, అన్ని జిల్లాల్లో యువభేరి కార్యక్రమాలు నిర్వహించి చైతన్యం చేశారని గుర్తు చేశారు. హోదా సంజీవనా? అని ఒకసారి, కోడలు మగబిడ్డను కంటానంటే అత్త వద్దంటుందా? అంటూ ఎగతాళి చేసి ప్యాకేజీకి అంగీకరించిన చంద్రబాబు ప్రజల ఆగ్రహంతో గత్యంతరం లేక అవిశ్వాసం పేరుతో డ్రామాలాడుతున్నారని విమర్శించారు.

చర్చ జరిగేవరకూ పోరాటమే: వైవీ సుబ్బారెడ్డి

అవిశ్వాసంపై చర్చ జరిపేందుకు సిద్ధంగా ఉన్నామని సోమవారం సభలో కేంద్ర హోం మంత్రి ప్రకటన చేయడంతో మంగళవారమైనా చర్చ జరుగుతుందని భావించామని ఎంపీ వైవీ సుబ్బారెడ్డి చెప్పారు. అయితే ప్రభుత్వం చర్చకు ముందుకు రాకుండా ఏపీకి అన్యాయం చేస్తోందన్నారు. సభలో అవిశ్వాసంపై చర్చ జరిగే వరకు పోరాడుతామని, అప్పటికీ కేంద్రం దిగి రాకపోతే ఏప్రిల్ 6న రాజీనామాలు చేస్తామని సుబ్బారెడ్డి స్పష్టం చేశారు.

బాబు అసమర్థతే కారణం: వరప్రసాదరావు

చంద్రబాబు అసమర్థత వల్లే రాష్ట్రానికి ప్రత్యేక హోదా రాలేదని ఎంపీ వరప్రసాదరావు విమర్శించారు. గత నాలుగేళ్లలో ఎప్పుడూ ప్రత్యేక హోదాను ప్రస్తావించకుండా ఇప్పుడు అవిశ్వాసం పెట్టినంత మాత్రాన ఆయన్ను ఎవరూ విశ్వసించబోరన్నారు.

చంద్రబాబును ఏ పార్టీ నమ్మదు: విజయసాయిరెడ్డి

అవిశ్వాసంపై సభలో చర్చ జరగకపోవడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యక్తిత్వమే ప్రధాన కారణమని ఎంపీ విజయసాయిరెడ్డి ధ్వజమెత్తారు. 1996 నుంచి 2014 వరకు దేశంలో ఉన్న అన్ని పార్టీలతో పొత్తు పెట్టుకొని తెగతెంపులు చేసుకున్న చంద్రబాబును ఎవరూ నమ్మే పరిస్థితి లేదన్నారు. 'వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు ఏ పార్టీని పెళ్లి చేసుకోబోతున్నారు? ఎన్ని రోజులు కాపురం చేస్తారు?' అని ప్రశ్నించారు. ఆయన నాటకాలను గమనిస్తున్న ప్రజలు వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
బుధవారం, 21-3-2018

సెటైర్

ఉట్టికెగరలేనయ్య!

ఉట్టికెగరలేనమ్మ స్వర్గానికి ఎగురుతాననందట! కాన్ఫిడెన్స్ మంచిదే. అయితే ఇప్పుడు స్వర్గం ఎవరిక్కావాలి? చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉంటేనూ! పనిలేని వాళ్లకు, పని ఉన్నవాళ్లకు కూడా వాట్సాప్ ఇప్పుడు స్వర్గధామం. ఈ స్వర్గంలో



ప్రియా వారియర్ వివాదాస్పద 'కన్నుగీటు' సన్నివేశం

ప్రముఖులదీ, అనామకులదీ ఒకటే బెంచ్. దమ్ మార్ దమ్. ఏక్ హై హమ్. చిన్న పోస్టుతో అబద్ధం నిజం అయిపోతుంది, నిజం అబద్ధం అయిపోతుంది. ఎవరికి లాభం.. ఇలాంటి ఫేక్ పోస్టులతో? ఎవరికీ లేదు. అదో గంజాయ్ లాంటి ఎంజాయ్‌మెంట్.

రెండు రోజులుగా వాట్సాప్‌లలో ఒక కాలేజ్ 'సర్క్యులర్' సర్క్యులేట్ అవుతోంది. మీకూ వచ్చే ఉంటుంది. కోయంబత్తూర్‌లోని 'వి.ఎల్.బి.జానకియమ్మాళ్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్ అండ్ సైన్స్' ప్రిన్సిపాల్ పేరుతో అది బయటికి వచ్చింది. 'డియర్ స్టూడెంట్స్.. ప్రియా వారియర్‌లా మీరూ కూడా క్లాస్ రూమ్‌లలో కన్నుగీటుతున్నట్లు తెలిసింది. అలా చేసినట్లు మా దృష్టికి వస్తే వెంటనే మిమ్మల్ని వన్ ఇయర్ పాటు కాలేజ్ నుంచి డీబార్ చేస్తాం' అన్నది సారాంశం! అమ్మో ఈ పిల్ల దేశం మొత్తాన్నీ పాడు చేస్తోందే.. అనిపిస్తుంది ఆ సర్క్యులర్‌ని చూడగానే. పాడై పోయే మాట నిజమేనేమో కానీ... ఈ సర్క్యులర్ మాత్రం నిజం కాదు. ఎవరో ఉట్టికెగరలేనయ్యలు ఊరికే ఉండలేక ఇలా ఫేక్ పని చేసినట్లున్నారు. ఎలాగంటారా! ప్రియ 'కన్నుగీటింది' ఫిబ్రవరిలో. ఆ సర్క్యులర్ మీద ఉన్న డేటు జనవరిది.

నిర్భయ తల్లి ఆత్మఘోష

కొంతమంది బండగాళ్లు!
వాళ్ల నోట్లో ఉండేది నాలుక కాదు...
శతాబ్దాల మగ అహంకారానికి కొలబద్ద.
అత్యాచారంతో చంపారు.
ఇప్పుడు...
జ్ఞాపకాలపై అత్యాచారం చేస్తున్నారు.
'నిర్భయ' తల్లికి అందుకే కోపం వచ్చింది.
మనమైతే అక్కడికక్కడే తిట్టేసేవాళ్లమేమో!
అప్పుడు..
తనకీ, వాడికీ తేడా ఏముంటుంది?
అందుకనే తన ఆత్మఘోషను
బహిరంగ లేఖగా రాసింది.

''రేయ్! గాడిదా!! తాటిచెట్టులా పెరగడం కాదురా, బుద్ధి జ్ఞానం కూడా ఉండాలి. వెధవా.''

ఇలా.. ఒక మనిషిని నోరారా తిట్టే హక్కు ఎవరికుంటుంది? అమ్మమ్మ, నానమ్మ, తాతయ్యలకే కదా?! మరి, కర్ణాటక మాజీ డీజీపీ హెచ్‌టీ సంగ్లియానా కు అమ్మమ్మ, నానమ్మ, తాతయ్యలు ఇప్పటికీ ఉంటే ఇలా తిట్టకుండా వదిలి పెడతారా?

మహిళాదినోత్సవం రోజు బెంగళూరులో ఓ మహిళా కార్యక్రమం జరిగింది. సంగ్లియానా కూడా ఆ కార్యక్రమ వేదిక మీద ఉన్నారు. తమ ప్రొఫెషన్‌లో విశేషంగా కృషి చేస్తున్న మహిళలు, పోరాట పటిమతో తమ వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకున్న మహిళలు, సాటి మహిళలకు మార్గదర్శనంగా ఉన్న వాళ్లను అభినందిస్తూ, వారిని పురస్కరించడం ఆ కార్యక్రమం ఉద్దేశం. నిర్భయ తల్లి ఆశాదేవిని కూడా నిర్వాహకులు ఆహ్వానించారు. ఆవిడ వచ్చారు. ఆసీనులయ్యారు.

పెద్దాయన కదా అని పిలిస్తే..!

మహిళా దినోత్సవం కాబట్టి, సమాజంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాల గురించి, దాడికి పాల్పడిన వారి మీద తక్షణమే చర్య తీసుకోవడం గురించి, నాలుగు పనికొచ్చే మాటలు చెప్తాడని సంగ్లియానాను పిలుచుకొస్తే, ఆయన మొత్తం పోలీస్ డిపార్ట్‌మెంట్ పరువునే పోగొట్టారు! ''నిర్భయ తల్లి ఫిజిక్ ఈ వయసులోనూ చాలా ఫిట్‌గా బాగుంది. ఆమెను చూస్తే నిర్భయ ఎంత అందంగా ఉండి ఉంటుందో నేను ఊహించగలను'' అని.. వేదిక మీద మైక్ పుచ్చుకుని మరీ సంగ్లియానా అన్నారు! సమావేశంలో ఉన్న వాళ్లకు ఒక్కసారిగా షాక్! తాము విన్నది నిజమేనా అన్నట్లు తలతిప్పి పక్క వాళ్లను చూశారు. నిజమే అన్నట్లు ఒకర్నొకరు ముఖముఖాలు చూసుకున్నారు. ఆ తర్వాత సంగ్లియానా మహిళలకు కొన్ని జాగ్రత్తలు కూడా చెప్పాడు. కానీ అవేవీ ఎవరికీ బుర్రల్లోకి ఎక్కనేలేదు.

పోరాటం గుర్తుకు రాలేదా?!

'ఇంత పెద్దాయన నోటి నుంచి వినాల్సిన మాటలేనా అవి' అందరిలోనూ అదే ప్రశ్న. అయితే సంగ్లియానా వ్యాఖ్యల మీద ఆశాదేవి చాలా హుందాగా మాట్లాడారు. ''సమాజంలో మనుషుల మైండ్‌సెట్ ఏ మాత్రం మారలేదని నిరూపిస్తున్నాయి ఆయన మాటలు'' అని, సమావేశం తర్వాతి ప్రెస్‌మీట్‌లో క్లుప్తంగా స్పందించారు. తనకు బాగా దగ్గరి వాళ్లతో మాత్రం ''నా ఫిజిక్ కంటే నేను చేసిన న్యాయ పోరాటాన్ని గుర్తు చేసుకుని ఉంటే బాగుండేద'ని ఆమె ఆవేదన చెందారు. ఆ తర్వాత ఎప్పటికో, తన వివాదాస్పద వ్యాఖ్యలకు (మహిళలు ఆవేశంతో రగిలిపోవడంతో) క్షమాపణలు చెప్పాడు సంగ్లియానా.

సంగ్లియానా ఒక ఎగ్జాంపుల్

ఈ ఏడాది ఫిబ్రవరి 11వ తేదీ నుంచి మార్చి 8 మహిళా దినోత్సవం వరకు సాక్షి ఫ్యామిలీ 'నేను శక్తి' క్యాంపెయిన్‌ను నిర్వహించింది. ఆ క్యాంపెయిన్‌లో మహిళలకు సమాజంలో ఎదురవుతున్న వివక్ష, గృహహింస, లైంగిక వేధింపుల నిజజీవిత కథనాలను, సమస్యలను సమర్థంగా ఎదుర్కొని సాధికారత సాధించిన మహిళల అనుభవాలను ప్రచురించింది. ఆ క్రమంలో కొంతమంది నుంచి.. ''ఇంకా మహిళలకు కష్టాలు, వేధింపులు ఉన్నాయా?! అవనీ వారిదే, అంతరిక్షమూ వారిదే అన్నట్లుగా ఎదుగుతున్న రోజుల్లో కూడా కడగండ్లతో బతుకీడుస్తున్న ఆడవాళ్లు ఉన్నారంటే నమ్మలేకపోతున్నాం'' అనే సందేహాలు వ్యక్తం అయ్యాయి. అన్నవాళ్లలో ఆడవాళ్లు, మగవాళ్లు కూడా ఉన్నారు. క్యాంపెయిన్ ఉద్దేశం విస్తృతమైనది. అభ్యుదయ పథంలో దూసుకుపోతున్న నూటికొక్కరు ఇద్దరి కథనాలను మాత్రమే కాదు, రోజూ మనం వింటున్న లైంగికదాడుల వార్తలు, వరకట్న వేధింపులు, పరువు హత్యలను కూడా గుర్తు చేసుకోవడం. ఇప్పుడు సంగ్లియానా మాటలు విన్న తర్వాత ఇలాంటి క్యాంపెయిన్‌ల అవసరం ఇంకా చాలా ఉందనే అనిపిస్తోంది.

\- మంజీర



సంగ్లియానా, ఐపీఎస్ రూప, ఆశాదేవి. (ఈ సభలోనే సంగ్లియానా నిర్భయ తల్లి ఫిజిక్‌ని పొగిడారు!)

మీకూ వాళ్లకు తేడా లేదు

మీరు నా శరీరాకృతిని ప్రశంసిస్తూ కామెంట్ చేశారు. ఆ కామెంట్ చేసే ముందు... అది ఏ మాత్రం సముచితమో ఒకసారి ఆలోచించి ఉండాల్సింది. దాంతోపాటు మా అమ్మాయి అందచందాల గురించి కూడా మాట్లాడారు. అత్యంత క్రూరంగా గాయపడి, చిన్న వయసులో ప్రాణాలు కోల్పోయిన అమ్మాయి దేహాకృతిని ఊహించారు. లైంగిక దాడి కారణంగా ప్రాణాలు కోల్పోయిన అమ్మాయి సౌందర్యం గురించి మాట్లాడారు! తన మీద దాడికి పాల్పడిన వారిని నిరోధిస్తూ మా అమ్మాయి ఎంతగా ప్రతిఘటించిందనే సంగతిని మీరు గుర్తించలేకపోయారు, ఆ ప్రతిఘటనను గౌరవించలేకపోయారు. మా అమ్మాయిలా మరే ఆడబిడ్డకూ జరగకూడదని నేనెంతగా పోరాటం చేశానో మీరు గుర్తించలేకపోయారు. మీ వ్యాఖ్యల ద్వారా మీరు మీలో నిండి ఉన్న అనారోగ్యకరమైన ధోరణిని బయటపెట్టుకున్నారు. మీ ఆలోచనలు కూడా మా అమ్మాయి మీద లైంగిక దాడికి పాల్పడిన మగవాళ్ల ఆలోచనల్లాగానే ఉన్నాయి. ఒక ఆడపిల్ల తమ దాడికి లొంగిపోకుండా ప్రతిఘటించడాన్ని పురుషాధిక్య అహంకారం సహించలేకపోయింది. అందువల్లనే ఆమెను అంత క్రూరంగా హింసించినట్లు వాళ్లే చెప్పారు. మీ మాటలు కూడా అలాంటి క్రూరమైన మనస్తత్వం ఉన్న వాళ్లను ప్రోత్సహించేవిగానే ఉన్నాయి.

మీరు చేసిన హేయమైన వ్యాఖ్యలతో మీరు యువతులకు ఏం చెప్పారు? లైంగిక దాడి జరిగినప్పుడు ప్రతిఘటించి ప్రాణాల మీదకు తెచ్చుకోకుండా, లొంగిపోయి ప్రాణాలు కాపాడుకోండి... అని! మీ ఈ అభిప్రాయం ప్రకారం... మీరు మన దేశం కోసం ప్రాణాలర్పించడానికి సిద్ధంగా ఉన్న సైనికులకు ఏం చెబుతారు? శత్రువు దాడి చేసినప్పుడు ఆయుధాలను విసిరేసి లొంగిపోయి ప్రాణాలు కాపాడుకోమనా?

మీరు మాట్లాడింది ఏమాత్రం సమంజసం కాదని ఇప్పటికైనా గ్రహించారా? ఆడపిల్లలకు మీరు బలహీనమైనవాళ్లు, పరిస్థితులను బట్టి రాజీ పడుతూ మిమ్మల్ని మీరు పణంగా పెట్టుకుంటూ జీవించాలి... అని సందేశం ఇవ్వదలుచుకున్నారా మీరు?

(సంగ్లియానాకు 'నిర్భయ' తల్లి రాసిన బహిరంగ లేఖలోని సారాంశం)



'నిర్భయ' తల్లి ఆశాదేవి

ఎడ్యుకేట్ గర్ల్స్

చదువుల రాయబారిగా చదువు లేని అమ్మాయ్!

తాజా వార్త ఏంటంటే.. బాలీవుడ్ నటి కత్రినా కైఫ్ 'ఎడ్యుకేట్ గర్ల్స్' అనే స్వచ్ఛంద సంస్థలో చేరారు! చేరడం అంటే? బాలికల విద్యకు రాయబారిగా ఇకనుంచీ ఆమె ఆ సంస్థ తరఫున పనిచేస్తారు. 'ఎడ్యుకేట్ గర్ల్స్' గత పదేళ్లుగా రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లోని 12 వేల గ్రామాలలో 21 వేల పాఠశాలలతో కలిసి పనిచేస్తోంది. బడి మానేసిన బాలికల్ని మళ్లీ బడిలో చేర్పించేందుకు సఫీనా హుస్సేన్ అనే ఢిల్లీ సోషల్ వర్కర్ ఈ సంస్థను ప్రారంభించారు. స్త్రీ, పురుషుల మధ్య అక్షరాస్యతలో లైంగిక వ్యత్యాసాన్ని తగ్గించి ఈక్వల్ ఈక్వల్ చెయ్యడం సఫీనా లక్ష్యం. ఆ లక్ష్యాన్ని ఇప్పుడు ఆమె కత్రినా అనే బాణంతో ఛేదించి సాధించబోతున్నారు. ఇంతకీ కత్రినా ఏం చదివారు? ఏమీ చదవలేదు. జీవితాన్నయితే విస్తృతంగా చదివారు. కత్రినా కుటుంబం ఏ దశలోనూ ఒకేచోట స్థిరంగా ఉండిపోలేదు. అందుకే కత్రినాకు చదువుకునే అవకాశం రాలేదు. అందరూ అనుకుంటున్నట్లు కత్రినా లండన్ అమ్మాయి కాదు. హాంకాంగ్‌లో పుట్టింది. అక్కడి నుంచి వాళ్ల ఫ్యామిలీ చైనా వెళ్లింది. చైనా నుంచి జపాన్ వెళ్లింది. అక్కడి నుంచి పడవలో ఫ్రాన్స్ వెళ్లింది. అప్పటికి కత్రినాకు 8 ఏళ్లు. అక్కడి నుంచి స్విట్జర్లాండ్, పోలండ్, జర్మనీ, బెల్జియం, ఇంకొన్ని ఐరోపా దేశాల్లో కొన్ని నెలలపాటు గడిపింది. తర్వాత హవాయికి. ఆ తర్వాత ఇంగ్లండ్‌కి. కత్రినా అమ్మగారి దేశం అది. అక్కడ కూడా మూడేళ్లు ఉంది కత్రినా. అక్కడి నుంచి ముంబై వచ్చేసింది. తండ్రిగారి పూర్వీకులు ఉన్నారిక్కడ. ముంబై వచ్చాక మోడలింగ్, బాలీవుడ్. ఇదీ కత్రినా జీవనయానం. ఎక్కడా స్టడీస్‌కి చోటే లేదు. అయినా ప్రపంచాన్ని మించిన పుస్తకం ఎక్కడ ఉంటుంది! అందుకే 'ఎడ్యుకేట్ గర్ల్స్' రాయబారిగా కత్రినా చక్కగా సరిపోతారు. అయినా కత్రినా ఇన్ని దేశాలు ఎందుకు తిరగవలసి వచ్చింది? తండ్రి వ్యాపారి.



కత్రినా కైఫ్

చెట్టు నీడ

చిన్న పిల్లాడి పెద్ద మనసు

ఒక వేసవికాలం మధ్యాహ్నం. ఒక పదేళ్ల పిల్లాడు ఐస్‌క్రీమ్ పార్లర్‌కు వెళ్లాడు. ఎగిరి కూర్చున్నట్టుగా కుర్చీలో కూర్చున్నాడు. పెద్దవాళ్లు ఎవరూ వెంటలేని చిన్న పిల్లాడి దగ్గరికి వచ్చింది ఒక వెయిట్రెస్. గ్లాసు మంచినీళ్లు ముందుపెట్టి, 'ఏం కావా'లని అడిగింది.

టేబుల్ మీదున్న మెనూలోంచి ఒక ఫొటో చూపిస్తూ, 'ఈ కస్టర్డ్ ఆపిల్ ఐస్‌క్రీమ్ ఎంత?' అని అడిగాడు పిల్లాడు.

'యాభై రూపాయలు' బదులిచ్చింది.

పిల్లాడు తన దగ్గరున్న చిల్లర నాణేలని జేబులోంచి తీసి లెక్కించసాగాడు. వెయిట్రెస్ అసహనంగా ఫీలైంది.

> పిల్లాడు తన దగ్గరున్న చిల్లర నాణేలని జేబులోంచి తీసి లెక్కించసాగాడు. వెయిట్రెస్ అసహనంగా ఫీలైంది. పిల్లాడు మెనూలో మరో ఫొటో వైపు చూపిస్తూ, 'మరి ఈ బటర్ స్కాచ్ ఎంత?' అన్నాడు.

పిల్లాడు మెనూలో మరో ఫొటో వైపు చూపిస్తూ, 'మరి ఈ బటర్ స్కాచ్ ఎంత?' అన్నాడు. ఇంతలో పార్లర్‌కు వేరే కస్టమర్లు రావడంతో ఆమె త్వరగా కానిమ్మన్నట్టుగా జవాబు ఇస్తూ, 'నలభై రూపాయలు' అంది.

పిల్లాడు మళ్లీ నాణేలు లెక్కించసాగాడు. వెయిట్రెస్ ఓపిక నశిస్తోంది. చివరకు తేల్చుకున్నట్టుగా, 'బటర్ స్కాచ్' అన్నాడు. ఆమె వేగంగా ఐస్‌క్రీమ్ తెచ్చి, బిల్లు కూడా టేబుల్ మీద పెట్టి, ఇతర కస్టమర్లకు ఏం కావాలో చూడటానికి వెళ్లింది.

కాసేపయ్యాక తిరిగి వచ్చేసరికి పిల్లాడు టేబుల్ మీద లేడు. డబ్బు కౌంటర్లో కట్టేసి వెళ్లిపోయాడు. టేబుల్ మీద టిప్పుగా పెట్టిన పది రూపాయి బిళ్లలు చూసేసరికి ఆమెకు కన్నీళ్లు ఆగలేదు.

న్యూస్

నిద్రే చెలిమి కలిమి



ఒత్తిడి, కుంగుబాటు, ఆందోళన వంటి మానసిక సమస్యలు నిద్రలేమికి దారితీస్తాయనే సంగతి తెలిసిందే. అయితే, నిద్రలేమి వల్ల మానసిక సమస్యలు తలెత్తుతాయని తాజా పరిశోధనలు చెబుతున్నాయి. స్త్రీలైనా, పురుషులైనా వయోజనులైన వారికి ఎనిమిది గంటల నిద్ర తప్పనిసరి అని, నిద్ర అంతకంటే తక్కువ అయితే మానసిక సమస్యలు తలెత్తే అవకాశాలు ఉన్నాయని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. తరచుగా నిద్రకు అంతరాయం ఏర్పడటం, తగినంత నిద్ర పట్టకపోవడం లేదా ఎక్కువసేపు మెలకువగా ఉండాల్సిన పరిస్థితులు తలెత్తడం వంటివి దీర్ఘకాలం కొనసాగితే మానసిక కుంగుబాటు, ఆందోళన తలెత్తుతాయని బింగ్‌హామ్టన్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్త ప్రొఫెసర్ మెరెడిత్ కోలెస్ చెబుతున్నారు. నిద్ర తగినంతగా లేనివారిని ప్రతికూల భావనలు వెంటాడుతాయని, ఇలాంటి పరిస్థితి దీర్ఘకాలం కొనసాగినట్లయితే తీవ్రమైన మానసిక సమస్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

లవ్ డాక్టర్ నన్నడగొద్దు ప్లీజ్


ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ సార్...! కొన్ని నెలల క్రితం ఒక అమ్మాయి నాకు ప్రపోజ్ చేసింది. ఇద్దరం సేమ్ క్లాస్. తను బాగా రిచ్. మాది మిడిల్ క్లాస్ ఫ్యామిలీ. సో నేను మ్యారేజ్ సెట్ అవ్వదనే ఆలోచనతో ఒప్పుకోలేదు. బట్ తనంటే నాకూ ఇష్టమే. కానీ నన్ను కన్విన్స్ చేసింది. అప్పటి నుంచి ఇద్దరం బాగా లవ్ చేసుకున్నాం. జాబ్స్ రావడం వల్ల ఇద్దరం వేరే వేరే ఊళ్లకు వెళ్లిపోయాం. ఇద్దరి మధ్య వెయ్యి కిలోమీటర్ల దూరం వచ్చేసింది. కానీ మాకు అలా అనిపించేది కాదు. తను ఒక నెల తరువాత నన్ను కలవడానికి వచ్చింది. ఖరీదైన గిఫ్ట్ కూడా ఇచ్చింది. కానీ వెళ్లేటప్పుడు నాకు సారీ చెప్పి, మన పెళ్లి జరగదు విడిపోదాం అని చెప్పింది. నేను తట్టుకోలేకపోయా. కారణం ఏంటంటే... ''నాకు సంబంధాలు చూస్తున్నారు'' అంది. ''ఇంట్లో అసలు ఒప్పుకోరు'' అంటోంది. నేను తన గురించి ఆలోచించకుండా ఉండలేకపోతున్నా. దీనికి మంచి సలహా ఇవ్వండి ప్లీజ్.

\- జీవ

ఏం చెప్పమంటావ్ అన్నయ్యా..?
నీ పరిస్థితి చూస్తుంటే దిగులుగా ఉంది...
నిన్నే చదివా నీ ఉత్తరం....
రాత్రంతా పట్టలేదు నిద్దర...
బతుకంతా చిందర వందర...
ముందు వద్దనుకుని.. మళ్లీ దిగావు సుందరా...
కానీ చివరికి మిగిలింది ఏందిరా....
లైఫ్ అంతా చిందర వందర...
'ఏంటి సార్..! మీ లైఫ్‌లో కూడా ఒక రిచ్ అమ్మాయి...
మిమ్మల్ని వాడుకుని.. బనానా మిల్క్ షేక్ చేసుకుని...
తొక్కలా పారేసిందా సార్..!?'
నువ్వు నా లైఫ్ డిగ్ చేయకు నీలూ...
జీవాకి బిగ్ సొల్యూషన్ చెప్పు...

'ఆ.. ఏముంది సార్, లైఫ్‌లో ఇలాంటివి జరిగితే టేకిటీజీ పాలసీ ఉండాలి సార్. అంతగా ఫీల్ కాకూడదు. మనోడు ఎంత హ్యాండ్సమ్ కాకపోతే రిచ్ అమ్మాయిలు ఇష్టపడతారు సార్? ఇప్పటికి మాత్రం అమ్మాయిల నుంచి వెయ్యి కిలోమీటర్ల డిస్టెన్స్ మెయింటైన్ చేస్తే కుదుట పడతాయి. ఏమంటారు సార్???'

సూపర్ నీలూ...!

లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్,
రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34.
lovedoctorram@sakshi.com

ఈ పాటకు ట్యూన్ తెలుసా?



కట్‌చేయ్...దాచేయ్...

పల్లవి

హే సూర్యవంశ తేజమున్న సుందరాంగుడు పున్నమి సెంద్రుడు
మారాజైనా మామూలోడు మనలాంటోడు
మచ్చ లేని మనసున్నోడు జనం కొరకు ధర్మం కొరకు
జన్మెత్తిన మహానుభావుడు... వాడే శ్రీరాముడు

చరణం-1: హే రాములోడు వచ్చినాడురో
దాని తస్సదియ్య శివధనుస్సు ఎత్తినాడురో (2)
నారి పట్టి లాగినాడురో
దాని తస్సదియ్య నింగికెక్కుపెట్టినాడురో (2)
ఫెళఫెళఫెళఫెళ్లుమంటూ ఆకసాలు కూలినట్టు
భళభళభళభళ్లుమంటూ దిక్కులన్నీ పేలినట్టు
విలవిలమని విల్లు విరిచి జనకరాజు అల్లుడాయెరో
మరామరామరామరామరామరామ
రామదండులాగ అందరొక్కటౌదామా ॥మరామ రామ॥

చరణం-2: హే రాజ్యమంటే లెక్కలేదురో
దాని తస్సదియ్య అడవి బాట పట్టినాడురో (2)
హే పువ్వులాంటి సక్కనోడురో
దాని తస్సదియ్య సౌఖ్యమంత పక్కనెట్టెరో
హే బలెబలె మంచిగున్న బతుకునంత పణం పెట్టి
అలుమలుపులు గతుకులున్న ముళ్ల దారిపట్టి
తన కథనే పూస గుచ్చి మనకు నీతి నేర్పినాడురో
॥మరామ రామ॥

హే రామసక్కనోడు మా రామసంద్రుడంట
ఆడ కళ్ల సూపు తాకి కందిపోతాడంట
అందగాళ్లకే గొప్ప అందగాడంట
నింగి నీలమై ఎవరికీ చేతికందదంట

చరణం-3: హే జీవుడల్లె పుట్టినాడురో
దాని తస్సదియ్య దేవుడల్లె ఎదిగినాడురో (2)
హే నేల దారి నడిచినాడురో
దాని తస్సదియ్య పూల పూజలందినాడురో (2)
హే పద పదమని వంతెనేసి పెను కడలిని దాటినాడు
పది పది తలలు ఉన్నవాణ్ని పట్టి తాట తీసినాడు
చెడు తలపుకి చావు దెబ్బ తప్పదంటు చెప్పినాడురో
॥మరామ రామ॥

కట్‌చేయ్...దాచేయ్...

రచన: రామజోగయ్యశాస్త్రి ; సంగీతం: దేవిశ్రీ ప్రసాద్
గానం: ఎంఎల్ఆర్ కార్తికేయన్, రనీనా రెడ్డి, సూరజ్ సంతోష్
చిత్రం: శ్రీమంతుడు


కాసుకో సుడోకు

				4	5	9		
4		8	9				6	
	1	7					8	
2			5	9		8		4
8	7		4		3		1	2
5		4		2	8			6
	9					1	5	
	4				9	6		8
		5	6	1				

నిన్నటి జవాబు

2	9	7	5	1	6	4	8	3
5	4	1	9	8	3	2	7	6
8	3	6	7	4	2	9	1	5
9	1	3	2	5	4	7	6	8
4	5	8	6	7	1	3	9	2
6	7	2	8	3	9	1	5	4
3	8	5	1	2	7	6	4	9
1	6	4	3	9	5	8	2	7
7	2	9	4	6	8	5	3	1

నిబంధనలు
ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.


రజనీకాంత్

నా వెనకాల ఉన్నది వాళ్లే!

ముగిసింది. రజనీకాంత్ ఆధ్యాత్మిక యాత్ర ముగిసింది. హిమాలయాలను సందర్శించి కూల్‌గా చెన్నై తిరిగొచ్చారు. అసలే ప్రశాంతంగా కనిపించే రజనీ మరింత ప్రశాంతంగా కనిపించారు. చుట్టుముట్టిన అభిమానులను చూసి, చిరునవ్వు నవ్వి మీడియాతో మాట్లాడారు. రాజకీయాలపరంగా మీ వెనకాల ఉన్నది బీజేపీయా? అని మీడియా అడిగితే– ''నా వెనకాల ఉన్నది దేవుడు, ప్రజలు'' అన్నారు. ప్రచారంలో ఉన్నట్లుగా తన పొలిటికల్ పార్టీ పేరుని, చిహ్నాన్ని ఏప్రిల్ 14న ప్రకటించడంలేదని కూడా స్పష్టం చేశారాయన. కాగా, రజనీ నటించిన 'కాలా' ఏప్రిల్ 27న విడుదల కానుంది. శంకర్ డైరెక్షన్‌లో చేసిన '2.0' విడుదల తేదీ ఇంకా ప్రకటించలేదు. ఈ రెండు చిత్రాలే కాకుండా ఈ ఏడాది రజనీ మరో చిత్రంలోనూ కనిపించే అవకాశం ఉంది. 'పిజ్జా' ఫేమ్ కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో ఆయన నటించనున్న చిత్రం షూటింగ్ త్వరలో ప్రారంభం కానుంది.

ఎవరు యస్ అంటారు?


రవితేజ
నాని

ఆ!.. ఇలా కూడా సినిమా తీస్తారా? 'అ!' సినిమాని చూసి చాలామంది ఇలానే ఆశ్చర్యపోయారు. కొత్త రకం సినిమా చూపించిన దర్శకుడు ప్రశాంత్ వర్మ నెక్స్ట్ ఎలాంటి సినిమా చూపించడానికి రెడీ అవుతున్నారు? అంటే.. ఈసారి కూడా న్యూ మూవీ ట్రై చేయనున్నారు. ప్రశాంత్ వర్మ 'అ!' కథను నమ్మి నిర్మాతగా మారిన హీరో నాని ఈసారి ఏకంగా అతని డైరెక్షన్‌లో సినిమా చేసే అవకాశం ఉందని టాక్. మరోవైపు రవితేజ హీరోగా ప్రశాంత్ వర్మ ఓ సినిమా చేస్తారనే వార్త కూడా వినిపిస్తోంది. మరి.. నానీయా? రవితేజనా? దర్శకుడిగా ప్రశాంత్ వర్మ వేయబోతున్న రెండో అడుగుకి ఏ హీరో 'యస్' అంటాడో చూడాలి. అయితే ఈ ఇద్దరిలో ఏ హీరోతో సినిమా చేసినా, ఆ హీరో ఇమేజ్‌కి తగ్గట్టుగా ఉంటూనే, కొత్తగా ఉండేలా ప్రశాంత్ వర్మ స్టోరీ లైన్ చేస్తున్నారట. అలాగే కమర్షియల్ ఎలిమెంట్స్ ఉండేలా చూసుకోవాలనుకుంటున్నారట. సో.. కొత్త రకం కమర్షియల్ మూవీని చూడబోతున్నామన్న మాట.

ఫటాఫట్.. ధనాధన్!

...ఇలానే ఉంది హీరోయిన్ సమంత స్పీడ్ చూస్తుంటే. జోరుగా సినిమాలు చేస్తున్నారు. ముఖ్యంగా ఈ మార్చి నెల ఆమెకు మర్చిపోలేనంత జ్ఞాపకంగా మిగిలింది. ఎందుకంటే.. ఈ నెలలోనే ఆమె మూడు సినిమాలకు టాటా చెప్పారు. అదేనండీ.. తన వంతు షూటింగ్‌ను కంప్లీట్ చేసుకున్నారని చెప్తున్నాం. ముందు రామ్‌చరణ్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందిన 'రంగస్థలం' సినిమాలో రామలక్ష్మిగా షూటింగ్‌ను కంప్లీట్ చేశారు సమంత. ఈ సినిమా ఈ నెల 30న రిలీజ్ కానుంది. శివ కార్తికేయన్ హీరోగా పొన్‌రామ్ దర్శకత్వంలో రూపొందుతున్న తమిళ సినిమా 'సీమరాజా' మూవీలో ఆమె తన వంతు షూటింగ్‌కు ప్యాకప్ చెప్పారు. వేసవిలో ఈ సినిమా రిలీజ్ కానుంది. తాజాగా 'మహానటి'లో మధురవాణి పాత్రను ముగించారు సమంత. ఇలా ఒకే నెలలో మూడు సినిమాలకు ముగింపు పలకడం అంటే చాలా రేర్‌గా జరుగుతుంది. ఈ ఏడాది ఈ మూడు సినిమాల ద్వారానే కాదు.. తమిళ సినిమా 'సూపర్ డీలక్స్', తెలుగు, తమిళ భాషల్లో రూపొందుతోన్న 'యు టర్న్', డబ్బింగ్ మూవీ 'అభిమన్యుడు' చిత్రాల ద్వారా కూడా తెరపై కనిపించనున్నారు. ఈ ఏడాది మొత్తం అరడజను సినిమాల్లో కనిపించి, ఫ్యాన్స్‌ని ఖుషీ చేయనున్నారామె. ఆ సంగతలా ఉంచితే పెళ్లయ్యాక నాగచైతన్య–సమంత జంటగా నటించనున్న సినిమా అనౌన్స్‌మెంట్ ఈ నెలలో వచ్చిన సంగతి తెలిసిందే. అది కూడా ఈ ఏడాదే విడుదలైతే..
గతేడాది ఏడడుగులు,
ఈ ఏడాది ఏడు సినిమాలు...
సమంత లైఫ్ సూపర్‌గా సాగుతోంది.


సమంత

కిరాక్ ఉందంటున్నారు

\- నిఖిల్


శరణ్ కొప్పిశెట్టి, సంయుక్తా హెగ్డే, బ్రహ్మాజీ, అనిల్ సుంకర, నిఖిల్, రాకేందు మౌళి

నిఖిల్, సిమ్రాన్, సంయుక్తా హెగ్డే ముఖ్య తారలుగా శరణ్ కొప్పిశెట్టి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'కిరాక్ పార్టీ'. ఏటీవీ సమర్పణలో ఏకే ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై రామబ్రహ్మం సుంకర నిర్మించారు. గత శుక్రవారం విడుదలైన 'కిరాక్ పార్టీ' నిఖిల్ కెరీర్‌లోనే అత్యధిక ఓపెనింగ్స్‌ను సాధించి, విజయవంతంగా ప్రదర్శించబడుతోందని చిత్రబృందం పేర్కొంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నిర్మాత అనిల్ సుంకర మాట్లాడుతూ –''కిరాక్ పార్టీ' చిత్రానికి అన్ని చోట్లా విశేష స్పందన లభిస్తోంది. స్టూడెంట్స్‌కి బాగా కనెక్టైంది. నిర్మాతగా మాకు మూడు రోజుల్లోనే బ్రేక్ ఈవెన్ ఇచ్చిన చిత్రమిది. ఓవర్సీస్‌లో అరమిలియన్ వసూళ్లను రాబట్టింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈరోజు నుంచి విజయ యాత్ర నిర్వహించనున్నాం'' అన్నారు. ''ప్రతి ఒక్కరు సినిమాను ఎంజాయ్ చేస్తున్నారు. కిరాక్ ఉందంటున్నారు. మౌత్‌టాక్‌తో రోజురోజుకు వసూళ్లు పెరుగుతున్నాయి. మూడు రోజులుగా హౌస్‌ఫుల్ కలెక్షన్స్‌తో సినిమా ఆడుతోంది. క్లైమాక్స్‌కి ముందు నా నటన బాగుందని అందరూ మెచ్చుకుంటున్నందుకు హ్యాపీగా ఉంది'' అన్నారు నిఖిల్. ''హ్యాపీడేస్ తర్వాత కాలేజీ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చిన మంచి సినిమా ఇది'' అన్నారు బ్రహ్మాజీ. ''ప్రతి విద్యార్థి తమ కథగానే భావించి సినిమాను పెద్ద హిట్ చేశారు'' అన్నారు శరణ్. ''తెలుగులో తొలి అడుగుతోనే మంచి విజయం దక్కడం ఆనందంగా ఉంది'' అన్నారు సంయుక్తా హెగ్డే. ఈ కార్యక్రమంలో హేమంత్, రాకేందు మౌళి తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ స్టూడెంట్‌గా

సాధారణంగా స్టూడెంట్ స్థాయి నుంచి టీచర్‌గా ఎదుగుతారు. కానీ కథానాయిక సాయిపల్లవి మాత్రం మలయాళ సినిమా 'ప్రేమమ్'లో టీచర్‌గా ఎంట్రీ ఇచ్చి కాలేజీ స్టూడెంట్‌గా అలరిస్తున్నారు. ఆల్రెడీ 'ఫిదా, ఎమ్‌సీఏ' సినిమాల్లో ఆమె కాలేజ్ స్టూడెంట్‌గా నటించిన విషయం గుర్తుండే ఉంటుంది. ఇప్పుడు మరోసారి ఆమె కాలేజీకి వెళ్లడానికి రెడీ అయ్యారని సమాచారం. శర్వానంద్ హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న ''పడి పడి లేచె మనసు''లో సాయి పల్లవి కథానాయికగా నటిస్తోన్న విషయం తెలిసిందే. రీసెంట్‌గా ఈ సినిమా షూటింగ్ కోల్‌కత్తాలో స్టార్టైంది. ఇందులో సాయి పల్లవి మెడికల్ స్టూడెంట్‌గా నటిస్తున్నారని సమాచారం. ఇక్కడ ఇంట్రెస్టింగ్ మేటర్ ఏంటంటే.. సాయిపల్లవి రియల్ లైఫ్‌లోనూ మెడిసిన్ స్టడీస్‌ను కంప్లీట్ చేశారు. అసలే ఈ మలయాళ బ్యూటీ మంచి నటి. రియల్ లైఫ్‌లో ఎలానూ మెడిసిన్ చేశారు కాబట్టి.. ఆ అనుభవంతో ఈ పాత్రను అలవోకగా చేసేస్తారని చెప్పొచ్చు.


సాయి పల్లవి

అయ్యో ఆలియా!

వారం రోజులు కూడా కంప్లీట్ కాలేదు. కథానాయిక ఆలియా భట్ బర్త్‌డేని హ్యాపీగా స్పెండ్ చేసి, ఈ నెల 15న 25వ వసంతంలోకి అడుగుపెట్టారామె. పాతికేళ్లలోకి ఎంటరైన సందర్భంగా ఫుల్‌గా పార్టీ చేసుకున్నారు. ఒక గుడ్ తర్వాత ఒక బ్యాడ్ అన్నట్లు.. వారం తిరగకుండానే ఆలియాకి చేదు అనుభవం ఎదురైంది. 'బ్రహ్మాస్త్ర' సినిమా షూటింగ్‌లో ఆలియా గాయపడ్డారు. ఈ విషయం తెలిసిన ఆలియా అభిమానులు.. 'అయ్యో ఆలియా. ఇలా జరగకుండా ఉండాల్సింది' అంటున్నారు. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో రణ్‌బీర్ కపూర్, అమితాబ్ బచ్చన్, ఆలియా భట్ ముఖ్య తారలుగా రూపొందుతున్న సినిమా 'బ్రహ్మాస్త్ర'. ప్రస్తుతం ఆ సినిమా షూటింగ్ బల్గేరియాలో జరుగుతోంది. ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను షూట్ చేస్తున్న సమయంలో కాస్త బ్యాలెన్స్ తప్పి ఆలియా భట్ గాయపడ్డారు. దీంతో ఆమె 15 రోజుల పాటు షూట్‌కు దూరంగా ఉండి విశ్రాంతి తీసుకుంటారని బాలీవుడ్ టాక్. ''ఆలియా కుడిచేతికి దెబ్బ కాస్త బలంగానే తగిలింది. ఈ మంత్ ఎండింగ్ కల్లా బల్గేరియా షెడ్యూల్‌ను కంప్లీట్ చేయాలని 'బ్రహ్మాస్త్ర' టీమ్ ప్లాన్ చేశారు. ఇంతలో ఇలా జరిగింది. ఇప్పుడు ఇతర సీన్స్‌పై చిత్రబృందం దృష్టి సారించింది'' అని యూనిట్ సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి.


ఆలియా భట్

పల్లెటూరి ప్రేమకథ

ప్రముఖ దర్శకులు రాజమౌళి వద్ద 'మగధీర' చిత్రానికి సహాయ దర్శకునిగా పనిచేసిన సాయికృష్ణ దర్శకత్వం వహించిన తొలి చిత్రం 'అనగనగా ఒక ఊళ్ళో'. అశోక్ కుమార్, ప్రియాంక శర్మ జంటగా చంద్ర బాలాజీ ఫిల్మ్స్ పతాకంపై కె.చంద్రరావు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 23న విడుదలవుతోంది. సాయికృష్ణ మాట్లాడుతూ –''రాజమౌళిగారి స్ఫూర్తితో దర్శకునిగా మారా. అశోక్ కుమార్ కొత్తవాడైనా అనుభవం ఉన్నవాడిలా తన పాత్రలో జీవించాడు. సినిమా విడుదల తర్వాత తెలుగు చిత్ర పరిశ్రమకు మరో యువ హీరో వచ్చాడని అంటారు. నాకు దర్శకునిగా అవకాశమిచ్చిన చంద్రరావుకు జీవితాంతం రుణపడి ఉంటా'' అన్నారు. ''ఫీల్ గుడ్ లవ్‌స్టోరీ ఇది. పల్లెటూరి నేపథ్యంలో ఉంటుంది. తెలుగు ప్రేక్షకులకు కావాల్సిన అన్ని అంశాలు ఉంటాయి'' అన్నారు అశోక్ కుమార్. ఈ చిత్రానికి కెమెరా: రాజశేఖర్ యస్, సంగీతం: యాజమాన్య, సహనిర్మాత: శ్రీతేజ్ మనోజ్ పాలిక.


ప్రియాంక, అశోక్

బీచ్‌లో బృందావనం


రిచా పణయ్, హర్షవర్ధన్ రాణే

రచయిత శ్రీధర్ సీపాన దర్శకునిగా పరిచయమవుతోన్న చిత్రం 'బృందావనమది అందరిది'. హర్షవర్ధన్ రాణే, రిచా పణయ్, ఎంపీ శివప్రసాద్, హీరా సాహిలి ముఖ్య తారలుగా శ్రీనివాస్ వంగల, ప్రభాకర్‌రెడ్డి కూతురు (యన్.ఆర్. ఐ) నిర్మిస్తున్న ఈ చిత్రం మొదటి షెడ్యూల్ పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా శ్రీధర్ సీపాన మాట్లాడుతూ –''వైజాగ్ బీచ్‌లో వేయించిన హీరోయిన్ ఇంటి సెట్‌తో పాటు, వైజాగ్ పరిసర ప్రాంతాల్లో తొలి షెడ్యూల్ పూర్తి చేశాం. ఔట్ పుట్ చాలా బాగా వచ్చింది. పని పరంగా నాకు పూర్తి సంతృప్తి అనిపించింది. తొలి చిత్రం అనే భయం నాకు కలగకుండా నటీనటులు, సాంకేతిక నిపుణులు సహకరిస్తున్నందుకు ప్రత్యేక కృతజ్ఞతలు. మా ఫస్ట్ షెడ్యూల్ మేకింగ్ అండ్ శాంపిల్ వీడియో టీజర్‌కి వచ్చిన రెస్పాన్స్ నాకు మరింత ధైర్యం ఇచ్చింది. ఏప్రిల్ 1 నుంచి బెంగళూర్‌లో ఓ షెడ్యూల్, ఆ తర్వాత హైదరాబాద్‌లో మరో షెడ్యూల్ జరుపుతాం'' అన్నారు. బెనర్జీ, పృథ్వీ, 'సత్యం' రాజేష్, 'తాగుబోతు' రమేష్, భద్రం, 'అదుర్స్' రఘు, రజిత తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: మణిశర్మ, కెమెరా: తమ్మ శ్యామ్.

సెల్ఫ్ చెక్

స్కూలు నుంచి వచ్చిన పిల్లలతో మీరెలా గడుపుతున్నారు?



ఇరుగుపొరుగు పిల్లలు సాయంత్రం స్కూల్ నుంచి ఇంటికొచ్చాక చలాకీగా ఆటల్లో మునిగిపోతారు, గెంతుతారు, గోలచేస్తూ ఆనందం పొందుతారు... ఇలా సంతోషించే వారిని, ఇంటి నుంచే కొంతమంది పిల్లలు చూస్తుంటారు. ఎందుకంటే వాళ్ల ఇంట్లో బాగా స్ట్రిక్ట్. పిల్లలను బయటకు రానివ్వరు... ఆటలాడనివ్వరు. వారిని కేవలం పుస్తకాలకే పరిమితం చేయాలనుకుంటారు. వీరి తల్లిదండ్రులు వారివారి వృత్తుల్లో బిజీగా ఉండటం వల్ల పిల్లల్ని గమనించే సమయం వారికి దొరకదు. దీంతో స్కూలు నుంచి ఇంటికొచ్చాక ఏమిచేయాలో తెలియక పిల్లలు అయోమయంలో పడతారు. పట్టించుకునే వారు లేక తల్లడిల్లుతారు... స్కూలు నుంచి ఇంటికొచ్చిన పిల్లలను మీరెలా గమనిస్తున్నారు? లీజర్ టైంలో వారితో ఎలా గడుపుతున్నారు?

1. పిల్లలను బయటకి తీసుకెళతారు. వారిలో నాలెడ్జ్ (మేధను పెంచే గేమ్స్, బుక్ రీడింగ్ మొదలైనవి) పెంచేందుకు వివిధరకాలుగా ప్రయత్నాలు చేస్తారు.
ఎ. అవును ☐ బి. కాదు ☐
2. ఉదాయాన్నే పిల్లలను నిద్రలేపి వారిలో యాక్టివ్‌నెస్ పెంచుతారు. ఎక్కువసేపు పడుకోనివ్వరు.
ఎ. అవును ☐ బి. కాదు ☐
3. పిల్లలతో పాటు పాఠశాలకు వెళ్ళటమన్నా, వారి యాక్టివిటీస్‌లో పాలుపంచుకోవట మన్నా ఉత్సాహం చూపుతారు.
ఎ. అవును ☐ బి. కాదు ☐
4. పిల్లలకు హోంవర్క్‌లో సహాయం చేస్తారు.
ఎ. అవును ☐ బి. కాదు ☐
5. పిల్లలకు కొత్తకొత్త క్రేయాన్స్, పెయింట్స్, పుస్తకాలు కొనిస్తుంటారు.
ఎ. అవును ☐ బి. కాదు ☐
6. పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లకు తప్పక హాజరవుతారు.
ఎ. అవును ☐ బి. కాదు ☐
7. స్కూలు నుంచి ఇంటికొచ్చిన పిల్లలకు రొటీన్ పనులను చెప్పి బోర్ కొట్టించరు.
ఎ. అవును ☐ బి. కాదు ☐
8. లంచ్‌లో పిల్లలకు ఇష్టమైన, బలమైన ఆహారాన్ని ఇచ్చేలా చూస్తారు.
ఎ. అవును ☐ బి. కాదు ☐
9. పిల్లలు ఎక్స్‌ట్రాకరికులర్ యాక్టివిటీస్‌లో పాల్గొనేలా చూస్తారు.
ఎ. అవును ☐ బి. కాదు ☐
10. పాఠశాల నుంచి ఇంటికొచ్చిన పిల్లలను ప్రేమతో దగ్గరకు తీసుకుంటారు. వారి సందేహాలు తీర్చుతారు.
ఎ. అవును ☐ బి. కాదు ☐

'ఎ' లు ఆరు దాటితే పిల్లలను పాఠశాలకే పరిమితం చేయాలని అనుకోరు. స్కూల్ అయిపోయాక కూడ వారి గురించి శ్రద్ధ తీసుకుంటారు. దీనివల్ల పిల్లలు త్వరగా మెచ్యూరిటీ సాధిస్తారు. 'బి' లు ఆరు దాటితే పాఠశాల అనంతరం లేదా పాఠశాల బయట పిల్లల గురించి మీరు సరిగా పట్టించుకోరు. పాఠశాలే పిల్లలకు అన్ని విషయాలు నేర్పిస్తుందని అపోహ పడుతుంటారు. స్కూల్లో పిల్లలు ఎన్నో విషయాలు నేర్చుకుంటారు. ఇంటిదగ్గర వారి గురించి శ్రద్ధ తీసుకోవలసిన బాధ్యత తల్లిదండ్రులది.

పరి పరిశోధన

ఆర్థరైటిస్‌కూ వ్యక్తిగత వైద్యం...

కీళ్లవాతం (రుమటాయిడ్ ఆర్థరైటిస్)కు మరింత మెరుగైన చికిత్స అందించేందుకు నార్త్ వెస్టర్న్ మెడిసిన్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు జన్యుక్రమం ఆసరా తీసుకున్నారు. వ్యక్తి జన్యుక్రమానికి అనుగుణంగా వారికి కీళ్లవాతం మందులు తయారుచేసి ఇవ్వడం దీని ప్రత్యేకత. ప్రస్తుతం ఇస్తున్న మందులు చాలామందిలో ఏ మాత్రం ప్రభావం



చూపవన్న సంగతి తెలిసిందే. కీళ్ల వాతానికి ప్రస్తుతం చాలా మందులు అందుబాటులో ఉన్నాయనీ.. అయితే ఒక్కో దాన్నీ 12 వారాల పాటు వాడిన తరువాతే అది పనిచేస్తుందా? లేదా? అన్నది తెలుస్తుందనీ.. ఒకవేళ పనిచేయకపోతే డాక్టర్లు వెంటనే మరో మందు పేరు రాస్తారనీ.. ఇది కూడా పనిచేస్తుందన్న గ్యారెంటీ ఏమీ ఉండదనీ పెర్ల్‌మ్యాన్ అనే శాస్త్రవేత్త తెలిపారు. ఈ నేపథ్యంలో తాము ఒక అధ్యయనం నిర్వహించామని, కొంతమంది బాధితుల జన్యుక్రమాలను విశ్లేషించామని చెప్పారు. సాధారణ మందులతో మంచి ఫలితాలు సాధించిన వారి జన్యువులతో పోల్చి అవే మందులు ఇచ్చినప్పుడు వీరిలోనూ మెరుగైన ఫలితాలు వచ్చాయని వివరించారు. ఈ అధ్యయనం ఆధారంగా జన్యుమార్పులకు అనుగుణంగా మెరుగైన ఫలితాలిచ్చే మందులను గుర్తించగలిగామని, త్వరలో కీళ్లవాతం ఉన్న వారందరికీ ఈ పద్ధతి అందుబాటులోకి వచ్చే అవకాశముందని చెప్పారు.

వాయుకాలుష్యం తగ్గితే 15.3 కోట్ల ప్రాణాలు నిలుస్తాయి...

వాతావరణంలో ఎప్పటికప్పుడు పెరిగిపోతున్న కార్బన్‌డయాక్సైడ్ కాలుష్యం తగ్గితే అనేక రకాల వ్యాధుల వ్యాప్తి తగ్గి ప్రాణాలు నిలుస్తాయని మన అందరికీ తెలుసు. అయితే భూతాపోన్నతికి కారణమవుతున్న ఈ వాయు కాలుష్యాన్ని ఎంతమేరకు తగ్గిస్తే ఎన్ని ప్రాణాలను కాపాడవచ్చు అన్న అంశాన్ని తొలిసారి డ్యూక్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు అధ్యయన పూర్వకంగా తెలుసుకున్నారు. వారి అంచనా ప్రకారం భూమి ఉష్ణోగ్రతలు ఈ శతాబ్దం అంతానికి 1.5 డిగ్రీల కంటే ఎక్కువ



పెరగకుండా చూసుకోగలిగితే దాదాపు 15.3 కోట్ల మంది అకాల మృత్యువు బారిన పడకుండా చూడవచ్చు. ప్రపంచంలోని 154 పెద్దపెద్ద నగరాల్లో గాలిలో కలుస్తున్న కార్బన్‌డయాక్సైడ్ మోతాదును వేగంగా తగ్గించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వీరు స్పష్టం చేస్తున్నారు. మనదేశ రాజధాని ఢిల్లీ, కోల్‌కతాల్లో మాత్రమే దాదాపు 44 లక్షల మంది ప్రాణాలను కాపాడవచ్చునని, ఆసియా, ఆఫ్రికాల్లోని ఇంకో 13 నగరాల్లో పది లక్షల మందిని కాపాడవచ్చునని ఈ అధ్యయనం చెబుతోంది. ప్రస్తుత కర్బన ఉద్గారాలు.. భవిష్యత్తు అంచనాల ఆధారంగా తాము కంప్యూటర్ సిమ్యులేషన్లు నడిపామని వీటివల్ల మానవులకు వచ్చే వ్యాధులు ఎంతమేరకు పెరుగుతాయి? తద్వారా ఎంతమంది అకాల మృత్యువు బారిన పడతారో? అంచనా కట్టామని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త షిండెల్ తెలిపారు.

సైన్స్ సంప్రదాయం



గుమ్మాలకు మామిడి తోరణాలెందుకు?

భారతీయ సంస్కృతి ఎంతో విశిష్టమైనది, మరెంతో శాస్త్రీయమైనది. మన సంస్కృతిలోని ఆచారాలన్నీ అద్భుతమైన ఆరోగ్య సూత్రాలతో ముడిపడి ఉండటం విశేషం. దానిలోని అంతస్సూత్రం తెలీనివారికి చాదస్తంగా అనిపించవచ్చు, కానీ అంతరార్థం తెలిస్తే, అంతా నిజమేనని అంగీకరించక తప్పదు..

ఇంటిగుమ్మాలకు కట్టే మామిడాకుల తోరణాలతో ముందుగా ప్రారంభిద్దాం. ప్రతిపండగకూ ఇంటి సింహద్వారానికి మామిడి ఆకులతో తోరణాలు కట్టడం మనకు తెలుసు కదా! పెళ్ళిళ్ళూ, వ్రతాలు జరిగేప్పుడు వాకిలిముందరి స్తంభాలకు అరటిచెట్లు, పూజామందిరానికి అరటిపిలకలు కడతారు. పూర్వం పల్లెల్లో తప్పని సరిగా కొబ్బరిమట్టలు స్తంభాలకు కట్టేవారు.

ఇది ఒక చాదస్తమా! లేక ఏదైనా ఉపయోగం ఉందా! చాలామంది ఒకచోట చేరినపుడు అంతా విడిచే బొగ్గు పులుసువాయువు (కార్బన్ డై ఆక్సైడ్ వల్ల గాలి కలుషితమై, ఊపిరాడక పోవడం, తలతిరగటం తలనొప్పి రావటం జరుగుతుంటాయి. అందుకే ముఖ్యంగా పసిపిల్లలు ఇలాంటి రద్దీగా ఉండే ప్రదేశాలలో దారుణమైన ఉక్కపోత, వేడిమికి గురై, ఊపిరి బిగదీసినట్లై గుక్కపట్టి ఏడుస్తుంటారు. దీన్నే ఆంగ్లంలో 'సఫకేషన్'అంటారు. ఈ మామిడి, అరటి, కొబ్బరి ఆకుల్లో చెట్టునుంచి కోశాక కూడా చాలాసేపటి వరకూ కార్బన్ డై యాక్సైడ్‌ను పీల్చుకుని, ఆక్సిజన్‌ను వదిలే గుణం ఉంటుంది. అందువల్ల ఊపిరాడకపోడం జరగదు. అంతేకాక ఈ ఆకులలోని ఆకుపచ్చరంగు కంటికి ఆహ్లాదాన్ని, మనస్సుకు ఉల్లాసాన్ని కలిగిస్తుంది. సహజరీతిలో అలంకారంతో పాటుగా, ఆరోగ్యాన్నీ కలిగిస్తాయి. చూశారా... ఈ మామిడాకులు, తోరణాలవల్ల ఎంత మేలు జరుగుతుందో! ఇంటి గుమ్మాలకు ముఖ్యంగా సింహద్వారాలకు పసుపు పూసి, కుంకుమబొట్లు పెట్టడం, ఇంటిలోకి లక్ష్మీ దేవిని స్వాగతించడం! పసుపు యాంటీబయాటిక్ సూక్ష్మజీవులను నాశనం చేస్తుంది. నోములూ వ్రతాల సమయంలో మహిళల పాదాలకు పసుపు రాసేవారు, మహిళలు ఎక్కువగా నీళ్ళలో పని ఉంటుంది, ఈ పసుపు రాసుకోడం వల్ల కాళ్లు, వేళ్లు పాయటం వంటివి జరగదు. . శరీరానికీ మహిళలు పసుపురాసుకుని స్నానంచేసేవారు. దీనివల్లా శరీరానికి రంగురావటమేకాక అనవసర కేశాలు రాలిపోతాయి.

ఇదేవిధంగా పెళ్లిళ్లలో కర్పూరపు దండలు అని ఇచ్చేవారు. వీటిలో కూడా బయటి గాలిలోని కాలుష్యాన్ని పీల్చుకుని, మనసుకు ఆహ్లాదాన్ని ఇచ్చే గుణం ఉంది. అందుకే వివాహాది శుభకార్యాలలో కర్పూరపు బంతులను ప్రతి ఒక్కరికీ ఇస్తుంటారు. వధూవరులకు మెడలో తప్పని సరిగా వీటిని ధరింపజేస్తుంటారు. వీటితోబాటు వెనకటి రోజుల్లో శుభకార్యాలు జరిగేటప్పుడు అందరికీ తలొక తాటాకు విసన కర్రా ఇచ్చేవారు. వీటినుంచి వీచే గాలి ఎంతో హాయిగా అనిపిస్తుంది. ఈ విసన కర్రలు తడిసినా కూడా మంచి వాసన వేస్తుంది. చల్లటి గాలి వంటికి తగులుతుంది.

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
బుధవారం
21-3-2018



నేను నా దైవం
రాజశ్రీ, నటి

మనసే మందిరం

సీనియర్ నటి రాజశ్రీ అనగానే ఎన్టీఆర్‌తో చేసిన 'గోపాలుడు భూపాలుడు', అక్కినేనితో చేసిన 'గోవుల గోపన్న', కాంతారావుతో చేసిన 'ప్రతిజ్ఞాపాలన', శోభన్‌బాబుతో చేసిన 'సత్తెకాలపు సత్తయ్య' వంటి ఎన్నో హిట్ సినిమాలు జ్ఞప్తికి వస్తాయి. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో 200లకు పైగా చిత్రాల్లో నటించారామె. జానపద, పౌరాణిక సినిమాల్లో భక్తికి సంబంధించిన అనేక సన్నివేశాల్లో, పాటల్లో నటించారు. చెన్నైలో ఉంటున్న రాజశ్రీ 'నేను- నా దైవం' గురించి...

- **మీకు ఆధ్యాత్మికత ఎలా పరిచయం అయ్యింది?**

నా పేరులోనే ఆధ్యాత్మికత ఉందండీ. నా అసలు పేరు 'కుసుమ కుమారి'. మా అమ్మకు బెంగాల్‌లో చాలా ప్రముఖంగా వాసికెక్కి తెలుగు నాట కూడా చాలామందికి ఆరాధ్యనీయమైన కుసుమ హరనాథ్ బాబా అంటే విశ్వాసం ఎక్కువ. 'ద్వేషానికి మించిన పాపం లేదు' అని బోధించిన బాబా ఆయన. ఆయన పట్ల ఆరాధనతో నాకు కుసుమ కుమారి అనే పేరు పెట్టింది. పేరు ప్రభావమో ఏమో నాకు ఏ ఆధ్యాత్మిక ధోరణి పట్ల ప్రేమే ఉంది తప్ప ద్వేషం లేదు. మా ఇంట్లో అందరు దేవుళ్లకు పూజలు చేసేవాళ్లం. వేంకటేశ్వరస్వామిని ఇలవేల్పుగా కొలిచేవాళ్లం. ఏడాదికి ఒకసారి తప్పని సరిగా తిరుమలకు వెళ్లి శ్రీవారికి కల్యాణం జరిపించేవాళ్లం. ఇక నా సినిమా ప్రయాణం అయితే శివాలయం నుంచే మొదలైంది.

- **అదెలా?**

మేము చెన్నైలోనే ఉండేవాళ్లం. మా ఊరి నుంచి బంధువులొస్తే ఏవీఎం స్టూడియోలో సినిమా షూటింగ్ చూడటం కోసం వెళ్లాను. అపుడు నా వయసు పదేళ్లు. దండాయుధపాణి అనే డ్యాన్స్ మాస్టర్, నటి జమున, ఏవీఎం చెట్టియార్ కూర్చుని పిల్లల చేత డ్యాన్స్ చేయిస్తూ సెలెక్షన్స్ చేస్తున్నారు. జమునగారు నన్ను గమనించి, ఈ పిల్ల బాగుంటుంది అని చూపారు. శివాలయం సెట్‌లో శివలింగం ముందు డ్యాన్స్ చేయడం నా తొలి పాత్ర. ఆ సినిమా పేరు 'నాగదేవతై'.

- **అంటే, దేవతామూర్తుల పాత్రలూ వేశారన్నమాట.**

తమిళం 'ఆదిపరాశక్తి'లో లక్ష్మీ, తెలుగు 'భక్తశబరి'లో సీతగా వేశాను. దైవ పాత్రలు వేసినప్పుడు మాంసాహారం తినను. మహిళగా కొన్ని దినాల్లో దైవ పాత్రల షూటింగ్‌కు వెళ్లేదాన్ని కాదు.

- **శివుని కంఠాభరణమైన పాములతోనే నృత్యం చేశారని మీ గురించి తెలిసినవారు చెబుతుంటారు, నిజమేనా ?**

నిజమే. 'స్వర్ణగౌరి' అనే సినిమాలో కృష్ణకుమారి, కాంతారావు హీరో హీరోయిన్లు. నేను నాగ కన్యగా వేషం వేశాను. నాగలోకం సెట్‌లో షూటింగ్. 18 ఏళ్ల వయసులో ఉన్న నేను షూటింగ్ విరామంలో నిద్రపోతుంటే లేపి మగత నిద్రలో ఉన్న నా రెండు చేతులకు పాములు అందించి డైలాగ్...డైలాగ్...అని డైరెక్టర్ కేకలు పెట్టారు. భయంతో డైలాగ్‌లు మర్చిపోయి నోటమాటరాలేదు. వదిలితే అవి జారిపోతాయి. అలా వాటితో యాక్ట్ చేశాను. అలాగే 'అదృష్ట దేవత' సినిమాలో నాగలోకం సెట్‌లో చాలా పాములు తీసుకువచ్చి నేను డ్యాన్స్ చేస్తుంటే పైకి విసిరారు. పౌర్ణమి రోజున పాములకు పళ్లు వస్తాయట. అవి నాపైకి పడగ విసిరేవి. అయినా భయం లేకుండా చేశాను.

- **భయం గురించిన ప్రస్తావన వచ్చింది. అసలు భయం లేని జీవితం గడపాలంటే దైవ సహాయం అవసరం అంటారా?**

తప్పక అవసరం. చాలామంది దైవ భక్తి అంటే 'మాకలాంటి నమ్మకాలు ఏవీ లేవండి' అని.. ఏవేవో కథలు చెబుతుంటారు. . కాని కష్టం వచ్చినప్పుడు, ఓ సవాలు ఎదురైనప్పుడు ప్రతి మనిషికీ ఒక నిస్సహాయ పరిస్థితి వస్తుంది. సాటి మనిషి ఆదరణ ఎంత లభించినా అంతకు మించిన శక్తి కావాల్సి వస్తుంది. ఆ శక్తిని దైవం అంటారో ప్రకృతి అంటారో ఎవరి ఇష్టం వారిది. కుటుంబాన్ని బట్టి ఆధ్యాత్మిక అలవాట్లు ఉంటాయి. పుట్టిపెరిగిన వాతావరణం ఎంతో ప్రభావం చూపుతుంది. నాకు తెలిసినంత వరకు నాస్తికుల్లోనూ అంతర్లీనంగా భక్తి ఉంటుంది. అయితే కొందరు దాన్ని శాస్త్ర, సాంకేతిక శక్తి అనుకుంటారు. ఆ సాంకేతిక శక్తిలో కూడా శక్తి ఉంది కదా.

- **ఆధ్యాత్మిక మార్గానికి మతం ఏ మేరకు సాయపడగలదు?**

ప్రతి మనిషి గమ్యం లౌకిక విషయాల నుంచి, ఇహ లోకపు మాయ నుంచి విముక్తం కావడం. దానికి మతం ఒక సోపానం. ప్రపంచంలో అనేక మతాలున్నాయి. అవన్నీ ఈ గమ్యానికి చేర్చే సోపానాలే. ఎవరు ఏ సోపానమైనా తీసుకోవచ్చు. నేను జన్మతః హిందువును కావచ్చు. కాని ఆధ్యాత్మిక సాక్షాత్కారం కోసం ఒక్క హిందూ మతం పైనే ఆధారపడాల్సిన అవసరం లేకపోవచ్చు. ఇస్లాం, క్రైస్తవంలో ఉన్న మంచి విషయాలను కూడా మనం గ్రహించవచ్చు. పాటించవచ్చు. నేను అలాగే పాటించాను కూడా.

- **ఇస్లాం, క్రిస్టియానిటీతో కూడా మీకు పరిచయం ఉన్నట్టుంది..**

నేను ఐదు భాషల్లో నటించాను. నేను వేసిన పాత్రలు, షూటింగ్‌లకు వెళ్లిన ప్రాంతాలు అనేకానేక సంస్కృతులను, మత భావాలను పరిచయం చేశాయి. అనేక మలయాళ సినిమాల్లో క్రైస్తవ, ముస్లిం పాత్రలు పోషించాను. క్రైస్తవులైన మలయాళ నిర్మాతలతో కలిసి ఆ సమయంలో కేరళలోని అనేక చర్చిలకు వెళ్లేదాన్ని. చాలా ప్రశాంతత కలిగేది. 'ప్రేమజీవులు' తెలుగు సినిమాలో నేను పోషించిన క్రైస్తవ పాత్ర నన్ను ఎంతో ప్రభావితం చేసింది. మా బాబును బీసెంట్ నగర్‌లోని సెయింట్ జాన్స్ స్కూల్లో చేర్చడం వల్ల అక్కడి సెయింట్ థామస్ చర్చి అలవడి ప్రార్థనలు చేసేదాన్ని. అలాగే ప్రసిద్ధ నాగూర్ దర్గాకు అనేక సార్లు డబ్బు ఎంట చేసేదాన్ని. నాగూర్ దర్గాలో నిద్రచేస్తే దోషాలు పోతాయని అంటారు. నేనూ నమ్ముతాను. చెన్నై మౌంట్‌రోడ్డులోని దర్గాకు, ట్రిప్లికేన్‌లోని బడా దర్గాకు వెళ్లేదాన్ని. పళని మురుగన్‌కు కూడా తరచు డబ్బులు పంపేదాన్ని.

- **భక్తురాలిగా మీ జీవితంలో దైవానికి సంబంధించి మరిచిపోలేని అనుభవం..?**

ఒకసారి షూటింగ్ నిమిత్తం నేను, కాంతారావు, రాజబాబు విమానంలో వెళుతున్నాం. అదే విమానంలో సత్యసాయిబాబా ఉన్నారు. ప్రార్థించడమేగానీ ఆయనను చూడటం అదే మొదటి సారి. ఆ అనుభూతి ఎంతో గొప్పగా అనిపించింది. ఆయన చెన్నైకు వచ్చినప్పుడు నేను దర్శనానికి వెళ్లి ఎంతో వెనుకాల నిలబడ్డాను. ముందు వరుసలో ఉంటే బాబాను బాగా దర్శించుకోవచ్చని అనుకున్నాను. నా మనసులో మాట విన్నట్లుగా అందరికీ విభూతి ఇస్తూ వెనుక వైపున్న నాకు కూడా ఇచ్చి బాబా వెళ్లిపోయారు.

- **ధ్యానం గురించి కూడా మీకు పరిచయం ఉందని తెలిసింది. దైవ ప్రార్థనలో ఎలాంటి నియమాలు పాటించాలంటారు?**

నిష్ఠ, నియమాలతో గంటలు గంటలు దేవుడి ముందు కూర్చోవడం కాదు. ఒక సెకండ్ అయినా ఏకాగ్రతతో దేవుణ్ణి ప్రార్థిస్తే చాలు. గుడికి వెళ్లడం అంటే.. అక్కడి స్థల మహాత్మ్యం కోసమే. మనసులోనే దైవాన్ని చూడగలగాలి.

- **నటిగా బిజీగా ఉండే సమయంలో మీలోని ఆధ్యాత్మిక హృదయాన్ని ఎలా సంతృప్తిపరిచేవారు.?**

షూటింగ్ సెట్‌లో విరామాల్లో రామకోటి లాగా ఓం నమో శ్రీ వేంకటేశాయ, తెలుగులో ఓం సాయిరాం అని రాసేదాన్ని. ఆ పుస్తకాలను తిరుమలకు వెళ్లినపుడు హుండీలో వేసేదాన్ని. సహనటులు ఏంది లెక్కలు రాస్తున్నావా అని అడిగేవారు.

- **దేవుడు ప్రత్యక్షమైతే ఏం వరం కోరుకుంటారు?**

అమ్మో..!! దేవుడు ప్రత్యక్షమైతే మాటలు వస్తాయా?!! మనకు ఏమి కావాలో దేవుడికి తెలియదా! దేవుడిని కోరుకోడానికి. దేవుడిని చూడటమే అదృష్టం. అంతకంటే ఇంకేమికావాలి. అన్నమైనా, సంపదైనా మనకు ఎంత ప్రాప్తం ఉంటే అంతే లభిస్తుంది. ఇంకా ఇంకా కావాలని ఆశించడం వల్ల ప్రయోజనం లేదు. సర్వేజనః సుఖినోభవంతు అని ప్రార్థిస్తాను.

- కొట్రా నందగోపాల్,
సాక్షి ప్రతినిధి, చెన్నై

రాజశ్రీ పశ్చిమగోదావరిలోని ఏలూరులో పుట్టి చెన్నై చిత్రసీమలో మెరిశారు. దక్షిణ భారత దేశ చిత్రపరిశ్రమలో 1956 నుంచి 1979 వరకు నటిగా రాణించారు. బాలనటిగా చిత్ర రంగ ప్రవేశం చేసిన రాజశ్రీ ఆ తర్వాత అగ్రకథానాయకులైన ఎన్టీఆర్, ఏఎన్నార్, కాంతారావు వంటి ప్రముఖ తారాగణంతో కలిసి పనిచేశారు. కాంతారావు-రాజశ్రీ నటించిన సినిమాలు బాక్సాఫీసు వద్ద అఖండ విజయం సాధించాయి. తెలుగులో 76 సినిమాలలో నటించిన రాజశ్రీ తమిళ, కన్నడ, మలయాళ, హిందీ సినిమాలలోనూ నటిగా గుర్తింపు పొందారు.



ఎన్టీఆర్‌తో...



ఏఎన్నార్‌తో...



కాంతారావుతో...

ఫ్యామిలీ డాక్టర్

న్యూరాలజీ కౌన్సెలింగ్

కండరాలు పట్టేస్తున్నాయి... కారణమేమిటి?

నా వయసు 36 ఏళ్లు. గత కొంతకాలంగా నాకు కాళ్లూ, చేతుల కండరాలు బిగుసుకుపోయినట్లుగా పట్టుకుపోతున్నాయి. తీవ్రమైన నొప్పి వస్తోంది. కొన్నిసార్లు కంప్యూటర్‌పై పని చేస్తున్నప్పుడు, మరికొన్నిసార్లు నిద్రలో ఇలా జరుగుతోంది. నిద్రలో ఇలా జరిగినప్పుడు అకస్మాత్తుగా నిద్ర లేచి కుంటుతూ నడుస్తుంటాను. నాకు ఈ సమస్య ఎందుకు వస్తోంది. దీని నుంచి బయట పడటానికి మార్గం చెప్పండి.

- సుధాకర్‌రావు, నల్లగొండ



తరచూ కాళ్లు, చేతుల కండరాలు బిగుసుకుపోయినట్లుగా పట్టేయడానికి (క్రాంప్స్‌కు), నొప్పికి చాలా కారణాలు ఉంటాయి. కొందరిలో తమ శరీరంలోని నీటి పాళ్లు తగ్గినా (సాధారణ డీహైడ్రేషన్ వల్ల) కూడా మీరు చెప్పిన లక్షణాలు వ్యక్తమవుతాయి. మీరు తీవ్రమైన అలసటకు గురైనప్పుడు ఇలాంటి లక్షణాలు కనిపించవచ్చు. మీరు వ్యాయామం చేయని కారణంగా కండరాలు బలహీనమైపోయి, తీవ్రమైన అలసట కలగడం అనేది చాలా అరుదైన సందర్భాల్లో జరిగే పరిణామం. దీనివల్ల కూడా మీరు చెప్పిన లక్షణాలు కనిపిస్తాయి. ఇలాంటి సమయాల్లో సాధారణంగా పిక్కలు పట్టేస్తాయి. ఇలాంటివారు క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ, మీ కండరాలను బలపరచుకోవాల్సి ఉంటుంది. ఇక కొందరిలో సోడియమ్, పొటాషియమ్, చక్కెరపాళ్లు, క్యాల్షియమ్, మెగ్నీషియమ్ వంటి ఖనిజ లవణాలు తగ్గడం గానీ లేదా పెరగడం గానీ జరిగినా ఇవే లక్షణాలు కనిపిస్తాయి. ఇక కొందరిలో కాలేయం, మూత్రపిండాలు సరిగా పనిచేయకపోతే కూడా ఇవే లక్షణాలు కనిపిస్తాయి. ఇక కొందరిలో విటమిన్ బి12, విటమిన్ డి తగ్గడం వల్ల, థైరాయిడ్, అడ్రినల్ గ్రంథులు సరిగా పనిచేయకపోవడం వల్ల కూడా ఇవే లక్షణాలు ప్రస్ఫుటమవుతాయి. కొందరిలో కొన్నిసార్లు సాధారణ ఆర్థరైటిస్ వచ్చినప్పుడు కూడా ఇవే లక్షణాలు కనిపించవచ్చు. అలాగే కొందరిలో పెరిఫెరల్ నర్వ్స్ అనే నరాలు, వెన్నెముక లోపాలతోనూ ఈ లక్షణాలు కనిపించవచ్చు. అందుకే ఇలాంటి లక్షణాలు కనిపించినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా న్యూరాలజిస్ట్‌ను కలిసి, విపులంగా రక్త పరీక్షలు చేయించుకొని, లక్షణాలకు అసలు కారణాన్ని కనుక్కోవాలి. సమస్య ఏమిటన్నది కనుగొంటే దాన్ని బట్టి చికిత్స ఉంటుంది.

కొన్నేళ్లుగా తీవ్రమైన తలనొప్పి... తరచూ ఎందుకిలా?

నా వయసు 32. గత 12 ఏళ్లుగా నాకు తరచూ తలనొప్పి వస్తోంది. ఒక్కోసారి అది నెలలో నాలుగైదుసార్లు కూడా వస్తోంది. దీని తీవ్రత ఎంతగా ఉంటుందంటే నేను నా రోజువారీ పనులేవీ చేసుకోలేకపోతున్నాను. ఇది తగ్గేదెలా?

- వసుంధర, మహబూబ్‌నగర్



తరచూ తలనొప్పి రావడం, దాంతోపాటు వాంతులు, వెలుగును చూడటంలో ఇబ్బంది పడటం, పెద్ద శబ్దాలను తట్టుకోలేకపోవడం, చీకటి గదిలో కాసేపు నిద్రపోయాక తలనొప్పి ఉపశమించడం లాంటి లక్షణాలు ఉంటే అది మైగ్రేన్ కావచ్చు. మీకు మైగ్రేన్ తలనొప్పిని ప్రేరేపించే అంశం ఏమిటో చూడండి. అంటే... సూర్యకాంతికి ఎక్స్‌పోజ్ కావడం, ఘాటైన వాసనలు, పర్‌ఫ్యూమ్స్ లేదా సుగంధద్రవ్యాల వాసన, సమయానికి భోజనం చేయకపోవడం, నిద్రలేమి, మీరు తీసుకునే ఆహారపదార్థాలలో నిర్దిష్టంగా ఏదైనా సరిపడక వెంటనే తలనొప్పి రావడం (ఉదాహరణకు చీజ్, ఆరెంజ్, అరటిపండ్లు, అజినమోటో వంటి చైనా ఉప్పు, చాక్లెట్లు వంటివి) జరుగుతుంటే వెంటనే ఆ పదార్థాన్ని తీసుకోవడం ఆపేయండి. దాంతో తలనొప్పిని నివారించవచ్చు. మీకు వచ్చే తలనొప్పిని నివారించే టోపిరమేట్, డైవల్‌ప్రోయేట్, ఫ్లునరిజిన్, ప్రొపనలాల్ వంటి మందులు ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. వాటిని తీసుకుంటే 70 శాతం వరకు మళ్లీ వచ్చే అవకాశం నివారితమవుతుంది. మీరు ఒకసారి న్యూరాలజిస్ట్‌ను సంప్రదించండి.

పక్షవాతానికి స్టెమ్‌సెల్ థెరపీ అందుబాటులో ఉందా?

నేను గత తొమ్మిదేళ్లుగా పక్షవాతంతో బాధపడుతున్నాను. ఇటీవల వార్తాపత్రికలు చదువుతూ పెరాలసిస్‌కు మూలకణ చికిత్స (స్టెమ్‌సెల్ థెరపీ) అందుబాటులోకి వచ్చినట్లు తెలుసుకున్నాను. నేను ఈ చికిత్స తీసుకోదలిచాను. ప్రస్తుతం ఇది ఎక్కడ లభ్యమవుతోంది, దీనికి ఎంత ఖర్చవుతుంది, దాని ఫలితాలెలా ఉన్నాయనే వివరాలు విపులంగా తెలియజేయండి.

- ఎల్. జీవన్‌రెడ్డి, కర్నూలు

ఒకసారి మెదడులోని కణాలు చనిపోతే అవి శాశ్వతంగా చనిపోయినట్టే. అది పక్షవాతం వల్ల చనిపోయినా లేదా మెదడుకు గాయం కావడం వల్ల చనిపోయినా మెదడులోని కణాలు ఎట్టి పరిస్థితుల్లోనూ మళ్లీ పునరుజ్జీవించలేవు. కానీ ఒక ఆశారేఖ ఉంది. మెదడు కణాలు చనిపోయిన సమయంలోనే ఆ కణాలలో నిక్షిప్తం అయి ఉన్నదాన్ని మనం తిరిగి పొందాలంటే దెబ్బతిన్న కణాలకు పక్కనే ఉండే కణాలు తోడ్పడతాయి. మన మెదడుకు ఉన్న ఈ అద్భుతమైన శక్తిని 'న్యూరోనల్ ప్లాస్టిసిటీ' అని వ్యవహరిస్తారు. ఇలా మనం 80 శాతం మేరకు కోలుకోడానికి ఆర్నెల్ల నుంచి ఏడాది వ్యవధి పడుతుంది.



ఇక మూలకణాల విషయానికి వద్దాం. మూలకణాలతో చికిత్స అంటే... ఇవి మన శరీరంలోని ఎలాంటి కణాలుగానైనా మారేశక్తి ఉన్న కణాలన్నమాట. పక్షవాతానికి మూలకణాలతో చికిత్స చేసే ప్రక్రియలో విషయంలో రెండు రకాల వ్యూహాలను అనుసరిస్తుంటాం. మొదటిది... మెదడులోనే చెడిపోయి ఉన్న కణాలను కొన్ని మందుల ద్వారా మళ్లీ ప్రేరేపించి పనిచేయించేలా చూడటం; ఇక రెండోది... బయటి నుంచి మూలకణాలను శరీరంలోకి పంపడం. అంటే ఉదాహరణకు చెడిపోయిన మూలగ స్థానంలో కొత్త కణాలు పంపి, కొత్త మూలగను రూపొందించేలా చేయడం అన్నమాట.

ఇక చనిపోయిన మెదడుకణాల స్థానంలో మూలకణాలను ప్రవేశపెట్టడం అనేది చాలా సుదీర్ఘమైన ప్రక్రియ. ఇందులో మూలకణాలు పాతకణాలతోనూ, న్యూరాన్ల దారులతో అనుసంధానితం అయి, అక్కడి రసాయన చర్యలకు అనుగుణంగా స్పందిస్తూ ఉండటానికి చాలా కాలం పడుతుంది. ఇందుకు కొన్నేళ్ల వ్యవధి కూడా పట్టవచ్చు. ఇవ్వాళ్టికీ ఈ విషయంలో పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయి. ఇప్పటికి వచ్చిన ఫలితాలైతే అంత సంతృప్తికరంగా లేవు. కాబట్టి ప్రస్తుతానికి మూలకణ చికిత్స అన్నది పరిశోధన దశలోనే ఉంది. పరిస్థితి ఇంకా ఆసుపత్రిలో చికిత్స అందించే వరకు రాలేదు.



డాక్టర్ బి. చంద్రశేఖర్ రెడ్డి,
చీఫ్ న్యూరాలజిస్ట్, సిటీ న్యూరో సెంటర్,
రోడ్ నెం. 12, బంజారాహిల్స్, హైదరాబాద్

డబ్బింగ్ క్లాసిక్స్-13

కర్ణుని గుండెల్లో బడబాగ్ని



ఏ జన్మలో అయినా శిశువుకు దొరికే ప్రథమ వరం ఏమిటంటే తల్లి ఒడి.

* * *

ఎలా ఉంటుంది ఆ ఒడి.

వెచ్చగా ఉంటుంది. నేనున్నానని దగ్గరగా ఉంటుంది. పక్కటెముకల చెంత పరుండబెట్టుకుని ధైర్యం ఇస్తుంది. గుండె లయను వినిపిస్తూ కలత పడవలసిన అవసరం లేదనే సంభాషణ చేస్తుంది. ఒడి– స్తన్యాన్ని దగ్గరగా ఉంచుంది. ఒడి– అమ్మను దగ్గరగా ఉంచుతుంది. ఒడి– నాకో అమ్ముంది అనే అతిశయాన్ని ఇస్తుంది.

అది ఉన్నవాళ్లకు దాని విలువ తెలుసో లేదో.

కాని లేని వాళ్లకు మాత్రం దాని విలువ కచ్చితంగా తెలుసు.

* * *

ఆ రోజు భోగి.

అక్కర్లేనివన్నీ అగ్నిలో ఆహుతి చేస్తున్నారు. విసిరి పారేస్తున్నారు. పాతవాటిల్ని నమిలేస్తున్న మంట ఆ ప్రభాతాన ఎర్రగా నాలుకలు సాచి ఉంది. ఆ తల్లికి నొప్పులు. నొప్పులంటే ఏమిటో తెలియని వయసు. పదమూడో పద్నాలుగో. నెలలు నిండిపోయాయి. ఇల్లు వద్దనుకుంది. ఊరు వద్దనుకుంది. కడుపులో ఉన్న శిశువును వద్దనుకుంటే మళ్లీ దగ్గరకు తీసుకుంటుందేమో.

ఆ శిశువు ఆ తల్లికి అడ్డం.

కాని శిశువు కదా. తన కడుపున పుట్టాడు కదా. ఎలా వదిలిపెట్టడం. తప్పదు. గూడ్స్ బండి ఏదో కదులుతుంటే పసుపుబట్టలో చుట్టి అందులో పడుకుకోబెట్టి మళ్లీ ఉండబట్టలేక దాని వెంట పరిగెట్టినా... కూ అని కూత పెడుతూ బిడ్డను మోసుకెళుతూ పసికందు రోదనను తనలో లీనం చేసుకుంటూ ఆ బండి వెళ్లిపోయింది.

శిశువు దూరమైంది.

కాని పాశం దూరం కాగలదా?

* * *

ఆ బిడ్డను ఎవరో చేరదీశారు. ఏ మురికివాడలోనో ఆ మురికి జన్మ ఊపిరి పీల్చుకోగలిగింది. పెరిగి పెద్దదై యువకుడిగా మారగలిగింది. ఆ యువకుడి గుండెల్లో ఎప్పుడూ ఒకటే ప్రశ్న. అమ్మ నన్నెందుకు పారేసింది? ఆ చేయి స్పర్శ కావాలనిపిస్తుంది. ఆ చేయి శిరస్సు మీద పెట్టి నిమిరితే అనుభవించాలని ఉంటుంది. ఆ తల్లి ఒడిలో తలను పరుండబెట్టి సేదతీరాలని ఉంటుంది. ఏం... ఆ తల్లిని పట్టుకుని గట్టిగా ఏడవాలని ఉండదూ?

సమాజంలో ఎప్పుడూ ఒక ప్రశ్న.

మీ అమ్మ పేరేమిటి?

తెలియదు.

నాన్న పేరు?

తెలియదు.

అనుభవించినవారికే తెలుస్తుంది నెత్తుటి గాటు. ఉబికి ఉబికి పొంగే అశ్రువు. ఆ యువకుడికి అప్పుడు ఒక స్నేహితుడు దొరుకుతాడు. నేనున్నానంటాడు. గాలికి గమ్యం లేకుండా ఎగురుతున్న జెండా ముక్క ఒక గుంజెకు తగులుకుంటే ఎలా ఉంటుంది? అది అక్కడ రెపరెపలాడే వీలు దక్కించుకుంటే ఎలా ఉంటుంది? ఆ యువకుడికి ఆ స్నేహితుణ్ణి చూస్తే అలాగే అనిపించింది.


మణిరత్నం

ఇప్పుడు ఈ ప్రాణానికి అర్థముంది. అది ఇవ్వడానికి ఒక స్నేహితుడు దొరికాడు.

అవును. ఈ జన్మ ఈ స్నేహితుని కోసమే.

* * *

అనాథ రజనీకాంత్, గ్యాంగ్‌స్టర్ మమ్ముట్టి ప్రాణానికి ప్రాణం అవుతారు. ఇద్దరూ పేదవాళ్లకు మిత్రులు. పేదల కష్టాలకు చట్టానికి ఆవల ఉన్న పరిష్కారాలను చేసి పెడుతుంటారు. ఆపదలో ఉన్నవాళ్లకు దేవుళ్లు. రజనీకాంత్ కులం ఏమిటి మతం ఏమిటి తల్లిదండ్రులు ఎవరు అనేది చూడకుండా మమ్ముట్టి అతణ్ణి గౌరవించాడు. తన దళపతిని చేసుకున్నాడు. తోడబుట్టినవాడనుకున్నాడు.


సంతోష్ శివన్

అందుకు రజనీకాంత్‌కు మమ్ముట్టి అంటే కృతజ్ఞత. ప్రేమ. అర్పణం. కాని రజనీకాంత్ ప్రేమించిన అమ్మాయి రజనీకాంత్‌కు దక్కలేదు. తల్లిదండ్రీ లేనివాడికి పిల్లనివ్వను అని చెబుతాడు అమ్మాయి తండ్రి. భారతంలో కర్ణుని ఆత్మగౌరవానికి వీర పరీక్షలు ఎదురయ్యాయే తప్ప ఇలా సాంఘిక పరీక్షలు ఎదురు కాలేదు. పోలీసులు కేసులు పెట్టినప్పుడల్లా 'నీ తల్లి పేరేమిటి... తండ్రి పేరేమిటి?' అని అవమానిస్తూనే ఉంటారు. ఈ అన్ని సందర్భాల్లోనూ రజనీకాంత్‌కు దొరికే ఒక ఒక ఓదార్పు మమ్ముట్టి స్నేహమే. అందుకే ఊరిలోని పెద్దమనిషి వాణ్ణి వదిలేసి నా పక్షంలో చేరిపో అనంటే వెళ్లడు. ఉండిపోతాడు. ఆ పెద్దమనిషి ప్రమాదకారి. ఇది ప్రమాదం.


ఇళయరాజా

* * *

కురుక్షేత్రం కేవలం భౌతిక సవాళ్లనే విసరలేదు. మానసికమైన మల్లయుద్ధాన్ని కూడా ఆహ్వానించింది. మమ్ముట్టి, రజనీకాంత్‌లను నిరోధించడానికి వచ్చిన కలెక్టర్ అరవింద్ స్వామి వాళ్లను నిరోధించ ప్రయత్నించి వాళ్లిద్దరికీ విరోధి అవుతాడు. అతణ్ణి చంపేయాలి. కాని అతడు రజనీకాంత్‌కు తమ్ముడు. ఏ తల్లయితే తనను విసిరేసిందో ఆ తల్లి కడుపున పుట్టినవాడు. ఆ తల్లి ఈ సంగతి తెలుసుకుని తన పెద్దకొడుకు దగ్గరకు భిక్షకు వస్తుంది– కొడుకు ప్రాణాలు ఇమ్మని. తల్లినీ తమ్ముణ్ణి స్వీకరిస్తే స్నేహితుడికి ప్రమాదం. స్నేహితుడు కావాలనుకుంటే తమ్ముడి ప్రాణాలకు ప్రమాదం.

అయినా సరే స్నేహితుడే ముఖ్యం అనుకుంటాడు రజనీకాంత్.

రక్తబంధాలు అనాథ వదిలేసినప్పుడు స్నేహమే ఐశ్వర్యం ఇచ్చింది. ఆ సంగతి మర్చిపోడు రజనీకాంత్. స్నేహానికి అర్థం అదే కదా.

* * *

కురుక్షేత్రం వస్తుంది.

ఊళ్లోని పెద్దమనిషి స్నేహితులిద్దరి మీదా దాడి చేయిస్తాడు.

వాస్తవానికి కర్ణుడు చనిపోతే సుయోధనుడు బదులు తీర్చుకోవాలి.

కాని మమ్ముట్టి చనిపోతే రజనీకాంత్ బదులు తీర్చుకుంటాడు. కొన్ని బంధాలు వీడ్కోలు తీసుకున్నప్పుడు కొత్త బంధాలు గుండెలకు హత్తుకుంటాయి. రజనీకాంత్ జీవితంలో ఇప్పుడు స్నేహితుడు లేకపోవచ్చు. తల్లి ఉంది. పుట్టిన కొద్ది గంటల్లోపే దూరమైన ఆ శిశువు సుదీర్ఘమైన పరితాపం, వేదన తర్వాత తల్లి ఒడికి చేరి పొందిన ప్రశాంతతో కథ ముగుస్తుంది.

* * *

లక్షలు, కోట్లు, మిద్దెలు, మేడల వేటలో మనిషి మర్చిపోతున్న వరం కూడా అదే– తల్లి ఒడి.

\- కె

భారతం కథ

మణిరత్నం దర్శకత్వంలో 1991లో వచ్చిన 'దళపతి' ఆ కాలంలో విడుదలకు ముందు అతి పెద్ద సంచలనంగా మారింది. రజనీకాంత్, మణిరత్నం కాంబినేషన్‌లో వస్తున్న మొదటి సినిమా కావడం, మమ్ముట్టి కూడా ఉండటం వల్ల మల్టీస్టారర్ కావడం, ఇళయరాజా చేసిన పాటలు విడుదలకు ముందే పెద్ద హిట్ కావడం ఇవన్నీ సినిమా మీద ఎక్స్‌పెక్టేషన్స్ పెంచాయి. 'దళపతి' టైటిల్ కూడా పెద్ద హంగామాను ఎక్స్‌పెక్ట్ చేసేలా చేసింది. కాని చివరకు ఇది 'భారతం కథ' అని తెలియడం కొంత ప్రేక్షకులను నిరాశ పరిచింది. నేరుగా విలన్ కథలో లేకపోవడం, హీరోయిజంను పెంచే కథనం లేకపోవడం కొంత లోటు. కాని భావోద్వేగాల కురుక్షేత్రాన్ని మాత్రం ఈ కథ బలంగా పట్టుకోగలిగింది. తల్లి కాదనుకున్న బిడ్డడి అంతర్మథనం రజనీకాంత్‌లో, తల్లిని పారేసిన తల్లి వేదన శ్రీవిద్యలో చాలా శక్తిమంతంగా దర్శకుడు చూపిస్తాడు. సంతోష్ శివన్ సినిమాటోగ్రఫీ, తోట తరణి సెట్స్ పెద్ద పేరు తెచ్చాయి. 'ఆడజన్మకు ఎన్ని సోకాలో', 'చిలకమ్మ చిటికేయంగా', 'యమునా తటిలో'... ఇవన్నీ పెద్ద హిట్స్. బాలు, ఏసుదాస్ కలిసి పాడిన 'సింగారాల పైరుల్లోన' ఇప్పటికీ ఆ గాయకుల మేలిమి కలయికకు ఒక నజరానాగా నిలిచింది. రజనీకాంత్‌ను అప్పటి సినిమాల ధోరణికి భిన్నంగా సహజంగా అందమైన హెయిర్ స్టయిల్‌తో ఈ సినిమా చూపించింది. మణిరత్నం, ఇళయరాజా కలిసి పని చేసిన చివరి సినిమాగా, అరవింద్ స్వామి తొలి సినిమాగా ఇది గుర్తుండిపోతుంది.

సాక్షి ఫ్యామిలీ సినిమా
విజయవాడ
బుధవారం
21-3-2018

శ్రీమతి శ్రియ

శ్రీమతిగా శ్రియ కొత్త జీవితాన్ని ప్రారంభించారు. కొన్ని రోజుల క్రితం రష్యన్ బాయ్‌ఫ్రెండ్ ఆండ్రీ కోశ్చీవ్‌ను ఉదయపూర్‌లో ఆమె వివాహం చేసుకోనున్నారన్న వార్తలు వచ్చాయి. ఈ వార్తలే నిజమయ్యాయి. సోమవారం ఉదయపూర్‌లో ఆండ్రీ, శ్రియ మూడుముళ్ల బంధంతో ఏడడుగులు వేసి ఒక్కటైపోయారు. అయితే ఈ వేడుకకు కేవలం సన్నిహితులు, బంధుమిత్రులు మాత్రమే హాజరయ్యారు. ఈ వివాహానికి సంబంధించిన ఫొటోలు కొన్ని వైరల్ అయ్యాయి.


శ్రియ, ఆండ్రీ

అంతేకాదు శ్రియ వెడ్డింగ్ వీడియో ఒకటి ఆన్‌లైన్లో చక్కర్లు కొడుతోంది. ''ఎవరైతే నిన్ను నిన్నుగా ప్రేమిస్తారో, వారి ప్రేమ నీలో కొంత మంచి మార్పును కోరుకుంటుంది. ఈ మార్పు ప్రేమ కాకపోవచ్చు. రాజీపడటం. శ్రియ ప్రేమ ప్రతిరోజూ నన్ను కొత్తగా, బెటర్‌గా ఉంచుతుందన్న నమ్మకం ఉంది'' అని ఆండ్రీ కోశ్చీవ్ అన్నట్లుగా ఈ వీడియోలో ఉంది. భర్త మాట్లాడుతున్న సమయంలో శ్రియ ప్రేమగా అతన్ని ముద్దాడటం హైలైట్. ఇదిలా ఉంటే ఈ జంట ఈ నెల 12న ముంబైలో తమ వివాహాన్ని రిజిస్టర్ చేసుకున్నారని టాక్. ఆ ముందు రోజు పార్టీని కూడా బాగానే సెలబ్రేట్ చేసుకున్నారట. ఇక.. ఆండ్రీ విషయానికొస్తే... అతను నేషనల్ లెవల్ టెన్నిస్ ప్లేయర్. అంతేకాదు మాస్కోలో ఉన్న కొన్ని రెస్టారెంట్స్‌కు యజమాని. ప్రస్తుతం శ్రియ చేస్తున్న సినిమాల విషయానికొస్తే.. తెలుగులో 'వీరభోగ వసంత రాయలు'లో నటిస్తున్నారు. తమిళ, తెలుగు భాషల్లో రూపొందిన 'నరగాసురన్' (తెలుగులో నరకాసురుడు) రిలీజ్‌కు రెడీ అవుతోంది.

'సింగం-3' తర్వాత సినిమాలు చేయకూడదనుకున్నా

\- మల్కాపురం శివకుమార్


జీవిత, మల్కాపురం శివకుమార్, రసమయి బాలకిషన్, ఎన్. శంకర్, కల్యాణ్

''గతంలో 'గులేబకావళి' టైటిల్‌తో విడుదలైన సినిమా మంచి విజయం సాధించింది. ఇప్పుడు అదే టైటిల్‌తో వస్తున్న ఈ సినిమా తప్పకుండా సక్సెస్ సాధిస్తుంది. ట్రైలర్, పాటలు చూస్తుంటే సినిమా ఎప్పుడెప్పుడు చూద్దామా అనే ఆసక్తి కలుగుతోంది'' అని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. ప్రభుదేవా, హన్సిక జంటగా రేవతి ప్రధాన పాత్రలో కల్యాణ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'గులేబకావళి'. తమిళంలో సంక్రాంతికి విడుదలై హిట్ అయిన ఈ చిత్రాన్ని అదే పేరుతో మల్కాపురం శివకుమార్ తెలుగులో ఏప్రిల్ 6న విడుదల చేస్తున్నారు. వివేక్ మెర్విన్ స్వరపరచిన ఈ సినిమా బిగ్ సీడీని రసమయి బాలకిషన్ విడుదల చేశారు. ఆడియో సీడీలను దర్శకుడు ఎన్.శంకర్ విడుదల చేయగా, నటి జీవిత తొలి సీడీ అందుకున్నారు. ఈ సందర్భంగా మల్కాపురం శివకుమార్ మాట్లాడుతూ– ''సింగం 3' తర్వాత సినిమాలు చేయడం ఆపేద్దామనుకున్నా. ఇండస్ట్రీలో సక్సెస్ అయితే తర్వాతి సినిమా ఏంటని అడుగుతారు. ఫ్లాప్ అయితే ఎవరూ కనిపించరు. కానీ, పది మందికి ఆదరణ చూపే ఇండస్ట్రీ ఇది. ఎంతోమంది చిత్ర పరిశ్రమపై ఆధారపడి బతుకుతున్నారు. తమిళం రాకున్నా 'గులేబకావళి' సినిమా చూసి సాధారణ ప్రేక్షకునిగా ఎంజాయ్ చేశా. తెలుగు ప్రేక్షకులకు నచ్చుతుందనిపించి విడుదల చేస్తున్నా'' అన్నారు. ''దర్శకుడిగా నా తొలి చిత్రమిది. తమిళ ప్రేక్షకులను అలరించినట్టు తెలుగు ప్రేక్షకులను కూడా ఆకట్టుకునే చిత్రమవుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు కల్యాణ్.

మల్లెపువ్వంత స్వచ్ఛంగా..


కౌసర్, ప్రియ

మమత, నరేంద్ర, షఫీ, ప్రియ ముఖ్య తారలుగా గౌతమ్. ఎమ్ రూపొందిస్తున్న మెసేజ్ ఓరియంటెడ్ చిత్రం 'సిరిమల్లె పువ్వా'. ఎస్.ఎమ్ క్రియేషన్స్ పతాకంపై కౌసర్ జహాన్ నిర్మిస్తున్నారు. తెలంగాణ ఫైనాన్స్ మినిస్టర్ ఈటెల రాజేందర్ చేతుల మీదగా ఈ చిత్రం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. దర్శకుడు గౌతమ్ మాట్లాడుతూ– ''ఇదొక మెసేజ్ ఉన్న వెరైటీ చిత్రం. ప్రతి ఒక్కరినీ ఆకట్టుకునేలా ఉంటుంది. టైటిల్‌కు తగ్గట్టుగానే సిరిమల్లె పువ్వంత స్వచ్ఛంగా ఉంటుంది'' అన్నారు. ''గౌతమ్‌గారు చెప్పిన కథ ఎంతో నచ్చింది. మెసేజ్‌తో పాటు కమర్షియల్ ఎలిమెంట్స్ కూడా ఉంటాయి'' అన్నారు కౌసర్ జహాన్. తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ అధ్యక్షులు డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహనరావు, సుధాకర్ గోగికర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సినిమాకు కెమెరా: సూర్య, ప్రభాకర్, ఫిరోజ్, సంగీతం: రామ్ మోహన్.

టెంపర్ చూపించనున్న సారా


సారా అలీఖాన్

రూమర్లకు చెక్ పడింది. ఇప్పటికైనా ఓ క్లారిటీ వచ్చింది. ఏ విషయంలో? అనేగా మీ డౌట్. కథానాయిక విషయంలో అన్నమాట. ఎన్టీఆర్–పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో వచ్చిన 'టెంపర్' ఎంత హిట్ అయిందో తెలిసిందే. ఈ చిత్రాన్ని రణ్‌వీర్ సింగ్ హీరోగా బాలీవుడ్‌లో 'సింబా' పేరుతో రీమేక్ చేస్తున్నారు. రోహిత్ శెట్టి దర్శకత్వంలో కరణ్ జోహార్ నిర్మిస్తున్న ఈ సినిమాలో కథానాయిక ఎవరనే విషయంపై చాన్నాళ్లుగా పలు రూమర్లు వినిపిస్తున్నాయి. హీరోయిన్ ఎవరన్నది చిత్ర బృందం అధికారికంగా ప్రకటించడంతో రూమర్లకు ఫుల్‌స్టాప్ పడింది. బాలీవుడ్ స్టార్ హీరో సైఫ్ అలీఖాన్ కూతురు సారా అలీఖాన్ 'సింబా' చిత్రంలో రణ్‌వీర్‌సింగ్‌తో జోడీ కడుతున్నారు. అలనాటి అందాల తార శ్రీదేవి తనయ జాన్వీ 'సింబా' చిత్రంలో నటించనున్నారనే వార్తలు చాలా రోజులు బాలీవుడ్‌లో హల్‌చల్ చేశాయి. తాజాగా 'ఒరు అదార్ లవ్' ఫేమ్ ప్రియాప్రకాశ్ పేరు తెరపైకి వచ్చింది. తమ చిత్రంలో కథానాయికగా సారా అలీఖాన్ నటించనున్నారంటూ కరణ్ జోహార్, రోహిత్ శెట్టి ప్రకటించి, సారాతో కలిసి ఉన్న ఫొటోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ ఏడాది డిసెంబరు 28న ఈ చిత్రం విడుదల కానుంది. ప్రస్తుతం అభిషేక్ కపూర్ దర్శకత్వంలో రూపొందుతోన్న 'కేదార్‌నాథ్' చిత్రంలో నటిస్తున్నారు సారా.

నవ్వుల థ్రిల్లర్


మారుతి, అశ్వినీ

మారుతి, శ్రావణి, అశ్వినీ, ప్రియ ముఖ్య పాత్రల్లో రూపొందిన చిత్రం 'యమ్ 6'. జైరామ్ వర్మ దర్శకత్వంలో విశ్వనాథ్ ఫిలిం ఫ్యాక్టరీ, శ్రీలక్ష్మి వెంకటాద్రి క్రియేషన్స్ పతాకంపై విశ్వనాథ్ తన్నీరు, సురేష్. ఎస్ నిర్మించిన ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. ఈ సందర్భంగా జైరామ్ వర్మ మాట్లాడుతూ– ''సస్పెన్స్ థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కిన చిత్రమిది. కడుపుబ్బా నవ్వించే సన్నివేశాలూ ఉంటాయి. అంతర్లీనంగా చిన్న సందేశమిచ్చే ప్రయత్నం చేశాం. సంగీతం, సినిమాటోగ్రఫీ బాగా కుదిరాయి. ఇటీవల షూటింగ్ పూర్తయింది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి'' అన్నారు. ''దర్శకుడు చెప్పిన కథ నచ్చి ఈ సినిమా నిర్మించా. మా హీరో మారుతికి ఇది తొలి సినిమా అయినా అనుభవం ఉన్న హీరోలా నటించాడు'' అన్నారు విశ్వనాథ్ తన్నీరు. ''నేను నటనలో శిక్షణ తీసుకోలేదు. దర్శకుడు చెప్పినట్లు చేశా'' అన్నారు మారుతి. గోవింద, హరిత, వంశీ, ఇంద్ర తేజ తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: విజయ్ బాలాజి, కెమెరా: మహ్మద్ రియాజ్, సమర్పణ: పార్వతి.

యువత కోసం


బిష్ణు

బిష్ణు, హిమాంశి కురానా, అపర్ణ శర్మ ముఖ్య తారలుగా రూపొందిన చిత్రం 'ఏక్'. 'బీయింగ్ హ్యూమన్' అనేది ఉపశీర్షిక. రుద్రారపు సంపత్ డైరెక్షన్‌లో కె.వరల్డ్ మూవీస్ బ్యానర్‌పై హరికృష్ణ నిర్మించిన ఈ చిత్రం సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ– ''మానవీయ విలువలతో, మంచి కథాంశంతో తెరకెక్కిన చిత్రమిది. యూత్‌ని టార్గెట్ చేసుకుని తీసిన చిత్రమిది. 'మంత్ర' ఆనంద్ స్వరపరచిన మా చిత్రం పాటలను హీరో నాగార్జునగారు విడుదల చేయగా చాలా మంచి స్పందన వచ్చింది. హిందీ డబ్బింగ్ రైట్స్ కోసం ఫ్యాన్సీ ఆఫర్స్ వచ్చాయి. ఏప్రిల్‌లో చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నాం'' అన్నారు. సుమన్, బెనర్జీ, పృథ్వీ తదితరులు నటించిన ఈ చిత్రానికి కెమెరా: చక్రవర్తి ఘనపాటి, స్టోరీ– స్క్రీన్‌ప్లే– డైలాగ్స్– నిర్మాత: హరికృష్ణ కొక్కొండ.

స్టీఫెన్ హాకింగ్ పేరుతో పోస్టల్ కవర్ విడుదల

విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ



స్టీఫెన్ హాకింగ్ పోస్టల్ కవర్‌ను విడుదల చేస్తున్న ఇస్రో వైస్ చైర్మన్ రమణ, బాలసుబ్రమణ్యం తదితరులు

విజయవాడ: ఇటీవల కన్నుమూసిన ప్రముఖ శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ పేరుతో పోస్టల్ శాఖ ప్రత్యేక కవర్‌ను విజయవాడలో విడుదల చేసింది. నగరంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఇస్రో వైస్‌చైర్మన్ డాక్టర్ కేవీ రమణ ఈ కవర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా రమణ.. స్టీఫెన్ చేసిన సేవలను కొనియాడారు. అంతకుముందు, తపాలా శాఖ ఆంధ్రప్రదేశ్ సర్కిల్.. దీన్‌దయాళ్ స్పర్శ యోజన కింద స్కాలర్‌షిప్పులను విద్యార్థులకు అందజేశారు. స్టాంపుల సేకరణను ప్రోత్సహించే క్రమంలో పోస్టల్ శాఖ పాఠశాల విద్యార్థులకు పరీక్ష నిర్వహించింది. ఇందులో ఎంపికైన మొత్తం 40మంది విజేతలకు ఒక్కొక్కరికి రూ.6వేలు చొప్పున ఈ ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏపీ చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ కె.బాలసుబ్రమణ్యం మాట్లాడారు. కార్యక్రమాన్ని కేంద్ర సమాచార శాఖా మంత్రి మనోజ్ సింహ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. కార్యక్రమంలో ఫిలాటలిస్టు ఎంవీఎస్ ప్రసాద్‌ను సత్కరించారు. పోస్టుమాస్టర్ జనరల్ రాధికా చక్రవర్తి, పోస్టల్ సర్వీసెస్ డైరెక్టర్ ఇ. వీరభద్రరావు తదితరులు హాజరయ్యారు.

విషవాయువులు పీల్చి ముగ్గురు మృతి!

అనారోగ్యంతో మృతి చెందారంటున్న కంపెనీ యాజమాన్యం

అనకాపల్లి: విశాఖ జిల్లా అనకాపల్లి మండలం సంపతిపురంలో ఉన్న ఒక రసాయన కంపెనీలో పనిచేస్తున్న ముగ్గురు అస్వస్థతకు గురై మృతి చెందారు! బుచ్చయ్యపేట మండలం చిట్టియ్యపాలేనికి చెందిన 30 మంది పది రోజుల క్రితం రసాయన కంపెనీలో పనిచేసేందుకు వచ్చారు. 8 ఏళ్ల క్రితం ప్రారంభించిన ఈ కంపెనీ హుదుహుద్ తుపానుకు ధ్వంసం కావడంతో మూతపడింది. పునఃప్రారంభించేందుకు కంపెనీ యాజమాన్యం సన్నాహాలు చేస్తున్న క్రమంలో కంపెనీ లోపల ఉన్న డై కార్బన్ ఫాస్పైడ్ వంటి రసాయన వ్యర్థాలను కార్మికులు తొలగించే పనులు చేపట్టారు. ఉగాదికి ముందు ఈ పనులను విరమించి కార్మికులు వెళ్లిపోగా వారిలో ముగ్గురు ఇంటికి వెళ్లిన తర్వాత అస్వస్థతకు గురయ్యారు. ఈ నెల 17న నానిపల్లి గంగరాజు చనిపోగా, మంగళవారం లక్కరాజు అప్పారావు, నానిపల్లి సత్యారావు చికిత్స పొందుతూ విశాఖలో మృతి చెందారు. కంపెనీలో విషవాయువులు పీల్చడం వల్లే కార్మికులు మృతి చెందారని చిట్టియ్యపాలెం గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కాగా, కంపెనీలో పనులు పూర్తి చేసుకొని వెళ్లిపోయిన తర్వాత అనారోగ్యంతో వారు మృతి చెందితే తమకేమీ సంబంధమని యాజమాన్యం వాదిస్తోంది. మృతుల కుటుంబీకులకు న్యాయం చేయాలని కోరుతూ గ్రామస్తులు అంత్యక్రియలు జరపకుండా మృతదేహాలను అనకాపల్లి ఆస్పత్రికి తీసుకొచ్చారు. పోస్టుమార్టం నిర్వహించాక కంపెనీ ముందు ధర్నా చేయాలని గ్రామస్తులు భావించగా రాజీ చేసేందుకు కొందరు ప్రజాప్రతినిధులు రంగంలోకి దిగారు. అయితే ముగ్గురు కార్మికుల మృతిని బయటకు పొక్కనీయకుండా అధికార యంత్రాంగం గోప్యంగా ఉంచడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఈబీసీల కోసం ప్రత్యేక కార్పొరేషన్

సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడి

సాక్షి, అమరావతి: ఉన్నత వర్గాల్లోని పేదలను(ఈబీసీ) ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయనున్నట్లు బీసీ సంక్షేమ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో మంగళవారం సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. ఈబీసీ కార్పొరేషన్ ఏర్పాటుపై సీఎం చంద్రబాబు సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. అలాగే ఆర్యవైశ్యుల కోసం కూడా కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామన్నారు. మైకులు దొరికాయని ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం సరికాదని.. సత్తా ఉంటే విభజన హామీలు అమలు చేసేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజుపై మంత్రి అచ్చెన్నాయుడు ధ్వజమెత్తారు. శాసన మండలి ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ.. దేశంలోని ఇతర ప్రాంతాలను, రాజధాని అమరావతితో కలుపుతూ నూతన రైల్వే లైన్ల మంజూరుకు కేంద్ర ప్రభుత్వానికి ఏమైనా ప్రతిపాదనలు పంపించారా అని ప్రశ్నించారు. దీనిపై అచ్చెన్నాయుడు స్పందిస్తూ.. వీటికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను రైల్వే శాఖకు పంపించినట్లు తెలిపారు. కానీ మంజూరు చేయకుండా కేంద్ర ప్రభుత్వం అడ్డుపడుతోందని మండిపడ్డారు.

చంద్రన్న బీమా కష్టాలు తీర్చండి

ప్రభుత్వానికి ఎమ్మెల్యేల విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పద్దెనిమిదేళ్ల నుంచి యాభై ఏళ్ల లోపు వారికి వర్తించేలా తీసుకొచ్చిన చంద్రన్న బీమా పథకం అమలులో ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని పలువురు ఎమ్మెల్యేలు కోరారు. చంద్రన్న బీమా పథకంపై మంగళవారం అసెంబ్లీలో చర్చ చేపట్టారు. ఈ సందర్భంగా తోట త్రిమూర్తులు మాట్లాడుతూ.. డాక్యుమెంటులో ఏ చిన్న తప్పు దొర్లినా ఇన్సూరెన్సు కంపెనీ వాళ్లు తిరస్కరిస్తున్నారని చెప్పారు. 18 ఏళ్లకు పైబడిన విద్యార్థి చనిపోతే వారి కేసులకు బీమా ఇవ్వడం లేదని.. దీనిపై తమకు అనేక విజ్ఞప్తులు వస్తున్నాయని ఉప్పులేటి కల్పన వివరించారు. మహిళలు చనిపోతే.. వారి డాక్యుమెంట్‌లో గృహిణి అని రాస్తే క్లెయిం వర్తించడం లేదన్నారు. మరికొందరికి ఆదాయం ఎక్కువగా ఉందంటూ సాకు చెబుతున్నారని గన్ని వీరాంజనేయులు సభ దృష్టికి తెచ్చారు. మంత్రి పితాని సత్యనారాయణ స్పందిస్తూ.. సాధికారిక సర్వేలో ఎంట్రీ అయితేనే బీమా వర్తింపజేస్తున్నట్లు తెలిపారు. కొన్ని తప్పులు జరిగిన మాట వాస్తవమేనని అంగీకరించారు. వాటిని సరిదిద్దుతున్నట్లు తెలిపారు.

సికింద్రాబాద్-గౌహతి మధ్య ప్రత్యేక రైళ్లు రద్దు

లక్ష్మీపురం (గుంటూరు): డబ్లింగ్ లైన్ నిర్మాణ పనులు చేపట్టినందు వల్ల గుంటూరు డివిజన్ మీదుగా నడిచే సికింద్రాబాద్-గౌహతి-సికింద్రబాద్ వారాంతపు ప్రత్యేక రైళ్లను రద్దు చేసినట్టు గుంటూరు రైల్వే డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.ఉమామహేశ్వరరావు తెలిపారు. సికింద్రాబాద్-గౌహతి రైలును (07149) ఈ నెల 23 వ తేదీన, గౌహతి-సికింద్రాబాద్ రైలును (07150) ఈ నెల 26వ తేదీన రద్దు చేసినట్టు తెలిపారు.

హంద్రీ-నీవాపై మరో ఎత్తిపోతల

రూ.224.31 కోట్లతో చేపట్టేందుకు జలవనరులశాఖ అనుమతి

సాక్షి, అమరావతి: హంద్రీ-నీవా సుజల స్రవంతికి అనుబంధంగా రూ. 224.31 కోట్లతో మరో ఎత్తిపోతల పథకాన్ని చేపట్టేందుకు పరిపాలనా అనుమతులు ఇస్తూ జలవనరులశాఖ కార్యదర్శి శశిభూషణ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు జిల్లా క్రిష్ణగిరి మండలం కూర్మగిరి వద్ద హంద్రీ-నీవా ప్రధాన కాలువకు ఎడమ వైపున ఎత్తిపోతల పథకాన్ని చేపట్టి 9 మండలాల్లోని 68 చెరువులకు 1.238 టీఎంసీలను తరలిస్తారు. సాగునీటితో పాటు 82 గ్రామాలకు తాగునీరు అందించడం ఈ పథకం లక్ష్యం.

పలుసార్లు ఆర్థికశాఖ అభ్యంతరాలు

హంద్రీ-నీవా ఆయకట్టుకు నీళ్లు అందించకుండా, అదనపు జలాలు కేటాయించకుండా అనంతపురం జిల్లాలో ఇప్పటికే బీటీపీ(భైరవానితిప్ప), పేరూరు ఎత్తిపోతలను మంజూరు చేసిన ప్రభుత్వం తాజాగా కర్నూలు జిల్లాలో మరో ఎత్తిపోతలను మంజూరు చేయడం గమనార్హం. హంద్రీ-నీవా ప్రధాన కాలువపై 89.90 కి.మీ. వద్ద క్రిష్ణగిరి మండలం కూర్మగిరి నుంచి నీటిని తరలించి 14 మండలాల్లోని 106 చెరువులను నింపేందుకు రూ.879 కోట్లు మంజూరు చేయాలని కర్నూలు జిల్లా చిన్ననీటిపారుదల విభాగం ఎస్‌ఈ తొలుత ప్రతిపాదనలు పంపారు. ఎకరానికి నీళ్లందించడానికి రూ.9 లక్షలకు పైగా ఖర్చు చేయాల్సి రావడం, అదనపు జలాలు కేటాయించని నేపథ్యంలో నీటి లభ్యత ఉండదంటూ ఈ ప్రతిపాదనలను ఆర్థిక శాఖ తోసిపుచ్చింది. దీంతో ప్రతిపాదనలను కుదిస్తూ గత జనవరి 29న మరోసారి ప్రభుత్వానికి పంపారు. వీటిపై కూడా ఆర్థిక శాఖ అభ్యంతరం వ్యక్తం చేసింది. అదనపు జలాలు కేటాయించని నేపథ్యంలో నీటి లభ్యత ఉండదని తేల్చిచెప్పింది. అయితే ముఖ్యనేత ఆగ్రహం వ్యక్తం చేయడంతో చేసేది లేక ఆర్థిక శాఖ ఆమోదముద్ర వేసింది.

‘మెడ్‌టెక్’ ఫైళ్లు మాయం!

- సచివాలయంలో కనపడటం లేదంటున్న సిబ్బంది
- ఎక్కడకు తరలించారో అంతా రహస్యం
- సమాచార హక్కు చట్టం కింద అడిగినా సమాచారమివ్వని అధికారులు
- తాజా బడ్జెట్‌లో రూ.274 కోట్ల కేటాయింపులపై మరిన్ని అనుమానాలు

సాక్షి, అమరావతి: విశాఖపట్నంలో నెలకొల్పే మెడికల్ టెక్నాలజీ పార్క్ (మెడ్‌టెక్ జోన్) సంబంధించిన ఫైళ్లు అదృశ్యమైనట్లు అనుమానాలు ముసురుకుంటున్నాయి. సచివాలయంలో ఈ ఫైళ్లు కనిపించడం లేదని పలువురు అధికారులు చెబుతున్నారు. ఇందులో కోట్ల రూపాయల కుంభకోణాలు జరిగినట్టు ఆరోపణలున్న నేపథ్యంలో ఫైళ్లను రహస్యంగా తరలించారా? అసలు ఉన్నాయా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

గతంలో మెడిటెక్ ప్రాజెక్టు డైరెక్టర్లుగా వ్యవహరించిన సుజాతశర్మ, డాక్టర్ రవిశంకర్ అయ్యన్నార్, పూనం మాలకొండయ్య అందులో సాగుతున్న వ్యవహారాలను భరించలేక ప్రభుత్వానికి లేఖ రాసి తప్పుకున్నారు. ప్రస్తుతం ఢిల్లీకి చెందిన ప్రైవేట్ కన్సల్టెంట్ జితేంద్రకుమార్‌శర్మ ప్రాజెక్టు సీఈవోగా వ్యవహరిస్తుండటంతో కిందిస్థాయి సిబ్బందికి ఫైళ్లు అందుబాటులో లేకుండా గుట్టుగా వ్యవహరిస్తున్నారు.



కొట్టిపారేసిన సీఎంవో

మెడ్‌టెక్ జోన్‌లో అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని అప్పటి కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ సుజాతశర్మ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాసినట్టు అధికార వర్గాలు తెలిపాయి. మెడ్‌టెక్ జోన్‌లో ఇప్పటివరకూ ఒక్క కంపెనీ కూడా రాలేదని, గతంలో ఇచ్చిన రూ.43 కోట్ల నిధులు కూడా ఏమయ్యాయో జవాబు లేదని ఆమె లేఖలో పేర్కొన్నట్టు తెలిసింది. భూ కేటాయింపులు, ప్రభుత్వ నిధుల వ్యయంపై ఆమె పలు సందేహాలను వ్యక్తం చేశారు. పలువురు సమాచార హక్కు చట్టం కింద మెడ్‌టెక్ జోన్ వివరాలు అడిగినా అధికారులు స్పందించలేదు. విజిలెన్స్, ఏసీబీకి ఫిర్యాదులు కుప్పలు తెప్పలుగా అందాయి. అయితే సీఎంవోలో పనిచేస్తున్న ఓ ఐఏఎస్ అధికారి వీటిని కొట్టిపారేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది.

ఆది నుంచీ అనుమానాలే

- విశాఖలో 200కు పైగా ఎకరాల్లో చేపట్టిన మెడ్‌టెక్ (వైద్య ఉపకరణాల తయారీ పరిశ్రమలు) పార్కు 2015లో మొదలైన నాటి నుంచే పలు ఆరోపణలు వచ్చాయి.
- మొదటిసారి టెండరు ద్వారా ఇచ్చిన కాంట్రాక్టు రద్దు చేశారు. తర్వాత ఆ సంస్థకు ఇచ్చిన రూ.43 కోట్లు ఏమయ్యాయో తెలియదు.
- ఎన్ని కంపెనీలు వచ్చాయి, ఏ సంస్థకు ఎన్ని భూములు ఇచ్చారన్న విషయాలు చెప్పడం లేదు.
- రెండోసారి టెండరులో కాంట్రాక్టు ఎవరికి ఇచ్చారు, ఎప్పుడు ఇచ్చారు అన్న వివరాలు వెల్లడించడం లేదు.
- కేటాయించిన భూముల్లో పరిశ్రమలేమైనా వచ్చాయా? వస్తే ఆ కంపెనీలేవీ అనే వివరాలు లేవు.
- 2018-19 బడ్జెట్‌లో రూ.274 కోట్లు మెడ్‌టెక్ జోన్‌కు కేటాయించారు. అదీ డీఎంఈ హెడ్ ద్వారా కేటాయించారు. పెద్ద ప్రాజెక్టుకు సొంత హెడ్ లేకుండా ఎందుకు చేశారు?
- కొద్ది నెలలుగా వెబ్‌సైట్‌లో వివరాలు కూడా పొందుపరచకపోవటం అనుమానాలకు తావిస్తోంది.
- తాజాగా సచివాలయంలో మెడ్‌టెక్ జోన్ ఫైళ్లు కానరాకపోవటం గమనార్హం.

అతిసార మృతుల కుటుంబాలకు చెక్కుల పంపిణీ

- రక్షిత నీరు సరఫరా చేయలేని దుస్థితిలో సర్కార్
- రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడిన వైఎస్సార్‌సీపీ నేతలు



బాధిత కుటుంబాలకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా, అప్పిరెడ్డి, శ్రీకృష్ణదేవరాయులు

నెహ్రూనగర్ (గుంటూరు): గుంటూరు నగరంలో నీరు కలుషితమై అతిసార బారిన పడి చనిపోయిన వ్యక్తుల కుటుంబాలకు మంగళవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ నాయకులు చెక్కులు పంపిణీ చేశారు. గుంటూరు పార్లమెంటు పార్టీ సమన్వయకర్త లావు శ్రీకృష్ణదేవరాయులు, తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా, పార్టీ నగర అధ్యక్షుడు లేళ్ళ అప్పిరెడ్డి రూ.50వేల చొప్పున ఈ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ.. అభివృద్ధి పేరుతో గొప్పలు చెబుతున్న ప్రభుత్వం ప్రజలకు కనీసం రక్షిత నీటిని కూడా సరఫరా చేయలేని దుస్థితిలో ఉందని విమర్శించారు. బాధితులను ఓదార్చి అండగా నిలవాల్సిన సమయంలో మంత్రులు రాజకీయాలకే ప్రాధాన్యత ఇచ్చారని మండిపడ్డారు. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి రిజర్వాయర్ల, పైపులైన్ల వ్యవస్థను ఆధునీకరించి సురక్షిత మంచినీటిని సరఫరా చేయాలని వారు డిమాండ్ చేశారు. అతిసార బాధిత కుటుంబాల పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్న తమ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ శ్రేణులను, నాయకులను అప్రమత్తం చేసి సహాయ కార్యక్రమాలు చేపట్టేలా పర్యవేక్షించారని తెలిపారు. అనంతరం వారు అతిసార ప్రబలిన డివిజన్లలో పర్యటించారు.

జీతాలు, అధికారాలు పెంచండి!

- మార్కెట్ కమిటీ పాలకవర్గాల డిమాండ్
- తమకు ప్రాధాన్యం ఉండడం లేదని ఆవేదన

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీల పాలకవర్గాలు తీవ్ర అసంతృప్తితో ఉన్నాయి. మార్కెట్ కమిటీ చైర్మన్లు, సభ్యుల గౌరవ వేతనం పెంచాలని, కుదించిన అధికారాలను పెంచాలని, లింకు రోడ్లు, రైతు బజార్ల నిర్వహణ మార్కెట్ కమిటీల పరిధిలోకి తీసుకురావాలని, తమ పదవీకాలాన్ని పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. రెండు రోజుల కిందట గుంటూరు జిల్లా తాడేపల్లిలోని ఒక హోటల్‌లో వీరు సమావేశమై పలు అంశాలపై నిర్ణయాలు తీసుకున్నారు. ఇప్పటి వరకు ఏర్పాటు కాని రాష్ట్రస్థాయి వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాల సంఘాన్ని కొత్తగా ఏర్పాటు చేసుకున్నారు.

రైతు బజార్ల నిర్వహణలో భాగస్వామ్యం కావాలి..

రాష్ట్రంలోని 191 మార్కెట్ కమిటీల పరిధిలో 324 మార్కెట్ యార్డులున్నాయి. మార్కెట్ కమిటీలకు వచ్చే ఆదాయం నుంచి రైతులకు ఉపయోగపడే విధంగా లింకు రోడ్లు నిర్మాణం, మరమ్మతులు, రైతు బజార్ల నిర్వహణ, ఆధునీకరణ తదితర పనులకు వినియోగిస్తున్నారు. అయితే వీటి నిర్వహణ బాధ్యతల్లో కమిటీలకు ప్రాధాన్యత ఉండటం లేదు. రైతు బజార్లలోని దుకాణాల కేటాయింపు, తాత్కాలిక ఉద్యోగుల నియామకాల వంటి వాటిల్లోనూ అధికారులే కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఇకపై లింకు రోడ్ల నిర్మాణాల పనులను నామినేషన్‌పై ఇచ్చే అధికారం తమకివ్వాలని, రైతుబజార్ల నిర్వహణలో తమకూ భాగస్వామ్యం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏ గ్రేడ్ మార్కెట్ కమిటీ చైర్మన్‌కు నెలకు రూ. 25 వేలను ఇస్తోంది. సమావేశానికి హాజరైనప్పుడు సభ్యునికి ఒకో సిట్టింగ్‌కు రూ. 1,000 ఇస్తోంది. రాష్ట్రంలోనూ అదే విధంగా గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. పాలకవర్గాల పదవీకాల పరిమితిని మూడేళ్ల వరకు పొడగించాలని కోరుతున్నారు. భవిష్యత్‌లో తమ సమస్యల సాధనకు ఉద్యమించడానికి 14 మంది సభ్యులతో సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. గుంటూరు మార్కెట్ కమిటీ చైర్మన్ మన్నవ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శిగా ఇందిరెడ్డి శివారెడ్డిని కమిటీ సభ్యులు ఎన్నుకున్నారు.

మన్నవ ఎత్తుగడ!: రాష్ట్రస్థాయి మార్కెట్ కమిటీ పాలకవర్గాల సమావేశం వెనుక గుంటూరు మార్కెట్ కమిటీ చైర్మన్ మన్నవ సుబ్బారావు హస్తం ఉందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆయన పదవీకాలం పూర్తయిన తరువాత ప్రభుత్వం ఆరు నెలలపాటు ఒకసారి పొడగించింది. ఈనెల 27తో ఆ పదవీకాలం కూడా ముగియనుంది. మరోసారి ఆయన పదవీకాలం పొడగింపునకు చేస్తున్న ప్రయత్నాలకు సానుకూలంగా పరిస్థితులు లేకపోవడంతో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారని వాదనలు వినిపిస్తున్నాయి.

పీఎంవీల లక్ష్యం నెరవేరేనా!

- అనంతపురం, వైఎస్సార్ జిల్లాల్లో పోలీస్ మహిళా వాలంటీర్ల ఎంపిక
- నియమించి ఆర్నెళ్లవుతున్నా పట్టించుకోని వైనం
- పైలెట్ ప్రాజెక్ట్ దశలోనే పథకానికి మంగళం!

సాక్షి, అమరావతి: మహిళలపై పెరుగుతున్న నేరాలను అదుపు చేసి, వారికి రక్షణగా నిలవాలన్న ఆశయంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ‘పోలీస్ మహిళా వాలంటీర్ల (పీఎంవీ)’ వ్యవస్థ ఫలితాలు ఇవ్వడం లేదు. రాష్ట్రంలో అనంతపురం, వైఎస్సార్ జిల్లాల్లో పైలెట్ ప్రాజెక్టుగా పీఎంవీలను నియమించి వదిలేశారు. వీరిని నియమించి ఆరు నెలలు గడుస్తున్నా పట్టించుకోకపోవడంతో అసలు ఉద్దేశం నెరవేరడం లేదు. గతంలో చంద్రబాబు సర్కారు చేపట్టిన మైత్రీ సంఘాల మాదిరిగానే పీఎంవీ వ్యవస్థ కూడా నీరుగారిపోతుందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మైత్రీ సంఘాల మాదిరే నీరుగారుస్తారా?

చంద్రబాబు గత పాలనలో పోలీస్‌స్టేషన్‌ల వారీగా నియమించిన మైత్రీ సంఘాల అసలు లక్ష్యం పక్కదారి పట్టిన సంగతి తెల్సిందే. టీడీపీ కార్యకర్తలనే మైత్రీ సంఘాల్లో నియమించి నెలకు రూ.వెయ్యి గౌరవ వేతనం ఇచ్చేవారు. వారు అసలు విధులను వదిలి కేసులు, అరెస్టులు వంటి వాటిలో జోక్యం చేసుకోవడంతో విమర్శలు వెల్లువెత్తాయి. ఇప్పుడు ఏర్పాటు చేసిన పోలీస్ మహిళా వాలంటీర్లు కూడా నియమించి వదిలేయడంతో పైలెట్ ప్రాజెక్టు దశలోనే మంచి ఆశయం నీరుగారిపోయే ప్రమాదం ఉంది.

నియామకం ఇలా..

2017, సెప్టెంబర్‌లో వైఎస్సార్ జిల్లాలో 1500, అనంతపురం జిల్లాలో 1390 మంది పీఎంవీలను నియమించారు. ఇంటర్మీడియెట్ పూర్తి చేసి 21 ఏళ్లు నిండిన మహిళలను దీనికి పరిగణనలోకి తీసుకున్నారు. మైనర్ పంచాయతీకి ఒకరు, మేజర్ పంచాయతీకి ఇద్దరు, పట్టణాల్లో డివిజన్‌ల వారీగా ఒకరు చొప్పున పీఎంవీలను నియమించారు. వీరికి మహిళా చట్టాలపై మూడు రోజుల చొప్పున శిక్షణ ఇచ్చారు. నెలకు రూ.వెయ్యి చొప్పున గౌరవ వేతనం ఇవ్వాల్సి ఉండగా ఆరు నెలలకుగాను రెండు నెలలకు మాత్రమే ఇచ్చినట్టు సమాచారం.

పీఎంవీల విధులివే..

పీఎంవీలు.. పోలీసులకు, మహిళలకు మధ్య కమ్యూనిటీ పోలీస్ పాత్రను పోషిస్తారు. బాల్య వివాహాలు, వరకట్న వేధింపులు, అక్రమ రవాణా, మహిళలు ఎదుర్కొంటున్న హింసాకాండ గురించి పోలీసులకు చేరవేయడం, వాటిని అడ్డుకోవడం చేయాలి. తరచూ సమావేశాలు నిర్వహించి మహిళలను చైతన్యవంతం చేయడంతోపాటు నేరాలు అదుపు చేయాలి. కాగా, పీఎంవీలను డీఎస్పీ, మహిళా బాలల సంక్షేమ అధికారి, జిల్లా పంచాయతీ అధికారి, సామాజిక కార్యకర్తతో కూడిన కమిటీ పర్యవేక్షిస్తుంది. ప్రతి ఆర్నెళ్లకు ఒకసారి పీఎంవీల పనితీరు ఆధారంగా కొనసాగించాలా? వద్దా? అనేది జిల్లా ఎస్పీకి నివేదించాలి.

ఏపీకి 16.. తెలంగాణకు 17 టీఎంసీలు

కేటాయించిన కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ

సాక్షి, అమరావతి: కృష్ణా జలాల్లో రెండు తెలుగు రాష్ట్రాల వాటాల లెక్కలను బోర్డు త్రిసభ్య కమిటీ తేల్చింది. ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, నాగార్జునసాగర్లలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న 33 టీఎంసీల్లో 17 టీఎంసీలు తెలంగాణకు, 16 టీఎంసీలు ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించింది. శ్రీశైలం జలాశయంలో 800 అడుగుల వరకు ఉన్న నీటిని వినియోగించుకోవాలని నిర్ణయించింది. కృష్ణా బోర్డు సభ్య కార్యదర్శి ఎ. పరమేశం నేతృత్వంలో ఇరు రాష్ట్రాల ఈఎన్‌సీలు మంగళవారం హైదరాబాద్‌లో సమావేశమయ్యారు. శ్రీశైలం నుంచి కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా తెలంగాణకు ఒక టీఎంసీ, హంద్రీ-నీవా ద్వారా ఏపీకి ఒక టీఎంసీ నీటిని కేటాయించారు. సాగర్‌లో నీటి లభ్యత ఆధారంగా ఏపీలోని కుడికాల్వకు 7 టీఎంసీలు, ఎడమ కాల్వకు 4 టీఎంసీలు, కృష్ణా డెల్టాకు 4 టీఎంసీలు కేటాయించారు.

అంగట్లో ఐడెంటిటీ



500 ఇస్తే ఎవరికైనా ఓటరు గుర్తింపు కార్డు

ఎలాంటి ప్రూఫ్‌లు అక్కర్లేదు.. పత్రాలతో పని లేదు

- ఓటరు కార్డుతో యథేచ్ఛగా ఆధార్, లైసెన్సులు, ఇతరత్రా కార్డులు
- ఉగ్రవాది యాసిన్ భత్కల్, అబూసలేం సహా ఎందరికో కార్డులు
- ‘మీ-సేవా’, దళారుల సాయంతో సాగుతున్న దందా
- ప్రశ్నార్థకంగా మారిన అంతర్గత భద్రత

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ భారీ అక్రమ రాకెట్‌కు అడ్డగా మారుతోంది. ఊరు, పేరు, వయసు, చిరునామా ఇలా ఏ ధ్రువీకరణ కావాలన్నా.. ఎలాంటి క్రాస్ చెక్ లేకుండానే కేవలం రూ.500 నుంచి రూ.1,200 తీసుకుని గంటల్లో ఓటరు గుర్తింపు కార్డులు ఇచ్చేస్తున్నారు. ఈ కార్డును ఆధారంగా చూపుతూ.. ఆధార్ కార్డు నుంచి పాస్‌పోర్టు దాకా యథేచ్ఛగా పొందుతున్నారు. భాగ్యనగరంలో తలదాచుకుంటున్న విదేశీయులు సైతం సులువుగా ఇలా ఓటరు కార్డులు తీసుకుంటున్నారు. ఆపై ఆధార్, ఇతర పత్రాలతో ‘ఇండియన్ సిటిజన్’గా గుర్తింపు పొందుతున్న వ్యవహారం అంతర్గత భద్రతకు సవాల్‌గా మారుతోంది. మీ-సేవా కేంద్రాలు, వాటి చుట్టూ అల్లుకున్న బ్రోకర్ల సాయంతో ఈ దందా విచ్చలవిడిగా సాగుతోంది. ఎలాంటి ప్రూఫ్‌లు లేకుండా ఓటరు కార్డులు పొందేందుకు ‘సాక్షి’చేపట్టిన ఆపరేషన్ ఎలా సాగిందో మీరే చదవండి..

ఎంత ఈజీగా ఇచ్చేశారో..

ఇంటర్‌నెట్‌లో ఫొటోలు డౌన్‌లోడ్ చేసుకుని చార్మినార్ సమీప పరిసరాల్లో తిరిగి ఇష్టం వచ్చిన ఇంటి నంబర్లను రాసుకుని ఛత్తాబజార్, గౌలిపురా, నూర్‌ఖాన్ బజార్‌లలోని మీ-సేవా కేంద్రాల్లోకి ‘సాక్షి’ బృందం వెళ్లింది. అర్జంట్‌గా ఓటరు గుర్తింపు కార్డులు కావాలని కోరగా, ఒక్కొక్కరు తొలుత వేలల్లో రేటు చెప్పారు. కాసేపు బేరమాడగా.. రూ.1,200కు ఒక కార్డు జారీ చేసేందుకు ఒప్పుకున్నారు. పీపుల్స్ రిప్రజెంటేషన్ యాక్ట్‌లో భాగంగా ఫాం-6 నింపే క్రమంలో వ్యక్తిగత గుర్తింపు, నివాస ధ్రువీకకరణ పత్రాలతోపాటు సంబంధిత వ్యక్తి తప్పనిసరిగా ఉండాలి. కానీ అవేవీ పట్టించుకోకుండానే.. మీ-సేవా నిర్వాహకులు వాటన్నింటిని మేనేజ్ చేశారు. 48 గంటల్లోనే ఉగ్రవాది యాసిన్ భత్కల్, అండర్ వరల్డ్ డాన్ అబూసలేం, ఆయన ప్రియురాలు మోనికాబేడీలతోపాటు ప్రధాని మోదీ సతీమణి జశోదాబెన్‌ల ఫొటోలతో కూడిన ఓటరు కార్డులు ‘సాక్షి’బృందం చేతికి వచ్చాయి. ఈ కార్డుల ఆధారంగా అన్ని రకాల కార్డులు సంపాదించే అవకాశాలను సైతం ‘మీ-సేవ’లోనే వివరించటం విశేషం. నగరానికి వివిధ రూపాల్లో వస్తున్న విదేశీయులు కూడా తొలుత ఇలా ఓటరు గుర్తింపు కార్డులు పొంది, దాని ఆధారంగా ఆధార్, పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్‌లు ఈజీగా తీసేసుకుంటున్నారు.

భత్కల్ కార్డు వచ్చిందిలా..

యాసిన్ భత్కల్ ఫొటోతో ఓటరు గుర్తింపు కార్డు కోసం జీహెచ్‌ఎంసీ దక్షిణ మండలం కార్యాలయంలోకి వెళ్లి బ్రోకర్‌గా వ్యవహరించే ఓ ఆశా వర్కర్ సిఫారసుతో ‘సాక్షి’ప్రతినిధి దరఖాస్తు చేశారు. అక్కడ కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేసే ఓ ఉద్యోగి కొంత మొత్తాన్ని తీసుకుని వివరాలను అప్‌లోడ్ చేసింది. మూడ్రోజుల్లో యాసిన్ భత్కల్ ఫొటో, బహదూర్‌పురా చిరునామాతో మహ్మద్ యాసిన్ పేరుతో ఓటరు గుర్తింపు కార్డును అందజేసింది. యాసిన్ భత్కల్ ఇండియన్ ముజాహిదీన్ తీవ్రవాద సంస్థను ఏర్పాటు చేసి హైదరాబాద్‌లోని లుంబినీ, గోకుల్‌చాట్, దిల్‌సుఖ్‌నగర్ సహా సూరత్, అహ్మదాబాద్, బెంగళూరు, ఢిల్లీలలో పేలుళ్ల కేసుల్లో ప్రధాన నిందితుడిగా ఎన్‌ఐఏ నిర్ధారించిన సంగతి తెలిసిందే.

‘అబూసలేంకు ’కార్డు..

దావూద్ ఇబ్రహీం ముఖ్య అనుచరుడిగా ఉంటూ 1993లో ముంబై వరుస పేలుళ్లు, ఆపై పలు హత్య కేసులతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని చిరునామాలతో నకిలీ పాస్‌పోర్టు పొందిన అబూసలేం, ఆయన ప్రియురాలు మోనికాబేడీల ఫొటోలతో ‘సాక్షి’ప్రతినిధులు ఓటరు కార్డు సంపాదించారు.

జశోదాబెన్‌కు సైతం..

నగరంలోని నూర్‌ఖాన్ బజార్‌లోని ఓ మీ-సేవ కేంద్రానికి వెళ్లి ఫాం-6 నింపి, వివరాలేవీ లేవని, ఎలాగైనా మేనేజ్ చేయాలంటూ కొంత మొత్తాన్ని చేతుల్లో పెట్టాం. తొలుత సాధ్యం కాదంటూనే ఆ తర్వాత మీ-సేవ నిర్వాహకుడు బేరమాడి రేటు పెంచాడు. ఆ మొత్తం ఇవ్వగానే జశోదాబెన్ ఫొటో, నూర్‌ఖాన్ బజార్ చిరునామాతో జశోదాబాయి పేరిట ఓటరు కార్డును ఇచ్చాడు.

ఆ ఒక్క కార్డు ఉంటే చాలు..

ఓటరు గుర్తింపు కార్డు ఆధారంగా ఎన్నో కార్డులు పొందే వీలుంది. అందులోని అడ్రస్ ప్రూఫ్ చూపి.. ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్, వెపన్ లైసెన్స్ ఇలా ఏది కావాలన్నా సులువుగా పొందొచ్చు. దీన్నే వ్యక్తిగత గుర్తింపు పత్రంగా చూపి ఎయిర్‌పోర్టులోకి ప్రవేశించవచ్చు.

ఆ కార్డు ఆమె జీవితాన్నే ముంచింది

ఈ చిత్రంలో కనిపిస్తున్న మైనర్ అమ్మాయి పేరు రుక్సార్. ప్రస్తుతం ఒమన్ దేశంలో నిత్యం నరకం అనుభవిస్తోంది. పాతబస్తీలోని వట్టిపల్లిలో నివాసముండే పదహారేళ్ల రుక్సార్‌ను మేజర్‌గా చూపింది పాతబస్తీ కేంద్రంగా పొందిన ఓటరు గుర్తింపు కార్డే. ఆ కార్డు ఆధారంగా 72 ఏళ్ల వృద్ధ షేక్‌తో ఆమె పెళ్లి, పాస్‌పోర్టు జారీ చకచకా జరిగిపోయాయి. తల్లిదండ్రులు నిరుపేదలు కావటంతో మేనత్త గౌసియా వద్ద ఈమె చదువుకునేది. ఓ బ్రోకర్ చెప్పిన మాటలు నమ్మి గౌసియా.. ఒమన్ దేశానికి చెందిన 72 ఏళ్ల వృద్ధుడితో ఆమె తల్లిదండ్రులకు తెలియకుండానే పెళ్లి చేసేసింది. తర్వాత ఒమన్ వెళ్లింది. అక్కడకు వెళ్లాక వృద్ధ షేక్ ఆచూకీ లేదు. అతడి కొడుకులు, మనవళ్లు రుక్సార్‌పై లైంగిక దాడులకు దిగారు. తిండి, నిద్ర కరువయ్యాయి. ఫోన్ చేసినా అత్త స్పందించలేదు. దీంతో తల్లికి ఫోన్ చేసి తనను నరకం నుంచి విడిపించాలని, లేదంటే విషం తాగి చస్తానని విలపించింది. తల్లిదండ్రుల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ దారుణం వెలుగులోకి వచ్చింది. తమ బిడ్డను అప్పగించాలని తల్లిదండ్రులు విదేశాంగ శాఖను వేడుకుంటున్నారు.



ఒమన్ షేక్‌తో రుక్సార్

హెచ్1 బీ వీసాలపై పోస్టర్ల నిరసన

శాన్‌ఫ్రాన్సిస్కో, కాలిఫోర్నియా రైల్వే స్టేషన్లలో పోస్టర్లు

వాషింగ్టన్: హెచ్–1బీ వీసాలకు వ్యతిరేకంగా అమెరికాలో పోస్టర్ల నిరసన మొదలైంది. శాన్‌ఫ్రాన్సిస్కో, కాలిఫోర్నియాలో హెచ్–1బీ వీసాల జారీకి వ్యతిరేకంగా రైల్వేస్టేషన్లలోనూ పోస్టర్లు అతికించారు. అయితే ఇది హెచ్1 బీ వీసాలకు వ్యతిరేకంగా కాదనీ, వీటిపై అవగాహన కల్పించేందుకే చేపట్టామని నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 15న మొదలైన ఈ ఉద్యమం ఏప్రిల్ 1 వరకు కొనసాగుతుందని చెప్పారు. అమెరికా ఉద్యోగులకు బదులుగా భారతీయ ఐటీ నిపుణులకు ప్రాధాన్యమిస్తున్నారని వాషింగ్టన్‌కు చెందిన ప్రొగ్రెసివ్ ఫర్ ఇన్‌ఫర్మేషన్ రిఫార్మ్ డైరెక్టర్ కెవిన్ లిన్ పేర్కొన్నారు. హెచ్1 బీ వీసాల నిబంధనల్ని కఠినతరం చేసిన తరుణంలో వీటిపై అందరికీ అవగాహన కల్పించేందుకే నిరసన చేపట్టామన్నారు. వలసదారులు అమెరికా ఆర్థికాభివృద్ధికి ఎంతో సహకరించారని, ఇలాంటి నిరసనలతో వ్యతిరేక భావాలకు ఆజ్యం పోసినట్లు ఉంటుందని హిందూ అమెరికన్ ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్ కల్రా పేర్కొన్నారు. తాము ఇలాంటి ప్రకటనల్ని ప్రోత్సహించడం లేదని బే ఏరియా ర్యాపిడ్ ట్రాన్స్‌పోర్ట్ (బార్ట్) స్పష్టం చేసింది.

గ్రీన్‌కార్డుల కోసం భారతీయుల ర్యాలీలు

అమెరికా వ్యాప్తంగా సోమవారం వందలాది మంది భారతీయ ఉద్యోగులు, నిపుణులు ర్యాలీలు నిర్వహించారు. గ్రీన్‌కార్డుల జారీలో బాగా జాప్యం జరుగుతోందని, దేశాల వారీగా పరిమితి ఎత్తేయాలని కోరుతూ పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ముఖ్యంగా అర్కాన్సాస్, కెంటకీ, ఒరెగావ్ రాష్ట్రాల్లో ర్యాలీలు నిర్వహించారు.



రాష్ట్రపతి కోవింద్ చేతుల మీదుగా పద్మ విభూషణ్ పురస్కారాలు అందుకుంటున్న సంగీత దర్శకుడు ఇళయరాజా, హిందుస్తానీ సంగీత విద్వాంసుడు గులామ్ ముస్తఫా ఖాన్, రచయిత పి.పరమేశ్వరన్, కేరళ బిషప్ ఫిలిపోస్ మార్ క్రిసోస్టోమ్ (పద్మభూషణ్). మంగళవారం ఢిల్లీలో రాష్ట్రపతిభవన్‌లో జరిగిన కార్యక్రమంలో పద్మ అవార్డులను ప్రదానం చేశారు. ఇంకొందరికి ఏప్రిల్ 2న అవార్డులను ప్రదానంచేయనున్నారు. ఈ ఏడాదికి మూడు పద్మవిభూషణ్, తొమ్మిది పద్మభూషణ్ అవార్డులు కలుపుకుని మొత్తం 84 పద్మఅవార్డులను ప్రకటించారు.

ఆ 39 మందిని చంపేశారు

ఐఎస్ అపహరించిన భారతీయుల విషాదాంతం

- మోసుల్ సమీపంలో మృతదేహాల గుర్తింపు
- వారి మృతిని నిర్ధారిస్తూ రాజ్యసభలో సుష్మాస్వరాజ్ ప్రకటన
- బాధిత కుటుంబాలతో అమానవీయంగా వ్యవహరించిన కేంద్రం: విపక్షాలు





రాజ్యసభలో సుష్మాస్వరాజ్. మరణవార్త తెలిసి పంజాబ్‌లోని జలాల్ ఉస్మా గ్రామంలో రోదిస్తున్న మృతుడి బంధువులు

న్యూఢిల్లీ: ఇరాక్‌లో నాలుగేళ్ల క్రితం ఇస్లామిక్ స్టేట్(ఐఎస్) ఉగ్రవాదులు అపహరించిన భారతీయుల కథ విషాదాంతమైంది. ఆ 39 మంది భారతీయులు చనిపోయారని, వారి మృతదేహాలను గుర్తించామని కేంద్రం ప్రకటించింది. వారిని ఉగ్రవాదులు ఊచకోత కోసి మోసుల్ పట్టణం సమీపంలోని బదోష్ అనే గ్రామంలో పూడ్చిపెట్టినట్లు గుర్తించామని తెలిపింది. డీఎన్‌ఏ పరీక్షల అనంతరం వారు అపహరణకు గురైన భారతీయులేనని నిర్ధారణకు వచ్చినట్లు మంగళవారం విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ రాజ్యసభకు తెలిపారు. లోక్‌సభలోనూ సుష్మ ఈ విషయం ప్రకటించాల్సి ఉన్నా ప్రతిపక్ష సభ్యుల గందరగోళం మధ్య సభ వాయిదా పడింది. అయితే, ఈ విషయాన్ని ముందుగా బాధిత కుటుంబ సభ్యులకు తెలపకుండా, సభలో ప్రకటించడాన్ని విపక్షాలు తప్పుబట్టాయి. బాధిత కుటుంబాల పట్ల ప్రభుత్వం అమానవీయంగా ప్రవర్తించిందని విమర్శించాయి. భారతీయుల అపహరణ విషయంలో ప్రభుత్వం ఇన్నాళ్లూ వారిని తప్పుదోవ పట్టించిందని ఆరోపించాయి. బాధిత కుటుంబాలకు ప్రధాని నరేంద్ర మోదీ ప్రగఢ సానుభూతి తెలిపారు. 2014లో మోసుల్ పట్టణం ఐఎస్ ఉగ్రవాదుల అధీనంలో ఉండగా.. మొత్తం 40 మంది భారతీయులు అపహరణకు గురవగా, వారిలో ఒకరు బంగ్లాదేశ్‌కు చెందిన ముస్లింనని చెప్పుకుని సురక్షితంగా బయటపడ్డాడు. లాంఛనాలు పూర్తిచేసి 39 మంది భారతీయుల మృతదేహాలను స్వదేశం తీసుకురావడానికి 10 రోజులు పట్టొచ్చని విదేశాంగ శాఖ సహాయ మంత్రి వీకే సింగ్ చెప్పారు.

మట్టి దిబ్బ కింద మృతదేహాలు..

'విస్పష్ట ఆధారాలు లభించే వరకూ ఎవరూ చనిపోయారని ప్రకటించనని ఇదివరకే చెప్పా. కచ్చితమైన నిర్ధారణ అనంతరమే ఈ ప్రకటన చేస్తున్నా. కార్మికుల మృతదేహాలను వారి కుటుంబాలకు అప్పగించి, ఇక వారి నిరీక్షణకు ముగింపు పలకబోతున్నామని భారమైన హృదయంతో చెబుతున్నా' అని సుష్మ భావోద్వేగంతో పేర్కొన్నారు. మృతదేహాల గుర్తింపు ప్రక్రియ ఎలా జరిగిందో సుష్మ వివరించారు. 'ఐఎస్ చెర నుంచి మోసుల్ విముక్తమైన తరువాత స్థానిక అధికారుల సాయంతో గాలింపును విస్తృతం చేశాం. మోసుల్ దగ్గర్లోని బదోష్ గ్రామంలోని ఒక మట్టిదిబ్బ కింద చాలా మంది మృతదేహాలను ఉగ్రవాదులు పూడ్చిపెట్టినట్లు మాకు సమాచారం అందింది. రాడార్ సాంకేతికతతో అది నిజమేనని గుర్తించాం. ఆ మృతదేహాలను వెలికితీశాం. ఆ మృతదేహాలు గల్లంతైన భారతీయులవేనని ధ్రువీకరించడం చాలా కష్టమైంది. మట్టి దిబ్బ కింద ఒకరి శరీరంపై మరో శరీరాన్ని పూడ్చి ఉగ్రవాదులు క్రూరత్వం ప్రదర్శించారు. మృతదేహాల వద్ద లభించిన ఆధారాల సాయంతో వారు భారతీయులేనని ప్రాథమికంగా నిర్ధారించాం. అనంతరం డీఎన్‌ఏ పరీక్షల కోసం బాగ్దాద్ తరలించాం. ఆ పరీక్షల్లో 38 మంది డీఎన్‌ఏలు సరిపోలగా, ఒక వ్యక్తివి '70% వరకు సరిపోయాయి' అని సుష్మ వివరించారు. మృతుల్లో 27 మంది పంజాబీలు, నలుగురు హిమాచల్ ప్రదేశ్, ఆరుగురు బిహార్, ఇద్దరు పశ్చిమ బెంగాల్ వాసులున్నారు.

నేనేమీ దాయలేదు: సుష్మ

మోసుల్‌లో భారత కార్మికుల అపహరణ వ్యవహారంలో తానేమీ దాయలేదని, ఎవరికీ కల్పిత హామీలు ఇవ్వలేదని సుష్మ తెలిపారు. ఉగ్రవాదుల చెర నుంచి తెలివిగా బయటపడ్డ హర్జీత్‌ను ప్రభుత్వం వేధించిందన్న ఆరోపణలను ఖండించారు. చావు విషయాల్లో కూడా కాంగ్రెస్ రాజకీయాలకు పాల్పడుతోందని మండిపడ్డారు. డీఎన్‌ఏ సరిపోలిన మొదటి వ్యక్తి సందీప్ అని, చివరి, 39వ వ్యక్తి డీఎన్‌ఏ 70 శాతమే సరిపోలిందని, అతని తల్లిదండ్రులు చనిపోవడంతో ఇతర కుటుంబ సభ్యుల డీఎన్‌ఏతో ఆయన డీఎన్‌ఏను పోల్చినట్లు తెలిపారు.

ఆ ఒక్కడు తప్పించుకున్నాడిలా..

2014లో ఇరాక్‌లోని రెండో పెద్ద పట్టణమైన మోసుల్‌లో నిర్మాణ రంగంలో కార్మికులుగా పనిచేస్తున్న మొత్తం 40 మంది భారతీయులు, మరికొందరు బంగ్లాదేశీయులను ఐఎస్ అపహరించింది. అందులో గురుదాస్‌పూర్‌కు చెందిన హర్జీత్ మాసిహ్ మాత్రం తాను బంగ్లాదేశీ ముస్లింనని చెప్పి తప్పించుకున్నాడు. మిగతా 39 మందిని ఐఎస్ ఉగ్రవాదులు చంపుతుండగా చూశానన్న హర్జీత్ మాటలను ప్రభుత్వం కొట్టిపారేసింది. ఆయనవి కట్టుకథలని ప్రకటించింది. బందీలను తొలుత ఓ వస్త్ర కర్మాగారంలో ఉంచి ఆ తరువాత బాదోశ్ గ్రామంలోని చెరసాలకు తరలించారు. ఓ కేటరింగ్ వ్యాపారి వెల్లడించిన వివరాల ప్రకారం..భోజనం చేసి తిరిగొస్తుండగా 40 మంది భారతీయులతో పాటు కొందరు బంగ్లాదేశ్ కార్మికులను ఐఎస్ ఉగ్రవాదులు బందీలుగా తీసుకున్నారు. వస్త్ర కర్మాగారంలో భారతీయులు, బంగ్లాదేశీయులను వేరుచేశారు. ఆ తరువాత బంగ్లాదేశీ కార్మికులను ప్రత్యేక వాహనంలో ఎర్బిల్‌కు తరలించారు. బంగ్లాదేశీయుడినని చెప్పుకున్న హర్జీత్..తన పేరు అలీ అని మార్చుకుని ఎర్బిల్ వెళ్లి ప్రాణాలు కాపాడుకున్నాడు.

ఈ నాలుగేళ్లలో....

- **జూన్ 15, 2014:** ఇరాక్‌లోని మోసుల్‌లో 40 మంది భారతీయుల కిడ్నాప్.. బంగ్లాదేశీ ముస్లింనని చెప్పి ఐఎస్ నుంచి తప్పించుకున్న హర్జీత్ మాసిహ్
- **మే 15, 2015:** అపహరించిన 5 రోజుల అనంతరం 39 మందిని ఒక కొండపైకి తీసుకెళ్లి వరుసగా నిలబెట్టి కాల్చి చంపారని చెప్పిన హర్జీత్.. ఇరాక్ నుంచి వచ్చాక తాను భారత్ దర్యాప్తు సంస్థల కస్టడీలో ఉన్నానని వెల్లడి.
- **జూన్ 20, 2016:** కిడ్నాపైన 39 మంది భారతీయులు సజీవంగా ఉన్నారన్న విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్
- **జూలై 2017:** మోసుల్‌కు ఐఎస్ నుంచి విముక్తి. బదోష్ జైల్లో 39 మంది బందీలుగా ఉన్నారన్న సమాచారంతో ఇరాక్‌కు వెళ్లిన విదేశాంగ సహాయ మంత్రి వీకే సింగ్.
- **అక్టోబర్ 28, 2017:** కిడ్నాపైన భారతీయుల బంధువుల నుంచి డీఎన్‌ఏ శాంపిల్స్ సేకరించిన అధికారులు
- **మార్చి 20, 2018:** ఆ 39 మంది భారతీయుల్ని ఉగ్రవాదులు ఊచకోత కోసి బదోష్ గ్రామంలో పూడ్చిపెట్టినట్లు పార్లమెంటులో ప్రకటన చేసిన సుష్మాస్వరాజ్.

ఎందుకు దాచారు?

చండీగఢ్: ఇరాక్‌లో భారతీయ కార్మికులు చనిపోయారని సుష్మా స్వరాజ్ రాజ్యసభలో చేసిన ప్రకటనను విన్న వెంటనే బాధిత కుటుంబాలు విషాదంలో మునిగాయి. ఇన్నాళ్లూ ఈ విషయాన్ని తమ వద్ద ఎందుకు దాచిపెట్టారని కేంద్రాన్ని వారు ప్రశ్నిస్తున్నారు. తమవారు చనిపోయారని ప్రభుత్వం నుంచి అధికారికంగా ఎలాంటి సమాచారం అందలేదని పంజాబ్‌లోని బాధిత కుటుంబాల సభ్యులు తెలిపారు. 'సుష్మా స్వరాజ్‌ను 12 సార్లు కలుసుకున్నాం. జాడ తెలియకుండా పోయిన భారతీయులంతా బతికే ఉన్నారని ఆమె ధైర్యం చెప్పారు. హర్జీత్ మాసిహ్ అబద్ధాలాడుతున్నాడని అన్నారు. ప్రభుత్వం తప్పుడు వివరాలు ఇవ్వడం కన్నా అసలు వారి వద్ద విశ్వసనీయ సమాచారం లేదని చెబితే బాగుండేది' అని అమృత్‌సర్‌కు చెందిన ఓ మృతుడి సోదరుడు సార్వాన్ వాపోయాడు. యెమెన్‌లో కేరళ నర్సులను కాపాడిన ప్రభుత్వం పంజాబ్‌కు చెందిన కార్మికులను రక్షించడంలో విఫలమైందని ఆక్రోశం వెళ్లగక్కాడు. గల్లంతైన 27 ఏళ్ల మజీందర్ సింగ్ సోదరి గుర్పీందర్ కౌర్ కూడా ప్రభుత్వంపై అసహనం వ్యక్తం చేసింది. తొలుత వారంతా బతికే ఉన్నారన్న ప్రభుత్వం హఠాత్తుగా ఇలాంటి ప్రకటన చేయడమేంటని ఆవేదన చెందింది.

ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వండి: హర్జీత్

తనకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వడంతో పాటు తనపై పెట్టిన మానవ అక్రమ రవాణా కేసును ఉపసంహరించుకోవాలని హర్జీత్ డిమాండ్ చేశారు. ఐఎస్ నిర్బంధంలోని కార్మికులు ఆనాడే చనిపోయారని నాలుగేళ్లుగా చెబుతున్నానన్నారు. పోలీసులు తనపై అక్రమంగా పెట్టిన కేసు వల్ల ఆరు నెలలు జైలులో గడిపి బెయిల్‌పై బయటికి వచ్చినట్లు తెలిపారు.

ఫ్రాన్స్ మాజీ అధ్యక్షుడు సర్కోజీ అరెస్టు



పారిస్: ఫ్రాన్స్ మాజీ అధ్యక్షుడు నికోలస్ సర్కోజీని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. 2007 అధ్యక్ష ఎన్నికల ప్రచారానికి సర్కోజీకి నాటి లిబియా నియంత గడాఫీ నుంచి ధన సహాయం లభించిందన్న ఆరోపణలపై పోలీసులు ఆయనను విచారించనున్నారు. 2013 నుంచి దర్యాప్తు సాగుతున్న ఈ కేసులో విచారణకు హాజరుకావాల్సిందిగా సర్కోజీకి నోటీసులు పంపినా ఆయన స్పందించలేదు. దీంతో పోలీసులు సర్కోజీని అరెస్టు చేశారు. ఫ్రాన్స్ అధ్యక్ష ఎన్నికల్లో ప్రచార ఖర్చుల కోసం గడాఫీ నుంచి డబ్బు తీసుకెళ్లి సర్కోజీ మనుషులకు ఇచ్చానని ఓ వ్యాపారవేత్త గతేడాది నవంబరులో చెప్పడంతో ఈ కేసుకు ప్రాధాన్యత ఏర్పడింది. సర్కోజీకి ఎన్నికల ఖర్చులకు డబ్బు పంపించామని గతంలో గడాఫీతోపాటు ఆయన కొడుకు సీఫ్ అల్–ఇస్లాం కూడా చెప్పారు. అయితే అమెరికా సైన్యంతో కలసి లిబియాలో 41 ఏళ్ల గడాఫీ పాలనను ముగించినందుకే తనపై వారు ఆరోపణలు చేశారని సర్కోజీ వాదిస్తున్నారు.

'రామరాజ్య రథయాత్ర'పై తమిళనాట నిరసన

సాక్షి, చెన్నై: అయోధ్యలో రామాలయ నిర్మాణం, దేశంలో రామరాజ్య స్థాపన నినాదంతో విశ్వ హిందూ పరిషత్, శ్రీరామదాస మిషన్ యూనివర్సల్ సొసైటీ చేపట్టిన రామరాజ్య రథయాత్రకు తమిళనాడులో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఫిబ్రవరి 14వ తేదీన అయోధ్యలో బయలుదేరిన ఈ యాత్ర మంగళవారం తమిళనాడులోకి ప్రవేశించింది. కేరళ నుంచి తమిళనాడులోని పులియరైకు యాత్ర చేరుకోగానే వీసీకే, నామ్ తమిళర్ కట్చి, మనిద నేయ మక్కల్ కట్చి, తమిళర్ వాల్వురిమై కట్చి తదితర పార్టీల నేతలు నినాదాలు చేస్తూ యాత్రను అడ్డుకున్నారు. దీంతో పోలీసులు వారిని అరెస్టు చేశారు.

ఆగని పెరియార్ విగ్రహాల ధ్వంసం: తమిళనాడులో ద్రవిడ ఉద్యమ నేత, సంఘ సంస్కర్త ఈవీ రామస్వామి (పెరియార్) విగ్రహాల ధ్వంసం కొనసాగుతోంది. మంగళవారం పుదుకొట్టాయ్ జిల్లాలోని ఓ గ్రామంలో ఉన్న పెరియార్ విగ్రహం నుంచి గుర్తుతెలియని దుండగులు తలను వేరుచేసి రోడ్డుపై పడేసినట్లు పోలీసులు వెల్లడించారు. దీన్ని డీఎంకే వర్కింగ్ ప్రెసిడెంట్, ప్రతిపక్షనేత స్టాలిన్, ప్రముఖ సినీ నటుడు రజనీకాంత్ తీవ్రంగా ఖండించారు.

లైంగిక వేధింపుల కేసులో ప్రొఫెసర్ అరెస్ట్



న్యూఢిల్లీ: విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ(జేఎన్‌యూ) ప్రొఫెసర్ ఒకరిని పోలీసులు అరెస్ట్ చేశారు. జేఎన్‌యూ లైఫ్ సైన్సెస్ విభాగంలో పనిచేస్తున్న ప్రొఫెసర్ అతుల్ జోహ్రి(54)తమను వేధిస్తున్నారంటూ సోమవారం కొందరు మహిళా విద్యార్థినులు వసంత్‌కుంజ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివిధ సంఘాలు, విద్యార్థులు, 54 మంది జేఎన్‌యూ ప్రొఫెసర్లు బాధితులకు మద్దతుగా పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. బాధితుల ఫిర్యాదులపై వేర్వేరుగా ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ప్రొఫెసర్‌ను అరెస్ట్ చేయాలంటూ మంగళవారం కూడా వారు ఆందోళనకు దిగారు. దీంతో పోలీసులు ప్రొఫెసర్‌పై ఏడు ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేయటంతోపాటు అదుపులోకి తీసుకుని, విచారణ చేపట్టారు. అనంతరం మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా బెయిల్ మంజూరు చేశారు.

అమెరికా స్కూల్లో మళ్లీ కాల్పుల మోత

వాషింగ్టన్: అమెరికాలోని మరో స్కూలును తుపాకీ మోతలు వణికించాయి. ఫ్లోరిడా స్కూలు ఘటన మరువకముందే మేరీల్యాండ్ రాష్ట్రంలోని గ్రేట్ మిల్స్ హైస్కూలులో మంగళవారం ఉదయం ఒక విద్యార్థి తుపాకీతో కాల్పులకు తెగబడి ఇద్దరు విద్యార్థులను తీవ్రంగా గాయపర్చాడు. వెంటనే తేరుకున్న స్కూలు భద్రతాధికారి ఎదురుకాల్పులు జరపడంతో దుండగుడు తీవ్రంగా గాయపడ్డాడు. అనంతరం చికిత్స పొందుతూ మరణించాడు. గాయపడ్డ ఇద్దరు విద్యార్థులు స్థానిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని, వారి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని సెయింట్ మేరీ కౌంటీ షెరీఫ్ టిమ్ కేమరాన్ తెలిపారు. ఉదయం 8 గంటలకు స్కూలు ప్రారంభమైన వెంటనే ఈ కాల్పుల సంఘటన చోటు చేసుకుందని కేమరాన్ చెప్పారు.

శశికళ భర్త కన్నుమూత

నేడు అంత్యక్రియలు

- శశికళకు 15 రోజుల పెరోల్



సాక్షి, చెన్నై: తమిళ ప్రజల అమ్మ జయలలితకు నెచ్చెలి, అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం ప్రధాన కార్యదర్శి శశికళ భర్త నటరాజన్(75) మంగళవారం తెల్లవారుజామున కన్నుమూశారు. శశికళ భర్త, పుదియ పార్వై పత్రిక సంపాదకుడు అయిన నటరాజన్ గత ఏడాది తీవ్ర అనారోగ్యం బారిన పడ్డారు. అనేక చికిత్సల అనంతరం ఆయన కోలుకున్నట్టు కుటుంబీకులు భావించారు. నుంగంబాక్కం మహాలింగపురంలోని నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. అయితే, ఆయన గతవారం గుండెపోటుకు గురయ్యారు. చెన్నై శివారులోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం వేకువజామున 1.30 గంటలకు ఆయన కన్నుమూశారు. ఆయన భౌతిక కాయాన్ని పోరూర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి ఎంబామింగ్ చేశారు. అనంతరం చెన్నై బీసెంట్ నగర్‌లోని నివాసంలో మధ్యాహ్నం వరకు ఉంచారు. అనంతరం తంజావూరు జిల్లాలోని నటరాజన్ స్వగ్రామం విలార్‌కు తరలించారు. బుధవారం అంత్యక్రియలు జరగనున్నాయి. డీఎంకే కార్యనిర్వాహక అధ్యక్షుడు స్టాలిన్, కేంద్ర మాజీ మంత్రి దయానిధి మారన్, ఎండీఎంకే నేత వైగో, పుదుచ్చేరి సీఎం నారాయణ స్వామి, కాంగ్రెస్ శాసనసభా పక్ష నేత కేఆర్ రామస్వామి తదితరులు నటరాజన్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

శశికళకు పెరోల్ మంజూరు

నటరాజన్ మరణంతో బెంగళూరు జైల్లో ఉన్న శశికళకు 15 రోజుల పెరోల్ మంజూరైంది. ఆమెను రోడ్డుమార్గంలో తంజావూరుకు తీసుకెళ్లేందుకు కుటుంబసభ్యులు ఏర్పాట్లు చేశారు.

ప్రభుత్వ ఉద్యోగుల తక్షణ అరెస్టు వద్దు

ముందు నియామక విభాగం అనుమతి తీసుకోవాలి


- ఎస్సీ, ఎస్టీ వేధింపుల చట్టంపై సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు



న్యూఢిల్లీ: ఎస్సీ, ఎస్టీ (వేధింపుల నివారణ) చట్టం–1989కి సంబంధించి సుప్రీంకోర్టు మంగళవారం కీలక ఉత్తర్వులు ఇచ్చింది. ఈ చట్టం కింద కేసు నమోదైతే నిందితులెవ్వరినీ తక్షణమే అరెస్టు చేయకూడదనీ, కనీసం డీఎస్పీ స్థాయి అధికారి ప్రాథమిక విచారణ జరిపి ఆరోపణల్లో నిజానిజాలు తెలుసుకున్న తర్వాతనే అరెస్టు చేయాలంది. ప్రభుత్వ ఉద్యోగుల విషయంలో అయితే వారి సంబంధిత నియామక విభాగం అనుమతి పొందిన తర్వాతనే అరెస్టులు చేయాలని జస్టిస్ ఆదర్శ్ గోయల్, జస్టిస్ యూయూ లలిత్‌లతో కూడిన ధర్మాసనం తేల్చి చెప్పింది. ఈ చట్టాన్ని ఆయుధంగా చేసుకుని కొందరు ప్రభుత్వ ఉద్యోగులను తప్పుడు కేసులతో బెదిరిస్తూ విధి నిర్వహణలో అడ్డుతగులుతున్నారనీ, అమాయక పౌరులను వేధిస్తున్న ఘటనలు అనేకం జరుగుతున్నాయని ధర్మాసనం పేర్కొంది. 'నిజంగా నేరాలు జరిగిన కేసుల్లో మాత్రమే ముందస్తు బెయిలు మంజూరు చేయకూడదు. నేరం చేసినట్లు ప్రాథమికంగా నిర్ధారణ కానప్పుడు కూడా బెయిల్ ఇవ్వకపోతే అప్పుడు నిర్దోషులకు రక్షణ లేనట్లే' అని న్యాయమూర్తులు తమ 89 పేజీల తీర్పులో పేర్కొన్నారు. 'దురుద్దేశంతో కేసు పెట్టారని, నేరం జరగలేదని ప్రాథమికంగా తెలిసినప్పుడు.. అలాంటి కేసుల్లో ముందస్తు బెయిలు ఇవ్వడంపై సంపూర్ణ నిషేధమేదీ లేదు. అమాయకులను వేధించడానికి చట్టాలను దుర్వినియోగం చేస్తుంటే.. దానిని అరికట్టే అధికారం మాకుందని మరోసారి చెబుతున్నాం' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అయితే ఈ ఆదేశాల ద్వారా తాము ఎస్సీ, ఎస్టీ చట్టంలోని సెక్షన్ 18ని నిర్వీర్యం చేయడం లేదనీ, నిజంగా నేరాలు జరిగిన కేసుల్లో, కస్టడీలో నిందితులను విచారించాల్సిన కేసుల్లో ప్రాథమిక విచారణ అనంతరం అరెస్టులు చేయవచ్చని ధర్మాసనం స్పష్టం చేసింది. 'పోలీసులు, ఇతరులు దురుద్దేశంతో పౌరులపై వేధింపుల కోసం చట్టాన్ని ఆయుధంగా వాడుకోకూడదు. కానీ ఇలా జరిగినట్లు అనేక సందర్భాల్లో బయటపడింది' అని కోర్టు పేర్కొంది. 'ఒక పౌరుడి కులమతాలేవైనా అతణ్ని వేధించడం రాజ్యాంగం కల్పించిన హక్కులకు విరుద్ధం. ఆ హక్కుకు ఈ కోర్టు రక్షణ కల్పిస్తుంది. చట్టం వల్ల కుల విద్వేషాలు రాకూడదు' అని న్యాయమూర్తులు అన్నారు.

భారతీయ కాల్ సెంటర్లకు ముప్పు

అమెరికన్ కాల్ సెంటర్ల పరిరక్షణకు బిల్లు



వాషింగ్టన్: భారతీయ కాల్ సెంటర్లపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపే బిల్లును అమెరికన్ కాంగ్రెస్‌లో ప్రవేశపెట్టారు. అమెరికన్ కాల్ సెంటర్లను పరిరక్షించాలని డెమొక్రటిక్ సెనేటర్ షెర్రాడ్ బ్రౌన్ ఈ బిల్లులో ప్రతిపాదించారు. ఈ బిల్లు చట్టమైతే భారత్‌లోని కాల్ సెంటర్ ఉద్యోగాలు ప్రమాదంలో పడతాయి. 'బై అమెరికన్, హైర్ అమెరికన్' అన్న ట్రంప్ విధానంలో భాగంగా ఈ బిల్లు వచ్చింది. బిల్లు ప్రవేశపెట్టిన సందర్భంగా బ్రౌన్ మాట్లాడుతూ.. 'చాలాకాలంగా అమెరికా వాణిజ్యం, పన్ను విధానం కార్పొరేట్ వ్యాపారాల్ని ప్రోత్సహించాయి. దీంతో ఓహియోలో వ్యాపార కార్యకలాపాలు మందగించాయి. అమెరికా నౌకల ఉత్పత్తి పరిశ్రమలు మెక్సికోలోని రైనోసాకు, చైనాలోని వుహాన్‌కు తరలిపోయాయి. కాల్ సెంటర్ ఉద్యోగాలు ఇతర దేశాలకు తరలిపోయాయి. ఓహియాలోనూ, దేశవ్యాప్తంగా ఉన్న పలు కాల్ సెంటర్లను చాలా కంపెనీలు భారత్ లేదా మెక్సికోకు తరలించాయి. ఈ ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల వల్ల ఎందరో అమెరికన్లు ఉద్యోగాలు కోల్పోయార'న్నారు.

బిల్లులో ముఖ్యాంశాలివీ...

- భారత్ వంటి దేశాల కాల్ సెంటర్ ఉద్యోగులు తామున్న ప్రాంతాన్ని వినియోగదారులకు కచ్చితంగా తెలపాలి.
- వినియోగదారులకు తమ కాల్‌ను అమెరికాలో ఉన్న సర్వీస్ ఏజెంట్‌కు బదిలీ చేయ మని అడిగే హక్కు ఉంటుంది.
- ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలను విదేశీయులకు కాకుండా అమెరికన్లకు ఇచ్చే కంపెనీలకే ఫెడరల్ కాంట్రాక్టులు ఇచ్చే విషయంలో ప్రాధాన్యం.

అంగుళం భూమినీ వదలం

ప్రపంచంలో ప్రముఖ స్థానం కోసం దేనికైనా సిద్ధం

- విస్తరణ వాదం, ఆధిపత్య ధోరణి లేదు
- చైనా జాతి గొప్పతనాన్ని చాటుదాం: జిన్‌పింగ్



బీజింగ్: చైనా తన భూభాగంలో అంగుళం కూడా ఇతరులకు వదిలిపెట్టబోదని అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ స్పష్టం చేశారు. ప్రపంచ రాజకీయాల్లో తన స్థానాన్ని పదిలం చేసుకునేందుకు ఏ స్థాయి యుద్ధానికైనా సిద్ధమేనన్నారు. నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్(ఎన్‌పీసీ) సమావేశాల చివరి రోజు జిన్‌పింగ్ ప్రసంగం దూకుడుగా సాగింది. చైనా జాతికి పునర్వైభవం సాధిద్దామంటూ ఆయన ఈ సందర్భంగా ప్రజలకు పిలుపునిచ్చారు. చైనా జాతీయవాదమే కేంద్రంగా.. పొరుగు దేశాలతో సంబంధాలు, ఉయిగుర్ సమస్య, తైవాన్ విలీనం, టిబెట్ తదితర అంశాలను ఆయన పరోక్షంగా ప్రస్తావించారు. ఎన్‌పీసీ సమావేశాల చివరి రోజు సాధారణంగా ప్రధాని మీడియా సమావేశం ఉంటుంది. ఈ సంప్రదాయానికి విరుద్ధంగా అధ్యక్షుడు జిన్‌పింగ్ ప్రసంగించారు. ఈ సమావేశాల్లో జిన్‌పింగ్ జీవితకాల అధ్యక్షుడిగా ఎన్నికైన విషయం తెలిసిందే. జిన్‌పింగ్ ప్రసంగం ఆయన మాటల్లోనే..

ప్రజా సేవకుడిని..

ఎన్ని అపరిమిత అధికారాలున్నా సరే, నేను ప్రజా సేవకుడిని. ఎప్పటి మాదిరిగానే వారి కోసం పనిచేస్తా. మన ప్రజలు పట్టుదల గలవారు, ఎవరికీ లొంగరు. స్వాతంత్య్రం కోసం శత్రువులతో ఎలాంటి యుద్ధానికైనా సిద్ధంగా ఉంటారు. మన భూభాగాలను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు కృతనిశ్చయంతో ఉందాం. దేశ సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను కాపాడుదాం. దేశాన్ని విభజించాలనుకునేవారి కుయుక్తులు చెల్లవు. వేర్పాటువాదులకు పరాజయం, శిక్ష తప్పదు. చైనా విస్తరణ వాదాన్ని, ఆధిపత్యాన్ని కోరుకోవటం లేదు. ప్రపంచ రాజకీయాల్లో మనదైన చోటు సంపాదించే అవసరమైన శక్తిసామర్థ్యాలున్నాయి. 170 ఏళ్లుగా ఇందుకోసం పోరాడుతున్నాం. ఈ కల నిజమవుతుందని స్పష్టం చేస్తున్నా.

పార్టీదే సర్వాధికారం..

చైనాలో కమ్యూనిస్టు పార్టీయే సుప్రీం. ఇరవై లక్షల సైన్యం, ప్రభుత్వ సంస్థలు కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలోనే పనిచేస్తాయి. దేశ రాజకీయ నాయకత్వంలో పార్టీదే అత్యున్నత స్థానం. చైనా జాతి గౌరవాన్ని నిలబెట్టి, కాపాడే బాధ్యత కూడా కమ్యూనిస్టు పార్టీదే. జీవిత కాలం అధ్యక్షుడిగా ఎన్నికైన విషయాన్ని ప్రస్తావిస్తూ.. 'ఇది దేశ ప్రజలు, కమ్యూనిస్టు పార్టీ నాపై పెట్టిన గురుతర బాధ్యత. ఏ హోదాలో ఉన్న వారైనా సరే, ఇది ప్రజల చైనా అనే విషయాన్ని మరువరాదు. జాతి గౌరవాన్ని నిలబెట్టి, మరింత సంపన్నులు, బలవంతులుగా అయ్యేందుకు పట్టుదలతో ప్రజలు ముందుకు సాగుతున్నారు' అని అన్నారు.

భారత్–చీనీ భాయి భాయి



భారత్, చైనాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల్ని బలోపేతం చేసుకోవడంతో పాటు ఉన్నత స్థాయిలో మరిన్ని సంప్రదింపులు కొనసాగేలా ఆ దేశంతో కలిసి పనిచేస్తామని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు ప్రధాని మోదీ తెలిపారు. చైనా అధ్యక్షుడిగా మరోసారి ఎన్నికైన షీ జిన్‌పింగ్‌కు అభినందనలు తెలిపేందుకు మంగళవారం ఫోన్ చేసిన ప్రధాని మోదీ.. అంతర్జాతీయ వ్యవహారాల్లో సమన్వయం, సహకారాన్ని పటిష్టం చేసుకునేందుకు, అంతర్జాతీయంగా, ప్రాంతీయంగా శాంతి, అభివృద్ధి కోసం చైనాతో కలిసి నడిచేందుకు సిద్ధమని స్పష్టం చేశారు. 21వ శతాబ్దం ఆసియాదేనని నిరూపించేందుకు ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు కీలకమని ఇరువురు అంగీకారానికి వచ్చారు.

తెలంగాణ మైనార్టీ గురుకులాల్లో ప్రవేశాలు

తెలంగాణలోని 204 మైనార్టీ గురుకులాల్లో 2018-19కి గాను ఐదో తరగతిలో రెగ్యులర్ ప్రవేశాలతోపాటు, ఆరు, ఏడు, ఎనిమిది, తొమ్మిదో తరగతుల్లో ఖాళీ (బ్యాక్‌లాగ్)గా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన విడుదలైంది. ఈ గురుకులాల్లో 75 శాతం సీట్లను మైనార్టీ (ముస్లిం, క్రిస్టియన్, జైన, పార్శీ, సిక్కు, బుద్ధిస్ట్) అభ్యర్థులతో, మిగిలిన వాటిని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ విద్యార్థులతో భర్తీ చేస్తారు. 2017-18 విద్యాసంవత్సరంలో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు ఐదో తరగతిలో ప్రవేశాలకు అర్హులు. అలాగే 6/7/8/9 తరగతుల్లోని బ్యాక్‌లాగ్ సీట్లకు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు 2017-18లో 5/6/7/8 తరగతులు చదువుతుండాలి. కుటుంబ వార్షిక ఆదాయం.. గ్రామాల్లో నివసిస్తున్నట్లయితే రూ.1,50,000, పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్నట్లయితే.. రూ.2 లక్షలకు మించకూడదు. ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలి. చివరి తేదీ ఏప్రిల్ 20, 2018. పూర్తి వివరాలకు వెబ్‌సైట్: tmreis.telangana.gov.in

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా

సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్,
సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

ఈఎస్ఐసీ 206 ఖాళీలు

ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ).. ఎనిమిది ఈఎస్ఐసీ మెడికల్ కళాశాలల్లోని 206 బోధన పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. సవరించిన విద్యార్హతల కారణంగా ఆయా మెడికల్ కాలేజీల్లోని ఖాళీల భర్తీకి ఇంతకు ముందే విడుదల చేసిన ప్రకటనల్లో మార్పులను పేర్కొంటూ తాజా నోటిఫికేషన్ విడుదల చేసింది.

❖ **పోస్టు-ఖాళీలు:** ప్రొఫెసర్-46, అసోసియేట్ ప్రొఫెసర్-75, అసిస్టెంట్ ప్రొఫెసర్-85.

❖ **మెడికల్ కాలేజీల వారీ ఖాళీలు:** ఈఎస్ఐసీ డెంటల్ కాలేజీ (గుల్బర్గా, కర్ణాటక)-9; ఈఎస్ఐసీ డెంటల్ కాలేజ్ (రోహిణి, న్యూఢిల్లీ)-13; ఈఎస్ఐసీ మెడికల్ కాలేజ్ (ఫరీదాబాద్, హర్యానా)-55; ఈఎస్ఐసీ పీజీఐఎంఎస్ఆర్ అండ్ మెడికల్ కాలేజ్ (రాజాజీ నగర్, బెంగళూరు, కర్ణాటక)-29; ఈఎస్ఐసీ పీజీఐఎంఎస్ఆర్ (మణిక్‌తల, కోల్‌కతా, పశ్చిమబెంగాల్)-3; ఈఎస్ఐసీ పీజీఐఎంఎస్ఆర్ అండ్ మెడికల్ కాలేజ్ (జోకా, కోల్‌కతా, పశ్చిమబెంగాల్)-25; ఈఎస్ఐసీ మెడికల్ కాలేజ్ (సనత్‌నగర్, హైదరాబాద్, తెలంగాణ)-38; ఈఎస్ఐసీ మెడికల్ కాలేజ్ (గుల్బర్గా, కర్ణాటక)-34.

❖ **బోధన విభాగాలు:** అనాటమీ, బయోకెమిస్ట్రీ, ఫిజియాలజీ, అనస్థీసియా, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, మైక్రోబయాలజీ, ఫార్మకాలజీ, కమ్యూనిటీ మెడిసిన్, డెంటిస్ట్రీ, డెర్మటాలజీ, ఈఎన్‌టీ, ఫోరెన్సిక్ మెడిసిన్, బ్లడ్ బ్యాంక్, ఒబేస్ట్రిక్ అండ్ గైనకాలజీ, ఆర్థోపెడిక్స్, ఆప్తాల్మాలజీ, పీడియాట్రిక్స్, పాథాలజీ, సైకియాట్రీ, రేడియాలజీ, టీబీ అండ్ చెస్ట్ డిసీజెస్, బ్లడ్/హెమటాలజీ, ఆర్ఈఎస్ మెడిసిన్/టీబీ/చెస్ట్, న్యూరాలజీ, కార్డియాలజీ, స్కిన్ అండ్ వీడీ, యురాలజీ.

❖ **వేతనశ్రేణి:** ప్రొఫెసర్-రూ.37,400-రూ.67,000; అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్-రూ.15,600-రూ.39,100.

❖ **అర్హతలు:** సంబంధిత పోస్టులు, విభాగాలను బట్టి ఎంబీబీఎస్/మెడికల్ పీజీ (ఎండీ/ఎంఎస్/ఎండీఎస్/..)/పీహెచ్‌డీ. అలాగే నిబంధనల మేర అనుభవం తదితర అర్హతలుండాలి. ❖ **ఎంపిక:** ఇంటర్వ్యూ.

❖ **దరఖాస్తు రుసుం:** రూ.225; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ/మహిళ/డిపార్ట్‌మెంటల్/మాజీ సైనికోద్యోగ కేటగిరీలకు ఫీజు లేదు.

❖ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.

❖ **చివరి తేదీ:** ఏప్రిల్ 2, 2018.

❖ **వెబ్‌సైట్:** www.esic.nic.in

ఎస్‌బీఐ... 119 ఖాళీలు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)... స్పెషలిస్ట్ కేడర్ కేటగిరీలోని 119 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

❖ **పోస్టు-ఖాళీలు:** స్పెషల్ మేనేజ్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ (ఎస్ఎంఈ)-35; డిప్యూటీ జనరల్ మేనేజర్ (డీజీఎం)-2 (లా); డిప్యూటీ మేనేజర్ (డీఎం)-82 (లా).

❖ **నోట్:** డీజీఎం పోస్టుల్లోని ఒక ఖాళీని కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేస్తారు. ❖ **వేతనశ్రేణి:** ఎస్ఎంఈ-రూ.42,020-రూ.51,490; డీఎం-రూ.31,705-రూ.45,950; డీజీఎం (రెగ్యులర్ పోస్టుకు)-రూ.68,680-రూ.74,520. డీజీఎం (కాంట్రాక్టువల్) పోస్టుకు అర్హతలను బట్టి నిర్ణయిస్తారు.

❖ **అర్హతలు:** ఎస్ఎంఈ పోస్టులకు సీఏ/ఐసీడబ్ల్యూఏ/ఏసీఎస్/ఎంబీఏ (ఫైనాన్స్)/పీజీ డిప్లొమా (ఫైనాన్స్) ఉత్తీర్ణత. అలాగే ఏదైనా షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్, అనుబంధ బ్యాంకుల్లో లేదా పబ్లిక్ సెక్టార్/గుర్తింపు పొందిన ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూట్/కంపెనీలో సూపర్‌వైజరీ/మేనేజ్‌మెంట్ హోదాలో ఎగ్జిక్యూటివ్‌గా కనీసం ఐదేళ్ల అనుభవం ఉండాలి; డీజీఎం, డీఎం పోస్టులకు లా డిగ్రీ (మూడేళ్లు/ఐదేళ్లు) ఉత్తీర్ణత ఉండాలి. అలాగే ఏదైనా షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్/ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూట్/అసెట్ రిస్ట్రక్షన్ కంపెనీలో లీగల్ ఆఫీసర్‌గా నిబంధనల మేర ఉద్యోగానుభవం, బార్ కౌన్సిల్‌లో అడ్వొకేట్‌గా రిజిస్ట్రేషన్ తప్పనిసరి. డీజీఎం పోస్టుల్లో ఒకదానికి లా పీజీ అభ్యర్థులకు ప్రాధాన్యం ఇస్తారు.

❖ **వయసు:** 2017, డిసెంబర్ 31 నాటికి ఎస్ఎంఈకి 30-40 ఏళ్ల లోపు; డీజీఎంకి 42-52 ఏళ్ల లోపు; డీఎంకు 25-35 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి.

❖ **ఎంపిక:** ఎస్ఎంఈ, డీజీఎంకు షార్ట్ లిస్టింగ్, ఇంటర్వ్యూ; డీఎంకు రాతపరీక్ష, ఇంటర్వ్యూ.

❖ **రాతపరీక్ష విధానం (డీఎం పోస్టులకు):** దీన్ని ఆన్‌లైన్‌లో 220 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో రీజనింగ్ నుంచి 70, ఇంగ్లిష్ లాంగ్వేజ్ నుంచి 50, ప్రొఫెషనల్ నాలెడ్జ్ నుంచి 50 ప్రశ్నలు ఇస్తారు. రీజనింగ్, ఇంగ్లిష్ లాంగ్వేజ్ పేపర్లను అర్హత పరీక్షగా పరిగణిస్తారు. వీటిలో నిర్దేశిత మార్కులతో ఉత్తీర్ణులైన వారి జాబితా నుంచి ప్రొఫెషనల్ నాలెడ్జ్ టెస్ట్‌కు ఎంపిక చేస్తారు. ప్రశ్నపత్రం ఇంగ్లిష్, హిందీల్లో మాత్రమే ఉంటుంది. రీజనింగ్, ఇంగ్లిష్ లాంగ్వేజ్ విభాగాలకు 90 నిమిషాలు, ప్రొఫెషనల్ నాలెడ్జ్‌కు 45 నిమిషాలు వ్యవధి ఇస్తారు. ప్రొఫెషనల్ నాలెడ్జ్ టెస్ట్‌లో నిర్దేశిత మార్కులతో ఉత్తీర్ణులైన వారిని ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. దీన్ని 50 మార్కులకు నిర్వహిస్తారు. వెయిటేజీ 25 మార్కులుగా పరిగణిస్తారు. ప్రొఫెషనల్ నాలెడ్జ్, ఇంటర్వ్యూల్లో వచ్చిన మార్కుల ఆధారంగా తుది ఎంపిక ఉంటుంది.

❖ **దరఖాస్తు రుసుం:** జనరల్/ఓబీసీ-రూ.600; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ-రూ.100. ❖ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.

❖ **చివరి తేదీ:** ఏప్రిల్ 7, 2018.

❖ **వెబ్‌సైట్:** www.sbi.co.in, bank.sbi/careers



పీవీఎన్ఆర్ తెలంగాణ వెటర్నరీ వర్సిటీ 183 ఖాళీలు

హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో ఉన్న పీవీ నరసింహారావు తెలంగాణ వెటర్నరీ వర్సిటీ (పీవీఎన్ఆర్‌టీవీయూ)లో 183 బోధన ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతూ రెండు వేర్వేరు ప్రకటనలు విడుదలయ్యాయి. ఇందులో 83 పోస్టులు లిమిటెడ్/ బ్యాక్‌లాగ్‌వి.

❖ **పోస్టు-ఖాళీలు:** ప్రొఫెసర్-28; అసోసియేట్ ప్రొఫెసర్-56; అసిస్టెంట్ ప్రొఫెసర్-99.

❖ **వేతనం:** ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్-రూ.37,400-రూ.67,000; అసిస్టెంట్ ప్రొఫెసర్-రూ.15,600-రూ.39,100. పోస్టును బట్టి ఏజీపీ వేర్వేరుగా ఉంటుంది.

❖ **విభాగాలు:** వెటర్నరీ సైన్స్, డెయిరీ సైన్స్, ఫిషరీ సైన్స్, అగ్రికల్చరల్ సైన్సెస్, లైబ్రరీ సైన్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్. ❖ అర్హతలు: సంబంధిత పోస్టులు, విభాగాలను బట్టి మాస్టర్స్ డిగ్రీతోపాటు నెట్/స్లెట్/సెట్/పీహెచ్‌డీ. అలాగే నిబంధనల మేర మార్కుల శాతం, బోధన/ పరిశోధన రంగంలో అనుభవం తదితర అర్హతలుండాలి.

❖ ఎంపిక: వర్సిటీ నిబంధనలప్రకారం.

❖ దరఖాస్తు రుసుం: రూ.1,000 (ఎస్సీ/ఎస్టీ-రూ.500).

❖ దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్.

❖ దరఖాస్తులు చేరాల్సిన చిరునామా: ది రిజిస్ట్రార్, పీవీ నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, రాజేంద్రనగర్, హైదరాబాద్-500030, తెలంగాణ.

❖ దరఖాస్తు చేరడానికి చివరి తేదీ: బ్యాక్‌లాగ్/లిమిటెడ్ రిక్రూట్‌మెంట్ పోస్టులకు ఏప్రిల్ 9, 2018; మిగిలిన పోస్టులకు ఏప్రిల్ 10, 2018.

❖ **వెబ్‌సైట్: tsvu.nic.in**

ఎయిర్‌ఫోర్స్ 145 ఖాళీలు

ఇండియన్ ఎయిర్ ఫోర్స్ హెచ్‌క్యూ మెయింటెనెన్స్ కమాండ్.. దేశవ్యాప్తంగా ఉన్న ఎయిర్‌ఫోర్స్ స్టేషన్స్/రిపెయిర్ డిపోల్లోని 145 గ్రూప్ 'సి' సివిలియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన విడుదల చేసింది.

ఎయిర్‌ఫోర్స్ స్టేషన్/రిపెయిర్ డిపోలు: కాన్పూర్, చండీగఢ్, కోయంబత్తూర్, న్యూఢిల్లీ, చెన్నై, పుణె, నాసిక్, బెంగళూరు, బేతుల్ (మధ్యప్రదేశ్), గురుగ్రామ్. పోస్టు-ఖాళీలు: మల్టీ టాస్కింగ్ స్టాఫ్ (ఎంటీఎస్)-90; హెచ్‌కేఎస్ (హౌస్ కీపింగ్ స్టాఫ్)-19; హిందీ టైపిస్ట్-1; పెయింటర్-3; ఏసీ మెకానిక్-2; ఇన్‌స్ట్రుమెంట్ రిపెయిరర్-1; మెస్ స్టాఫ్-5; డ్రాఫ్ట్స్‌మ్యాన్ (గ్రేడ్ 2)-1; కార్పెంటర్-2; కుక్-8; లాండ్రీమ్యాన్-3, టైలర్-1; లోయర్ డివిజన్ క్లర్క్ (ఎల్‌డీసీ)-6; ఫైర్‌మ్యాన్-2, కాపర్‌స్మిత్ అండ్ షీట్ మెటల్ వర్కర్ (సీఅండ్ఎస్ఎం డబ్ల్యూ)-1.

❖ **వేతనశ్రేణి:** డ్రాఫ్ట్స్‌మ్యాన్- రూ.25,500-రూ.81,100; హెచ్‌కేఎస్, ఎంటీఎస్, మెస్ స్టాఫ్, లాండ్రీ మ్యాన్-రూ.18,800-రూ.56,900; మిగిలిన పోస్టులకు రూ.19,900-రూ.63,200. ❖ **అర్హతలు:** సంబంధిత పోస్టులు, విభాగాలను అనుసరించి పదోతరగతి/పదోతరగతి+ఐటీఐ/ఇంటర్/ఇంజనీరింగ్ డిప్లొమా. అలాగే నిబంధనల మేర పోస్టును బట్టి అనుభవం, టైపింగ్ (ఎల్‌డీసీ/హిందీ టైపిస్ట్), సంబంధిత ప్రత్యేకాంశాల్లో నైపుణ్యం ఉండాలి.

❖ **శారీరక ప్రమాణాలు (ఫైర్‌మ్యాన్ పోస్టులకు):** ఎత్తు (షూ లేకుండా)-ఎస్టీ అభ్యర్థులకు కనీసం 162.5 సెం.మీ., మిగిలిన కేటగిరీలకు కనీసం 165 సెం.మీ.; ఛాతీ-81.5 సెం.మీ. (సాధారణం)-85 సెం.మీ. (గాలి పీల్చినపుడు); బరువు-కనీసం 50 కిలోలు.

❖ **దేహ దారుఢ్య పరీక్ష (ఫైర్‌మ్యాన్ పోస్టులకు):** 63.5 కిలోల బరువున్న మనిషిని 96 సెకన్లలో 183 మీటర్ల దూరం మోసుకెళ్లగలగాలి. డిచ్ లాండింగ్-2.7 మీటర్ల దూరాన్ని దూకగలగాలి. 3 మీటర్ల ఎత్తయిన తాడుపై నిలువుగా పైకి చేరుకోగలగాలి.

❖ **వయసు:** ఫైర్‌మ్యాన్‌కు 18-27 ఏళ్ల లోపు; మిగిలిన పోస్టులకు 18-25 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి.

❖ **ఎంపిక:** రాతపరీక్ష, స్కిల్/ప్రాక్టికల్/ఫిజికల్ టెస్ట్.

❖ **రాతపరీక్ష విధానం:** ఇందులో జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్, న్యూమరికల్ ఆప్టిట్యూడ్, జనరల్ ఇంగ్లిష్, జనరల్ అవేర్‌నెస్ నుంచి ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నపత్రం ఇంగ్లిష్, హిందీల్లో మాత్రమే ఉంటుంది. రాతపరీక్షలో నిర్దేశిత మార్కులతో ఉత్తీర్ణులైన వారి మెరిట్ జాబితా నుంచి స్కిల్/ప్రాక్టికల్/ఫిజికల్ టెస్ట్‌కు ఎంపిక చేస్తారు.

❖ **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని, సంబంధిత ఖాళీల ఎయిర్‌ఫోర్స్ స్టేషన్/డిపోల చిరునామాకు గడువులోగా చేరేలా పంపాలి.

❖ **చివరి తేదీ:** ఎంప్లాయిమెంట్ న్యూస్‌లో నోటిఫికేషన్ వెలువడిన 30 రోజుల్లోపు.

❖ **వెబ్‌సైట్:** www.indianairforce.nic.in

సీఈఐఎల్ 244 ఖాళీలు

సర్టిఫికేషన్ ఇంజనీర్స్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ (సీఈఐఎల్).. సప్లయ్ చైన్ మేనేజ్‌మెంట్ (ఎస్‌సీఎం), ప్లానింగ్, కన్‌స్ట్రక్షన్, సేఫ్టీ, వేర్‌హౌస్ తదితర విభాగాల్లోని 244 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతూ రెండు వేర్వేరు ప్రకటనలు విడుదల చేసింది.

❖ **పోస్టు-ఖాళీలు:** సీనియర్ కన్‌స్ట్రక్షన్ ఇంజనీర్ (ఎస్‌సీఈ)-54; డిప్యూటీ కన్‌స్ట్రక్షన్ మేనేజర్ (డీసీఎం)-21; కన్‌స్ట్రక్షన్ మేనేజర్ (సీఎం)-4; సీనియర్ సేఫ్టీ ఆఫీసర్ (ఎస్ఎస్‌వో)-22; డిప్యూటీ సేఫ్టీ మేనేజర్ (డీఎస్ఎం)-8; సీనియర్ వేర్‌హౌస్ ఆఫీసర్ (ఎస్‌డబ్ల్యూవో)-10; డిప్యూటీ వేర్‌హౌస్ మేనేజర్ (డీడబ్ల్యూఎం)-5; డిప్యూటీ ప్లానింగ్ మేనేజర్ (డీపీఎం)-15; సప్లయ్ చైన్ మేనేజ్‌మెంట్ (ఎస్‌సీఎం)-100 (కాంట్రాక్ట్స్ అండ్ పర్చేజ్ (సీపీ)-68+ఇన్‌స్పెక్షన్/ప్రొక్యూర్‌మెంట్ డెవలప్‌మెంట్ (పీడీడీ)-32); ప్లానింగ్ ఇంజనీర్ (పీఈ)-5.

❖ **నోట్:** ఎస్‌సీఎం, ప్లానింగ్‌లోని మొత్తం 105 పోస్టుల్లో కాంట్రాక్ట్స్ అండ్ పర్చేజ్, ఇన్‌స్పెక్షన్/ప్రొడక్షన్ డెవలప్‌మెంట్‌తోపాటు ప్లానింగ్‌లో విభిన్న విభాగాలవి ఉన్నాయి. అవి.. ఇంజనీర్-10, సీనియర్ ఇంజనీర్-30, డిప్యూటీ మేనేజర్-42 (సీపీ-20+పీడీడీ-14+ఇన్‌స్పెక్షన్-3+ప్లానింగ్-5), మేనేజర్-23 (సీపీ-8+ఇన్‌స్పెక్షన్/పీడీడీ-12+ఇన్‌స్పెక్షన్-3).

❖ **వేతనం:** ఎస్‌సీఈ, ఎస్ఎస్‌వో, ఎస్‌డబ్ల్యూవో పోస్టులకు రూ.74,250; డీసీఎం, డీఎం, డీఎస్ఎం, డీడబ్ల్యూవో-రూ.90,200; సీఎం-రూ.1,05,160; ఇంజనీర్-రూ.55,000; సీనియర్ ఇంజనీర్-68,000; డిప్యూటీ మేనేజర్-రూ.83,000; మేనేజర్-రూ.96,000.

❖ **అర్హతలు:** సంబంధిత పోస్టులు, విభాగాలను బట్టి ఇంజనీరింగ్‌లో గ్రాడ్యుయేషన్/డిప్లొమా. అలాగే నిబంధనల మేర మార్కుల శాతం, అనుభవం, సంబంధిత రంగం ప్రత్యేకాంశాలపై నైపుణ్యం తదితర అర్హతలుండాలి.

❖ **వయసు:** 2018, జనవరి 31 నాటికి 35-45 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి.

❖ **ఎంపిక:** ఇంటర్వ్యూ.

❖ **దరఖాస్తు విధానం:** ఈ-మెయిల్ ద్వారా.

❖ **దరఖాస్తు సమర్పణకు చివరి తేదీ:** మార్చి 31, 2018.

❖ **వెబ్‌సైట్:** http://ceil.co.in

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్.. 44 ఖాళీలు

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ (ఎన్ఐఓఎస్).. దేశవ్యాప్తంగా ఉన్న తన శాఖల్లోని 44 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఇది కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ పరిధిలోని స్వయంప్రతిపత్తి సంస్థ.

❖ **పోస్టు-ఖాళీలు:** ఈడీపీ సూపర్‌వైజర్-31 (అన్‌రిజర్వ్‌డ్-19+ఎస్సీ-3+ఎస్టీ-1+ఓబీసీ-8); జూనియర్ అసిస్టెంట్ (జేఏ)-13 (అన్‌రిజర్వ్‌డ్-11+ఎస్సీ-1+ఎస్టీ-1). ❖ **వేతనశ్రేణి:** ఈడీపీ సూపర్‌వైజర్-రూ.35,400-రూ.1,12,400; జేఏ-రూ.19,900-రూ.63,200.

❖ **అర్హతలు:** ఈడీపీ సూపర్ వైజర్‌కు ఏదైనా బ్యాచిలర్ డిగ్రీతోపాటు కంప్యూటర్ అప్లికేషన్స్/హార్డ్‌వేర్ ఇంజనీరింగ్‌లో పీజీ డిప్లొమా/తత్సమాన విద్యలో ఉత్తీర్ణత. అలాగే నిబంధనల మేర అనుభవం; జూనియర్ అసిస్టెంట్‌కు ఇంటర్మీడియెట్/తత్సమాన విద్యతోపాటు కంప్యూటర్ అంశాల్లో గంటకు 6 వేల డిప్రెషన్స్‌తో పనిచేయగల ప్రావీణ్యం ఉండాలి. హిందీ, ఇంగ్లిషుల్లో నైపుణ్యం ఉండాలి.

❖ **వయసు:** ఈడీపీ సూపర్‌వైజర్‌కు 37 ఏళ్లు; జూనియర్ అసిస్టెంట్‌కు 27 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.

❖ **ఎంపిక:** రాతపరీక్ష/ట్రేడ్/స్కిల్ టెస్ట్/ఇంటర్వ్యూ.

❖ **దరఖాస్తు రుసుం:** ఈడీపీ సూపర్‌వైజర్ పోస్టులకు రూ.500 (ఎస్సీ/ఎస్టీ-రూ.250), జూనియర్ అసిస్టెంట్ పోస్టులకు రూ.500 (ఎస్సీ/ఎస్టీ-రూ.150). దివ్యాంగ కేటగిరీకి ఫీజు లేదు.

❖ **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని, ఆయా ప్రాంతీయ ఎన్ఐఓఎస్ కేంద్రాలకు పంపొచ్చు.

❖ **తెలుగు రాష్ట్రాల్లో ఎన్ఐఓఎస్ కేంద్రాలు:** హైదరాబాద్, విశాఖపట్నం.

❖ **దరఖాస్తు చేరడానికి చివరి తేదీ:** మే 11, 2018.

❖ **వెబ్‌సైట్: nios.ac.in**

ఎన్‌టీఆర్‌వో 62 ఖాళీలు

నేషనల్ టెక్నికల్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఎన్‌టీఆర్‌వో).. గ్రూప్ 'ఎ' కేటగిరీలోని 62 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

❖ **పోస్టు:** సైంటిస్ట్ 'బి' ❖ **విభాగాల వారీ ఖాళీలు:** ఎలక్ట్రానిక్స్-21, కంప్యూటర్ సైన్స్-35, జియో ఇన్ఫర్మేటిక్స్-6. ❖ **అర్హతలు:** సంబంధిత విభాగాలను బట్టి బీఈ/బీటెక్/మాస్టర్స్ డిగ్రీ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణతతోపాటు గేట్ (2016/17/18) స్కోర్ కార్డ్ ఉండాలి. కంప్యూటర్ అప్లికేషన్స్‌లో ప్రావీణ్యం తప్పనిసరి.

❖ **వయసు:** దరఖాస్తు గడువు ముగిసే నాటికి 30 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి. ❖ **ఎంపిక:** గేట్ స్కోర్, ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామినేషన్. ❖ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్. ❖ **దరఖాస్తుల ప్రారంభం:** మార్చి 24, 2018. ❖ **చివరి తేదీ:** ఏప్రిల్ 14, 2018.

❖ **వెబ్‌సైట్:** http://ntro.gov.in

ఏఎస్ఆర్‌బీ 20 ఖాళీలు

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐసీఏఆర్)కు దేశవ్యాప్తంగా ఉన్న వివిధ ఇన్‌స్టిట్యూట్లలోని 20 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతూ అగ్రికల్చరల్ సైంటిస్ట్స్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ (ఏఎస్ఆర్‌బీ) నోటిఫికేషన్ విడుదల చేసింది.

❖ **పోస్టు-ఖాళీలు:** ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ (పీసీ)-9; హెడ్ ఆఫ్ డివిజన్ (హెచ్‌వోడీ)-11. ❖ **వేతన శ్రేణి:** రూ.37,400-రూ.67,700. ❖ **అర్హతలు:** సంబంధిత పోస్టులు, విభాగాలను బట్టి డాక్టోరల్ డిగ్రీ (సాయిల్ సైన్సెస్/అగ్రికల్చరల్ సైన్సెస్/బేసిక్ సైన్సెస్/అగ్రికల్చర్ ప్రాసెస్ ఇంజనీరింగ్/అగ్రికల్చరల్ అండ్ ఫుడ్ ఇంజనీరింగ్/ప్రాసెసింగ్ అండ్ అగ్రికల్చరల్ స్ట్రక్చరస్/హార్టికల్చర్ సైన్సెస్/...). అలాగే నిబంధనల మేర అనుభవం తదితర అర్హతలుండాలి. ❖ **వయసు:** దరఖాస్తు గడువు ముగిసే నాటికి 60 ఏళ్లు మించకూడదు. ❖ **దరఖాస్తు రుసుం:** రూ.500; ఎస్సీ/ఎస్టీ/మహిళ/దివ్యాంగ అభ్యర్థులకు ఫీజు లేదు. ❖ **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్. ❖ **దరఖాస్తు చేరడానికి చివరి తేదీ:** ఏప్రిల్ 16, 2018. ❖ **వెబ్‌సైట్:** www.icar.org.in, www.asrb.org.in

ఎంఈసీఎల్ 15 ఖాళీలు

మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో ఉన్న మినరల్ ఎక్స్‌ప్లొరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఈసీఎల్).. 15 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

❖ **పోస్టు:** ఎగ్జిక్యూటివ్ ట్రైనీ (కెమిస్ట్రీ).

❖ **మొత్తం ఖాళీలు:** 15 (అన్‌రిజర్వ్‌డ్-10+ఓబీసీ (ఎన్‌సీఎల్)-2+ఎస్సీ-1+ఎస్టీ-2).

❖ **అర్హతలు:** కనీసం 60 శాతం మార్కులతో ఎంఎస్సీ (కెమిస్ట్రీ)/తత్సమాన విద్యతోపాటు గేట్ 2017 స్కోర్. ❖ **వయసు:** 2018, జనవరి 21 నాటికి 28 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి. ❖ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్. ❖ **దరఖాస్తు ప్రారంభం:** ఏప్రిల్ 9, 2018.

❖ **చివరి తేదీ:** మే 8, 2018.

❖ **వెబ్‌సైట్:** www.mecl.gov.in

ఐఐఎస్ఈఆర్-పుణె 28 ఖాళీలు

పుణెలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐఐఎస్ఈఆర్).. 28 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఇది కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ పరిధిలోని స్వయంప్రతిపత్తి సంస్థ.

❖ **పోస్టు-ఖాళీలు:** లైబ్రేరియన్-1; డిప్యూటీ రిజిస్ట్రార్-1; ప్రిన్సిపల్ టెక్నికల్ ఆఫీసర్ (పీటీవో)-2; సీనియర్ టెక్నికల్ ఆఫీసర్ (ఎస్‌టీవో)-4; అసిస్టెంట్ లైబ్రేరియన్-1; టెక్నికల్ ఆఫీసర్ (టీవో)-5; నర్స్ (మేల్)-1; టెక్నికల్ అసిస్టెంట్ (టీఏ)-11; లేబొరేటరీ టెక్నీషియన్ (ఎల్‌టీ)-1; జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్ (జేవోఏ)-1 (మల్టీ స్కిల్).

❖ **వేతనం:** లైబ్రేరియన్-రూ.1,44,200; డిప్యూటీ రిజిస్ట్రార్, పీటీవో-రూ.78,800; ఎస్‌టీవో-రూ.67,700; అసిస్టెంట్ లైబ్రేరియన్-రూ.57,700; టీవో-రూ.56,100; నర్స్ (మేల్)-రూ.44,900; టీఏ-రూ.35,400; ఎల్‌టీ-రూ.29,200; జేవోటీ-రూ.25,500. ❖ **అర్హతలు:** సంబంధిత పోస్టులు, విభాగాలను బట్టి ఇంటర్/డిగ్రీ/ఇంజనీరింగ్ డిప్లొమా/బీఈ/బీటెక్/మాస్టర్స్ డిగ్రీ/పీహెచ్‌డీ. అలాగే నిబంధనల మేర మార్కుల శాతం, నెట్/స్లెట్/సెట్, కంప్యూటర్ ప్రత్యేకాంశాల్లో నైపుణ్యం తదితర అర్హతలుండాలి.

❖ **వయసు:** లైబ్రేరియన్‌కు 55 ఏళ్లు; డిప్యూటీ రిజిస్ట్రార్, పీటీవో-45; ఎస్‌టీవో-40; అసిస్టెంట్ లైబ్రేరియన్, టీవో-35; నర్స్ (మేల్)-36; టీఏ-30; ఎల్‌టీ-39; జేవోఏకు 33 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి. ❖ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్. ❖ **చివరి తేదీ:** ఏప్రిల్ 6, 2018.

❖ **వెబ్‌సైట్:** www.iiserpune.ac.in

సాక్షి బిజినెస్
బుధవారం 21-3-2018
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 10.30కి)

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
74 ▲	30 ▲
32,997	10,124

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	7,352	▲ 8
డోజోన్స్	24,715	▲ 103
ఎఫ్‌టీఎస్ఈ 100	7,061	▲ 18
డాక్స్	12,307	▲ 90
షాంఘై	3,290	▲ 11
నికాయ్	21,381	▼ 99

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		● కొనుగోలు	● అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	64.45	66.08
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	90.07	93.01
€	యూరో	ఎస్‌బీఐ	79.27	81.94
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	60.40	62.46
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	49.47	51.21
SS	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	48.83	50.44
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	15.78	18.69
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	16.15	18.88
¥	చైనా యువాన్	థామస్‌కుక్	7.29	11.82

టాటా, నిస్సాన్ ధరలు పెరుగుతున్నాయ్!

వచ్చే నెల 1 నుంచి ◆ రూ.60,000 వరకూ పెరుగుదల



న్యూఢిల్లీ: టాటా మోటార్స్ కంపెనీ ప్రయాణికుల వాహన ధరలను పెంచుతోంది. వచ్చే నెల 1 నుంచి వాహన ధరలను రూ.60,000 వరకూ పెంచుతున్నామని టాటా మోటార్స్ తెలిపింది. పెరుగుతున్న ఉత్పత్తి వ్యయాలను తట్టుకోవడానికి ధరలను పెంచక తప్పడం లేదని టాటా మోటార్స్ ప్రెసిడెంట్(ప్యాసింజర్ వెహికల్ బిజినెస్) మయాంక్ పరీక్ చెప్పారు. మారుతున్న మార్కెట్ పరిస్థితులు, ఇతర ఆర్థిక కారణాల వల్ల ధరలను పెంచుతున్నామని తెలిపారు. రానున్న ఆర్థిక సంవత్సరంలో వృద్ధి జోరును కొనసాగించగలమన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. తామందిస్తున్న టియాగో, హెక్సా, టైగర్, నెక్సాన్ మోడళ్లకు వినియోగదారుల నుంచి మంచి స్పందన లభిస్తుండడమే దీనికి కారణమని పేర్కొన్నారు. కాగా ఇటీవలనే జర్మనీ లగ్జరీ కార్ల కంపెనీ ఆడీ తన కార్ల ధరలను రూ.1–9 లక్షల రేంజ్‌లో పెంచిన విషయం తెలిసిందే. టాటా మోటార్స్ రూ.2.28 లక్షల ధర ఉన్న జెన్ ఎక్స్ నానో మోడల్ నుంచి రూ.17.42 లక్షల ధర ఉన్న ప్రీమియమ్ ఎస్‌యూవీ హెక్సా వరకూ విక్రయిస్తోంది.

నిస్సాన్ పెంపు 2 శాతం

కార్ల కంపెనీలు కొత్త ఆర్థిక సంవత్సరం నుంచి కార్ల ధరలను పెంచుతున్నాయి. పెరుగుతున్న ఉత్పత్తి వ్యయాలను తట్టుకోవడానికి ఈ కార్ల ధరలను పెంచక తప్పడం లేదని కంపెనీలంటున్నాయి. ఇప్పటికే ఆడీ, టాటా మోటార్స్, నిస్సాన్ కంపెనీలు ధరలను పెంచుతున్నట్లు వెల్లడించాయి. వచ్చే నెల 1 నుంచి అన్ని మోడళ్ల ధరలను పెంచుతున్నామని నిస్సాన్ ఇండియా తెలిపింది. ఈ పెరుగుదల 2 శాతం వరకూ ఉంటుందని నిస్సాన్ మోటార్ ఇండియా ఎమ్‌డీ, జెరోమి సైగట్ చెప్పారు. పెరుగుతున్న ఉత్పత్తి వ్యయాల కారణంగానే ధరలను పెంచుతున్నామని పేర్కొన్నారు.

ఇక ఇంటి వద్దకే ఇంధనం!!

● ఇండియన్ ఆయిల్ సంస్థ డీజిల్ హోమ్ డెలివరీ సర్వీసులు
● ప్రయోగాత్మకంగా పుణెలో అమలు ● త్వరలో పెట్రోల్ కూడా



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ దిగ్గజం ఇండియన్ ఆయిల్ తాజాగా ఇంటి వద్దకే ఇంధనం అందించే సర్వీసులు ప్రారంభించింది. ఇందులో భాగంగా డీజిల్‌ను హోమ్ డెలివరీ చేయడం మొదలుపెట్టింది. ప్రస్తుతం పుణెలో ప్రయోగాత్మకంగా ప్రారంభించిన సర్వీసులను త్వరలో దేశ వ్యాప్తంగా విస్తరించాలని కంపెనీ భావిస్తోంది. అలాగే పెట్రోల్ కూడా హోమ్ డెలివరీ చేయాలని యోచిస్తోంది. రవాణాకు అనువైనది కావడంతో పాటు కొంత సురక్షితం అయినందున ముందుగా హోమ్ డెలివరీకి డీజిల్‌ని ఎంచుకున్నట్లు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సీఎండీ సంజీవ్ సింగ్ తెలిపారు. పెట్రోల్‌ని కూడా అందించాలంటే కొన్ని రిస్కులు ఉన్నాయని.. దీనిపై పెట్రోలియం అండ్ ఎక్స్‌ప్లోజివ్స్ సేఫ్టీ ఆర్గనైజేషన్ (పెసో)తో చమురు కంపెనీలు చర్చిస్తున్నాయని ఆయన వివరించారు. ఇంధనాలను ఇంటివద్దకే అందించే సర్వీసుల అంశాన్ని పెట్రోలియం శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దాదాపు ఏడాది క్రితమే ప్రస్తావించారు. 2017 జూన్‌లోనే బెంగళూరుకి చెందిన స్టార్టప్ సంస్థ ఏఎన్‌బీ ఫ్యూయల్స్ సంస్థ .. మైపెట్రోల్‌పంప్ బ్రాండ్ పేరిట పెట్రోల్, డీజిల్ హోమ్ డెలివరీ సర్వీసులు కూడా మొదలుపెట్టింది. అయితే, ఈ విధంగా ఇంధనాలను రవాణా చేయడం సురక్షితం కాదని, ఏఎన్‌బీకి ఇంధనం సరఫరా చేయడాన్ని నిలిపివేయాలంటూ చమురు కంపెనీలకు పెసో సర్క్యులర్ జారీ చేసింది. ఆ ఉదంతం తర్వాత.. మళ్లీ ఇంధనాల హోమ్ డెలివరీకి ఇండియన్ ఆయిల్ తదితర చమురు కంపెనీలకు లైసెన్సులు ఇచ్చింది. వీటిలో ముందుగా ఇండియన్ ఆయిల్ సంస్థ ఈ సర్వీసులు ప్రారంభించింది.

ప్రపంచవ్యాప్త కవరేజీతో న్యూఇండియా హెల్త్‌ప్లాన్

6 రకాల క్రిటికల్ ఇల్‌నెస్‌లకు పరిహారం



ముంబై: న్యూ ఇండియా జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ తొలిసారిగా ప్రపంచవ్యాప్త కవరేజీతో కూడిన గ్లోబల్ మెడిక్లెయిమ్ పాలసీని మంగళవారం ఆవిష్కరించింది. కేన్సర్, అవయవ మార్పిడి, బోన్‌మారో ఇలా ఆరు రకాల క్రిటికల్ ఇల్‌నెస్‌లకు 0.5 మిలియన్ డాలర్ల నుంచి 20 మిలియన్ డాలర్ల వరకు ఈ పాలసీలో కవరేజీ పొందొచ్చు. ప్రపంచ వ్యాప్తంగా 100 ఆస్పత్రులతో ఒప్పందం చేసుకున్నట్టు న్యూఇండియా జనరల్ ఇన్సూరెన్స్ చైర్మన్, ఎండీ జి.శ్రీనివాసన్ మీడియాకు తెలిపారు. 18–75 సంవత్సరాల మధ్యనున్న వారు ఎటువంటి ముందస్తు షరతులు లేకుండా ఆరు రకాల క్రిటికల్ ఇల్‌నెస్‌లకు కవరేజీ పొందొచ్చు. ఎన్ని రకాల క్రిటికల్ ఇల్‌నెస్ కవరేజీలను ఎంచుకున్నారు, వయసు తదితర అంశాలపై ప్రీమియం ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు 18 ఏళ్ల వ్యక్తి ఒక దానికి కవరేజీ ఎంచుకుంటే ప్రీమియం రూ.5,672. ఆరు రకాల క్రిటికల్ ఇల్‌నెస్‌లకు కవరేజీ కోరుకుంటే ప్రీమియం రూ.12,716. అదే 75 ఏళ్ల వయసున్న వ్యక్తికి ఒక దానికి కవరేజీ కోసం ప్రీమియం రూ.2,05,696 కాగా, క్రిటికల్ ఇల్‌నెస్ కవర్‌తో కలిపితే వార్షిక ప్రీమియం రూ.4,95,899 అవుతుంది.

మూడా.. నాలుగా! ఫెడ్.. లబ్ డబ్..

ప్రపంచ మార్కెట్లకు దిశానిర్దేశం చేసే అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల పెంపుపై ప్రస్తుతం సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ ఏడాది మూడు దఫాలు మాత్రమే వడ్డీ రేట్లు పెంపు ఉండొచ్చని ముందస్తుగా అనుకున్నప్పటికీ.. అమెరికాలో ఆర్థిక పరిస్థితులు మెరుగవుతున్న నేపథ్యంలో ఈ పెంపు నాలుగుసార్లయినా లేదా అయిదుసార్లయినా కావొచ్చన్న అంచనాలు వెలువడుతున్నాయి.

● ఈ ఏడాది అమెరికా కేంద్ర బ్యాంక్ ఫెడ్ వడ్డీ రేట్ల పెంపుపై సర్వత్రా ఆసక్తి
● ద్రవ్యోల్బణం, ఉద్యోగ గణాంకాలు సానుకూలం
● చైర్మన్ పావెల్ సారథ్యంలో తొలి సమీక్ష



ఫెడరల్ రిజర్వ్ చైర్మన్‌గా పగ్గాలు చేపట్టిన తర్వాత జెరోమ్ పావెల్ తొలిసారిగా పరపతి విధాన సమీక్ష జరుపుతున్న నేపథ్యంలో వడ్డీ రేట్ల పెంపు విడతలపై ఉత్కంఠ నెలకొంది. మాజీ చైర్మన్ జేనెట్ యెలెన్‌లాగా క్రమానుగతంగా పెంచుకుంటూ వెళ్లే విధానాలనే కొనసాగిస్తారా.. లేక అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాలను ప్రతిబింబించేలా దూకుడు ప్రదర్శిస్తారా అన్నది మార్కెట్ వర్గాలు ఆసక్తిగా చూస్తున్నాయి. ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ (ఎఫ్‌వోఎంసీ) బుధవారం వడ్డీ రేట్లపై నిర్ణయాన్ని ప్రకటించనుంది. అదే సమయంలో ఆర్థిక అంచనాలను కూడా వెలువరిస్తుంది. ఇందులోనే వడ్డీ రేట్ల పెంపు ఎన్ని దఫాలు ఉండొచ్చన్నదీ వెల్లడి కానుంది. ఏదైతేనేం పావెల్ మాటలు బట్టి, అమెరికా సానుకూల ఆర్థిక పరిస్థితులు బట్టి చూస్తే వడ్డీ రేట్లను పెంచే క్రమం పెరగడమే తప్ప.. తగ్గే అవకాశాల్లేవని విశ్లేషకులు అంటున్నారు.

సానుకూల పరిస్థితులు..

ద్రవ్యోల్బణం, నిరుద్యోగిత గణాంకాలు మొదలైన వాటికి సంబంధించిన సానుకూల అంశాలు మరిన్ని దఫాలు వడ్డీ రేట్ల పెంపునకు దోహదపడే అవకాశాలు ఉన్నట్లుగా పరిశీలకులు భావిస్తున్నారు. ఇటీవలి కాలంలో ద్రవ్యోల్బణం పెరగడంతో.. వచ్చే ఏడాదిలోగా రెండు శాతం టార్గెట్‌ను సులువుగా చేరొచ్చని ఫెడరల్ రిజర్వ్‌కు కొంత భరోసానిస్తోంది. మరోవైపు, నిరుద్యోగిత స్థిరంగా 4.1 శాతంగా కొనసాగుతోంది. మెరుగుపడుతున్న ఎకానమీకి అనుగుణంగా ఉద్యోగాల కల్పనలో వృద్ధి కూడా క్రమంగా పెరుగుతోంది.

రిస్కులూ ఉన్నాయి..: ఇవన్నీ నాణేనికి ఒకవైపు కాగా.. దీనికి మరోవైపు కూడా చూడాలంటున్నారు మరికొందరు విశ్లేషకులు. ఇప్పుడున్నంత తక్కువ స్థాయిలో నిరుద్యోగిత సుదీర్ఘకాలం కొనసాగడం.. దాని ప్రభావాలు ఎలా ఉంటాయన్నది ఈ మధ్య కాలంలో ఎన్నడూ చూడలేదన్నది వారి వాదన. చాన్నాళ్ల క్రితం 1960ల ఆఖర్లో నిరుద్యోగిత 4 శాతం కన్నా తక్కువ స్థాయిలో ఉండేది. అయితే, అది 1970ల నాటికి భారీ ద్రవ్యోల్బణ పరిస్థితులకు దారి తీసింది. వడ్డీ రేట్ల పెంపునకు సంబంధించి ప్రస్తుత ద్రవ్యోల్బణం, నిరుద్యోగిత అంశాలను ఈ కోణంలో కూడా చూడాల్సి ఉంటుందని విశ్లేషకులు చెబుతున్నారు. ఇక, ఇప్పటికే పన్ను కోతలు, వ్యయాల పెంపుతో భారీ ఊతం లభించిన ఎకానమీకి.. అంతర్జాతీయంగా పటిష్ట వృద్ధి, బలహీన డాలరు, మెరుగుపడుతున్న పెట్టుబడులు మొదలైన అంశాలు కూడా తోడైతే ఆర్థిక వ్యవస్థ చాలా వేగంగా అస్థిరతకు లోనయ్యే అవకాశాలూ ఉన్నాయన్న అభిప్రాయం కూడా నెలకొంది.

ప్రస్తుతం ఫెడ్ రేట్లు 1.25 శాతం – 1.50 శాతం శ్రేణిలో ఉన్నాయి. తాజా సమీక్షలో వీటిని పావు శాతం పెంచవచ్చని అంచనా. దీంతో వడ్డీ రేట్ల శ్రేణి 1.5 శాతం – 1.75 శాతానికి చేరుతుంది. గతేడాది మూడు దఫాలుగా వడ్డీ రేట్లు పెంచిన ఫెడరల్ రిజర్వ్ .. ఈ ఏడాది మరో మూడు దఫాలు పెంచే అవకాశాలు ఉన్నాయంటూ డిసెంబర్‌లో సూచన ప్రాయంగా వెల్లడించింది. అయితే, ఈ ఏడాది జనవరిలో సమీక్ష జరిపినప్పటికీ.. రేట్లు మాత్రం యధాతథంగానే ఉంచింది. 2007–09 మధ్య కాలంలో ఆర్థిక మాంద్యం దరిమిలా ఎకానమీకి ఊతమిచ్చే ప్రయత్నాల్లో భాగంగా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను సున్నా స్థాయికి తగ్గించేసిన సంగతి తెలిసిందే.

రేపటి నుంచి ఐసీఐసీఐ సెక్యూరిటీస్ ఐపీఓ

ధరల శ్రేణి రూ.519–520



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఐసీఐసీఐ సెక్యూరిటీస్ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) గురువారం ప్రారంభం కానుంది. రూ.5 ముఖ విలువ కలిగిన 7,72,49,508 ఈక్విటీ షేర్లను జారీ చేయనుంది. వీటిల్లో 38,62,475 షేర్లను ఐసీఐసీఐ బ్యాంక్ షేర్ హోల్డర్ల కోసం కేటాయిస్తామని ఐసీఐసీఐ సెక్యూరిటీస్ రిటైల్ డిస్ట్రిబ్యూషన్ హెడ్ కేతన్ కర్కానీస్ మంగళవారమిక్కడ మీడియాకు తెలిపారు. ప్రతి ఈక్విటీ షేర్‌కు రూ.519–520 ధరల శ్రేణిని నిర్ణయించామని, కనీసం 28 షేర్ల కు బిడ్ దాఖలు చేయాల్సి ఉంటుం దని చెప్పారాయన. ఆఫర్ ఈ నెల 26న ముగుస్తుంది.

ఈసారి చిన్న సంస్థల వంతు..!

● అవి కూడా ఎన్‌పీఏలుగా మారే ప్రమాదం
● ఆర్‌బీఐ సర్క్యులర్‌తో సమస్య జఠిలం
● ఉదయ్ కొటక్ హెచ్చరిక
● నీలేకనితో కలసి బ్యాంకు ఛార్టర్ ఆవిష్కరణ
● ఏఐ ఆధారిత యాప్, బయోమెట్రిక్ బ్రాంచ్‌లు

ముంబై: మొండిబాకీల సమస్య కేవలం పెద్ద కార్పొరేట్లకే పరిమితం కాదని... ఈసారి చిన్న సంస్థల వంతూ రానుందని ప్రముఖ బ్యాంకరు, కొటక్ మహీంద్రా బ్యాంక్ ఎండీ ఉదయ్ కొటక్ హెచ్చరించారు. ఈ నేపథ్యంలో చిన్న, మధ్య తరహా సంస్థలకు (ఎస్ఎంఈ) ఇచ్చిన రుణాల నాణ్యతపై మరింతగా దృష్టి సారించాల్సి ఉందన్నారు. 'మొండిబాకీలన్నీ పెద్దపెద్ద కార్పొరేట్లవేనన్న అభిప్రాయం ఉంది. అయితే, ఎస్ఎంఈ వ్యాపారాల్లో కూడా ఇలాంటి పరిస్థితి ఉంది. అదింకా పూర్తి స్థాయిలో బయటపడటం లేదు అంతే..' అని ఉదయ్ పేర్కొన్నారు. ఐటీ దిగ్గజం నందన్ నీలేకని సమక్షంలో మంగళవారమిక్కడ జరిగిన కార్యక్రమంలో ఆయన కొటక్ మహీంద్రా బ్యాంకు 'విజన్'ను ఆవిష్కరిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. నిరర్థక ఆస్తుల (ఎన్‌పీఏ) వర్గీకరణ విషయంలో ఫిబ్రవరి 12న ఆర్‌బీఐ ఇచ్చిన సర్క్యులర్‌తో మొండిబాకీల సమస్య మరింతగా ముదిరే అవకాశం ఉందన్నారు. ''ఎన్‌పీఏల విషయంలో యూరోపియన్ దేశాలైన గ్రీస్, ఇటలీ తర్వాత మూడో స్థానానికి భారత్ చేరింది. దీన్ని చక్కదిద్దే చర్యలు అవసరం'' అని ఉదయ్ కొటక్ వ్యాఖ్యానించారు.

టెక్నాలజీతో కొటక్ ఛార్టర్...

తక్కువ నగదున్న వ్యవస్థలో వినియోగదారులకు టెక్నాలజీ ఆధారంగా మరింత మెరుగైన సేవలందించటమే లక్ష్యంగా కొటక్‌మహీంద్రా బ్యాంకు తాలూకు ఏబీసీడీ ఛార్టర్‌ను నీలేకనితో కలసి ఉదయ్ ఈ సందర్భంగా ఆవిష్కరించారు. ఇవి... ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో ముడిపడ్డ యాప్, బయోమెట్రిక్ బ్రాంచ్‌లు, కస్టమర్‌కు తగ్గ సేవలు, డేటాతో నిండిన డిజైన్. ఈ సందర్భంగా నీలేకని మాట్లాడుతూ ''గడిచిన దశాబ్దంలో టెక్నాలజీతో అంతరాలు తగ్గాయి. ప్రపంచమంతా ఒక్క మొబైల్‌లో ఒదిగిపోవటంతో మనం ముందెన్నడూ ఊహించని సేవలు, ఉత్పత్తులు అందుబాటులోకి వస్తున్నాయి'' అన్నారు. అందరికీ బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి తేవాలన్న ఉద్దేశంతో ఏడాది కిందట 811 సేవింగ్స్ ఖాతాను ప్రారంభించామని, ఇపుడు పూర్తి స్థాయి ఉత్పత్తులు, సేవలను దేశం నలుమూలలకూ అందించాలన్న లక్ష్యాన్ని విధించుకున్నామని ఉదయ్ కొటక్ తెలియజేశారు. ''ఆధార్ ఓటీపీ గుర్తింపును ఆర్‌బీఐ ఆమోదించిన మూడునెలలకు మేం 811 సేవల్ని ఆరంభించాం. అప్పటికి 80 లక్షల మంది ఖాతాదారులున్నారు. డిసెంబర్ 31నాటికి ఈ సంఖ్య 1.2 కోట్లకు చేరింది. దేశంలోని డిపాజిట్లలో 2 శాతం... మొబైల్ లావాదేవీల్లో 8 శాతం మా సొంతం. వచ్చే ఐదేళ్లలో ప్రయివేటు బ్యాంకుల వాటా 30 నుంచి 50 శాతానికి చేరుకుంటుందనే నమ్మకం నాకుంది'' అన్నారాయన.



మొండి బాకీలకూ టెక్నాలజీ పరిష్కారం

2008 ఆర్థిక సంక్షోభం తరవాత సరైన మదింపు లేకుండా ఇన్‌ఫ్రా తదితర రంగాలకు భారీ రుణాలిచ్చారని, వాటి చెల్లింపులను ఎనిమిదేళ్లుగా పొడిగించుకుంటూ రావడం మొండిబాకీల సంక్షోభానికి ప్రధాన కారణమని ఉదయ్ వ్యాఖ్యానించారు. సంక్షోభానంతరం ఇచ్చిన రుణాల అసలు మొత్తంలో కనీసం 40 శాతం వెనక్కి వచ్చినా సంతోషించవచ్చన్నారు. ప్రస్తుతం రిటైల్ రుణాల మంజూరులో టెక్నాలజీని వినియోగిస్తుండటం.. భవిష్యత్‌లో మొండిబాకీల సమస్యలను తగ్గించేందుకు తోడ్పడగలదని చెప్పారు.

బ్యాంకుల జాతీయాకరణతో ఒరిగిందేమిటి ..

బ్యాంకుల జాతీయాకరణ జరిగి 50 ఏళ్లు గడిచినా... అనేక కుంభకోణాలు బయటపడుతూనే ఉన్నాయని ఉదయ్ తెలిపారు. ఈ నేపథ్యంలో బ్యాంకుల జాతీయాకరణతో ఒనగూరిన ప్రయోజనాలేమిటని ప్రశ్నించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వజ్రాభరణాల వ్యాపారస్తులు నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీలు .. పంజాబ్ నేషనల్ బ్యాంకును (పీఎన్‌బీ) భారీగా మోసగించిన ఉదంతాన్ని ప్రస్తావిస్తూ.. ఇలాంటివి అసాధారణ పరిస్థితులన్నారు. ఈ స్కాంతో బ్యాంకింగ్ వ్యవస్థపై పోయిన నమ్మకాన్ని పునరుద్ధరించడానికి బ్యాంకర్లతో పాటు నియంత్రణ సంస్థ, ప్రభుత్వం కూడా కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ ఏడాది డిసెంబరు ఆఖరు నాటికి యూపీఐ (యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్) చెల్లింపుల వ్యవస్థ ద్వారా లావాదేవీలు వంద కోట్ల స్థాయికి చేరగలవని నీలేకని చెప్పారు. గతేడాది డిసెంబర్ ఆఖరు నాటికి ఈ లావాదేవీలు 14.5 కోట్లకు చేరాయి.

అమ్మకాల్లో అగ్రస్థానం ఆల్టో



టాప్–10లో 6 మారుతీవే

న్యూఢిల్లీ: భారత్‌లో గత నెలలో అత్యధికంగా అమ్ముడైన పది కార్లలో మారుతీ సుజుకీ కంపెనీ కార్లు ఆరు చోటు సంపాదించాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో అత్యధికంగా అమ్ముడైన కార్ల తొలి ఐదు స్థానాల్లో మారుతీ కార్లే ఉన్నాయని సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫాక్చరర్స్ (సియామ్) వెల్లడించింది, హ్యుందాయ్ కంపెనీకి చెందిన మూడు కార్లు ఈ జాబితాలో ఉండగా, మహీంద్రాకు చెందిన యుటిలిటి . వెహికల్ బొలెరోకు రెండేళ్ల తర్వాత స్థానం లభించింది. దాదాపు రెండేళ్ల తర్వాత బాగా అమ్ముడైన టాప్ 10 కార్లలో ఈ కారుకు చోటు దక్కింది.

◆ ఈ జాబితాలో మారుతీ సుజుకీ కంపెనీకి చెందిన ఆల్టో అగ్రస్థానంలో నిలిచింది. గత నెలలో మొత్తం 19,760 ఆల్టో కార్లు అమ్ముడయ్యాయి. గతేడాది ఇదే నెలలో 19,524 ఆల్టో కార్లు అమ్ముడయ్యాయి.

◆ గత ఏడాది ఫిబ్రవరి జాబితాలో ఐదో స్థానంలో ఉన్న స్విఫ్ట్ కారు ఈఏడాది ఫిబ్రవరి జాబితాలో మూడో స్థానానికి ఎగబాకింది.

◆ గత ఏడాది టాప్–10 జాబితాలో తొమ్మిదో స్థానంలో ఉన్న మారుతీ బాలెనో ఈ సారి ఏకంగా నాలుగో స్థానంలోకి దూసుకువచ్చింది.

గత నెలలో టాప్ టెన్ కార్లు

ర్యాంక్	మోడల్	అమ్మకాలు
1	ఆల్టో(మారుతీ)	19,760
2	డిజైర్(మారుతీ)	17,784
3	స్విఫ్ట్(మారుతీ)	17,291
4	బాలెనో(మారుతీ)	15,807
5	వేగన్‌ఆర్(మారుతీ)	14,029
6	ఇలీట్ ఐ20(హ్యుందాయ్)	13,378
7	విటారా బ్రెజా(మారుతీ)	11,620
8	గ్రాండ్ ఐ10(హ్యుందాయ్)	10,198
9	క్రెటా(హ్యుందాయ్)	9,278
10	బొలెరో (మహీంద్రా)	8,001

రుణదాతలకు బాధ్యత ఏదీ?

● రూ.15 వేల లోపు లోన్ల మీద ఫోకస్ అవసరం
● రుణ ప్రక్రియలో పారదర్శకత ఉంటేనే తిరిగి చెల్లింపులు
● సర్వేలో పాల్గొన్న 15–16 బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలు
● వచ్చే ఏడాది రుణ గ్రహీతల నివేదిక విడుదల
● ఎఫ్‌పీఎస్‌బీ వైస్ చైర్మన్ రంజిత్ మధోల్కర్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశంలో రుణ దాతలు బాధ్యతగా వ్యవహరించాలని లేకపోతే రుణ పరిశ్రమ ప్రతికూలంగా మారుతుందని ఫైనాన్షియల్ ప్లానింగ్ స్టాండర్డ్స్ బోర్డ్ ఇండియా (ఎఫ్‌పీఎస్‌బీ) వైస్ చైర్మన్ అండ్ సీఈఓ రంజిత్ మధోల్కర్ చెప్పారు. బాధ్యత, పారదర్శకత అనేది కేవలం చిన్న రుణదాతలకే కాదు, కార్పొరేట్, వ్యక్తిగత రుణదాతలు, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు, లిస్టెడ్ కంపెనీలు అందరికీ వర్తిస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. అప్పుడే స్కామ్‌లు, ఎన్‌పీఏలు తగ్గుముఖం పడతాయని అభిప్రాయపడ్డారు. దేశంలో తొలిసారిగా రుణదాతల బాధ్యతలపై ఎఫ్‌పీఎస్‌బీ, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ లక్నో కలసి 'నావిగేటర్; దేశంలో బాధ్యతాయుతమైన రుణదాత' అనే అంశంపై పరిశోధన నిర్వహించింది. ''ఈ పరిశోధనలో 80–85 శాతం మార్కెట్ వాటా ఉన్న సుమారు 15–16 ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలు భాగస్వాములయ్యాయి. వీటిల్లో బజాజ్ ఫిన్‌సర్వ్, యాక్సిస్, స్టాండర్డ్ చార్టెర్డ్, టాటా క్యాపిటల్, హెచ్‌డీబీఎఫ్ఎస్, హోమ్ క్రెడిట్ వంటివి కొన్ని. రుణ దరఖాస్తు విధానం, రుణ దాత సమాచారం, రుసుములు, సేవలు, ఆర్థిక సమూహం వంటి ఐదు ప్రామాణికాల ఆధారంగా ఈ సర్వే చేశాం'' అని ఆయన వివరించారు.



ఎఫ్‌పీఎస్‌బీ ఇండియా వైస్ చైర్మన్ రంజిత్

రూ.15 వేల లోపు రుణాలపై ఫోకస్..

''దేశంలో రుణ పరిశ్రమ శరవేగంగా వృద్ధి చెందుతోంది. బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలు వినియోగదారుల కోసం సులభమైన ఫైనాన్షియల్ ఆప్షన్లను అందించాల్సిన అవసరముంది. నావిగేటర్ నివేదిక పరిశ్రమకు, సంస్థాగత ఇన్వెస్టర్లకు బాధ్యతాయుతమైన రుణ ప్రమాణాలను, పరిమితులను, స్వయం నియంత్రణ వంటివి ఏర్పాటు చేసింది. బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలు రూ.15 వేలు లోపుండే చిన్న, వ్యక్తిగత రుణాలపై దృష్టి సారించాలి'' అని మధోల్కర్ సూచించారు. రుణ గ్రహీతలకు అందులోనూ తొలిసారి రుణం తీసుకుంటున్న వారికి బాధ్యతాయుతమైన రుణ విధానాలను పరిచయం చేయాల్సిన అవసరముందన్నారు. అందుబాటు, పారదర్శకత, షరతుల వంటివి రుణ గ్రహీతలకు రుణాలను తిరిగి చెల్లించటానికి సహాయపడతాయన్నారు.

ఏడాదిలో రుణ గ్రహీతల నివేదిక..

''ఓ ప్రైవేట్ అకడమిక్ ఏజెన్సీతో కలసి రుణ గ్రహీత బాధ్యత అంశాలపైన కూడా పరిశోధన చేస్తున్నాం. ఇందులో రుణ గ్రహీతల కోరికలు, అభిప్రాయాలు, అనుభవాలు, బాధ్యతలు ఇతరత్రా అంశాలుంటాయి. ఇది పూర్తి కావడానికి 8–9 నెలల సమయం పడుతుంది. వచ్చే ఆర్థిక సంవత్సరం చివరికల్లా పూర్తి నివేదిక ప్రతులను అందిస్తాం'' అని రంజిత్ వివరించారు. 50కి పైగా ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంక్‌లు, ఆర్థిక సంస్థలు, ఎన్‌బీఎఫ్‌సీలు, సెక్యూరిటీస్, అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీల సమూహమే ఈ ఫైనాన్షియల్ ప్లానింగ్ స్టాండర్డ్స్ బోర్డ్ ఇండియా (ఎఫ్‌పీఎస్‌బీ).

వీడియోకాన్ బీమా వ్యాపారం విక్రయం

● డీపీ జిందాల్ గ్రూప్‌కు 26 శాతం
● ఈనామ్ సెక్యూరిటీస్‌కు 25% వాటా

ముంబై: దివాళా కేసు ఎదుర్కొంటున్న వీడియోకాన్ ఇండస్ట్రీస్ సాధారణ బీమా వ్యాపారం జాయింట్‌వెంచర్‌లో తన పూర్తి వాటాను విక్రయించింది. లిబర్టీ వీడియోకాన్ జనరల్ ఇన్సూరెన్స్‌లో తమ పూర్తి వాటాను డీపీ జిందాల్‌గ్రూప్‌కు, ఈనామ్ సెక్యూరిటీస్‌కు విక్రయించామని వీడియోకాన్ వెల్లడించింది. అయితే ఈ లావాదేవీకి సంబంధించిన ఆర్థిక వివరాలను వీడియెకాన్ వెల్లడించలేదు. వీడియోకాన్ వాటా విక్రయానంతరం. ఈ బీమా కంపెనీలో డీపీ జిందాల్ గ్రూప్‌కు 26%, ఈనామ్ సెక్యూరిటీస్‌కు 25 శాతం చొప్పున వాటాలు ఉంటాయి. విదేశీ భాగస్వామి అమెరికాకు చెందిన లిబర్టీ మ్యూచువల్ ఇన్సూరెన్స్ గ్రూప్‌కు 49% వాటా ఉంటుంది. గత ఏడాది డిసెంబర్‌లోనే ఈ కంపెనీ తన వాటాను 26% నుంచి 49%కి పెంచుకున్నది. వీడియోకాన్ వాటా విక్రయానంతరం లిబర్టీ వీడియోకాన్ జనరల్ ఇన్సూరెన్స్ పేరు లిబర్టీ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీగా మారుతుందని కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్, పూర్తి కాలపు డైరెక్టర్ రూపమ్ ఆస్థానా తెలిపారు. కాగా కొత్త భాగస్వాముల చేరికతో తమ వ్యాపారాన్ని మరింతగా విస్తరిస్తామని, మరింతగా పటిష్టం చేస్తామని బోస్టన్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న లిబర్టీ మ్యూచువల్ ఇన్సూరెన్స్ పేర్కొంది. సాధారణ బీమా రంగంలో మంచి నాణ్యత గల బీమా పాలసీలను, సర్వీసులను అందిస్తామని తెలిపింది.



రూపమ్ ఆస్థానా

మూడు కొత్త సెగ్మెంట్లలో కొత్త పాలసీలు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.800 కోట్ల కొత్త వ్యాపార ప్రీమియమ్‌ను ఆశిస్తున్నామని, గత ఆర్థిక సంవత్సరం కొత్త వ్యాపార ప్రీమియమ్ కంటే ఇది 60 శాతం అధికమని కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్, పూర్తి కాలపు డైరెక్టర్ రూపమ్ ఆస్థానా తెలిపారు. సాధారణ బీమా పరిశ్రమ 17 శాతం వార్షిక వృద్ధిని సాధిస్తోందని, దీనికంటే రెండు–మూడు రెట్ల వృద్ధిని సాధించడం లక్ష్యమని వివరించారు. మూడు కొత్త సెగ్మెంట్లు–విలీనాలు, కొనుగోళ్లు, సైబర్, టైటిల్ లోకి ప్రవేశించాలనుకుంటున్నామని వివరించారు. 2913లో ప్రారంభమైన ఈ కంపెనీ ప్రస్తుతం 23 రాష్ట్రాల్లో 58 నగరాల్లో 60 కార్యాలయాలు, 1,100 మంది ఉద్యోగులతో కార్యకలాపాలు నిర్వహిస్తోంది.

మార్కెట్‌కు స్వల్ప లాభాలు

- అయినా 33 వేలపైకి చేరని సెన్సెక్స్
- 74 పాయింట్ల లాభంతో 32,997 వద్ద ముగింపు
- 30 పాయింట్లు పెరిగి 10,124కు నిఫ్టీ



ఐదు రోజుల సెన్సెక్స్ నష్టాలకు మంగళవారం బ్రేక్ పడింది. అంతర్జాతీయ సంకేతాలు అంతంతమాత్రంగానే ఉన్నప్పటికీ, స్టాక్ సూచీలు స్వల్ప లాభాల్లో ముగిశాయి. ఆద్యంతం ఒడిదుడుకులమయంగా సాగిన ట్రేడింగ్‌లో ఐటీ షేర్ల దన్నుతో స్టాక్ మార్కెట్ స్వల్ప లాభాలతో గట్టెక్కింది. సెన్సెక్స్ లాభపడినప్పటికీ, కీలకమైన 33,000 పాయింట్లపైకి ఎగబాకలేకపోయింది. 74 పాయింట్ల లాభంతో 32,997 పాయింట్ల వద్ద ముగిసింది. ఇక ఎన్ఎస్ఈ నిఫ్టీ 30 పాయింట్ల లాభంతో 10,124 పాయింట్లకు చేరింది. ఆయిల్, గ్యాస్, లోహ, బ్యాంక్, పీఎస్‌యూ, రియల్టీ, క్యాపిటల్ గూడ్స్ షేర్లు నష్టపోయాయి.

ఫెడ్ సమావేశంపైనే అందరి దృష్టి

ఇటీవల బాగా పతనమైన షేర్లలో కొనుగోళ్లు జరగడంతో మార్కెట్ కోలుకుంది. మంగళవారం ప్రారంభమైన అమెరికా ఫెడరల్ రిజర్వ్ చైర్మన్ జెరోమీ పావెల్ తొలి పాలసీ సమావేశంపైనే అందరి దృష్టి ఉంది. దీంతో సూచీలు తీవ్రమైన ఒడిదుడుకులకు గురయ్యాయి. సెన్సెక్స్ ఒక దశలో 180 పాయింట్లు లాభపడగా, మరో దశలో 112 పాయింట్లు నష్టపోయింది. మొత్తం మీద 292 పాయింట్ల రేంజ్‌లో కదలాడింది. నిఫ్టీ ఒక దశలో 61 పాయింట్లు లాభపడగా, మరో దశలో 45 పాయింట్లు నష్టపోయింది. గత ఐదు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ మొత్తం 995 పాయింట్లు నష్టపోయింది. రూపాయి బలహీన పడిన నేపథ్యంలో ఐటీ, ఫార్మా షేర్లలో షార్ట్ కవరింగ్ చోటు చేసుకోవడం వల్ల మార్కెట్ లాభపడిందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

కెనరా బ్యాంక్ 4 శాతం డౌన్...



మోసం, ఫోర్జరీ కేసులో కెనరా బ్యాంక్ మాజీ సీఎమ్‌డీ ఆర్.కె. దూబే, ఇద్దరు మాజీ ఈడీలపై సీబీఐ చార్జ్‌షీట్ దాఖలు చేసింది. దీంతో కెనరా బ్యాంక్ షేర్ 3.8 శాతం నష్టపోయి రూ. 254 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ షేర్ 5.4 శాతం నష్టంతో రూ.250ను కనిష్ట స్థాయిని తాకింది. ఈ బ్యాంక్ మార్కెట్ క్యాప్‌రూ.606 కోట్లు క్షీణించి రూ.15,180 కోట్లకు తగ్గింది.

అన్ని రంగాల్లోను 'ఫిక్సిడ్ టర్మ్' ఉద్యోగాలు

న్యూఢిల్లీ: ప్రత్యేక ప్రాజెక్టులు, ఆర్డర్లను పూర్తి చేసేందుకు పరిమిత కాలం పాటు తాత్కాలిక సిబ్బందిని నియమించుకునే (ఫిక్సిడ్ టర్మ్ ఎంప్లాయ్‌మెంట్–ఎఫ్‌టీఈ) వెసులుబాటును అన్ని రంగాల సంస్థలకూ వర్తింపచేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఇప్పటిదాకా దుస్తుల తయారీ రంగానికి మాత్రమే పరిమితమైన ఈ నిబంధనను సవరిస్తూ.. కేంద్ర కార్మిక శాఖ ఒక నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇది ఆయా రంగాల్లోని సంస్థల వ్యాపారాల నిర్వహణను మరింత సులభతరం చేసేందుకు దోహదపడనుంది. సాధారణ కాంట్రాక్టు వర్కరుతో పోలిస్తే.. ఎఫ్‌టీఈ కింద తీసుకునే ఉద్యోగులకు కార్మిక చట్టాల ప్రకారం పర్మనెంట్ ఉద్యోగులకు సమానంగా స్థిరమైన పనివేళలు, అలవెన్సులు మొదలైన ప్రయోజనాలన్నీ లభిస్తాయి. నిర్దిష్ట పని లేదా డిమాండ్‌ను బట్టి సీజనల్ వ్యాపార అవసరాల కోసం సంస్థలు వీరిని నియమించుకోవచ్చు. ఆ పని పూర్తి కాగానే ఈ ఉద్యోగులతో నియామక ఒప్పందం కూడా రద్దయిపోతుంది. తాజా సవరణల ప్రకారం.. ఒకవేళ మూడు నెలల పాటు సర్వీసు అనంతరం కాంట్రాక్టు షరతులకు భిన్నంగా సదరు ఎఫ్‌టీఈ వర్కరును తొలగించాలనుకున్న పక్షంలో రెండు వారాల ముందుగా నోటీసు ఇవ్వాల్సి ఉంటుంది. ఒకవేళ మూడు నెలల సర్వీసు కాలంలోగా తొలగిస్తున్న పక్షంలో దానికి గల కారణాలను రాతపూర్వకంగా తెలియజేయాల్సి ఉంటుంది. అయితే, కాంట్రాక్టు వ్యవధి పూర్తయిపోతే మాత్రం ఎలాంటి నోటీసులు ఇవ్వనక్కర్లేదు.

తొలి ఏడాది రూ.600 కోట్ల జీవీఏ

ఎంకేటీయార్డ్.కామ్ రికార్డు

హైదరాబాద్: ప్రైవేట్ రంగ వ్యవసాయ మార్కెటింగ్ పోర్టల్.. ఎంకేటీయార్డ్.కామ్ తొలి ఏడాది రికార్డు స్థాయిలో రూ.600 కోట్ల స్థూల లావాదేవీల విలువను (జీవీఏ) నమోదు చేసింది. నేషనల్ కొల్లేటరల్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ (ఎన్‌సీఎంఎల్) అనుబంధ సంస్థయిన ఈ 'ఎంకేటీ యార్డ్.కామ్'.... ద్వారా తొలి ఏడాది 40 వేల మంది రైతులు లబ్ధి పొందినట్లు సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. పప్పుధాన్యాలు, బియ్యం, పసుపు, పల్లీలు, గోధుమల వంటి వ్యవసాయ ఉత్పత్తులను ఈ–యాక్షన్ ద్వారా కొనేందుకు ఈ సంస్థ వీలు కల్పిస్తుంది. ప్రస్తుతం దేశంలో ఎంకేటీయార్డ్.కామ్‌కు 2 వేలకు పైగా గిడ్డంగులున్నాయి.

ఐదు ఎన్ఎండీసీ గనులకు ఫైవ్‌స్టార్ రేటింగ్

ఇనుప ఖనిజ క్షేత్రాలకు సంబంధించి ఎన్ఎండీసీ గనులకు కేంద్ర గనుల శాఖ నుంచి ఫైవ్ స్టార్ రేటింగ్ లభించింది. గనులు, ఖనిజాలపై సోమవారం న్యూఢిల్లీలో జరిగిన 3వ జాతీయ సదస్సులో గనుల శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమార్, బొగ్గు, గనుల శాఖ సహాయమంత్రి హెచ్‌పీ చౌదరి ఎన్ఎండీసీ అత్యున్నత స్థాయి అధికారులకు ఫైవ్‌స్టార్ రేటింగ్ సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. మరింత ఉన్నత స్థితికి సంస్థ ఎదగడానికి తాజా గుర్తింపు స్ఫూర్తిదాయకంగా ఉంటుందని ఎన్ఎండీసీ సీఎండీ ఎన్ బైజేంద్ర కుమార్ పేర్కొన్నారు.



వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో కొత్త టెలికం విధానం...

న్యూఢిల్లీ: నూతన టెలికం పాలసీ దాదాపుగా సిద్ధమైనట్టేనని, దీన్ని కేబినెట్ ఆమోదం అనంతరం రానున్న పార్లమెంటు సమావేశాల్లో సభ ముందు ప్రవేశపెడతామని ఆ శాఖా మంత్రి మనోజ్ సిన్హా తెలిపారు. నూతన విధానంపై ప్రజల అభిప్రాయాలు తెలుసుకునేందుకు ఈ నెలలోనే తమ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామని చెప్పారు. ఢిల్లీలో మంగళవారం జరిగిన దీన్‌దయాళ్ స్పర్ష్ యోజన స్కాలర్‌షిప్ అవార్డుల కార్యక్రమంలో భాగంగా మంత్రి మాట్లాడారు. దేశంలో టెలికం రంగానికి విజయవంతమైన చరిత్ర ఉందని, ఈ విజయం కొనసాగుతుందని, దేశంలో చక్కని అనుసంధానత ఉంటుందన్నారు. టెలికం కంపెనీలు స్పెక్ట్రమ్ విషయంలో నూతన చెల్లింపుల షెడ్యూల్‌కు వెళ్లడం లేదా ప్రస్తుత ఒప్పందం ప్రకారం కొనసాగడం అన్నది వాటి ఇష్టంపైనే ఆధారపడి ఉంటుందని మంత్రి తెలిపారు. ఒప్పందం ప్రకారం బిడ్ చేసిన స్పెక్ట్రమ్‌కు చెల్లింపులను పదేళ్లలో చేయాల్సి ఉండగా, దీన్ని 16 ఏళ్లకు పెంచుతూ ఈ నెలలోనే కేంద్ర కేబినెట్ వెసులుబాటు కల్పించిన విషయం తెలిసిందే. నూతన టెలికం పాలసీ లైసెన్సింగ్, నియంత్రణ పరమైన కార్యాచరణను సులభతరం చేయడం, పన్నుల హేతుబద్ధీకరణ ద్వారా మరింత వృద్ధికి ఊతమిచ్చేలా ఉంటుందని భావిస్తున్నారు.

వృద్ధి వేగానికి బ్యాంకింగ్ కష్టాలు అడ్డు!

అంతర్జాతీయ బ్యాంకింగ్ సేవల దిగ్గజం గోల్డ్‌మన్ శాక్స్

న్యూఢిల్లీ: బ్యాంకింగ్ వ్యవస్థలో నెలకొన్న ప్రతికూల పరిస్థితులు భారత్ వృద్ధికి విఘాతం కలిగించనున్నట్లు అంతర్జాతీయ బ్యాంకింగ్ సేవల దిగ్గజం– గోల్డ్‌మన్ శాక్స్ విశ్లేషిస్తోంది. ఈ నేపథ్యంలో భారత్ ఆర్థిక వ్యవస్థ వృద్ధి అంచనాలనూ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ డౌన్‌గ్రేడ్ చేసింది. 2019 మార్చితో ముగిసే ఆర్థిక సంవత్సరానికి వృద్ధి అంచనాలను 7.6 శాతానికి తగ్గించింది. ఇంతక్రితం ఈ అంచనా 8 శాతం. ప్రభుత్వ రంగంలో రెండవ బ్యాంకింగ్ దిగ్గజం– పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)లో దాదాపు రూ.13,000 కోట్ల కుంభకోణం గోల్డ్‌మన్ శాక్స్ తాజా అంచనాలకు నేపథ్యం... రెండేళ్ల కాలానికి రూ.2.11 లక్షల కోట్ల తాజా మూలధనాన్ని బ్యాంకింగ్‌కు ప్రకటిస్తూ, రుణ వృద్ధికి, ఉద్యోగ కల్పనకు ఈ చర్య దోహదపడుతుందని ప్రకటిస్తున్న కేంద్రానికి గోల్డ్‌మన్ శాక్స్ తాజా నివేదిక ఆందోళన కలిగించేదే. బ్యాంక్ విడుదల చేసిన అంచనాల్లో ముఖ్యాంశాలను చూస్తే...



- ఆర్థిక కుంభకోణాల నేపథ్యంలో...బ్యాంకింగ్ రంగంలో కఠినతరమైన నియంత్రణ విధానాలను అమల్లోకి తెచ్చే అవకాశం ఉంది. ఇది రుణ వృద్ధికి తద్వారా ఆర్థిక వేగానికి విఘాతం కలిగిస్తుంది.
- ఇక బ్యాంకులపై మొండిబకాయిల భారం ఇప్పటికిప్పుడు తగ్గే అవకాశాలు కనిపించడం లేదు. బ్యాంకు బ్యాలన్స్ షీట్లలో ఉన్న రూ.8.5 లక్షల కోట్ల ఎన్‌పీఏల తీవ్రత ఇంకా ఎక్కువగానే ఉంది.
- మొండిబకాయిలకు ప్రొవిజనింగ్‌లు పెంచాల్సి రావడం, రుణ వృద్ధిపై పరోక్షంగా తీవ్ర ప్రభావాన్నే చూపుతుంది.
- భారత్ వృద్ధి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 6.6 శాతం వృద్ధి సాధించే అవకాశం ఉంది. 2019–20లో 8.3 శాతం వృద్ధి నమోదవుతుందన్న తొలి అంచనాల్లో ఇప్పటికి ఎటువంటి మార్పు లేదు.

హిందుస్తాన్ ఏరోనాటిక్స్ ఐపీఓకు పేలవ స్పందన!



న్యూఢిల్లీ: హిందుస్తాన్ ఏరోనాటిక్స్ ఐపీఓ(ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్)కు అంతంత మాత్రం స్పందన లభించింది. ఈ నెల 16న ప్రారంభమైన ఈ ఐపీఓ మంగళవారం ముగిసింది. ఈ ఐపీఓ పూర్తిగా సబ్‌స్క్రైబ్ కాలేదు. 99 శాతం మాత్రమే సబ్‌స్క్రైబయింది. ఈ ఐపీఓ ద్వారా ఈ కంపెనీ రూ.4,229 కోట్లు సమీకరించనున్నది. ఐపీఓలో భాగంగా ఈ కంపెనీ మొత్తం 3.41 కోట్ల షేర్లను ఆఫర్ చేస్తోంది. 3.37 కోట్ల షేర్లకు మాత్రమే దరఖాస్తులు వచ్చాయి. క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్లకు కేటాయించిన వాటా 1.7 రెట్లు సబ్‌స్క్రైబ్ కాగా, సంస్థాగతేతర ఇన్వెస్టర్లకు కేటాయించిన వాటా 3 శాతం, రిటైల్ ఇన్వెస్టర్లకు కేటాయించిన వాటా 38 శాతం చొప్పున మాత్రమే సబ్‌స్క్రైబయ్యాయి. ఈ ఐపీఓ ప్రైస్‌బాండ్ రూ.1,215 –1,240గా ఉంది. ఈ ఐపీఓకు లీడ్ మేనేజర్లుగా ఎస్‌బీఐ క్యాపిటల్ మార్కెట్స్, యాక్సిస్ క్యాపిటల్‌లు వ్యవహరించాయి. ఈ షేర్ ఈ నెల 28న స్టాక్ మార్కెట్లో లిస్టయ్యే అవకాశాలున్నాయి.

డేటా వినియోగంలో భారత ఉద్యోగుల ముందంజ

క్లిక్ సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ: డేటా అక్షరాస్యత విషయంలో (సమాచార సేకరణ, వినియోగం, విచారణ తదితర అంశాలు) భారత ఉద్యోగుల్లో ఎక్కువ అవగాహన ఉన్నట్టు డేటా అనలైటిక్స్ సంస్థ 'క్లిక్' నిర్వహించిన సర్వేలో తెలిసింది. 45 శాతం మందిలో ఎక్కువ విజ్ఞానం ఉన్నట్టు, వారు డేటాను చదవడం, వినియోగించడం, విశ్లేషించడం, ప్రశ్నించే జ్ఞానంతో ఉన్నారని క్లిక్ ఎండీ అరుణ్ బాలసుబ్రమణియన్ తెలిపారు. ఆస్ట్రేలియా, సింగపూర్, చైనా, భారత్, జపాన్ దేశాల్లో జనవరి 30 నుంచి ఫిబ్రవరి 14 వరకు 5,288 మందిపై ఈ సర్వే జరిగింది. చైనా ఉద్యోగుల్లో డేటా జ్ఞానం 20 శాతంగా ఉంటే, సింగపూర్‌లో 15 శాతం, చైనాలో 11 శాతం, జపాన్‌లో 6 శాతంగానే ఉండటం గమనార్హం. ఈ ప్రాంతంలో భారత ఉద్యోగులే ఈ విషయంలో ముందున్నట్టు క్లిక్ తెలిపింది.

జీఈ పవర్‌కు రూ.309 కోట్ల ఆర్డరు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: జీఈ పవర్‌కు ఎన్‌టీపీసీ నుంచి రూ.309 కోట్ల విలువైన ఆర్డరు లభించింది. ఇందులో భాగంగా తెలంగాణలో ఎన్‌టీపీసీ ఏర్పాటు చేస్తున్న 800 మెగావాట్ల సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టుకు ఫ్లూ గ్యాస్ డీసల్ఫరైజేషన్ (ఎఫ్‌డీజీ) వ్యవస్థను సరఫరా చేయనుంది. బొగ్గు ఆధారిత విద్యుత్ ప్లాంట్ల నుంచి వెలువడే సల్ఫర్‌ను అరికట్టడంలో ఎఫ్‌డీజీ సాంకేతిక పరిజ్ఞానం దోహదం చేస్తుందని జీఈ పవర్ ఇండియా ఎండీ అంద్రూ హెచ్ డీలియోనీ ఈ సందర్భంగా తెలిపారు.

రోల్స్ రాయిస్ పవర్ సిస్టమ్స్‌తో ఫోర్స్ మోటార్స్ జేవీ

ముంబై: రోల్స్ రాయిస్ పవర్ సిస్టమ్స్ కంపెనీ ఫోర్స్ మోటార్స్‌తో ఒక జాయింట్ వెంచర్‌ను ఏర్పాటు చేసింది. ఎమ్‌టీయూ సిరీస్ ఇంజిన్ల తయారీ కోసం ఈ జేవీని ఏర్పాటు చేశామని, ఈ జేవీ ప్రారంభ పెట్టుబడి రూ.300 కోట్లని ఫోర్స్ మోటార్స్ ఎమ్‌డీ ప్రసన్ ఫిరోదియా చెప్పారు. రోల్స్ రాయిస్ పవర్ సిస్టమ్స్ ఏజీకి చెందిన అనుబంధ కంపెనీ జర్మనీకి చెందిన ఎమ్‌టీయూ ఫ్రెడిరిక్‌షాఫెన్‌తో ఈ జేవీని ఏర్పాటు చేశామని తమ వాటా 51 శాతమని పేర్కొన్నారు. ఫోర్స్ మోటార్స్‌కు చెందిన పుణే ప్లాంట్‌లో ఇంజిన్ల తయారీ యూనిట్ పనిచేస్తుందని, వచ్చే ఏడాది చివరి నుంచి ఉత్పత్తి కార్యక్రమాలు ఆరంభమవుతాయని వివరించారు. ప్రస్తుతం ఈ ఇంజిన్లు జర్మనీలో తయారవుతున్నాయని తెలిపారు. ఈ జేవీలో భాగంగా ఎమ్‌టీయూ సిరీస్ ఇంజిన్లతో పాటు 1600 సిరీస్ జనరేటర్లను కూడా తయారు చేస్తామని, వీటిని దేశీయంగా విక్రయించడమే కాకుండా విదేశాలకు కూడా ఎగుమతుల చేస్తామని వివరించారు.

FORCE MOTORS
Rolls-Royce

బులియన్ రూ.లలో

ముంబై			
బంగారం (99.9, 10గ్రా)	30,400	▲	60
బంగారం (99.5, 10గ్రా)	30,250	▲	60
వెండి (కిలో)	38,020	▲	80
చెన్నై			
బంగారం (24 క్యారెట్లు)	– –		–
బంగారం (22 క్యారెట్లు)	28,980	▲	120
వెండి (కిలో)	– –		–
హైదరాబాద్			
బంగారం (24 క్యారెట్లు)	30,460	▲	160
బంగారం (22 క్యారెట్లు)	29,010	▲	150
వెండి (కిలో)	41,200	▲	200
ప్రొద్దుటూరు			
బంగారం (24 క్యారెట్లు)	31,250	▲	100
బంగారం (22 క్యారెట్లు)	28,980	▲	80
వెండి (కిలో)	39,200	▲	100
విశాఖపట్నం			
బంగారం (24 క్యారెట్లు)	31,030	▲	170
బంగారం (22 క్యారెట్లు)	29,010	▲	150
వెండి (కిలో)	41,100	▼	400
విజయవాడ			
బంగారం (24 క్యారెట్లు)	31,400	▲	100
బంగారం (22 క్యారెట్లు)	29,000	▲	200
వెండి(కిలో)	39,000	▼	200
ఏపీ బులియన్ అసోసియేషన్			
బంగారం (24 క్యారెట్లు)	31,330	▲	30
బంగారం (22 క్యారెట్లు)	28,980	▲	30
వెండి (కిలో)	39,200	▼	100

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	63.41 (రాత్రి 11.00కు)	$62.13 (సోమవారం ముగింపు)
బ్రెంట్	66.99 (రాత్రి 11.00కు)	$66.05 (సోమవారం ముగింపు)

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 21-3-2018

విశాఖ	325–00
చిత్తూరు	363–00
వరంగల్	332–00
ముంబై	370–00
చెన్నై	370–00
విజయవాడ	317–00
గోదావరి	317–00
నమక్కల్	360–00
20–3–2018 ఫామ్ ధర...	
హైదరాబాద్	330–00
రిటైల్ (ఒక గుడ్డుకు)	3.90
బెంగళూరు	365–00
కోల్‌కతా	360–00
ఢిల్లీ	310–00

ఎన్ఎస్ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ADANI PORT	364.3	370.5
ADANI PORT	370	364.3
AMBUJA CEME	230.4	231.15
ASIAN PAINT	1106.5	1102.55
AXIS BANK L	521.1	519.45
BAJAJ AUTO	2873	2849.45
BAJAJ FINAN	1657.3	1631.85
BHARTI AIRT	400.4	399.65
BOSCH LIMIT	17876.75	17515.05
BHARAT PETR	424.9	430.75
CIPLA LTD	552.9	559.75
COAL INDIA	270.25	272.3
EICHER MOTO	28360.45	27403.05
GAIL (INDIA	438.5	442.05
HCL TECHNOL	937.2	926.5
HDFC LTD	1800.05	1774.5
HDFC BANK L	1839.5	1847.25
HERO MOTOCO	3513.8	3515.3
HINDALCO I	217.3	214.55
HINDUSTAN Pet,	354.85	352.35
HINDUSTAN Unili.	1313.25	1309.4
INDIABULLS	1198.3	1187.85
ICICI BANK	292	294.55
INDUSIND BA	1716.65	1718.8
BHARTI INFR	341.9	325.35
INFOSYS LIM	1164.55	1146.75
INDIAN OIL	173.85	177.9
ITC LTD	259.2	259.15
KOTAK MAHIN	1045.3	1049
LARSEN & TO	1293.5	1279.55
LUPIN LIMIT	771.75	766.6
MAHINDRA &	740.95	742.7
MARUTI SUZU	8802.4	8773.5
NTPC LTD	166.4	167
OIL AND NAT	174.1	176.85
POWER GRID	194.9	194.2
RELIANCE IN	889.8	895.5
STATE BANK	249.1	247.95
SUN PHARMAC	508.75	497.65
TATA MOTORS	338.8	335.7
TATA STEEL	593	574.95
TATA CONSUL	2864.85	2831
TECH MAHIND	633.4	609.9
ULTRATECH C	3936.8	3972.4
UPL LIMITED	712.3	701.85
VEDANTA LIM	287.1	307.2
WIPRO LTD	293.6	288.65
YES BANK LI	302.4	304.8
ZEE ENTERTA	575.1	566.45

నిఫ్టీ నెక్ట్స్ ఫిఫ్టీ

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ABB INDIA L	1304.7	1317.3
ACC LIMITED	1554.8	1562.9
ASHOK LEYLA	146	145.7
BAJAJ FINSE	5080.85	4963.45
BANK OF BAR	135.85	133.35
BHARAT ELEC	149.5	148.55
BHEL	84.1	83.75
BRITANNIA I	4825.05	4815.55
CADILA HEAL	385.45	376.95
COLGATE PAL	1040.65	1034
CONTAINER C	1185.15	1199.1
CUMMINS IND	744.7	755.15
DABUR INDIA	319.35	319.7
DLF LIMITED	215.4	214.35
AVENUE SUPE	1346.5	1342.55
EMAMI LIMIT	1031.65	1025.65
GLAXOSMITHK	2226.05	2227.65
GLENMARK PH	546.4	543.85
GODREJ CONS	1068.45	1047.3
GLAXOSMITHK	6612.9	6527.5
HAVELLS IND	499	506.5
HINDUSTAN Zinc	313	308.7
ICICI PRU L	371.2	372.3
IDEA CELLUL	77.15	77.8
INTERGLOBE	1242.95	1215.8
JSW STEEL L	285.5	283.6
LIC HOUSING	518.05	511.25
MARICO LIMI	318.95	303.25
UNITED SPIR	3043.9	3038.25
MOTHERSON S	304.9	306.65
MRF LTD	69593.05	70074.85
NHPC LTD	26.35	26.45
NMDC LTD.	118.4	117.9
ORACLE FIN	3797.85	3880.05
OIL INDIA L	327.1	337
PIRAMAL ENT	2469.8	2492.25
PETRONET LN	235.65	233.65
POWER FIN C	88.95	87.7
P&G HYGIENE	9237.15	9304.3
PIDILITE IN	902.7	907.65
PUNJAB NATI	96.85	96.55
RURAL ELEC	127.1	124.75
STEEL AUTHO	72.25	68.9
SHREE CEMEN	16423.75	16015.5
SIEMENS LTD	1108.5	1090.5
SHRIRAM TRA	1377.85	1404
SUN TV NETW	892.2	907.3

బీఎస్ఈలో ఏపీ,టీఎస్ స్టాక్స్

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
AditSpin	8.6	8.92
Alphageo	747.05	755.4
Alu Flouride	106.4	106.15
Amar Raja Bat	783.05	772.5
And Bank	42.85	41.85
And Cemen	9.9	10.37
And Paper	293	292.25
And Petro	54.05	55.5
Anjani Portl	179.5	177.6
Aries Agro Ltd	189	187.2
Aurobindo Ph	571.05	571.95
[illegible]		

A B C D / E F G H / I J K L / M N O P / R S T U / V W Y Z

TATA POWER	80.35	79.55
TITAN COMPA	871.75	869
TORRENT PHA	1254.8	1261.65
3M INDIA LI	19608.65	19689.15
63 MOONS TE	102.3	104
8K MILES SO	667.65	674.8
A AND M JUM	65.5	65.25
AARTI DRUGS	528.55	540.8
AARTI INDUS	1112.3	1141.15
[illegible]		

ఆ పది కాలేజీల్లో తనిఖీలు చేయండి

- పూర్తి వివరాలతో రెండు వారాల్లో నివేదిక ఇవ్వండి
- ఎన్‌సీటీఈకి హైకోర్టు ఆదేశం
- ఆరోపణలు అవాస్తవమని తేలితే చర్యలు తప్పవు
- పిటిషనర్‌కు హైకోర్టు హెచ్చరిక

సాక్షి, హైదరాబాద్: ప్రకాశం, కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని పది బీఈడీ, డీఈడీ కాలేజీల్లో ప్రవేశాలకు సంబంధించి అక్రమాలు జరిగాయని ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఆ కాలేజీల్లో తనిఖీలు నిర్వహించాలని హైకోర్టు మంగళవారం నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్‌సీటీఈ)ని ఆదేశించింది. తనిఖీల అనంతరం పూర్తి వివరాలతో రెండు వారాల్లో నివేదిక సమర్పించాలని హైకోర్టు స్పష్టం చేసింది. తదుపరి విచారణను వాయిదా వేసింది. ఈ మేరకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ రమేశ్ రంగనాథన్, న్యాయమూర్తి కొంగర విజయలక్ష్మిలతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. మూడు జిల్లాల్లోని వివేకానంద కాలేజీ, ఆలీ కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్, నవచైతన్య కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, ఆజాద్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, ఎస్ఆర్, జీఎస్ఆర్, సలాం అమరావతి, ఎస్ఆర్‌డీ, షారోన్, మహాత్మాగాంధీ తదితర కాలేజీల యాజమాన్యాలు విద్యార్థుల ప్రవేశాలు, బోధన సిబ్బంది, భవనాల విషయంలో అక్రమాలకు పాల్పడ్డాయంటూ ప్రకాశం జిల్లాకు చెందిన నవలూరి మాధవరావు హైకోర్టులో రెండు ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేసిన విషయం తెలిసిందే. వీటిపై ఇప్పటికే పలుమార్లు విచారణ జరిపిన ఏసీజే నేతృత్వంలోని ధర్మాసనం వాటిపై మంగళవారం మరోసారి విచారణ జరిపింది. ఈ సందర్భంగా పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఎ.సత్యప్రసాద్ వాదనలు వినిపిస్తూ ప్రకాశం జిల్లా బ్రాహ్మణపల్లిలో కాలేజీకి అనుమతి తీసుకుని, వినుకొండలో ఆ కాలేజీని నడుపుతున్నారని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ఒక కాలేజీలోనే పనిచేయాల్సిన అధ్యాపకులను రెండు మూడు కాలేజీల్లో కూడా పనిచేయిస్తున్నారని తెలిపారు. ఇది ఎన్‌సీటీఈ నిబంధనలకు విరుద్ధమన్నారు. అయితే ఈ వాదనలను కాలేజీల తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.రవి తోసిపుచ్చారు. ఈ నేపథ్యంలో ధర్మాసనం స్పందిస్తూ వాస్తవాలను నిగ్గు తేల్చేందుకు ఆ పది కాలేజీల్లో తనిఖీలకు ఆదేశించింది. ఇందుకయ్యే ఖర్చుల నిమిత్తం రూ.లక్షను ఎన్‌సీటీఈ డైరెక్టర్ వద్ద డిపాజిట్ చేయాలని పిటిషనర్‌కు స్పష్టం చేసింది. నివేదికలు సిద్ధమైన తర్వాత ఈ కేసు గురించి తమ ముందు ప్రస్తావించాలని ఇరుపక్షాల న్యాయవాదులకు తేల్చిచెప్పింది. ఈ కాలేజీలపై చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని తేలితే చర్యలు తప్పవని పిటిషనర్‌ను హెచ్చరించింది.




చాలా చానెళ్లు స్పందించలేదు

- కోడిపందేలపై హైకోర్టుకు నివేదించిన రాష్ట్ర ప్రభుత్వం
- ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు ఎందరో ఆడారు..
- టీవీల ముందుకొచ్చి మాట్లాడారు.. సవాళ్లు విసిరారు..
- మీకు ఒక్క ఎమ్మెల్యేనే కనిపించారా?: హైకోర్టు విస్మయం

సాక్షి, హైదరాబాద్: కోడి పందేలను నిర్వహించిన ప్రజా ప్రతినిధులను గుర్తించేందుకు వీలుగా టీవీ వీడియో ఫుటేజీలను ఇవ్వాలని కోరినా పలు టీవీ ఛానెళ్లు స్పందించలేదని రాష్ట్ర ప్రభుత్వం చెప్పడంపై హైకోర్టు విస్మయం వ్యక్తంచేసింది. మీ నిస్సహాయతను మా వద్ద వ్యక్తం చేయడం ఏమిటంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. దీంతో ఫుటేజీలను తీసుకునేందుకు మరో అవకాశమివ్వాలని హైకోర్టును ప్రభుత్వం అభ్యర్థించింది. ఇందుకు అంగీకరించిన హైకోర్టు తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు ఏసీజే జస్టిస్ రమేశ్ రంగనాథన్, న్యాయమూర్తి జస్టిస్ కొంగర విజయలక్ష్మిల ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. గత ఏడాది మాదిరిగా ఈ సంక్రాంతికి భీమవరం మండలం వెంప, శ్రీరాంపురం గ్రామాల్లో కోడి పందేల పేరుతో జూదం, అశ్లీల నృత్యాలు, వ్యభిచారం జరగకుండా తగిన చర్యలు తీసుకునేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ కలిదిండి రామచంద్రరాజు అనే వ్యక్తి హైకోర్టులో పిల్ వేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ధర్మాసనం మంగళవారం మరోసారి విచారణ జరిపింది. ప్రభుత్వం తరఫున ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ, కోడి పందేలను నిర్వహించిన వారిలో పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ఓ ప్రజా ప్రతినిధిని గుర్తించామని చెప్పారు. ధర్మాసనం స్పందిస్తూ, జిల్లాలో ఒక్క ప్రజాప్రతినిధే కనిపించారా? అంటూ ఆశ్చర్యం వ్యక్తంచేసింది. దీని ద్వారా కోర్టు ఆదేశాలను మరోసారి అపహాస్యం చేశారని ఆక్షేపించింది. 'జాతీయ, ప్రాంతీయ టీవీ ఛానెళ్లలో ప్రజా ప్రతినిధులు కోడి పందేలు నిర్వహించినట్లు ప్రసారమైంది. నేనూ చూశాను. మీరు మా ఆదేశాలను చాలా తేలిగ్గా తీసుకుంటున్నారు'.. అని ఘాటుగా వ్యాఖ్యానించింది. అసలు ఇంతకు ఏ టీవీ నుంచి వీడియో ఫుటేజీని తీసుకున్నారని ఏజీని ప్రశ్నించగా.. ఒక్క ఛానెల్ మాత్రమే ఫుటేజీ ఇచ్చిందని ఏజీ బదులిచ్చారు. 'ఎంపీటీసీలు, జడ్పీటీసీలు కనిపించలేదా? పందేలు నిర్వహించిన ప్రజాప్రతినిధులు మీడియా ముందుకొచ్చి మాట్లాడారు. మా ఆదేశాల విషయంలో సవాళ్లు కూడా విసిరారు. జాతీయ ఛానెళ్లలో కూడా ఇది ప్రసారమైంది' అని ధర్మాసనం పేర్కొంది. దీనికి ఏజీ స్పందిస్తూ, తప్పించుకోవడం తమ ఉద్దేశం కాదన్నారు. మరొక్క అవకాశం ఇవ్వాలని అభ్యర్థించారు. ఇందుకు ధర్మాసనం అంగీకరిస్తూ విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

కోదండరాముడికి గోటి తలంబ్రాలు సమర్పణ



గోటి తలంబ్రాలు సమర్పిస్తున్న త్రిమూర్తులు

ఒంటిమిట్ట: వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్ట (ఏకశిలా నగరి)లో వెలసిన శ్రీ కోదండరామునికి మంగళవారం తూర్పుగోదావరి జిల్లా ఆల్మూరు మండలం పనికేరుకు చెందిన చిలుకూరు త్రిమూర్తులు గోటి తలంబ్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది బ్రహ్మోత్సవాలకు 16.6 కిలోల గోటి తలంబ్రాలను స్వామికి సమర్పించామని, ఈ ఏడాది కూడా అలానే సమర్పించాలని నిర్ణయించామన్నారు. అందులో భాగంగా ప్రస్తుతం 3.5 కిలోల గోటి తలంబ్రాలు సమర్పించామని, మిగిలినవి కల్యాణం రోజుకల్లా సమర్పిస్తామని తెలిపారు.

ఏసీబీ వలలో గుర్రంకొండ తహసీల్దార్

గుర్రంకొండ: చిత్తూరు జిల్లా గుర్రంకొండ తహసీల్దార్ రవిచంద్రన్ ఏసీబీ అధికారుల వలలో చిక్కుకొన్నాడు. మండలంలోని టి.రాచపల్లె పంచాయతీ దిగువ బురుజుపల్లెకు చెందిన ఎస్.గోపాల్‌రెడ్డికి కొంత భూమి ఉంది. సర్వే నంబర్ 77లో గోపాల్‌రెడ్డికి 90 సెంట్ల భూమి రావాల్సి ఉంది. కింది స్థాయి నుంచి పైస్థాయి వరకు రూ.40 వేలు లంచాలు సమర్పించుకున్నాడు. తహసీల్దార్ రవిచంద్రన్ ఈనెల 31న ఉద్యోగ విరమణ చేయనుండటంతో ఆయన్ను ఆశ్రయించారు. రూ.75 వేలు ఇస్తే సమస్యను పరిష్కరిస్తామని డీల్ కుదుర్చుకున్నాడు. ముందుగా రూ.60 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో రైతు తిరుపతి ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. వారి సూచనల మేరకు గోపాల్‌రెడ్డి తహసీల్దార్‌కు రూ. 60 వేలు ఇస్తుండగా తిరుపతి ఏసీబీ డీఎస్పీ తిరుమలేష్‌రెడ్డి ఆధ్వర్యంలో రవిచంద్రన్‌ను అదుపులోకి తీసుకున్నారు.

బాబు పాలన అవినీతికి చిరునామా

- హోదా కోసం వైఎస్ జగన్ నిర్ణయాలతో ఢిల్లీలో ప్రకంపనలు: భూమన
- ఎన్నికలైన 4 నెలల నుంచే హోదా ఉద్యమాన్ని వైఎస్సార్‌సీపీ చేపట్టింది
- ప్రత్యేక రైళ్లలో వెళ్లి ఢిల్లీలో ఆందోళనలు నిర్వహించాం



సదస్సులో మాట్లాడుతున్న భూమన కరుణాకరరెడ్డి

చోడవరం: చంద్రబాబు సర్కారు పాలన అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారిందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూమన కరుణాకర రెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం విశాఖ జిల్లా చోడవరంలో వైఎస్సార్‌సీపీ బూత్ కమిటీల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. చంద్రబాబు రాష్ట్ర ప్రజలను అన్ని విధాలా మోసం చేశారని మండిపడ్డారు. ప్రత్యేక హోదా కోసం ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ తీసుకున్న నిర్ణయాలు ఢిల్లీలో ప్రకంపనలు సృష్టించాయన్నారు. 2014లో సార్వత్రిక ఎన్నికలు జరిగిన నాలుగు నెలల తరువాత నుంచే ప్రత్యేక హోదా ఉద్యమాన్ని వైఎస్సార్‌సీపీ చేపట్టిందన్నారు. తమ ఎంపీలు, ఎమ్మెల్యేలు, కార్యకర్తలతో కలిసి ప్రత్యేక రైళ్లలో వెళ్లి ఢిల్లీలో ఆందోళనలు చేశామని గుర్తు చేశారు.

కేసుల భయంతో మోకరిల్లిన బాబు

హోదా ఉద్యమాన్ని పలురూపాల్లో ముందుకు తీసుకెళ్లిన ప్రతిపక్ష నేత జగన్ చివరికి ఎవరూ సాహసించని విధంగా కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాసం పెట్టడం, ఎంపీల రాజీనామాలకు సిద్ధం కావటంతో సీఎం చంద్రబాబుకు వణుకు పుట్టిందని భూమన వ్యాఖ్యానించారు. ఇచ్చిన మాట కోసం ఆనాడు సోనియాగాంధీని ఎదిరించడంతోపాటు నేడు రాష్ట్రానికి హోదా కావాలని మోదీ ప్రభుత్వంపై అవిశ్వాసం పెట్టి ఢిల్లీని ఢీకొడుతున్న ఏకైక నాయకుడు జగన్ అని ప్రశంసించారు. ప్రత్యేక హోదా ఏమైనా సంజీవనా? అని ఎగతాళి చేసిన సీఎం చంద్రబాబు చివరికి వైఎస్ జగన్ దారిలోకే రావడం తమ ఉద్యమ స్ఫూర్తికి నిదర్శమన్నారు. బీజేపీతో జగన్ చేతులు కలిపారని టీడీపీ ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. నాలుగేళ్లపాటు బీజేపీ మిత్రపక్షంగా అధికారాన్ని అనుభవించి ఓటుకు కోట్లు కేసులో జైలు పాలవుతాననే భయంతో కేంద్రం ముందు మోకరిల్లింది చంద్రబాబు కాదా? అని ప్రశ్నించారు. ఇప్పుడు ఆయన యూ టర్న్ తీసుకొని మభ్యపెట్టే ప్రయత్నం చేయడాన్ని అంతా గమనిస్తున్నారన్నారు.

మాటకు కట్టుబడే నేత జగన్

విశ్వసనీయతకు మారుపేరు జగన్ అయితే లాలూచీ రాజకీయాలకు పెట్టింది పేరు చంద్రబాబు అని భూమన విమర్శించారు. సీఎం చంద్రబాబు సోనియాతో చీకటి ఒప్పందాలు కుదుర్చుకుని రాజకీయ డ్రామాలాడుతున్నారని దుయ్యబట్టారు. నిజాయితీగా ప్రజల పక్షాన నిరంతరం పోరాడే జగన్ వ్యక్తిత్వమే వైఎస్సార్‌సీపీకి ఆస్తి అని చెప్పారు. అడ్డదారిన సీఎం కావాలనుకుంటే ఎనిమిదేళ్ల కిందటే సోనియా చెప్పినట్టు వింటేనో, నాలుగేళ్ల కిందట అబద్ధపు హామీలు ఇచ్చి ఉంటేనో జగన్ సీఎం అయ్యేవారని అయితే ఆయన విశ్వసనీయత, ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే ఒకే ఒక్కడని చెప్పారు. కుతంత్ర రాజకీయాలు చేయడం చంద్రబాబుకు తెలిసినంతగా ఎవరికీ తెలియవన్నారు. చంద్రబాబు మోసాల గురించి ప్రజాసంకల్ప పాదయాత్రలో ప్రజలే నేరుగా చెబుతున్నారన్నారు. రాజన్న రాజ్యం కావాలంటే జగనన్న సీఎం కావాలని ప్రజలంతా ముక్తకంఠంతో అంటున్నారన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరణం ధర్మశ్రీ,, విజయనగరం జిల్లా సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను), అనకాపల్లి పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, పార్లమెంటు సమన్వయకర్త వరుదు కల్యాణి, సీనియర్ నేత, మాజీ మంత్రి బలిరెడ్డి సత్యారావు పాల్గొన్నారు.

ప్రాజెక్టుల పనులపై సీబీఐ విచారణ జరిపించాలి

బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పూడి తిరుపతిరావు



మాట్లాడుతున్న పూడి తిరుపతిరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రంలో నీటిపారుదుల శాఖ ప్రాజెక్టుల పనుల్లో జరుగుతున్న అవినీతిపై సీబీఐ విచారణ జరిపించాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పూడి తిరుపతిరావు డిమాండ్ చేశారు. దీనిపై త్వరలో క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రధాని, కేంద్ర హోంమంత్రులకు లేఖలు రాస్తామన్నారు. శ్రీకాకుళంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి పైడి వేణుగోపాలంతో కలిసి మంగళవారం విలేకరులతో మాట్లాడారు. వంశధార, పోలవరం, గాలేరు నగరి, హంద్రీనీవా ప్రాజెక్టుల్లో లక్షల కోట్ల అవినీతి జరిగిందన్నారు.

వృద్ధురాలి ఉసురు తీసిన మరుగుదొడ్డి

- భర్త మరణం, బిడ్డలు దూరమై ఒంటరిగా జీవిస్తున్న రెడ్డెమ్మ
- మరుగుదొడ్డి నిర్మించలేదని రేషన్, పింఛన్ నిలిపివేత
- ఆధారం పోయిందని వేదనతో మృతి



రెడ్డెమ్మ నివాసం ఉంటున్న అసంపూర్తి ఇల్లు (ఇన్‌సెట్‌లో) రెడ్డెమ్మ (ఫైల్)

బి.కొత్తకోట: మరుగుదొడ్డి నిర్మాణం ప్రారంభించలేదంటూ నెలానెలా ఇచ్చే రేషన్, పింఛన్ సొమ్మును చౌకడీలర్, పంచాయతీ కార్యదర్శి నిలిపివేయడంతో వేరే ఆధారం లేని ఓ వితంతు వృద్ధురాలు మనోవేదనతో మృతి చెందిన సంఘటన మంగళవారం చిత్తూరు జిల్లా బి.కొత్తకోట మండలం అచ్చమ్మకోటలో జరిగింది. పలువురిని కలచివేసిన ఈ సంఘటనపై ఒక్క అధికారైనా స్పందించకపోవడం విచారకం. గ్రామస్తులు తెలిపిన మేరకు.. గుమ్మసముద్రం పంచాయతీ అచ్చమ్మకోటకు చెందిన ఎం.రెడ్డెమ్మ (68) భర్త ఎం.రామప్ప మూడేళ్ల క్రితం మృతి చెందాడు. ఈమె ఇద్దరు కుమారుల్లో వెంకటరమణ, సురేంద్ర వేరేచోట కాపురాలు ఉన్నారు. రెడ్డెమ్మ గ్రామంలోని అసంపూర్తి ఇంటిలో ఒంటరిగా జీవిస్తోంది. అప్పుడప్పుడూ కూలీ పనులకు వెళ్లగా వచ్చే సొమ్ముకు తోడు ప్రతినెలా చౌక దుకాణంలో ఇచ్చే 5కిలోల బియ్యం, రూ.1,000 పింఛన్‌తో నెట్టుకొచ్చేది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రతిఇంటికి మరుగుదొడ్డి ఉండాలన్న నిబంధన పెట్టడంతో అధికారులు చర్యలు చేపట్టారు. మరుగుదొడ్డిని నిర్మించుకోలేదంటే రేషన్, పింఛన్ సొమ్ము ఇవ్వమని చౌకడీలరు, కార్యదర్శి హెచ్చరిస్తూ వచ్చారు. నిస్సహాయ స్థితిలో ఆమె పనులు చేపట్టలేదు. దీనితో గతనెల బియ్యం కోసం వేమిలేటికోటలోని చౌక దుకాణానికి వెళ్లగా మరుగుదొడ్డి నిర్మించుకోకుంటే మార్చిలో బియ్యం ఇవ్వమని గ్రామస్తుల సమక్షంలో తెగేసి చెప్పడంతో ఆవేదనకు గురైంది. మార్చినెల బియ్యం ఇవ్వరని తీసుకునేందుకు రెడ్డెమ్మ వెళ్లలేదు. ప్రతినెలా ఇచ్చే రూ.1,000 పింఛన్ కోసం ఈనెల 2న పంచాయతీ కార్యదర్శి లక్ష్మీదేవి వద్దకు వెళ్లింది. మరుగుదొడ్డి నిర్మించే వరకు పింఛన్ ఇవ్వనంటూ గ్రామస్తుల సమక్షంలో చెప్పడంతో అవమానానికి గురై ఆవేదనతో వెనక్కు వచ్చేసింది. ఆ మనోవదనతోనే సోమవారం రాత్రి ఇంటిలో నిద్రించిన రెడ్డెమ్మ మృతి చెందింది. పంచాయతీ కార్యదర్శి లక్ష్మీదేవి వివరణ కోరగా రెడ్డెమ్మ పింఛన్ కోసం తనవద్దకు రాలేదన్నారు. ఎంపీడీవో ధనలక్ష్మిని రెడ్డెమ్మ పింఛన్ కోసం కలవగా మరుగుదొడ్డి నిర్మించుకోవాలని కోరినట్టు చెప్పారు.

- వడదెబ్బకు గురై ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన అనంతపురం జిల్లా కంబదూరు మండల కేంద్రంలో చోటు చేసుకుంది. కంబదూరు మండలానికి చెందిన నాగభూషణ (35) మంగళవారం మండల కేంద్రంలో మరుగుదొడ్డి గుంతను తవ్వడానికి వెళ్లగా వడ దెబ్బ తగిలింది.

మయూర్‌భంజ్‌లో కుప్పకూలిన విమానం

ఫైలెట్‌కు గాయాలు



భువనేశ్వర్: ఇండియన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన హాక్‌జెట్ ఒడిశా–జార్ఖండ్ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతంలో మంగళవారం కుప్పకూలింది. పశ్చిమ బెంగాల్‌లోని కలైకొండ విమానాశ్రయం నుంచి ఈ హాక్ జెట్ విమానం బయల్దేరింది. గాలిలో ఎగురుతున్న విమానం అకస్మాత్తుగా మయూర్‌భంజ్ జిల్లాలోని నెదా పోలీస్ స్టేషన్ పరిధిలోని బరిపద మొహులొటంగిరి సువర్ణరేఖ నది వద్ద టొప్పా ఘాట్ ప్రాంతంలో కుప్పకూలింది. ఈ ప్రమాదంలో పైలట్ తీవ్రంగా గాయపడ్డాడు. పైలెట్‌ను జార్ఖండ్‌లోని బహాడొగొడా ఆస్పత్రికి హుటాహుటీన తరలించారు. పారాచూట్ సహకారంతో పైలెట్ సకాలంలో దూకడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. నెల కిందట అసోంలోని మజులి ద్వీపంలో భారతీయ విమాన దళం మైక్రోలైట్ వైరస్ ఎస్‌డబ్ల్యూ–80 కుప్పకూలింది.

పంజా విసిరిన కుష్ఠువ్యాధి

- రాష్ట్రంలో పెరుగుతున్న వ్యాధిగ్రస్తులు
- ఏడాదిలోనే 469 మంది చిన్నారులకు వ్యాధి
- గుంటూరు జిల్లాలో అధిక కేసులు నమోదు

సాక్షి, అమరావతి: పూర్తిగా నిర్మూలన అయిందని చెప్పుకుంటున్న కుష్ఠు వ్యాధి రాష్ట్రంలో మళ్లీ పడగ విప్పింది. చాప కింద నీరులా విస్తరిస్తున్న ఈ వ్యాధి భయభ్రాంతులను గుర్తిచేస్తోంది. ఇప్పటికే సాంక్రమిక (అంటువ్యాధులు), అసాంక్రమిక (అంటువ్యాధులు కాని గుండె, కేన్సర్, కిడ్నీ తదితర) జబ్బులతో రాష్ట్రం గజగజలాడిపోతూంటే తాజాగా కుష్ఠు వ్యాధి కేసులు మళ్లీ నమోదవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఎన్ఎల్ఈపీ (నేషనల్ లెప్రసీ ఎరాడికేషన్ ప్రోగ్రాం) కింద కేంద్ర ప్రభుత్వం నిధులిస్తున్నా, కుష్ఠు వ్యాధిని నిర్మూలించడంలో దారుణంగా విఫలమైనట్లు తెలుస్తోంది. గత నాలుగేళ్ల క్రితం ఎన్ని కేసులు నమోదయ్యాయో, ఏడాది కాలంలోనే ఈ సంఖ్య మరి కాస్త పెరిగినట్లు తేలింది. ఈ వ్యాధి సోకిన వారిని సమాజంలో చాలా చిన్నచూపు చూస్తుంటారు. జబ్బులన్నిటికన్నా దీన్ని అత్యంత హీనమైన జబ్బుగా కూడా పరిగణిస్తారు. ఇలాంటి ఈ వ్యాధిని నిర్మూలించడంలో యంత్రాంగం చొరవచూపలేదనే విమర్శలు వినవస్తున్నాయి. కుష్ఠు వ్యాధి 2016– 17లో అత్యధికంగా గుంటూరు జిల్లాలో నమోదైనట్లు ఆరోగ్యశాఖ అధికారుల సర్వేలో వెల్లడైంది. గత రెండు మాసాల క్రితం కుష్ఠు వ్యాధి స్థితిగతులపై ప్రజారోగ్య శాఖ సర్వే చేసింది. ఈ సర్వేలో పలు ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. గడిచిన 8 నెలల్లోనే 4,500కు పైగా కేసులు నమోదైనట్లు తేలింది. వీరిలో 469 మంది చిన్నారులు వ్యాధి బారిన పడటం గమనార్హం.



యూఏఈపై అఫ్గానిస్తాన్ విజయం

ప్రపంచకప్ క్వాలిఫయింగ్ టోర్నీ సూపర్‌సిక్స్‌లో యూఏఈపై 5 వికెట్లతో అఫ్గానిస్తాన్ విజయం సాధించింది. ముందుగా యూఏఈ 43 ఓవర్లలో 177 పరుగులకు ఆలౌటైంది. అన్వర్ (64), నవీద్ (45) రాణించారు. రషీద్ ఖాన్ 5 వికెట్లతో చెలరేగాడు. అనంతరం అఫ్గానిస్తాన్ 34.3 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 178 పరుగులు చేసింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' గుల్బదిన్ నైబ్ (74 నాటౌట్), నజీబుల్లా జద్రాన్ (63 నాటౌట్) రాణించారు. 54 పరుగులకే 5 వికెట్లు కోల్పోయిన దశలో వీరిద్దరు అభేద్యమైన ఆరో వికెట్‌కు 124 పరుగులు జతచేసి జట్టును గెలిపించారు.



మంగళవారం ఢిల్లీలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా 'పద్మశ్రీ' పురస్కారం అందుకుంటున్న భారత స్టార్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కిడాంబి శ్రీకాంత్

'సుందర'కాండ



ఈ కుర్రాడు 'ఎంవీపీ'

మునివేళ్ల మాయాజాలంతో కట్టిపడేస్తున్నాడు

బ్యాట్స్‌మెన్ విరుచుకుపడతారన్న భయం లేదు
తానొక ఆఫ్ స్పిన్నర్‌నన్న బెరుకు లేదు
పరుగులు భారీగా ఇస్తానేమోనన్న ఆందోళన లేదు
పవర్ ప్లేలో బౌలింగ్ చేస్తున్నానన్న ఒత్తిడి లేదు
ఉన్నదల్లా తనపై తనకు నమ్మకమే...!
అదే మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్ (ఎంవీపీ)ను చేసింది
నిదహస్ ట్రోఫీలో 'మ్యాన్ ఆఫ్ ది సిరీస్'గా నిలిపింది

అతడే వాషింగ్టన్ సుందర్!

సాక్షి క్రీడా విభాగం

టి20 మ్యాచ్‌లంటేనే తీవ్ర ఒత్తిడితో కూడుకున్నవి. ఒక్క ఓవర్‌తో ఫలితం తారుమారయ్యేవి. పూర్తిగా బ్యాట్స్‌మెన్ ఆధిపత్యం కనిపించే చోట, ఏమాత్రం లైన్ తప్పినా బౌలర్లకు మిగిలేది చేదు అనుభవమే. ఇక పవర్ ప్లేలో బౌలింగ్ చేయాలంటే ప్రతిభ కంటే... ఎదురుదాడిని తట్టుకునే మానసిక దృఢత్వం ముఖ్యం. ప్రత్యర్థి జట్లలో ఎడమ చేతివాటం బ్యాట్స్‌మెన్ ఎక్కువగా ఉంటే ఆఫ్ స్పిన్నర్‌కు మరింత పరీక్ష ఎదురైనట్లే. కానీ, 18 ఏళ్ల వాషింగ్టన్ సుందర్ వీటన్నింటినీ అధిగమించి విజయవంతమయ్యాడు. మిగతా ప్రధాన బౌలర్లు తమ కోటా పూర్తి చేయడానికే నానా కష్టాలు పడుతుంటే సుందర్ మాత్రం అటు పరుగుల కట్టడి, ఇటు వికెట్లూ తీస్తూ అలవోకగా అందరినీ ఆశ్చర్యపరిచాడు. అందుకే టోర్నీలో 'ఎంవీపీ'గా నిలిచాడు.

అనూహ్యంగానే..

నిదహస్ ట్రోఫీ ప్రారంభానికి ముందు సమీకరణాల ప్రకారం చూస్తే వాషింగ్టన్‌కు తుది జట్టులో చోటు కొంత అనుమానంగానే ఉండేది. అయితే, తొలి మ్యాచ్‌లోనే అవకాశం దక్కించుకున్న అతడు ఏకంగా పవర్ ప్లేలో బౌలింగ్‌కు దిగి చక్కటి గణాంకాలతో మెప్పించాడు. దీంతో తర్వాతి మ్యాచ్‌లకూ కొనసాగించక తప్పలేదు. ఈ నమ్మకాన్ని సుందర్ ఎక్కడా కోల్పోలేదు. టోర్నీలో ప్రధాన పేసర్లు శార్దుల్ ఠాకూర్, ఉనాద్కట్, సిరాజ్‌తో పాటు విజయ్ శంకర్ కూడా ఓవర్‌కు పది పరుగులిచ్చిన సందర్భాలున్నాయి. చహల్ సైతం ఓసారి గాడితప్పాడు. కానీ ఫైనల్ సహా అన్ని మ్యాచ్‌ల్లో ప్రారంభ ఓవర్లు వేసిన సుందర్ ఎకానమీ 5.7 మాత్రమే. దీన్నిబట్టి అతడెంత కట్టుదిట్టంగా బంతులేశాడో తెలుస్తోంది. ముఖ్యంగా కీలకమైన చివరి లీగ్ మ్యాచ్‌లో బంగ్లాదేశ్ టాపార్డర్‌ను పెవిలియన్‌కు పంపి టీమిండియా దర్జాగా ఫైనల్ చేరడంలో కీలకపాత్ర పోషించాడు.

'ముని వేళ్ల' మాయాజాలం

ప్రస్తుతం టి20 ర్యాంకింగ్స్‌లో టాప్ 15 బౌలర్లలో ఏడుగురు మణికట్టు (లెగ్) స్పిన్నర్లే. బ్యాట్స్‌మెన్‌ను వైవిధ్యం, ఊహాతీత బంతులతో అవుట్ చేయడం వీరికి వెన్నతో పెట్టిన విద్య. కానీ... సుందర్ ఆఫ్ స్పిన్నర్. అతడి మాయాజాలం అంతా మునివేళ్ల మీదనే ఉంటుంది. బ్యాట్స్‌మన్ భారీ షాట్‌కు యత్నిస్తున్నాడని పసిగట్టి వెంటనే బంతి వేగం తగ్గించి, లైన్‌ను మార్చేస్తాడు. నిదహస్‌లో పూర్తిగా ఇదే పద్ధతి పాటించి వికెట్లు పడగొట్టాడు. ఇప్పటికైతే భవిష్యత్ ఆఫ్ స్పిన్ ఆశాకిరణంగా సుందరే కనిపిస్తున్నాడు. దీనిని అతడెంత మేరకు నిలుపుకొంటాడో చూద్దాం.

అవసరమైనవాడే...

సీనియర్ అశ్విన్‌ను టెస్టులకే పరిమితం చేశారు. మరోవైపు చహల్ లెగ్ స్పిన్నర్ కాగా, కుల్దీప్ ఎడమ చేతివాటం చైనామన్ బౌలర్. దీంతో పరిమిత ఓవర్ల క్రికెట్లో భారత్‌కు ప్రస్తుతం ఒక ఆఫ్ స్పిన్నర్ అవసరం చాలా ఉంది. దీనిప్రకారం వన్డేలు, టి20ల్లో సుందర్‌కు ఎక్కువ అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎడమ చేతివాటం బ్యాట్స్‌మన్ కావడం, హిట్టింగూ చేయగలగడం ఇతడికి ఉన్న మరో సానుకూలాంశం. అసలు తాను క్రికెట్ ఆడటం మొదలుపెట్టింది కూడా బ్యాట్స్‌మన్‌గానే. ఈ నేపథ్యంలో లోయరార్డర్‌లో ఉపయుక్తంగానూ మారగలడు.

ముందుంది అసలు కాలం

కెరీర్ ప్రారంభంలో అద్భుతంగా బౌలింగ్ చేసినా ప్రత్యర్థులు చదివేశాక ఒక్కసారిగా తెరమరుగైన వారిని గతంలో చూశాం. తాను కూడా అలా కాకుండా ఉండాలంటే సుందర్ ఎప్పటికప్పుడు మెరుగుపడాలి. ఈ దిశగా ఐపీఎల్ అతడికి మంచి అవకాశం. ఎందుకంటే సుందర్ ఈసారి విరాట్ కోహ్లి సారథ్యంలోని రాయల్ చాలెంజర్స్ బెంగళూరుకు ఆడనున్నాడు. జట్టు కోచ్ కివీస్ దిగ్గజ స్పిన్నర్ వెటోరీ. ఆధునిక తరం కోచ్‌గా వెటోరీకి పేరుంది. ఆటగాడిగా మెరుగుపడేందుకు ఇంతకుమించిన చాన్స్ ఉండదు. కాబట్టి దీనిని రెండు చేతులా అందిపుచ్చుకోవాలి.

> పవర్ ప్లేలో బౌలింగ్ సవాలు లాంటిది. దీనిని గెలిస్తే చాలా సంతృప్తి దక్కుతుంది. క్రికెట్ ఆడేది ఇలాంటి వాటి కోసమే కదా? బౌలింగ్ సందర్భంగా నన్ను నేను బ్యాట్స్‌మన్‌గానే భావించుకుంటా. ప్రత్యర్థి ఏం ఆలోచిస్తున్నాడో, ఎక్కడకు కొట్టబోతున్నాడో పసిగడతా. ఆరు బంతుల్లో కనీసం ఫోర్ లేదా సిక్స్ కొట్టాలని చూసే బ్యాట్స్‌మన్ తీరును అర్థం చేసుకోవడం ముఖ్యం. కెప్టెన్ రోహిత్ శర్మ, కోచ్‌లు రవిశాస్త్రి, భరత్ అరుణ్ చాలా పోత్సాహించారు. పరిమిత ఓవర్ల మ్యాచ్‌ల్లో మునివేళ్ల స్పిన్నర్లూ ప్రభావం చూపగలరు
> \- వాషింగ్టన్ సుందర్




మీడియా సమావేశంలో జులన్, మిథాలీరాజ్

ఆసీస్‌తో సిరీస్ కళ్లు తెరిపించింది: మిథాలీ

ముంబై: ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్ భారత జట్టులోని లోపాలను బయటపెట్టిందని మహిళా క్రికెట్ కెప్టెన్ మిథాలీ రాజ్ చెప్పింది. పటిష్టమైన రిజర్వ్ బెంచ్ అవసరముందని తెలిపింది. ఆసీస్ చేతిలో సొంతగడ్డపై భారత్ 0–3తో క్లీన్‌స్వీప్ అయిన సంగతి తెలిసిందే. మంగళవారం మీడియా సమావేశంలో మిథాలీ మాట్లాడుతూ 'గతేడాది ప్రపంచకప్‌లో రన్నరప్‌గా నిలిచాకే భారత 'ఎ' జట్టును తయారు చేశాం. వాళ్లు రాటుదేలేందుకు సమయం పడుతుంది. ఇపుడు అంతర్జాతీయ జట్లతో ఆడుతున్న అనుభవం వాళ్లకు అక్కరకొస్తుంది. సత్తాగల క్రీడాకారిణులు అందుబాటులో ఉన్నారు. వాళ్లంతా విదేశీ జట్లతో ఆడినపుడే పరిణతి చెందుతారు. మరో రెండేళ్లలో పరిస్థితిలో తప్పకుండా మార్పుంటుంది' అని చెప్పింది. ఆస్ట్రేలియాతో జరిగిన సిరీస్‌పై స్పందిస్తూ... ఆ జట్టు అన్ని విభాగాల్లోనూ చాలా పటిష్టంగా ఉందని తొలి మ్యాచ్‌లోనే తమకు అర్థమైందని చెప్పింది. దక్షిణాఫ్రికా పర్యటనలో గెలిచిన సిరీస్‌ను, సొంతగడ్డపై ఓడిన సిరీస్‌తో పోల్చడం తగదని వివరించింది. ఇంగ్లండ్, ఆస్ట్రేలియాలతో రేపటినుంచి జరుగనున్న టి20 ముక్కోణపు టోర్నీ పోటాపోటీగా సాగుతుందని తెలిపింది. భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) మహిళా క్రికెటర్ల కాంట్రాక్టు ఫీజుల పెంపుపై మిథాలీ హర్షం వ్యక్తం చేసింది. ఇప్పుడైతే మహిళల ఐపీఎల్ అవసరం లేదని చెప్పింది. దేశవాళీ మహిళల క్రికెట్‌లో బలమైన జట్లు ఉన్నప్పుడే లీగ్ విజయవంతమవుతుందని భారత సారథి పేర్కొంది.

ధోని యూనివర్సిటీ టాపరైతే... నేనింకా విద్యార్థినే: కార్తీక్



చెన్నై: మ్యాచ్‌లను ముగించడంలో మహేంద్ర సింగ్ ధోని యూనివర్సిటీ టాపరైతే తానింకా విద్యార్థినేనని నిదహస్ ట్రోఫీ ఫైనల్ హీరో దినేశ్ కార్తీక్ అంటున్నాడు. ధోనిని చూస్తూ ఎదిగినవారిలో తానూ ఒకడినని, ఇద్దరి ప్రయాణాలు వేర్వేరని పేర్కొన్నాడు. మంగళవారం చెన్నైలో దినేశ్ కార్తీక్ మీడియాతో మాట్లాడాడు. 'ధోని అద్భుతమైన వ్యక్తి. ఒకప్పుడు సిగ్గరిగా ఉన్న అతడు నేడు యువకులకు అండగా నిలిచే వ్యక్తిగా మారాడు. తనతో నన్ను పోల్చడం సరికాదు. ప్రస్తుతం అందరూ నా గురించి మాట్లాడుతున్నారు. దీనిని మాటల్లో వర్ణించలేను. ఇదంతా కొన్నేళ్ల శ్రమ ఫలితం. నేనున్న స్థితి గురించి సంతృప్తిగా ఉన్నాను. ఇప్పుడిక కొత్తగా ఏం చేయనున్నానో చూస్తారు' అని అన్నాడు.

రబడ వచ్చేశాడు

- రెండు టెస్టుల నిషేధం ఎత్తివేత
- అప్పీల్ కమిషనర్ నిర్ణయం



కేప్‌టౌన్: దక్షిణాఫ్రికా– ఆస్ట్రేలియా టెస్టు సిరీస్‌కు మళ్లీ జీవం వచ్చింది! అద్భుతమైన బౌలింగ్‌తో రెండో టెస్టులో ఆసీస్ బ్యాట్స్‌మెన్ పని పట్టిన యువ పేసర్ కగిసో రబడ గురువారం నుంచి జరిగే మూడో టెస్టులో బరిలోకి దిగనున్నాడు. తనపై విధించిన రెండు టెస్టుల నిషేధంపై రబడ చేసిన అప్పీల్‌లో ఫలితం అతనికి అనుకూలంగా వచ్చింది. సోమవారం దాదాపు ఆరు గంటల పాటు రబడ విచారణ సాగింది. దక్షిణాఫ్రికాకు చెందిన ప్రఖ్యాత న్యాయవాది డాలి ఎంపోఫూ తమ పేసర్ తరపున వాదించారు. పోర్ట్ ఎలిజబెత్ టెస్టులో ఆసీస్ కెప్టెన్ స్మిత్‌ను ఉద్దేశపూర్వకంగా తాను ఢీకొట్టలేదంటూ రబడ పదే పదే చెప్పాడు. ఈ వాదనతో ఐసీసీ కోడ్ ఆఫ్ కండక్ట్ అప్పీల్ కమిషనర్ మైకేల్ హెరాన్ ఏకీభవించారు. వీడియోలో కూడా అతను కావాలని చేసినట్లుగా లేదని హెరాన్ తేల్చారు. దాంతో రబడపై విధించిన మూడు డీమెరిట్ పాయింట్ల శిక్షను ఒక డీమెరిట్ పాయింట్‌కు తగ్గించడంతో పాటు మ్యాచ్ ఫీజులో 25 శాతాన్ని మాత్రమే జరిమానాగా విధించారు. దాంతో రబడ డీమెరిట్ పాయింట్ల సంఖ్య ఆరుకు తగ్గింది. ఫలితంగా రెండు టెస్టుల నిషేధాన్ని ఐసీసీ ఎత్తివేసింది. రెండో టెస్టులో 11 వికెట్లతో సఫారీలకు విజయాన్ని అందించిన రబడ సిరీస్‌కు దూరమైతే ఆ జట్టు పరిస్థితి మిగిలిన రెండు టెస్టుల్లో ఇబ్బందికరంగా ఉండేది. అయితే తాజా తీర్పుతో సఫారీ సేన ఊపిరి పీల్చుకుంది. రేపటి నుంచి కేప్‌టౌన్‌లో మూడో టెస్టు జరుగుతుంది.

అయితే ప్రస్తుతానికి దక్షిణాఫ్రికాకు ఊరట లభించినా ప్రమాదం ఇంకా పూర్తిగా దాటిపోలేదు. పోర్ట్ ఎలిజబెత్ టెస్టులో స్మిత్ ఘటన తర్వాత రెండో ఇన్నింగ్స్‌లో వార్నర్‌ను దూషించినందుకు మరో డీమెరిట్ పాయింట్ రబడ ఖాతాలో చేరింది. దాంతో ప్రస్తుతం అతని పాయింట్ల సంఖ్య ఏడు వద్ద నిలిచింది. మూడో టెస్టులో ఏ దశలోనైనా పరిధి దాటితే మరో పాయింట్ చేరి మళ్లీ నిషేధం పడవచ్చు. అందువల్ల రబడను అదుపులో ఉంచాల్సిన బాధ్యత డుప్లెసిస్, అతని సహచరులపైనే ఉంది.

క్రికెట్ కోసం ఫుట్‌బాల్ స్టేడియాన్ని నాశనం చేస్తారా!

కేసీఏ తీరుపై ఫుట్‌బాలర్ల ఆగ్రహం

తిరువనంతపురం: నవంబర్‌లో వెస్టిండీస్‌తో జరిగే వన్డే సిరీస్‌లో ఒక మ్యాచ్‌ను కొచ్చి నగరానికి కేటాయించడం వివాదాస్పదంగా మారింది. ఫుట్‌బాల్‌కు గుర్తింపు పొందిన నెహ్రూ స్టేడియాన్ని క్రికెట్ కోసం పాడుచేయడం ఏమిటని పలువురు ఫుట్‌బాలర్లు, అభిమానులు కేరళ క్రికెట్ సంఘం (కేసీఏ) తీరును ఎండగడుతున్నారు. ఇప్పటికే కేసీఏ తిరువనంతపురంలో అత్యున్నత ప్రమాణాలతో క్రికెట్ స్టేడియాన్ని నిర్మించింది. గత నవంబర్‌లో భారత్, కివీస్ మధ్య మూడో టి20 కొత్త స్టేడియంలో జరిగింది. కానీ ఇక్కడ క్రికెట్ మ్యాచ్‌లు కాకుండా కొచ్చిలోని నెహ్రూ స్టేడియం (మల్టీపర్పస్)లో నిర్వహించేందుకు కేసీఏ సిద్ధమవుతుంది. ఇక్కడ గతేడాది అండర్–17 ప్రపంచకప్ మ్యాచ్‌లు కూడా జరిగాయి. దీని కోసం స్టేడియంను 'ఫిఫా' ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేశారు. ఇప్పుడు క్రికెట్ మ్యాచ్ నిర్వహించాలంటే మైదానంలో తవ్వకాలు, పెనుమార్పులు తప్పవు.



కొచ్చి స్టేడియం

సచిన్ కూడా...

ఐఎస్‌ఎల్‌లో కేరళ బ్లాస్టర్స్ జట్టుకు యజమాని అయిన క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ కూడా దీనిపై స్పందించాడు. 'ఫిఫా గుర్తింపు పొందిన కొచ్చి స్టేడియానికి జరగబోయే నష్టం గురించి ఆందోళనగా ఉంది. అటు క్రికెట్, ఇటు ఫుట్‌బాల్ రెండింటికీ సమస్య రాకుండా వ్యవహరించాలని కేరళ క్రికెట్ సంఘాన్ని కోరుతున్నా. రెండు ఆటల అభిమానులు నిరాశ పడరాదు. దీనిపై వినోద్‌రాయ్‌తో కూడా మాట్లాడాను. ఆయన ఈ విషయాన్ని పరిశీలిస్తానని చెప్పారు' అని సచిన్ ట్వీట్ చేశాడు.

షమీ దుబాయ్‌కి వెళ్లాడు: బీసీసీఐ

కోల్‌కతా: పేసర్ మొహమ్మద్ షమీ ఫిబ్రవరి 17, 18 తేదీల్లో దుబాయ్‌లోని ఓ హోటల్‌లో ఉన్నట్లు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) మంగళవారం స్పష్టం చేసింది. కోల్‌కతా పోలీసులు అడిగిన వివరాల మేరకు బీసీసీఐ ఈ విషయాన్ని నిర్ధారించింది. షమీ భార్య హసీన్ జహాన్ ఆరోపణల నేపథ్యంలో ఈ అంశంపై దృష్టి సారించిన కోల్‌కతా పోలీసులు గత నెలలో షమీ ఎక్కడెక్కడికి వెళ్లాడనే అంశాలపై ఆరా తీస్తున్నారు. ఈ నేపథ్యంలో షమీ గత నెల షెడ్యూల్ వివరాలను కోరారు. మరోవైపు ఈ మొత్తం అంశంలో మూడో వ్యక్తి హస్తం ఉందని షమీ ఆరోపించాడు. 'ఇది హసీన్ పని కాదు. డబ్బు కోసం



ఆడుతున్న నాటకం అయి ఉండొచ్చు' అని అన్నాడు.

విభేదాలతో అనర్థమే!

- డబుల్సే కాదు...సింగిల్స్‌లోనూ కష్టం
- విజయ్ అమృత్‌రాజ్ వ్యాఖ్య

న్యూఢిల్లీ: భారత టెన్నిస్‌లో డబుల్స్ భాగస్వామ్యం ఈ మధ్య సమస్యగా మారింది. పేస్‌తో జోడీ కట్టేందుకు బోపన్న నిరాకరిస్తుండటంతో ప్రతిష్టాత్మక టీమ్ ఈవెంట్లలో ఫలితాలు ప్రతికూలంగా వస్తున్నాయి. దీనిపై టెన్నిస్ దిగ్గజం విజయ్ అమృత్‌రాజ్ మాట్లాడుతూ ఇది ఒక్క డబుల్స్‌కే పరిమితం కాదని... సింగిల్స్‌కూ వర్తిస్తుందన్నారు. సీజన్ మొత్తం జరిగే ఏటీపీ టూర్లలో ఆటగాళ్ల మధ్య కలివిడితనం, కలుపుగోలు లక్షణాలు ఉంటేనే మంచి ఫలితాలు వస్తాయన్నారు. 'డబుల్స్ జోడీల సమస్య సరే. నా వరకైతే అది రెండో ప్రాధాన్యాంశం. ముందుగా మాట్లాడాల్సింది సింగిల్స్ గురించే! ఎందుకంటే డేవిస్ కప్‌లో నాలుగు సింగిల్స్ మ్యాచ్‌లుంటాయి.



మన లక్ష్యం వరల్డ్ గ్రూప్ బెర్తు. అక్కడికి అర్హత సాధించాలంటే మన వాళ్లంతా సింగిల్స్‌లో టాప్–50 ఆటగాళ్లుగా ఎదగాలి. ఇలాంటి పరిస్థితి ఉందా. అఖిల భారత టెన్నిస్ సంఘం (ఐటా) కానీ, ఆటగాళ్లు కానీ ఎవరికి వారుంటే ఏం లాభం. నిజానికి... ఎవరు కూడా సింగిల్స్ లేదంటే డబుల్స్ స్పెషలిస్టు ఆటగాడినవుతానని టెన్నిస్ నేర్చుకోరు. కానీ భారత్ డబుల్స్‌లోనే పటిష్టం. దీన్ని కాదనలేం. అయితే సింగిల్స్‌ను, డబుల్స్‌ను సమదృష్టితో చూస్తేనే మరిన్ని మంచి ఫలితాల్ని ఆశించవచ్చు. దీని కోసం అందరు కలిసి పోవాలి. తమ అనుభవాల్ని, నైపుణ్యాన్ని ఒకరికొకరు పంచుకోవాలి' అని విజయ్ అమృత్‌రాజ్ అన్నారు.

మెయిన్ డ్రాకు చేరువలో యూకీ

మయామి మాస్టర్స్ టోర్నీ

మయామి: భారత యువ టెన్నిస్ ఆటగాడు యూకీ బాంబ్రీ తన సూపర్ ఫామ్ కొనసాగిస్తున్నాడు. మయామి మాస్టర్స్ ఏటీపీ టోర్నమెంట్ క్వాలిఫయింగ్ ఈవెంట్‌లో అతను శుభారంభం చేశాడు. తొలి రౌండ్‌లో యూకీ 6–4, 6–1తో రెంజో ఒలివో (అర్జెంటీనా)పై నెగ్గాడు. గత వారం ఇండియన్ వెల్స్‌లో అదరగొట్టిన ఈ భారత ప్లేయర్ ఆ టోర్నీలో ప్రపంచ 12వ ర్యాంకర్ లుకాస్‌ను కంగుతినిపించాడు. చివరి క్వాలిఫయింగ్ పోరులో యూకీ... యమెర్ (స్వీడెన్)తో తలపడతాడు. మరో భారత ఆటగాడు రామ్‌కుమార్ రామనాథన్ 6–7 (4/7), 4–6తో మైకెల్ మో (అమెరికా) చేతిలో తొలిరౌండ్‌లోనే ఓడాడు.

రెండో రౌండ్లో పంకజ్ అద్వానీ విజయం

యాంగాన్ (మయన్మార్): ఆసియా బిలియర్డ్స్ చాంపియన్‌షిప్‌లోభారత దిగ్గజం పంకజ్ అద్వానీ తన జైత్రయాత్ర కొనసాగిస్తున్నాడు. ఈ టోర్నీ రెండో రౌండ్ రాబిన్ మ్యాచ్‌లో పంకజ్ 4–1తో పాక్ సా (మయన్మార్) పై గెలుపొందాడు. మరోవైపు మహిళల ఆసియా స్నూకర్ చాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారిణి విద్య పిళ్లై రెండో మ్యాచ్‌లో 2–1తో అక్రమ్ మొహమ్మదీ (ఇరాన్)ని ఓడించింది.

తెలుగు సినిమా వాళ్లకి అంత సీన్‌లేదు

- డైరెక్టర్లు హీరోయిన్ల బొడ్లు, జఘనాలను వర్ణించడానికే పనికొస్తారు
- హీరోలందరూ వయస్సైపోయిన ముసలివాళ్లు
- హైదరాబాద్‌లో బానిస బతుకులు బతుకుతున్నారు
- 'హోదా' పోరులో పాల్గొనకపోవడంపై టీడీపీ ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్ తీవ్ర వ్యాఖ్యలు



సాక్షి, అమరావతి : ప్రత్యేక హోదా పోరులో తెలుగు సినీ పరిశ్రమ పాత్ర లేకపోవడంతో తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్ తీవ్రస్థాయిలో వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. హీరోలకు సీన్ లేదని.. డైరెక్టర్లు హీరోయిన్ల బొడ్లు, జఘనాలు వర్ణించడానికే పనికొస్తారు తప్ప సామాజిక స్పృహ, రాష్ట్రాభివృద్ధి కాంక్ష లేదని వారిని రెచ్చగొట్టేలా మాట్లాడారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. తెలుగు హీరోలు హాలీవుడ్ స్థాయి నటులు కారని, అంతా వయస్సు అయిపోయిన ముసలివాళ్లే ఉన్నారంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. 'తెలుగు సినిమా పరిశ్రమకు ఏ మాయరోగం వచ్చింది? చేవ తగ్గిపోయిందా? రూ.వందల కోట్ల కనక వర్షం మత్తులోంచి బయటకు రాలేకపోతున్నారా?' అంటూ రాజేంద్రప్రసాద్ తీవ్రంగా విమర్శించారు. తెలుగు సినిమా కళాకారులు హైదరాబాద్‌లో బానిస బతుకులు బతుకుతున్నారని ఎద్దేవా చేశారు. 'ప్రత్యేక హోదాకు మద్దతు పలికితే తెలంగాణ ప్రజలు హైదరాబాద్ నుంచి తన్ని తరిమేస్తారని, ఆస్తులు లాకుంటారని భయపడుతున్నారా?'.. అని ప్రశ్నించారు. తమిళనాడులో జల్లికట్టు కోసం సినీ పరిశ్రమంతా ఒక్కతాటిపైకి వచ్చి ఉద్యమాన్ని నడిపిస్తే ఇక్కడి కళాకారులు మాత్రం ప్రత్యేక హోదాపై స్పందించకుండా ఏసీ గదుల్లో కులుతున్నారంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 'అవార్డులు రాకపోతే గొడవ చేసే మీకు.. రాష్ట్రానికి నిధులు రావడంలేదన్న విషయం చెవులకు ఎక్కడం లేదా? మీ కళ్లకు కనపడటం లేదా?'.. అని ప్రశ్నించారు. ఇప్పటికైనా తెలుగు సినిమా పరిశ్రమ హోదా ఉద్యమంలో పాల్గొనాలని లేకపోతే 5 కోట్ల మంది ఆంధ్రులు తెలుగు సినిమా కళాకారులను వెలివేయడానికి వెనుకాడరంటూ హెచ్చరించారు.

ఒక్కోరైతు నుంచి 25 క్వింటాళ్లే..

కందుల కొనుగోళ్లకు మార్గదర్శకాల జారీ

సాక్షి, అమరావతి: కందుల కొనుగోళ్లపై రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం మార్గదర్శకాలను విడుదల చేసింది. కేంద్ర ప్రభుత్వం అనుమతించిన పరిమితిని మించి కనీస మద్దతు ధర రూ.5,450కు కొంటామని ప్రకటించింది. అయితే ఒక్కో రైతు నుంచి గరిష్టంగా 25 క్వింటాళ్లే కొనుగోలు చేస్తుంది. మద్దతు ధరను నోడల్ ఏజెన్సీ పర్యవేక్షిస్తుంది. జిల్లా కలెక్టర్లు వాస్తవ రైతులెవరో గుర్తించి వారికి కూపన్లు ఇస్తారు. ఏయే గ్రామాల, రైతులు ఎప్పుడెప్పుడు సరకును మార్కెట్‌కు తెచ్చుకోవాలో తేదీలు ఖరారు చేస్తారు. ఈ కొనుగోళ్ల చెల్లింపులకు ఏపీ మార్క్‌ఫెడ్‌కు మార్కెటింగ్ శాఖ రూ.50 కోట్లు సమకూర్చుతుంది. వీటి పర్యవేక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ఐదుగురితో కమిటీ వేసింది. వ్యవసాయ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి చైర్మన్‌గా ఉంటారు. పౌరసరఫరాల సంస్థ, వ్యవసాయ మార్కెటింగ్, ఆర్థిక శాఖ, మార్క్‌ఫెడ్ అధికారులు సభ్యులుగా ఉంటారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఈ ఏడాది ఖరీఫ్‌లో 2.71 లక్షల హెక్టార్లలో కంది సాగైంది. దిగుబడి ఎక్కువగా రావడంతో లక్ష టన్నుల కందుల్ని కొనాలని రాష్ట్రం కేంద్రాన్ని కోరింది. నాఫెడ్ ద్వారా 55,600 మెట్రిక్ టన్నుల కొనుగోలుకు కేంద్రం అంగీకరించి, ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా 42771 టన్నులను కొనుగోలు చేసింది. మిగతా వాటిని కొనుగోలు చేయాలని రైతులు ఆందోళనకు దిగిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్టు వ్యవసాయ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ చెప్పారు.

హోదాపై ఉప్పెనలా మలిదశ ఉద్యమం: సీపీఐ



సాక్షి, అమరావతి: ఇప్పటికే ప్రత్యేక హోదా ఉద్యమ సెగ ఢిల్లీని తాకిందని, మలిదశ ఉద్యమం ఉప్పెన ఉంటుందని సీపీఐ స్పష్టం చేసింది. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన హామీల అమలుపై బీజేపీ, తెలుగుదేశం పార్టీల వైఖరిని ఎండగడుతూ చేపట్టిన ఉద్యమం ప్రస్తుతం జాతీయ సమస్యగా మారిందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గం అభిప్రాయపడింది. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులపై పరస్పర విరుద్ధమైన ప్రకటనలు వెలువడుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేసింది. సీపీఐ నాయకుడు కె.రామాంజనేయులు అధ్యక్షతన మంగళవారం విజయవాడలో జరిగిన పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పార్టీ సీనియర్ నేత ఈడ్పుగంటి నాగేశ్వరరావు, కార్యదర్శి కె.రామకృష్ణ ప్రసంగించారు. ప్రత్యేక హోదాపై భవిష్యత్ కార్యాచరణను చర్చించిన అనంతరం ఓ తీర్మానాన్ని ఆమోదించారు. ఈనెల 22న చేపట్టే జాతీయ రహదారుల దిగ్బంధానికి అన్ని వర్గాలు సహకరించాలన్నారు.

హోదా ఉద్యమకారులపై కేసులు ఉపసంహరించాలి

రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాటం చేసిన ఉద్యమకారులపై పోలీసులు పెట్టిన కేసులను ఎత్తివేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు..

అసెంబ్లీ ముట్టడికి గిరిజన జేఏసీ యత్నం

అదుపులోకి తీసుకున్న పోలీసులు



గిరిజన సంఘాల జేఏసీ నాయకులను అరెస్టుచేస్తున్న పోలీసులు.

సాక్షి, అమరావతి: బోయలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదనకు నిరసనగా ఏపీ గిరిజన సంఘాల జేఏసీ మంగళవారం నిర్వహించిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం ఉద్రిక్తతకు దారితీసింది. రాష్ట్రంల్లోని 13 జిల్లాల నుంచి వచ్చిన గిరిజన ప్రతినిధులు అసెంబ్లీ వైపు రాగా సచివాలయం గేటు సమీపంలో వారిని పోలీసులు అడ్డుకున్నారు. అసెంబ్లీ ముట్టడికి ప్రయత్నించిన వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని వ్యాన్‌లోకి ఎక్కించి తుళ్లూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. 38 మంది గిరిజన ప్రతినిధులను సాయంత్రం వరకు పోలీస్‌స్టేషన్‌లో ఉంచి అటు తరువాత విడిచిపెట్టారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి ఏపీ గిరిజన సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పాలకీర్తి రవి రాసిన బహిరంగలేఖను మీడియాకు విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాల్లో 35 తెగలకు చెందిన వారు 40 లక్షల మంది ఉన్నారని, స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లు గడిచినా వారి బతుకులు ఎక్కడవేసిన గొంగళి అక్కడే అనే సామెతగా ఉందని పేర్కొన్నారు. పలు కులాలకు కార్పొరేషన్‌లు పెట్టిన చంద్రబాబు ప్రభుత్వం 35 తెగలు ఉన్న గిరిజనులకు సంబంధించిన కార్పొరేషన్ ఏర్పాటు చేయకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు.

23లోగా తప్పులు దిద్దుకోవచ్చు

జేఈఈ మెయిన్స్ దరఖాస్తులు సరిదిద్దుకోవడానికి అవకాశం

సాక్షి, హైదరాబాద్: జేఈఈ మెయిన్స్ అభ్యర్థులు దరఖాస్తులో తెలిపిన వ్యక్తిగత వివరాలు (పేరు/పుట్టిన తేదీ/లింగం), వారి ఆధార్ కార్డులోని సమాచారం మధ్య వ్యత్యాసముంటే అభ్యర్థులు www.sfeemainr.nic.in వెబ్‌సైట్‌ను సందర్శించి ఆధార్ కార్డులోని సమాచారం ప్రకారం దరఖాస్తులను ఈనెల 26వ తేదీలోగా సరిదిద్దుకోవాలని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ ఓ ప్రకటనలో తెలిపింది.

ప్రభుత్వం కూలిపోతుందని బీజేపీకి భయం

అందుకే అవిశ్వాసంపై చర్చకు వెనుకంజ: టీడీపీ ఎంపీలు

సాక్షి, న్యూఢిల్లీ: ప్రభుత్వం కూలిపోతుందేమోనన్న భయంతోనే అవిశ్వాస తీర్మానంపై చర్చకు బీజేపీ వెనుకంజ వేస్తోందని టీడీపీ ఎంపీలు విమర్శించారు. మంగళవారం లోక్‌సభ వాయిదా పడిన అనంతరం ఎంపీ తోట నరసింహం, అవంతి శ్రీనివాస్ మీడియాతో మాట్లాడారు. ఏపీ ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలన్న చిత్తశుద్ధి కేంద్రానికి లేదన్నారు. అవిశ్వాసంపై చర్చకు మళ్లీ నోటీసు ఇచ్చినట్టు వారు తెలిపారు. పార్టీలోని అంతర్గత విభేదాలు బయటపడతాయనే ఉద్దేశంతోనే అవిశ్వాస తీర్మానంపై చర్చకు బీజేపీ వెనకడుగు వేస్తోందని విమర్శించారు.

ఎదురుదాడే బాబు తంత్రం

- వైఎస్సార్‌సీపీపై బురదజల్లుతూనే ఉండాలని నాయకులకు దిశానిర్దేశం
- బీజేపీ, జగన్, పవన్ కుమ్మక్కయ్యారని దుష్ప్రచారం చేయాలని సూచనలు
- బీజేపీ రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందని కరపత్రాలు
- బీజేపీ చేస్తున్న ఆరోపణలను తెలుగుజాతిపై చేస్తున్న పోరాటంగా చిత్రీకరణ
- హోదా ఉద్యమంతో జగన్‌కు వచ్చిన ఆదరణను జీర్ణించుకోలేక కుయుక్తులు
- ఉద్యమాన్ని అణగదొక్కిన తానే ఇప్పుడు పోరాడుతున్నట్లు హడావుడి
- ప్రజల్లో గందరగోళం సృష్టించడమే లక్ష్యంగా పావులు
- రూ. కోట్లు వెచ్చించి మీడియాలో, సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం



సాక్షి, అమరావతి

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో సాగిన ప్రత్యేక హోదా ఉద్యమాన్ని అణచివేయడానికి తీవ్రంగా ప్రయత్నించి విఫలమైన ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజాగ్రహానికి తలవంచి చివరికి అదే బాట పట్టినా తనపై వెల్లువలా వస్తున్న ఆరోపణలకు సమాధానం చెప్పలేక ఎదురుదాడి మార్గాన్ని ఎంచుకున్నారు. బీజేపీతో కలిసి పోటీ చేసి, కేంద్రంలో నాలుగేళ్లు అధికారాన్ని అనుభవించి, ప్రజల నుంచి వచ్చిన వ్యతిరేకతతో తప్పనిసరి పరిస్థితుల్లో ఎన్డీఏ నుంచి వైదొలిగినా, వారితో కలిసి ఉన్నప్పుడు ఎదురైన వైఫల్యాలకు జవాబు చెప్పాల్సిన చంద్రబాబు వాటిని బీజేపీపైనే రుద్దేందుకు తన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు శతవిధాలుగా ప్రయత్నిస్తున్నారు. నాలుగేళ్లపాటు బీజేపీతో అంటకాగి బయటకు వచ్చిన బాబు, ఇప్పుడు ఆ పార్టీతో ప్రతిపక్ష నేత జగన్‌మోహన్‌రెడ్డి లాలూచీపడినట్లు అదేపనిగా ప్రచారం చేయించడం మొదలుపెట్టారు. ప్రత్యేక హోదా కోసం నాలుగేళ్ల నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిర్మాణాత్మకంగా చేసిన పోరాటాన్ని, కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానాన్ని పెట్టడాన్ని, ఎంపీల చేత రాజీనామాలు చేయించడానికి కూడా సిద్ధపడడాన్ని తన ఖాతాలో వేసుకునేందుకు అనుకూల మీడియాలో ప్రచారం చేయిస్తున్నారు. మీడియా, సోషల్ మీడియాలో ఈ ప్రచారాల కోసం కోట్ల రూపాయలను వెచ్చించేందుకు సిద్ధమయ్యారని సమాచారం.

కావాలనే వైఎస్సార్ కాంగ్రెస్‌పై దుష్ప్రచారం

ప్రత్యేక హోదా అంశం ప్రజల్లో సెంటిమెంటుగా మారి, తొలి నుంచి దాని కోసం పోరాడుతూ ఆ నినాదాన్ని సజీవంగా ఉంచింది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీయే. ఈ విషయం ప్రజల్లోకి బాగా వెళ్లడంతో దాన్ని పక్కదారి పట్టించేందుకు చంద్రబాబు రకరకాలుగా మాటలు మారుస్తూ వ్యతిరేక ప్రచారాలు పారంభించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీజేపీతో లాలూచీపడిందనే ప్రచారం ద్వారా అటు హోదా ఉద్యమాన్ని భుజానమోసిన జగన్ పై దుష్ప్రచారానికి పూనుకున్నారు. ప్రతిపక్ష పార్టీ అధ్యక్షుడు గానీ, ఎంపీలు గానీ ప్రధానమంత్రిని, కేంద్ర మంత్రులను ప్రజాసమస్యలపై కలిస్తే అదేదో నేరమైనట్లు దుష్ప్రచారం చేయిస్తున్నారు. తాను మాత్రం నాలుగేళ్లుగా అధికారాన్ని పంచుకుంటూ 29 సార్లు ఢిల్లీ చుట్టూ తిరిగి ఎవరిని కలిసి ఏమడిగిందీ చెప్పరు. ఐదు కోట్ల ఆంధ్రులకు సంజీవని వంటి ప్రత్యేక హోదా గురించి కేంద్రంపై వత్తిడి తీసుకురాకుండా.. కలసిన ప్రతిసారీ ఫిరాయింపు ఎమ్మెల్యేల కోసం అసెంబ్లీ సీట్ల పెంపు వంటి వాటి గురించే చంద్రబాబు మాట్లాడి వస్తున్నా దానిని ఎవరూ ఆక్షేపించకూడదట.

కింది స్థాయి వరకు అదే ప్రచారం

బీజేపీ, వైఎస్సార్ కాంగ్రెస్, పవన్ కల్యాణ్‌లపై తాను చెప్పే విషయాలనే మళ్లీ మళ్లీ పార్టీ సమావేశాలతోపాటు ప్రభుత్వ కార్యక్రమాల్లోనూ చంద్రబాబు చెబుతున్నారు. తాను మాట్లాడుతున్న మాటల్నే జనంలోకి తీసుకెళ్లాలని, కరపత్రాలు పంచాలని, విలేకరుల సమావేశాలు పెట్టి చెప్పాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తున్నారు. దీంతో టీడీపీ నాయకులు గ్రామ స్థాయి నుంచి రాష్ట్రం వరకూ ఇవే విషయాలను అనుకూల మీడియాలో ఊదరగొడుతున్నారు. ప్రత్యేక హోదా అంశాన్ని వదలకుండా పోరాటం చేసి అందరి చేత హోదా నినాదాలు చేయిస్తున్న ప్రతిపక్ష నేత జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల్లో ఆదరణ పెరగడాన్ని జీర్ణించుకోలేక అందులో తనకూ భాగం ఉందని చెప్పుకునేందుకు రకరకాల ఎత్తులు వేస్తున్నారు. అయినా ప్రజలు తనను నమ్మే పరిస్థితి లేకపోవడంతో ఒక పథకం ప్రకారం రకరకాల జిమ్మిక్కు ప్రచారాలు, వాదనలు లేవనెత్తడం ద్వారా వారిని గందరగోళానికి గురిచేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నారు.

తనపై ఆరోపణల్ని తెలుగుజాతిపై పోరాటంగా చిత్రీకరణ

ఎన్డీఏ నుంచి వైదొలిగిన వెంటనే బీజేపీ రాష్ట్రానికి అన్యాయం చేసిందనే ప్రచారంతో ఆ పార్టీపై చంద్రబాబు ఎదురుదాడి ప్రారంభించారు. ప్రధాని మోడీ రాష్ట్రానికి తీరని అన్యాయం చేశారని, నిధులు ఇవ్వలేదని, అవమానించారని, వైసీపీతో లాలూచీ పడ్డారని రకరకాల ప్రచారాలు లేవనెత్తారు. చంద్రబాబు చేసిన తప్పులను ఎత్తి చూపుతామని, ఏపీ కోసం తెలుగుదేశంపై పోరాటం చేస్తామని బీజేపీ చేసిన వ్యాఖ్యలను సైతం వక్రీకరించి వారు రాష్ట్రంపై పోరాటం చేస్తారా, తెలుగుజాతిపై పోరాటం చేస్తారా అంటూ ప్రజల్ని రెచ్చగొట్టేవాదనను లేవనెత్తారు. తనను బలహీనపరిస్తే రాష్ట్రాన్ని బలహీనపరచినట్లేననే విచిత్రమైన వాదనను తెరపైకి తెచ్చారు. తనపై వ్యక్తిగతంగా వచ్చిన ఆరోపణలకు రాష్ట్ర ప్రయోజనాలకు లింకుపెట్టి మాట్లాడుతూ ప్రజల్ని ఏమార్చేందుకు విశ్వప్రయత్నం చేస్తుండడంపై ఆశ్చర్యం వ్యక్తమవుతోంది. అలాగే ఎన్నికల్లో కలిసి పోటీ చేసి, నాలుగేళ్లపాటు చెట్టాపట్టాలేసుకుని తిరిగిన పవన్ కళ్యాణ్ తనకు వ్యతిరేకంగా ఆరోపణలు చేస్తుండడంతో ఆయనకూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి లింకు కలిపి ప్రత్యారోపణలు చేయడం మొదలు పెట్టారు. నాలుగేళ్లుగా జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న ఆరోపణల్నే పవన్ చేస్తున్నారని, తనపై చేస్తున్న ఆరోపణల వల్ల రాష్ట్రం నష్టపోతుందని చెబుతూ అసలు ప్రశ్నలకు సమాధానాలు దాటవేస్తున్నారు. చివరికి బీజేపీ, వైసీపీ, జనసేనలు టీడీపీపై బురదజల్లుతున్నాయని, వైసీపీ, జనసేనలు బీజేపీకి కోవర్టులనే ప్రచారాన్ని మొదలు పెట్టారు. నాలుగేళ్లుగా జనసేన అధినేతతో జగన్‌పై చేయించిన ఆరోపణలను పక్కనపెట్టిన చంద్రబాబు ఇప్పుడు జగన్ – పవన్ కలిసిపోయారని ప్రచారం చేయడం ప్రారంభించారు.

600 హామీల్లో ఎన్ని అమలు చేశావ్?

- చంద్రబాబుకు బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి ప్రశ్న
- బీజేపీని ముద్దాయి చేయాలనుకుంటే మీరే మునిగిపోతారు

సాక్షి, న్యూఢిల్లీ/అమరావతి: బీజేపీని ముద్దాయిని చేయాలని చూస్తే టీడీపీయే మునిగిపోతుందని బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి హెచ్చరించారు. ఎన్నికల హామీల అమలుపై శ్వేతపత్రం విడుదల చేయాలని చంద్రబాబును డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. బీజేపీ ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వలేదని చెబుతున్న చంద్రబాబు.. అసలు ఆయన ఇచ్చిన 600 హామీల్లో ఇప్పటివరకు ఎన్ని అమలు చేశారో చెప్పాలని ప్రశ్నించారు. నిరుద్యోగ భృతి ఇస్తానని రాష్ట్రంలో 40 లక్షల మంది నిరుద్యోగులను చంద్రబాబు వంచించారని.. లక్షన్నర ఉద్యోగాలు భర్తీ చేయకుండా మోసం చేశారని మండిపడ్డారు.



అవినీతిని కప్పిపుచ్చుకునేందుకే..

రాజకీయ లబ్ధి కోసమే చంద్రబాబు ప్రజల్లో సెంటిమెంట్ రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమ్ముల శ్యాం కిశోర్ ధ్వజమెత్తారు. మంగళవారం విజయవాడలోని పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు రెండు నాల్కల ధోరణిని అవలంభిస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీని స్వాగతించిన చంద్రబాబు.. ఇప్పుడు హోదా అడుగుతూ డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. ప్రజలు చంద్రబాబు తీరును గమనిస్తున్నారని.. ఆయనకు తగిన బుద్ధి చెబుతారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అవినీతిపై నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే చంద్రబాబు కేంద్రాన్ని దోషిగా చూపిస్తున్నారని ఆరోపించారు.

60 విద్యాసంస్థలకు స్వయం ప్రతిపత్తి

తెలుగు రాష్ట్రాల నుంచి 13 సంస్థలకు చోటు

న్యూఢిల్లీ: యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) కొత్తగా దేశవ్యాప్తంగా 60 ఉన్నత విద్యాసంస్థలకు స్వయం ప్రతిపత్తిని కల్పించినట్లు మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్ మంగళవారం వెల్లడించారు. వాటిలో 5 కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, 21 రాష్ట్రీయ విశ్వవిద్యాలయాలు, 24 డీమ్డ్ యూనివర్సిటీలు, 2 ప్రైవేటు యూనివర్సిటీలు, 8 ప్రైవేటు కళాశాలలు ఉన్నాయి. 60లో తెలుగు రాష్ట్రాల నుంచి 13 విద్యా సంస్థలకు చోటు దక్కింది. స్వయం ప్రతిపత్తి పొందిన యూనివర్సిటీలన్నీ ఇకపై కూడా యూజీసీ పరిధిలోనే ఉంటాయనీ, అయితే కొత్త కోర్సులను ప్రారంభించడం, నైపుణ్య శిక్షణా తరగతులను నిర్వహించడం, విదేశీ అధ్యాపకులను నియమించుకోవడం, విదేశీ విద్యార్థులను కోర్సుల్లో చేర్చుకోవడం తదితరాల్లో యూనివర్సిటీలకు పూర్తి స్వేచ్ఛ ఉంటుందని జవదేకర్ చెప్పారు. స్వయం ప్రతిపత్తి పొందిన 8 కళాశాలలకు సిలబస్‌ను నిర్ణయించడం, పరీక్షలు పెట్టడం, ఫలితాలు వెల్లడించడం తదితరాలపై స్వేచ్ఛ ఉంటుంది. విద్యార్థులకు డిగ్రీలు మాత్రం సంబంధిత యూనివర్సిటీల పేరు మీదుగానే వస్తాయి.

తెలుగు రాష్ట్రాల విద్యాసంస్థలివే..

తెలంగాణలోని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, ది ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఇఫ్లూ – హైదరాబాద్), నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా (హైదరాబాద్), ఉస్మానియా యూనివర్సిటీ (హైదరాబాద్), కాకతీయ యూనివర్సిటీ (వరంగల్), ఐసీఎఫ్ఏఐ ఫౌండేషన్ ఫర్ హయర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (హైదరాబాద్), నారాయణమ్మ ఇంజినీరింగ్ కళాశాల (హైదరాబాద్) ఉన్నాయి. అటు ఆంధ్రప్రదేశ్‌లోని ఆంధ్ర విశ్వవిద్యాలయం (విశాఖపట్నం), శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం (తిరుపతి), రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం (తిరుపతి), గీతం యూనివర్సిటీ (విశాఖపట్నం), వాసవి ఇంజినీరింగ్ కళాశాల (కాకినాడ), బోనం వెంకట చలమయ్య ఇంజినీరింగ్ కళాశాల (కాకినాడ) ఉన్నాయి.

ఆయుష్మాన్ భారత్‌కు తుది మెరుగులు

రాజ్యసభలో ఎంపీ విజయసాయి రెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబు



సాక్షి, అమరావతి: జాతీయ ఆరోగ్య పరిరక్షణ పథకం (ఆయుష్మాన్ భారత్) తుది మెరుగులు దిద్దుకుంటున్నట్లు కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి అశ్వనీ కుమార్ చౌబే తెలిపారు. ఈ పథకానికి ఏటా సుమారు రూ.7 వేల కోట్లు అవసరమని ఆరోగ్య నిపుణులు, ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్న విషయం వాస్తవమేనా? అని వైఎస్సార్ కాంగ్రెస్ ఎంపీ వి.విజయసాయి రెడ్డి మంగళవారం రాజ్యసభలో అడిగిన ప్రశ్నకు అలాంటి అంచనాలేవీ తమ మంత్రిత్వ శాఖ దృష్టికి రాలేదని మంత్రి చౌబే చెప్పారు. ఈ పథకానికి సంబంధించి వైద్య సేవలకు ప్యాకేజీ రేట్ల రూపకల్పనలో తమ మంత్రిత్వశాఖ నిమగ్నమై ఉందని మంత్రి తెలిపారు. ఈ ప్యాకేజీల్లో నిర్ధారించిన రేట్లనే చికిత్స చేసిన ఆస్పత్రులకు చెల్లిస్తారని పేర్కొన్నారు.

సుబాబుల్, యూకలిప్టస్ ఆ స్కీమ్‌లోకి రావు

వైవీ సుబ్బారెడ్డి ప్రశ్నకు కేంద్రం రాతపూర్వక సమాధానం

సాక్షి, న్యూఢిల్లీ: సుబాబుల్, యూకలిప్టస్ పంటలు మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ పరిధిలోకి రావని, అందువల్ల ఆ స్కీమ్ కింద ఈ పంటలను కొనుగోలు చేసే ప్రతిపాదనేదీ లేదని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. వైఎస్సార్‌సీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి అడిగిన ప్రశ్నకు వ్యవసాయ శాఖ మంత్రి రాధామోహన్‌సింగ్ మంగళవారం రాతపూర్వక సమాధానం ఇచ్చారు. ఈ పంటలకు గిట్టుబాటు ధర అందేందుకు ఏపీ ప్రభుత్వం మంత్రులతో కమిటీవేసిందని, ఈ కమిటీ ఆయా పంటలకు కనీస మద్దతు ధరను నిర్ధారించిందని తెలిపారు.

మెట్రో రైలు పాలసీ–2017కి అనుగుణంగా ప్రతిపాదనలు రాలేదు

విశాఖ, విజయవాడ మెట్రో రైళ్ల ప్రతిపాదనలను సమీక్షించాలని ఏపీ ప్రభుత్వం 2017 సెప్టెంబరు 1న విన్నవించిందని, అయితే మెట్రో రైల్ పాలసీ–2017కు అనుగుణంగా అవి లేవని, ఇప్పటివరకు కొత్త ప్రతిపాదనలేవీ రాలేదని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి తెలిపారు. ఎంపీ వై.ఎస్.అవినాష్‌రెడ్డి ప్రశ్నకు ఆయన రాతపూర్వక సమాధానం ఇచ్చారు.

- తమిళనాడు దివంగత ముఖ్యమంత్రి, నటి జయలలిత జీవిత చరిత్ర సినిమాగా రూపొందనుంది. 'ముల్‌లేవైనం' చిత్రం ఫేమ్ రవిరత్నం 'అమ్మ' బయోపిక్‌ను తెరకెక్కించనున్నారు. ఈ విషయాన్ని ఆయన మంగళవారం చెన్నైలో వెల్లడించారు.

టెట్ ఫలితాల్లో గందరగోళం


- తారుమారైన అభ్యర్థుల మార్కులు
- మూల్యాంకనంలో తప్పులు జరిగినట్లు ఆరోపణలు
- ఫైనల్ 'కీ'కి, ఫలితాలకు పొంతనలేని వైనం
- రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలో అభ్యర్థులు

సాక్షి, అమరావతి/రాజమహేంద్రవరం

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఫలితాలు అభ్యర్థుల్లో గందరగోళానికి తెరలేపాయి. తమ మార్కులు తారుమారయ్యాయని అభ్యర్థుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. కొన్ని జిల్లాల అభ్యర్థులు పాఠశాల విద్యాశాఖ కమిషనరేట్‌కు వచ్చి గోడు వెళ్లబోసుకున్నారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఒక విద్యార్థిని పేపర్–2లో ప్రాథమిక 'కీ' అభ్యంతరాలపై విడుదల చేసిన 'కీ' అనుసరించి 134 మార్కులు రావాల్సి ఉంది. అయితే ఆమె మార్కులు ఏకంగా 78కి కుదించుకుపోవడంతో తీవ్ర ఆందోళనకు గురైంది. దీంతో ఆమె పాఠశాల విద్యాశాఖ కమిషనరేట్ వద్దకు వచ్చి మొరపెట్టుకుంది. చిత్తూరు జిల్లాకు చెందిన కొంతమందికి కూడా ఇదే అనుభవం ఎదురైంది. అభ్యంతరాల పరిశీలన అనంతరం తప్పు ప్రశ్నలు, సమాధానాలకు అదనపు మార్కులు కలుపుతున్నట్లు అధికారులు ప్రకటించారు. ఇవి కలిస్తే తమ మార్కులు మరింత పెరగొచ్చని అనుకున్నామని కానీ జరిగింది వేరని అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆన్‌లైన్ మూల్యాంకనంలోనే లోపాలు!

టెట్ ప్రాథమిక 'కీ'పై 19,314 అభ్యంతరాలు వచ్చాయి. వీటిలో 2,604ను సహేతుకమైనవిగా చూపి మార్కులు కలిపేందుకు నిర్ణయించారు. పేపర్–1లో 5, పేపర్–2లో 11 (సైన్సులో–8, సోషల్–3) కలిపి ఫైనల్ 'కీ'ని విడుదల చేశారు. తిరిగి అభ్యర్థుల వారీగా ఆన్‌లైన్ మూల్యాంకనం చేసి తుది ఫలితాలను సోమవారం ప్రకటించారు. ఈ మూల్యాంకనంలోనే లోపాలు జరిగాయని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కొందరు అభ్యర్థులు రాసిన కోడ్ పేపర్‌కు వేరొక కోడ్ పేపర్ 'కీ'తో తుది మూల్యాంకనం చేశారంటున్నారు. ప్రశ్నల జంబ్లింగ్‌తోపాటు సమాధానాలు జంబ్లింగ్ అయ్యాయని, ఆయా కోడ్ ప్రశ్నలకు అనుగుణమైన 'కీ'లతో మూల్యాంకనం జరగనందునే మార్కులు తారుమారైనట్లు చెబుతున్నారు. ఫైనల్ 'కీ' ప్రకారం తనకు వచ్చిన మార్కులను విద్యాశాఖ వద్దకు వెళ్లి ఫిర్యాదు చేస్తే తనకు వేరే కోడ్ 'కీ'ని చూపించి అందుకే తక్కువ మార్కులు వచ్చాయని చెబుతున్నారని శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఒక విద్యార్థిని వాపోయారు.



ANDHRA PRADESH TEACHER ELIGIBILITY TEST (APTET), December 2017

Statement of Marks

Hall Ticket No

Candidate Name MOHAMMAD AKRAM

Father name MOHAMMAD ASLAM

	Paper - I
Maximum marks	150
Marks Obtained	48

Note : This is a computer generated Statement of Marks for information of the candidate.


Category	Pass Percentage	Pass Mark
1 OC	60% Marks and above	90
2 BC	50% Marks and above	75
3 SC / ST	40% Marks and above	60
4 Differently abled (PH) **	40% Marks and above	60
5 Ex-Servicemen	40% Marks and above	60

ఫైనల్ 'కీ' ప్రకారం 95 మార్కులు వస్తాయనుకున్న అక్రమ్‌కు ఫలితాల్లో 48 మార్కులు వచ్చినట్లు తెలుపుతున్న పత్రం

ఎక్కువకు తక్కువ.. తక్కువకు ఎక్కువ

రాజమహేంద్రవరంకు చెందిన మహ్మద్ అక్రమ్‌కు ఫైనల్ 'కీ' ప్రకారం 95 మార్కులు వచ్చాయి. అయితే ఫలితాల్లో 48 మార్కులు మాత్రమే రావడంతో ఆందోళనకు గురయ్యాడు. ఫైనల్ 'కీ' ఆధారంగా 88 మార్కులు వస్తాయనుకున్న వారికి 54, 84 వస్తాయనుకున్న వారికి 58 మార్కులు వచ్చాయి. 60 మార్కులు వస్తాయనుకున్నవారికి 86, 40 వస్తాయనుకున్న వారికి 67, 56 వస్తాయనుకున్నవారికి 81 మార్కులు రావడంపై అభ్యర్థులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

సమాధానపత్రాలు బహిర్గతం చేయాలి



టెట్ ఫైనల్ 'కీ' ప్రకారం నాకు 95 మార్కులు వస్తాయి. ఫలితాల్లో 48 మార్కులే వచ్చాయి. నా మిత్రుల్లో చాలా మందికి ఇలాగే జరిగింది. తక్కువ వస్తాయనుకున్న వారికి ఎక్కువ మార్కులు వచ్చాయి. మేము రాసిన సమాధాన పత్రాలు బహిర్గతం చేయాలి.

– మహ్మద్ అక్రమ్, టెట్ అభ్యర్థి, రాజమహేంద్రవరం

ఫిర్యాదులకు అవకాశం

సహేతుక కారణాలున్న అంశాలను పరిష్కరించి న్యాయం చేస్తాం. తప్పులు దొర్లడానికి సాంకేతిక లోపాలా? ఇంకా వేరే ఏదైనా సమస్య ఏర్పడిందో తెలుసుకుంటాం. టెట్ ఫలితాలపై అభ్యంతరాలు, కులం, పుట్టిన రోజు వంటి వాటిల్లో దొర్లిన తప్పులను సరిదిద్దుకోవడానికి అవకాశం కల్పించాం. ఈ నెల 28 సాయంత్రం 5 గంటల వరకు అభ్యంతరాలను స్వీకరిస్తాం. దీనికోసం http://cse.ap.gov.in/dse/, https://aptet.apcfss.in అనే వెబ్‌సైట్లను అందుబాటులో ఉంచాం.

– టెట్ కన్వీనర్ ఎ. సుబ్బారెడ్డి

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP), and D. No. 5- 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503. Editor: V. Murali, Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23794.